సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 337

మంగళవారం 27-2-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'



భారతీయులు వెనక్కి..

రష్యా సైన్యానికి సహాయకులుగా ఉన్న భారతీయులను తిరిగి పంపించారు.- 6లో



గాజాలో ఆకలి కేకలు

గాజాలోని 23 లక్షల మంది జనాభా ఆహార కొరతతో అల్లాడుతున్నారు. - 6లో


సాక్షి ఫ్యామిలీ II

విజయవాడ

మంగళవారం ॥ 27-2-2024

నివాళి

గజల్ గంధర్వుడు


పంకజ్ ఉధాస్

'ముజ్ కో యారో మాఫ్ కర్నా,
మై నషేమే హూ'
'థోడి థోడి పియా కరో'
'షరాబ్ చీజ్ హి ఐసీ'
'సబ్‌కో మాలూమ్ హై మై షరాబీ నహీ'
'చాందీ జైసా రంగ్ హై తేరా'
'కభీ సాయా హై కభీ ధూప్'
'దివారోంసే మిల్ కర్ రోనా అచ్ఛా లగ్తా హై'
'ఆయియే బారిషోం కా మౌసం హై'...
ఒక్కటా రెండా పంకజ్ ఉధాస్ పేరు వినడగానే ఈ పేరుతో పాటు వినిపించే అమృత గుళికల్లాంటి గజల్స్, పాటలు ఎన్నో ఎన్నెన్నో. గజల్స్‌ను ఎప్పుడూ వినే వాళ్లతో పాటు, ఎప్పుడూ వినని వాళ్లను కూడా తన అభిమానులుగా చేసుకున్నాడు గజల్ మేస్ట్రో పంకజ్ ఉధాస్. ఎప్పుడూ వినని వాళ్లు ఆయన గొంతు నుంచి ఒక్కసారి గజల్ వింటే మంత్రముగ్ధులయ్యే వారు. మళ్లీ మళ్లీ వినాలని తపించే వారు. 'ఆహత్' ఆల్బమ్‌తో ఆనందాశ్చర్యాలకు గురి చేసిన పంకజ్ గజల్ ప్రపంచంలో అజరామరమైన కీర్తిని సొంతం చేసుకున్నారు. సోమవారం ఆయన భౌతికంగా దూరమైనా ప్రతి శ్రోతలో, అభిమానిలో సజీవంగా నిలిచే ఉంటాడు.

గుజరాత్‌లోని జెట్‌పూర్‌లో పుట్టిన పంకజ్ ముగ్గురు అన్నదమ్ములలో చిన్నవాడు. అన్న నిర్మల్ ఉధాస్‌తో ఆ ఇంట్లో గజల్ గజ్జె కట్టింది. మరో అన్న మన్‌హర్ ఉధాస్ బాలీవుడ్‌లో కొన్ని సినిమాలకు పాడాడు. తండ్రి కేశుభాయిదాస్ ప్రభుత్వ ఉద్యోగి. వైణికుడు. ప్రసిద్ధ వైణికుడు అబ్దుల్ కరీమ్ ఖాన్ దగ్గర దిల్‌రుబా నేర్చుకున్నాడు.

ఒక్క ముక్కలో చెప్పాలంటే ఆ ఇల్లు ఒక సంగీత పాఠశాలలాగ ఉండేది.

వన్స్ అపాన్ ఎ టైమ్ బ్లాక్ అండ్ వైట్ చిత్రాల పాటల నుంచి గజల్స్ వరకు ఆ ఇంట్లో ఎన్నో వినిపించేవి. రాగాలు, స్వరఝరుల గురించి చర్చ జరిగేది.

తనకు ఏమాత్రం సమయం దొరికినా పంకజ్ తండ్రి దిల్‌రుబా వాయించేవాడు. దిల్‌రుబా నుంచి వచ్చే సుమధుర శబ్దతరంగాలు పంకజ్‌ను సంగీతం వైపు నడిపించాయి. 'చక్కగా స్కూలు పాఠాలు చదువుకోకుండా ఈ సంగీత పాఠాలు నీకు ఎందుకు నాయనా' అని తండ్రి మందలించి ఉంటే పరిస్థితి ఎలా ఉండేదీ తెలియదుగానీ గజల్స్ గురించి, దిల్‌రుబాపై వినిపించే రాగాల గురించి సందేహాలు అడిగినప్పుడు కుమారుడి సంగీతోత్సాహానికి ఆ తండ్రి మురిసిపోయేవాడు.

ఒక్క సందేహం అడిగితే మూడు సమాధానాలు చెప్పేవాడు. అంతేకాదు ముగ్గురు కుమారులను రాజ్‌కోట్(గుజరాత్)లోని 'సంగీత్ అకాడమీ'లో చేర్పించాడు. ఆ కళాశాలలో తబాలా వాయించడం నేర్చుకున్న పంకజ్ గులామ్ ఖదీర్ ఖాన్ సాహెబ్ దగ్గర శాస్త్రీయ సంగీతం నేర్చుకున్నాడు. డిగ్రీ కోసం ముంబైలోని సెయింట్ జేవియర్ కాలేజీలో చేరిన పంకజ్ 'క్లాస్‌లో సైన్స్ పాఠాలు' కాలేజీ తరువాత శాస్త్రీయ సంగీత పాఠాలపై శ్రద్ధ పెట్టేవాడు. తొలిసారిగా 'కామ్నా' (1972) అనే సినిమాలో పాడాడు పంకజ్. ఆ సినిమా ఫ్లాప్ అయినప్పటికీ గాయకుడిగా పంకజ్‌కు మంచి పేరు వచ్చింది. అయితే ఈ మంచి పేరు తనకు వెంటనే మరో అవకాశాన్ని తీసుకు రాలేదు.

'ఇది కూడా మంచికే జరిగింది. పంకజ్‌కు బోలెడు అవకాశాలు వచ్చి ఉంటే తనకు అత్యంత ఇష్టమైన గజల్స్‌కు అనివార్యంగా దూరం కావాల్సి వచ్చేది' అంటారు పంకజ్ అభిమానులు.

అవకాశాల సంగతి ఎలా ఉన్నా పంకజ్‌లో గజల్స్‌పై ఆసక్తి అంతకంతకూ పెరుగుతూనే పోయింది. 'ఉద్యోగం చెయ్ లేదా వ్యాపారం చెయ్' లాంటి సలహాలు అదేపనిగా వినిపిస్తున్న కాలంలో ఒక అద్భుత అవకాశం తనను వెదుక్కుంటూ వచ్చింది. అమెరికా, కెనడాలలో పది నెలల పాటు ఉన్న పంకజ్ అక్కడ ఎన్నో గజల్ కచేరీలు చేశాడు. 'వాహ్వా వాహ్వాల'తో కూడిన ప్రేక్షకుల చప్పట్లు అతడి ప్రతిభను ప్రశంసించే సర్టిఫికెట్‌లు అయ్యాయి. ఇండియాకు డబ్బులతో కాదు ఉత్సాహంతో... ఆత్మవిశ్వాసంతో వచ్చాడు.

'గజల్స్' కోసమే ఉర్దూ నేర్చుకున్నాడు పంకజ్. గజల్స్ గానంలో మరింత పట్టు సాధించాడు. పంకజ్ ఉధాస్ అనే శబ్దం వినబడగానే 'గజల్' అనేది అతడి పేరు ముందు వచ్చి మెరిసేది.

1980లో తొలి గజల్ ఆల్బమ్ 'ఆహత్'ను తీసుకువచ్చాడు. ఈ గజల్ ఆల్బమ్ తనకు తీసుకువచ్చిన పేరు అంతా ఇంతా కాదు. పదేళ్ల పోరాటం తరువాత పంకజ్ తొలి ఆల్బమ్ అనూహ్యమైన విజయం సాధించింది. ఇక అప్పటి నుంచి 50 వరకు ఆల్బమ్‌లను తీసుకువచ్చాడు. మ్యూజిక్ ఇండియా 1987లో లాంచ్ చేసిన పంకజ్ 'షాగుఫ్తా' మన దేశంలో కంపాక్ట్ డిస్క్‌పై రిలీజ్ అయిన తొలి ఆల్బమ్. ఇక సినిమాల విషయానికి వస్తే 'ఘాయల్' సినిమా కోసం 1990లో లతా మంగేష్కర్‌తో కలిసి మెలోడియస్ డ్యూయెట్ పాడాడు. ఇక 'నామ్' సినిమాలో 'చిఠ్ఠీ ఆయీ హై' పాట ఎంత పెద్ద హిట్టో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. ఈ పాట సూపర్ హిట్ అయిన తరువాత అవకాశాలు వెల్లువెత్తాయి. అయితే అవకాశాన్ని సొమ్ము చేసుకోవాలని పంకజ్ ఎప్పుడూ అనుకోలేదు.

ఆచితూచి నిర్ణయం తీసుకునేవాడు. రాశి కంటే వాసికి ప్రాధాన్యత ఇచ్చాడు. బహుశా ఇలాంటి విలువలే సంగీత చరిత్రలో అతడికి సమున్నత స్థానం ఇచ్చాయి. సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్ కోసం 'ఆదాబ్ అర్జ్ హై' టాలెంట్ హంట్ ప్రోగ్రామ్‌ను నిర్వహించాడు పంకజ్. సినిమా కోసం పాడినా, నటించినా, టీవీ షోలు నిర్వహించినా గజల్స్‌పై తనకు ఉన్న ప్రత్యేక ప్రేమను ఎప్పుడూ కాపాడుకునేవాడు పంకజ్. అందుకే గజల్స్‌ను ప్రేమించే వాళ్ల మదిలో చిరస్థాయిగా, ఇంకో వందేళ్లయినా సజీవంగానే ఉంటాడు.

పంకజ్ ఫేవరెట్ సాంగ్

రేడియోలో వినిపించే బేగం అఖ్తర్ గానామృతానికి చాలా చిన్న వయసులోనే ఫిదా అయ్యాడు పంకజ్. 'ఆమెది ఒక వినూత్న స్వరం' అంటాడు. భావాలు, భావోద్వేగాలు పాటలో ఎలా పలికించాలో ఆమె గొంతు విని నేర్చుకున్నాడు. 'యే మొహబ్బత్ తేరే అంజామ్ పే' తనకు ఇష్టమైన పాట. ఎప్పుడు వినాలనిపించినా వినేవాడు. పద్దెనిమిది సంవత్సరాల వయసులో పంకజ్‌కు ప్రసిద్ధ గజల్ గాయకుడు మెహదీ హాసన్‌తో పరిచయం అయింది. చాలాకాలానికి యూకే టూర్‌లో స్నేహితుడి ఇంట్లో హాసన్‌ను కలుసుకున్నాడు. పంకజ్ గానప్రతిభకు కితాబు ఇచ్చాడు హాసన్. ఈ కితాబు కంటే హాసన్‌తో కలిసి పర్యటించడం, అతడి గొంతును గంటల తరబడి వినడాన్ని బాగా ఎంజాయ్ చేసేవాడు పంకజ్.



అదర్ సైడ్

హీరో జాన్ అబ్రహాం పంకజ్‌కు వీరాభిమాని. విద్యాబాలన్, జాన్ అబ్రహామ్, సమీరా రెడ్డిలాంటి వారికి తన మ్యూజిక్ వీడియోలతో బ్రేక్ ఇచ్చాడు పంకజ్. ఎప్పుడూ సంగీత ప్రపంచంలో తేలియాడినట్లు కనిపించే పంకజ్‌కు క్రికెట్ అంటే చాలా ఇష్టం. స్కూల్, కాలేజీలలో బాగా ఆడేవాడు. పంకజ్ ఫేవరెట్ బౌలర్ బీఎస్ చంద్రశేఖర్. సంగీతం తప్ప ఏమీ తెలియనట్లు ఉండే పంకజ్ మ్యాచ్‌లకు సంబంధించి చేసే విశ్లేషణ ఆకట్టుకునేది.

'మీరు క్రికెట్ వ్యాఖ్యాతగా బ్రహ్మాండంగా రాణించవచ్చు' అని సరదాగా అనే వారు సన్నిహితులు.

పంకజ్‌ను చూసీచూడగానే అంతర్ముఖుడు(ఇంట్రావర్ట్) అని అనిపిస్తుంది అయితే ఆయన చాలా సరదా మనిషి అని, చుట్టుపక్కల వాళ్లను తెగ నవ్విస్తారని చెబుతుంటారు సన్నిహితులు.

డాక్టర్ కావాలనేది పంకజ్ చిన్నప్పటి కల. అయితే సంగీతం అతడిని వేరే దారిలోకి తీసుకువెళ్లింది. డాక్టర్ కాకపోయినా ఆయన పాడే గజల్స్ ఔషధాలలాగే పనిచేసి మనసుకు స్వస్థతను చేకూరుస్తాయి.

ముక్కు సూటి మనిషి

సినిమా రంగంలో అవకాశాలు రావాలంటే 'నిక్కచ్చిగా మాట్లాడే ధోరణి' ఉండకూడదు అంటారు. అయితే పంకజ్ మాత్రం 'నొప్పించక తానొవ్వక' అన్నట్లుగా ఎప్పుడూ ఉండేవాడు కాదు. తన మనసులోని మాటను కుండ బద్దలు కొట్టినట్లు చెప్పేవాడు. బాలీవుడ్ మ్యూజిక్ ప్రస్తావన వస్తే....

'మ్యూజిక్ ఇండస్ట్రీ పూర్తిగా మారిపోయింది. నాన్-ఫిల్మ్ మ్యూజిక్‌ను పట్టించుకోవడం లేదు. సర్వం బాలీవుడ్ అన్నట్లుగా ఉంది. బాలీవుడ్‌లో తొంభై శాతం మ్యూజిక్ హిప్ హాప్, పంజాబీ, ర్యాప్. ఆర్డీ బర్మన్ క్లాసిక్స్‌లాంటివి ఇప్పుడు వినే పరిస్థితి లేదు. పాటలు స్క్రీన్‌ప్లేలో భాగంగా ఉండడం లేదు. సినిమాను ప్రమోట్ చేయడానికి అన్నట్లుగా ఉంటున్నాయి. బాలీవుడ్‌లోని ఒకప్పటి స్వర్ణశకం తిరిగి రావాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. బాలీవుడ్ గాయకుల్లో పాప్ సంగీత నేపథ్యం నుంచి వచ్చిన వారే ఎక్కువ. ఖవ్వాలి ఎవ్వరికీ పట్టని కళ అయింది' అని నిట్టూర్చేవాడు పంకజ్.

బీబీసీ టాప్ 100 సాంగ్స్‌లో...

'పంకజ్‌తో ఎన్నో విలువైన జ్ఞాపకాలు ఉన్నాయి. ఆయన పాడిన చిఠ్ఠీ ఆయీ హై పాట మన దేశంలో అందరూ కనెక్ట్ అయ్యేంత రేంజ్‌లో హిట్ అయింది. సినిమాలో ఈ పాట కీలకం. పంకజ్‌లోని సమయ పాలన, క్రమశిక్షణను దగ్గరి నుంచి చూసే అవకాశం వచ్చింది' అంటాడు మహేష్ భట్. తన 'నామ్' సినిమా కోసం ఈ పాటను పంకజ్ తో పాడించాడు మహేష్. పాటను ఒక ప్రముఖ గజల్ గాయకుడితో పాడిస్తే బాగుంటుందని మహేష్‌కు సలహా ఇచ్చారు ప్రఖ్యాత సినీ రచయిత సలీమ్ ఖాన్. బాలీవుడ్‌లో ప్రతి అంశాన్ని 'సక్సెస్‌ఫుల్ ఫార్ములా'తో తూచి కాచి వడబోసే కాలంలో సంజయ్ దత్ సినిమాలోని పాటను గజల్ గాయకుడితో పాడించడం సాహసం అనే చెప్పాలి. ఫార్ములాలు సినిమా వాళ్లకు కానీ, ప్రేక్షకులకు కాదని ఈ పాట విజయం నిరూపించింది. 'చిఠ్ఠీ' పాటను బీబీసీ రేడియో సహస్రాబ్ది 'టాప్ 100' పాటలలో ఒకటిగా ఎంపిక చేసింది. కారణం తెలియదుగానీ ఈ పాట ఆఫర్‌ను తాను మొదట్లో తిరస్కరించానని ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు పంకజ్. ఈ సినిమాలో పంకజ్ గొంతు వినిపించడమే కాదు.. తానూ కనిపిస్తాడు కూడా.

సాగుబడి

శతభిష కార్తె: మార్చి 3 వరకు
పూర్వాభాద్ర కార్తె: మార్చి 4 నుంచి

కరువు నేలలోనూ లాభాల ముత్యాలు!

కరువుకు నెలవైన రాజస్థాన్‌లోనూ ఓ మాజీ ఉపాధ్యాయుడు ముత్యాల పెంపకం చేపట్టి విజయం సాధించటమే కాకుండా ప్రధాని మోదీ నుంచి ప్రశంసలు పొందారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన వినోద్ భారతి (45) మాజీ కంప్యూటర్ ఉపాధ్యాయుడు. సొంతూళ్లోనే ఉండి మరో పని చేయడానికి లేక ముత్యాల పెంపకం గురించి ఆలోచించారు.


● ఆల్చిప్పలతో వినోద్

భువనేశ్వర్‌లోని భారతీయ మంచినీటి ఆక్వాకల్చర్ పరిశోధనా సంస్థలో ఐదేళ్ల క్రితం శిక్షణ పొంది కొండంత ఆశతో 10×5 చెరువులో 500 ఆల్చిప్పలు వదిలారు. వేడి వాతావరణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించకపోవటంతో నెల రోజుల్లోనే 453 ఆల్చిప్పలు చనిపోయాయి. ఆ తర్వాత గానీ, ఆల్చిప్పలు బాగుండాలంటే నీటిలో పిహెచ్ 7.5, ఉష్ణోగ్రత 25–30 డిగ్రీల మధ్య ఉండాలని గ్రహించలేకపోయారు. వేసవిలో చెరువుపై షేడ్‌నెట్ వేస్తే చాలదని, 3–4 గంటలకోసారి నీటిని మార్చాల్సిన అవసరం ఉందని అనుభవపూర్వకంగా గ్రహించారు. వెయ్యి ఆల్చిప్పలు తెచ్చి మళ్లీ చెరువులో వదిలారు. ఈ సారి 70% విజయం సాధించారు. ఇక ఆ తర్వాత వెనుదిరగలేదు. నాలుగు చెరువులకు ముత్యాల సాగు విస్తరించారు.


● వినోద్ ముత్యాల చెరువులను సందర్శిస్తున్న అధికారులు

ఇటీవల తీసిన పంటలో పది వేల ముత్యాల దిగుబడి తీశారు. అరబ్ దేశాల్లో వ్యాపారులకు ఒక్కో ముత్యం రూ. 500కు అమ్మి రూ. 20 లక్షల ఆదాయం సంపాదించారు. ఆ నోటా ఈ నోటా విని అధికారులు, రైతులు వినోద్ ముత్యాల చెరువుల్ని ఆసక్తిగా చూస్తున్నారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు వచ్చి చూశారు. ఏకంగా ప్రధాని మోదీ కూడా ప్రశంసిస్తూ ఆయనకు లేఖ రాశారు. ఆ ఉత్సాహంతో ఇతర రైతులకు శిక్షణ ఇస్తున్నారు వినోద్. రాష్ట్ర ప్రభుత్వం ముత్యాల పెంపకంపై శిక్షణా సంస్థను ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు.


● అల్ట్రావైలెట్ కాంతిలో ఉంచి పుట్టగొడుగులను డి-విటమిన్‌తో సుసంపన్నం చేస్తున్న దృశ్యం

డి-విటమిన్ పుట్టగొడుగులు!

● పుట్టగొడుగులతో యువిబి వెలుగుతో డి-విటమిన్‌ని జోడిస్తున్న ఐఐహెచ్ఆర్

● డి-విటమిన్‌తో సుసంపన్నం చేసిన పుట్టగొడుగులను అప్పటికప్పుడు వండుకు తినొచ్చు / వారం నిల్వ చేసుకోవచ్చు

● ఆ పుట్టగొడుగులను ఎండబెట్టి లేదా పొడి చేసి పెట్టుకుంటే.. ఆరు నెలలు వరకు నిల్వ చేసుకొని ఆహారంగా తీసుకోవచ్చు

● మన దేశంలో మందిలో డి-విటమిన్ లోపం ఉన్నందున.. తక్కువ ఖర్చుతో చేపట్ట దగ్గ మంచి ఆహార వ్యాపారం ఇది

డి–విటమిన్.. మనిషి శారీరక, జీవరసాయన పరమైన ఆరోగ్యాన్ని నిర్వహించడంలో ఇది ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. కాల్షియం శోషణను సులభతరం చేయడం, రోగనిరోధక వ్యవస్థను నియంత్రించడం ద్వారా ఎముకలను ఆరోగ్యంగా ఉంచుతుంది. మన దేశంలో సూర్యరశ్మి పుష్కలంగా ఉన్నప్పటికీ.. జనాభాలో గణనీయమైన భాగం (50–94%) ప్రజలు కీలకమైన డి–విటమిన్ లోపంతో బాధపడుతున్నారు. రకరకాల కారణాల వల్ల శరీరానికి ఎండ తగలకపోవటం వల్ల ప్రజలు డి–విటమిన్ లోపానికి గురవుతున్నారు.

యువిబి కిరణాల ద్వారా డి-విటమిన్...

అయితే, ఎండబెట్టిన పుట్టగొడుగులను ఆహారంగా తీసుకోవటం ద్వారా ఈ సమస్యను అధిగమించవచ్చు. పుట్టగొడుగులను అల్ట్రావైలెట్-బి (యువిబి) కిరణాల రేడియేషన్‌కు గురి చేసినప్పుడు అవి డి-విటమిన్‌ని సంతరించుకుంటాయి. పుట్టగొడుగుల్లో ఎర్గోస్టిరాల్ మూలకం ఉంటుంది. దీనికి ఎండ లేదా యువిబి కిరణాలు తగిలినప్పుడు సమర్థవంతంగా డి2 విటమిన్ (ఎర్గోకాల్సిఫెరోల్) ని ఉత్పత్తి చేయగల గుణం దీనికి ఉంది.

ఎల్మ్ ఆయిస్టర్ (హైప్సిజిగస్ ఉల్మారియస్) రకం పుట్టగొడుగుల పెంపకంపై విస్తృత పరిశోధనలు చేస్తున్న బెంగళూరులోని ఐసిఎఆర్ అనుబంధ సంస్థ భారతీయ ఉద్యాన పరిశోధనా సంస్థ (ఐఐహెచ్ఆర్) శాస్త్రవేత్తలు.. డి–విటమిన్ కలిగిన పుట్టగొడుగులను ఉత్పత్తి చేసే ప్రత్యేక యువిబి ఎక్స్‌పోజర్ యంత్రాన్ని రూపొందించారు. దేశీయ పరిజ్ఞానాన్ని ఉపయోగించి తక్కువ ఖర్చుతో ఈ పరికరాన్ని రూపొందించటం విశేషం. దీన్ని రూ. 10–15 వేల ఖర్చుతో సులువుగా అసెంబుల్ చేసుకోవచ్చని ఐఐహెచ్ఆర్ మష్రూమ్ లాబ్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా. సి. చంద్రశేఖర తెలిపారు. ఇందులో ఒకసారి కిలోన్నర పుట్టగొడుగులను విటమిన్ డితో సుసంపన్నం చేయవచ్చు.

5 నుంచి 10 నిమిషాలు చాలు...

వ్యక్తికి ఒక రోజుకు 18 మైక్రోగ్రాముల డి–విటమిన్ అవసరం. యువిబి ఎక్స్‌పోజర్ యంత్రంలోని (100 వోల్టుల) కాంతి కింద 5 నిమిషాలు ఉంచిన 50–70 గ్రాముల తాజా ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులను తీసుకుంటే ఒక రోజుకు సరిపడా డి–విటమిన్ అందుతుంది. లేదా యువిబి (100 వోల్టుల) కాంతి కింద 10 నిమిషాలు ఉంచిన 2–3 గ్రాముల తాజా ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులను తీసుకుంటే మనిషికి రోజుకు అవసరమైన డి–విటమిన్ అందుతుందని డా. సి. చంద్రశేఖర 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. అంటే, తక్కువ సేపు యువిబి కాంతిలో ఉంచిన ఎక్కువ పుట్టగొడుగులు తిన్నా పర్వాలేదు. ఎక్కువ సేపు యువిబి కాంతిలో ఉంచిన తక్కువ పుట్టగొడుగులు తిన్నా చాలన్నమాట.

ఎన్నో రకాలుగా తీసుకోవచ్చు...

డి–విటమిన్‌తో సుసంపన్నమైన ఈ పుట్టగొడుగులను అనేక విధాలుగా ఆహారంలో భాగం చేసుకోవచ్చు. పుట్టగొడుగుల పొడిని క్యాప్సూల్ రూపంలో తీసుకోవచ్చు లేదా పుట్టగొడుగుల రసం తీసుకోవచ్చు రాగి ముద్ద వంటి రోజువారీ ఆహార ఉత్పత్తులతో కలిపి తినవచ్చు లేదా ఈ పొడిని వేడి నీటితో కలిపి సూప్‌గానూ.. డి–విటమిన్ లోపాన్ని భర్తీ చేసుకోవడానికి ఏదో ఒక రీతిలో రోజువారీ ఆహారంలో తీసుకోవచ్చు. ఐఐహెచ్ఆర్ రూపొందించి, ప్రమాణీకరించిన ఈ సాంకేతికత మన దేశ ప్రజల్లో డి–విటమిన్ లోపాన్ని తీర్చడానికి విలువైన పరిష్కారాన్ని అందిస్తుందని డా. చంద్రశేఖర వివరించారు.

మార్చి 5 నుంచి 7వ తేదీ వరకు బెంగళూరులోని ఐఐహెచ్ఆర్‌లో జరగనున్న జాతీయ ఉద్యాన ప్రదర్శన–2024లో ప్రదర్శించనున్న అనేక కొత్త సాంకేతికతల్లో డి–విటమిన్ ఎన్‌రిచ్‌డ్ మష్రూమ్ టెక్నాలజీ కూడా ఒకటి. ఇతర వివరాలకు.. ఐఐహెచ్ఆర్ మష్రూమ్ లాబ్ ప్రధాన శాస్త్రవేత్త డా. సి. చంద్రశేఖరను సంప్రదించవచ్చు: 95579 35579, 80575 47150
Chandrashekara.C@icar.gov.in


● డి-విటమిన్‌తో సుసంపన్నం చేసిన ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులు

డి-విటమిన్ పుట్టగొడుగులను 6 నెలలు నిల్వ చేసుకోవచ్చు

అంతేకాకుండా, యువిబి కాంతిలో ఉంచటం ద్వారా డి–విటమిన్‌తో సుసంపన్నం చేసిన తాజా పుట్టగొడుగులను తాజాగా అప్పటికప్పుడు నచ్చిన విధంగా వండుకొని తినొచ్చు. లేదా 4–6 డిగ్రీల చల్లని ఉష్ణోగ్రతలో 4–7 రోజులు నిల్వ చేసుకొని వాడుకోవచ్చని ఐఐహెచ్ఆర్ మష్రూమ్స్ ల్యాబ్ అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డా. సి. చంద్రశేఖర 'సాక్షి సాగుబడి'తో చెప్పారు.

ఇది కూడా వీలుకాని పరిస్థితుల్లో వాటిని ఎండబెట్టి నిల్వచేసి వాడుకోవచ్చు లేదా ఎండబెట్టిన పుట్టగొడుగులను పొడి చేసి నిల్వ చేసి వాడుకోవచ్చు. ఎండబెట్టి (డీహైడ్రేట్) చేసిన పుట్టగొడుగులను గానీ, వాటిని పొడిగా మార్చి గానీ 6 నెలల వరకు వాడుకోవచ్చు. ప్రకృతి సహజమైన రోజువారీ విటమిన్ డి సప్లిమెంట్‌గా తీసుకోవచ్చు. వీటిలో ఆర్నెల్లకు పైగా డి–విటమిన్ పుష్కలంగా ఉన్నట్లు తమ పరిశోధనల్లో వెల్లడైందన్నారు. ఎల్మ్ ఆయిస్టర్ పుట్టగొడుగులతో పాటు బటన్ మష్రూమ్స్‌ను కూడా ఈ విధంగా డి–విటమిన్‌తో సుసంపన్నం చేయవచ్చా? అన్న ప్రశ్నకు ఐఐహెచ్ఆర్‌లో తాము ప్రయత్నించలేదని, అయితే, అమెరికాలో ఇప్పటికే వాణిజ్యపరంగా చేస్తున్నారన్నారు.


● ఎండు పుట్టగొడుగులు


● పుట్టగొడుగుల పొడి

సౌరశక్తితో పుట్టగొడుగుల పెంపకం

ఏ కాలంలో అయినా సులువుగా ఇంటిపట్టున ఆరుబయటే పుట్టగొడుగుల పెంపకానికి ఉపయోగపడే 'సోలార్ పవర్ ఇంటిగ్రేటెడ్ అవుట్‌డోర్ మష్రూమ్ గ్రోయింగ్ యూనిట్'ను ఐఐహెచ్ఆర్ శాస్త్రవేత్తలు మూడేళ్ల క్రితమే రూపొందించారు. 1.35 × 0.93 × 1.69 మీటర్ల సైజులో ఉండే ఈ సోలార్ యూనిట్‌తో నెలకు 25–28 కిలోల ఎల్మ్ ఆయిస్టర్, వైట్ ఆయిస్టర్ పుట్టగొడుగులను ఉత్పత్తి చేయవచ్చని ఐఐహెచ్ఆర్ చెబుతోంది. తెలుగు రాష్ట్రాల్లో సీజనల్‌గా పుట్టగొడుగులు పెంచుకోవచ్చు. ఇంటి స్థాయిలో డి–విటమిన్‌తో సుసంపన్నం చేసిన తాజా పుట్టగొడుగులను, ఎండు పుట్టగొడుగులను తయారు చేసుకునే కుటుంబాలతో పాటు వాణిజ్య స్థాయిలో తయారు చేసి విక్రయించాలనుకునే వ్యాపారస్తులకు కూడా ఐఐహెచ్ఆర్ టెక్నాలజీలు ఉపయోగకరంగా ఉంటాయి. పుట్టగొడుగుల ఉత్పత్తిపై ఐఐహెచ్ఆర్ ఏడాదికి రెండు, మూడు సార్లు 5 రోజుల శిక్షణా శిబిరం నిర్వహిస్తుంటుంది. వచ్చే జూన్ 24–28 తేదీల్లో కూడా శిక్షణా శిబిరం జరగనుంది. ఐఐహెచ్ఆర్ వెబ్‌సైట్ ద్వారా రిజిస్టర్ చేసుకోవచ్చు.



సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 337
మంగళవారం 27-2-2024
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'



కుర్రాళ్లు కొట్టేశారు
నాలుగో టెస్టులో ఇంగ్లండ్‌పై భారత్ గెలుపు.. సిరీస్ 3-1తో సొంతం - 12లో



లాభాల స్వీకరణ
సెన్సెక్స్ నష్టం 353 పాయింట్లు.. 22,150 దిగువకు నిఫ్టీ - 13లో



జూన్ నుంచి మూడో టర్మ్
ఎన్డీఏ ఘనవిజయం ఖాయమని.. జూన్ నుంచి తమ మూడో టర్మ్ పాలన మొదలవుతుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.
వివరాలు 6లో ▸



'అగ్నిపథ్'ను రద్దు చేస్తాం
తాము అధికారంలోకి వస్తే 'అగ్నిపథ్'ను రద్దు చేసి.. పాత నియామక పద్ధతిని తీసుకొస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చెప్పారు.
వివరాలు 6లో ▸



గజల్ గాయకుడు కన్నుమూత
చిట్టీ ఆయీ హై అంటూ సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ తుదిశ్వాస విడిచారు.
వివరాలు 6లో ▸



కేజ్రీవాల్ ఏడో'సారీ'
ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం వ్యవహారంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ ఏడోసారి కూడా ఈడీ విచారణకు హాజరు కాలేదు.
వివరాలు 6లో ▸

ఫ్యాక్ట్‌చెక్

ఉన్నత విద్యపై ఉన్మాద రాతలు
- గతంలో విద్య ప్రభుత్వ బాధ్యత కాదన్న చంద్రబాబు
- కానీ, సీఎం జగన్ హయాంలో గ్లోబల్ విద్యార్థులుగా పేదింటి బిడ్డలు.. ఇదిచూసి ఓర్వలేకే రామోజీ పెత్తందారి రాతలు
- పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ప్రైవేటు కళాశాలల్లోనూ హాయిగా విద్యార్థుల చదువులు
- 2020 నుంచి ఇప్పటి వరకు 15 ప్రభుత్వ డిగ్రీ కాలేజీల ఏర్పాటు

- వివరాలు 5లో

ముదిరింది ఎండే కాదు..
ఈనాడు పచ్చ పైత్యం కూడా
- రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం
- అయినా సరిపడా సరఫరా చేస్తున్న డిస్కంలు.. కోతలు లేకుండా ముందస్తు చర్యలు
- ప్రణాళిక ప్రకారం బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు
- లేని ఇబ్బందులు సృష్టించి ఈనాడు తప్పుడు రాతలు

- వివరాలు 11లో


చిత్తూరు జిల్లా శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె వద్ద జరిగిన సభకు హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం

కుప్పంలో కృష్ణమ్మ
కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం జగన్.. బీడు భూముల్లోకి బిరబిరా

నవరత్నాలతో కుప్పానికి 57 నెలల్లో రూ.1,400 కోట్లు అందించాం

15,000 మందికి ఇళ్ల పట్టాలిచ్చాం.. మరో 15 వేల మందికిపైగా ఈ నెలలోనే పట్టాలిస్తున్నాం

మీరంతా నా వాళ్లే.. మిమ్మల్ని గుండెల్లో పెట్టుకున్నా

2లో

సొంత గడ్డకే మంచి చేయని చంద్రబాబుతో రాష్ట్రానికి ఏం ప్రయోజనం?

నీళ్లు పారాల్సిన కాలువను అవినీతి పారించే కాలువగా మార్చుకున్నారు

ఇంత కాలం ఆయన్ను భరించిన కుప్పం ప్రజల సహనానికి జోహార్లు

నియోజకవర్గంలో మరో 3 ప్రాజెక్టులకు శ్రీకారం.. అనుమతులు మంజూరు

"కుప్పం ప్రజలు చంద్రబాబుకు చాలా ఇచ్చారు. అలాంటి కుప్పానికి ఆయన చేసింది పెద్ద సున్నా. 35 ఏళ్లలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులు కూడా పూర్తి చేయలేకపోయారు. పద్నాలుగేళ్లు సీఎంగా, ఏడు సార్లు ఎమ్మెల్యేని చేసిన కుప్పం ప్రజలకే మంచి చేయని బాబుతో రాష్ట్రానికి ఏం ప్రయోజనం? ఆయన ఎలాంటి మనిషో చంద్రగిరి ప్రజలు ఎప్పుడో తెలుసుకున్నారు. కుప్పానికి ఎవరి వల్ల మంచి జరిగిందో ఆలోచన చేయాలి. కుప్పానికి కృష్ణమ్మ నీళ్లను తీసుకొచ్చింది ఎవరంటే.. మీ జగన్. కుప్పాన్ని మున్సిపాలిటీగా మార్చింది మీ జగన్. కుప్పానికి రెవెన్యూ డివిజన్, పోలీస్ సబ్ డివిజన్ ఇచ్చింది మీ జగనే.




రామకుప్పం మండలంలోని రాజుపేట వద్ద కుప్పానికి కృష్ణా జలాలను విడుదల చేస్తున్న సీఎం జగన్

ఆశలతో ఉచ్చు.. ఎన్నో ఇళ్లలో చిచ్చు
ఇదే మార్గదర్శి ఆర్థిక కుతంత్రం
- పక్కా పన్నాగంతో అప్పుల ఉచ్చులోకి చందాదారులు
- డిఫాల్ట్ అయినా చిట్టీలు కొనసాగించి అప్పులు పెంచేసిన వైనం
- ఒక చిట్టీ డబ్బుల కోసం మరెన్నో గ్రూపుల్లో చేర్పించడం
- ఆస్తులు అమ్ముకుని రోడ్డున పడుతున్న సామాన్యులు
- బాధితులకు అండగా నిలుస్తున్న ప్రభుత్వం
- ఫిర్యాదు చేసేందుకు రెండంచెల వ్యవస్థ



గురివింద రామోజీ-6

సాక్షి, అమరావతి: 'మార్గదర్శి తోడుంటే ఆనందం మీవెంటే.. ఇళ్లు, కార్లు, ఫర్నీచర్, నగలు అన్నీ కొనుక్కోవచ్చు..' ఇదీ టీవీ చానళ్లలో, హోర్డింగుల్లో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఊదరగొట్టే ప్రచారం. అది నిజమేనని నమ్మి మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో చేరిన చందాదారుల ఇళ్లల్లో ఆనందం ఆవిరవుతోందన్నది పచ్చి నిజం. కొత్త ఇళ్లు, కార్లు

మిగతా 11వ పేజీలో ▶

ఉత్తరాంధ్రకు ఊతం
శృంగవరపుకోటలో ఎంఎస్ఎంఈ పార్కు.. రూ.531 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి

ప్రపంచస్థాయి సౌకర్యాలతో పరిశ్రమలకు ఆహ్వానం

జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీ భూముల సద్వినియోగానికి గ్రీన్‌సిగ్నల్

13లో

క్లీన్ స్వీపే లక్ష్యం
నేడు మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ కీలక సమావేశం

ఎన్నికల వ్యూహంపై నేతలకు దిశానిర్దేశం చేయనున్న సీఎం వైఎస్ జగన్



3లో

8 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు
అనర్హులుగా వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి నలుగురు

వారిపై స్పీకర్‌కు వైఎస్సార్‌సీపీ, టీడీపీ ఫిర్యాదులు

ఎమ్మెల్యేలను విచారించి, వివరణ తీసుకున్న స్పీకర్ తమ్మినేని

11లో



బాబు లీల.. కేడర్ గోల
ఎవరిని ఎక్కడి నుంచి పోటీ చేయిస్తున్నారో తెలియక టీడీపీలో గందరగోళం

కొత్త నేతల పేర్లు చెప్పి నియోజకవర్గాల్లో ఐవీఆర్ఎస్ సర్వే

ఇదేమి గోల అంటున్న కేడర్

మైలవరం నుంచి పెనమలూరుకు దేవినేని ఉమ.. గురజాల నుంచి నరసరావుపేటకు యరపతినేని

గంటాను ఏకంగా జిల్లా దాటించే ప్రయత్నం

విజయవాడ పశ్చిమలో తెరపైకి కొత్త వ్యక్తి

14లో

'స్కిల్' కేసులో చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాల్సిందే



ఆయన కుటుంబ సభ్యులు అధికారుల్ని బెదిరిస్తున్నారు

ఇలా చేయడం బెయిల్ షరతుల ఉల్లంఘన కిందకే వస్తుంది

అందువల్ల చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయండి

సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ విజ్ఞప్తి

కౌంటర్ దాఖలు చేయాలని బాబుకు ధర్మాసనం ఆదేశం

తదుపరి విచారణ మార్చి 19కి వాయిదా

- వివరాలు 11లో


కుప్పానికి కృష్ణా జలాల విడుదల సందర్భంగా పూజలు నిర్వహిస్తున్న సీఎం వైఎస్ జగన్


కృష్ణమ్మకు హారతి ఇస్తున్న ముఖ్యమంత్రి జగన్


పూలు జల్లుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

కుప్పంలో కృష్ణమ్మ

కృష్ణా జలాలను విడుదల చేసిన సీఎం జగన్.. బీడు భూముల్లోకి బిరబిరా

"చంద్రబాబుకు నామీద కోపం వచ్చినప్పుడల్లా పులివెందులను, కడపను తిడతాడు. చివరికి రాయలసీమను కూడా తిడుతూ ఉంటాడు. మీ జగన్ ఏనాడూ ఇక్కడి ప్రజల్ని గానీ, కుప్పం నియోజక వర్గాన్నిగానీ ఒక్క మాట కూడా అనలేదు. పులివెందుల, కుప్పం, అమరావతి, ఇచ్ఛాపురం.. ఏ ప్రాంతమైనా సరే పేదలను పేదలుగానే చూశాం. కుప్పం నియోజకవర్గంలో 82,039 కుటుంబాలకు (93.29 శాతం) నవరత్నాల పథకాల ద్వారా లబ్ధి చేకూర్చాం. కులమతాలు, ప్రాంతాలు, పార్టీలకు అతీతంగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నాం. - సీఎం జగన్

సాక్షి, తిరుపతి: కనీసం సొంత నియోజకవర్గానికైనా మేలు చేయని రాజకీయ నాయకుడు ఇక రాష్ట్రానికి ఏం ఒరగబెడతారని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా ప్రశ్నించారు. సుదీర్ఘకాలం అధికారంలో ఉన్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు 35 ఏళ్లలో కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను సైతం పూర్తి చేయలేకపోయారని విమర్శించారు. కుప్పానికే ప్రయోజనం లేని ఆ నాయకుడి వల్ల రాష్ట్రానికి ఏం ప్రయోజనం ఉంటుందో అందరూ బాగా ఆలోచన చేయాలని సూచించారు. కరువు తాండవమాడిన కుప్పం నేలకు కృష్ణా జలాలను తరలిస్తామన్న మాటను నిలబెట్టుకుంటూ తాగు, సాగునీటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న ప్రజల చిరకాల వాంఛను నెరవేరుస్తూ ముఖ్యమంత్రి జగన్ కుప్పం నియోజకవర్గానికి సోమవారం కృష్ణా జలాలను విడుదల చేశారు. కుప్పం పరిధిలోని 110 మైనర్ ఇరిగేషన్ చెరువుల ద్వారా 6,300 ఎకరాల ఆయకట్టుకు సాగునీటితోపాటు కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లోని 4.02 లక్షల మందికి తాగునీరు అందిస్తూ అనంత వెంకటరెడ్డి హంద్రీ-నీవా సుజల స్రవంతిలో భాగంగా రూ.560.29 కోట్లతో చేపట్టిన కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను సీఎం జగన్ వాయువేగంతో పూర్తి చేశారు. చిత్తూరు జిల్లా రామకుప్పం మండలం రాజుపేట వద్ద కృష్ణా జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి నీటిని విడుదల చేశారు. అనంతరం శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లె వద్ద జరిగిన బహిరంగ సభలో సీఎం జగన్ ప్రసంగించారు.

మాట నిలబెట్టుకుంటున్నా..

కొండలు, గుట్టలు దాటుకుని ఏకంగా 672 కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు నుంచి హంద్రీ-నీవా సుజల స్రవంతిలో భాగంగా కృష్ణమ్మ కుప్పం నియోజకవర్గంలోకి ఇప్పటికే ప్రవేశించింది. ఏకంగా 540 మీటర్ల ఎత్తు అంటే 1,600 అడుగుల ఎత్తు పైకెక్కి కృష్ణమ్మ మన కుప్పంలోకి బిరబిరా వచ్చింది. 2022 సెప్టెంబర్ 23న ఇదే కుప్పంలో బహిరంగ సభ సందర్భంగా నియోజకవర్గానికి కృష్ణా జలాలను తరలిస్తామని, కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులను పూర్తి చేస్తామని ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నా.

మరో మూడు ప్రాజెక్టులకు శ్రీకారం

కుప్పానికి కృష్ణా జలాలను తీసుకురావడమే కాకుండా ఇక్కడ మరో రెండు ప్రాజెక్టుల పనులకు కూడా శ్రీకారం చుట్టేలా పరిపాలన అనుమతులిచ్చాం. కుప్పంలో రెండుచోట్ల రిజర్వాయర్ల నిర్మాణానికి అనువుగా ఉన్నట్లు గుర్తించాం. గుడుపల్లి మండలంలోని యామగానిపల్లె వద్ద ఒక రిజర్వాయర్‌ను, శాంతిపురం మండలం మాదనపల్లె వద్ద మరో రిజర్వాయర్‌ను రూ.535 కోట్లతో నిర్మించడం ద్వారా అదనంగా మరో 5 వేల ఎకరాలకు తాగు, సాగునీరు అందించేందుకు మనందరి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. వీటికి పరిపాలన అనుమతులు ఇప్పటికే మంజూరు చేశాం. పాలారు ప్రాజెక్టుకు సంబంధించి 0.6 టీఎంసీల కెపాసిటీతో చిన్నపాటి రిజర్వాయర్‌ను రూ.215 కోట్లతో నిర్మించేందుకు కూడా పరిపాలన అనుమతులు మంజూరు చేశాం. వచ్చే టర్మ్‌లో ఈ మూడు ప్రాజెక్టులూ పూర్తి చేసి మీబిడ్డ మీకు అందిస్తాడు.

ముడుపులపై రీసెర్చ్

కుప్పం బ్రాంచ్ కెనాల్ పనులకు 2015లో జలవనరుల శాఖ పరిపాలన అనుమతులు మంజూరు చేస్తే చంద్రబాబు అంచనాలను అమాంతం రూ.561 కోట్లకు పెంచేసి తన పార్టీ వారికి, బినామీలకు అప్పజెప్పాడు. నీళ్లు పారే కాలువగా కాకుండా తన జేబులో నిధులు పారించే కాలువగా మార్చుకున్నారు. ఎంత ముడుపులు పుచ్చుకోవాలనే అంశంపైనే చంద్రబాబు రీసెర్చ్ చేశారు. తన నియోజకవర్గ ప్రజలనే దోచుకుని కనీసం దాహార్తి తీర్చని నాయకుడిని ఇంతకాలం భరించిన కుప్పం ప్రజల సహనానికి, మంచితనానికి జోహార్లు చెబుతున్నా.

మీకు మేలు చేసిందెవరు..?

35 ఏళ్లు ఎమ్మెల్యేగా, 14 ఏళ్లు అధికారంలో ఉన్న చంద్రబాబు వల్ల కుప్పానికి మంచి జరిగిందా? లేక మీ బిడ్డ ముఖ్యమంత్రి అయిన తర్వాత కేవలం 57 నెలల వ్యవధిలో కుప్పానికి మేలు జరిగిందా? అన్నది ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. చంద్రబాబు హెరిటేజ్ కోసం మూసివేసిన చిత్తూరు డెయిరీని తెరిపించడమే కాకుండా అమూల్‌ను తెచ్చి కుప్పం, పలమనేరు పాడి రైతులందరికీ గిట్టుబాటు ధర అందించింది ఎవరంటే మీ జగన్. ప్రతిష్టాత్మక వెల్లూర్ సీఎంసీ మెడికల్ కాలేజీని చిత్తూరు జిల్లాకు రాకుండా, కుప్పం, పలమనేరు ప్రజలకు అందుబాటులో లేకుండా చేసింది ఎవరంటే చంద్రబాబు, ఈనాడు రామోజీరావు వియ్యంకుడు, చంద్రబాబు పార్టనర్. ఆ కాలేజీని చిత్తూరులో పునఃప్రారంభించేలా చేసింది ఎవరంటే మీ జగన్. కుప్పంలో మరో రెండు విద్యుత్తు సబ్ స్టేషన్లు, ఇంటిగ్రేటెడ్ ఆఫీసు కాంప్లెక్సులు నిర్మిస్తోంది ఎవరంటే మీ జగన్. కుప్పం మున్సిపాలిటీకి రూ.66 కోట్లు ఇచ్చి పనులు చేయిస్తోంది ఎవరంటే మీ జగన్.

బాబుకు ఓటేసిన పేదలూ నావాళ్లే

కుప్పంలో చంద్రబాబుకు ఓటేసిన పేదలందరికీ ఓ మాట చెబుతున్నా. మీరందరూ నావాళ్లే అని భావిస్తూ మీకు మంచి చేశా. కుప్పం నియోజకవర్గంలో మొత్తం 87,941 కుటుంబాలుంటే నవరత్నాల పథకాలను ఏకంగా 82,039 కుటుంబాలు (93.29 శాతం) అందుకున్నాయి. మనసున్న పాలన అంటే ఇది కాదా? 2019 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రవ్యాప్తంగా డీబీటీతో నేరుగా రూ.2.55 లక్షల కోట్లు పేదల ఖాతాల్లోకి జమ చేస్తే ఒక్క కుప్పం నియోజకవర్గంలోని నా అక్కచెల్లెమ్మలకు రూ.1,400 కోట్లు అందచేశాం.

కుప్పానికి కృష్ణాభిషేకం

రామకుప్పం (చిత్తూరు జిల్లా): వేద మంత్రోచ్చారణాల నడుమ సీఎం జగన్ హంద్రీ-నీవా కాలువ ద్వారా కుప్పానికి కృష్ణా జలాలను విడుదల చేశారు. శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి గంగా హారతి ఇచ్చారు. హంద్రీ-నీవా కాలువ గేటును ఎత్తి కృష్ణా నీటిని విడుదల చేయడంతో అన్నదాతలు హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అంబటి రాంబాబు, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిధున్‌రెడ్డి, చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.



పలు అభివృద్ధి కార్యక్రమాలకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

భరత్‌ను ఎన్నుకోండి.. గుండెల్లో పెట్టుకుంటా

బలహీన వర్గాలకు చెందిన భరత్‌ను ఎమ్మెల్సీగా చేసి కుప్పానికి ఐదేళ్లలో మంచి చేశాం. భరత్‌ను కుప్పం ఎమ్మెల్యేగా ఎన్నుకోండి. నా కేబినెట్‌లో మంత్రిగా స్థానం ఇస్తా. గుండెల్లో పెట్టుకుంటా. తన ద్వారా కుప్పం నియోజకవర్గానికి మరింత అభివృద్ధి, సంక్షేమ ఫలాలను అందిస్తామని మాట ఇస్తున్నా. మీలో ప్రతి ఒక్కరూ మీకు జరిగిన మంచిని వివరిస్తూ ఇంకో వంద మందితో మనకు ఓటు వేయించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టాలని విన్నవిస్తున్నా.

'కుప్పానికి మాటిచ్చా .. నిలబెట్టుకున్నా'

సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: 'కుప్పం నియోజకవర్గానికి నీరందించే గొప్ప కార్యక్రమాన్ని నేడు మన ప్రభుత్వంలో నిర్వహించాం' అని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'హంద్రీనీవా సుజల స్రవంతిలో భాగంగా 672 కి.మీ. దూరంలో ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి కృష్ణా నది నీటిని కుప్పానికి తీసుకొచ్చాం. 2022 సెప్టెంబర్ 23న కుప్పంలో మాట్లాడుతూ ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తీసుకొస్తానని మాటిచ్చాను. నేడు ఆ మాట నిలబెట్టుకున్నాను' అని సీఎం జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో సోమవారం ట్వీట్ చేశారు.

బ్యాంకు స్టేట్‌మెంట్లే సాక్ష్యం

కుప్పంలో ప్రతి పేద కుటుంబాన్నీ అడుగుతున్నా. మీ బ్యాంకులకు వెళ్లి గత పదేళ్ల అకౌంట్ స్టేట్‌మెంట్ తీసుకోండి. చంద్రబాబు హయాంలో ఐదేళ్లు, మీ బిడ్డ వచ్చాక ఐదేళ్లు కలిపి మొత్తం పదేళ్ల స్టేట్‌మెంట్‌ను పరిశీలించండి. చంద్రబాబు పాలనలో మీ బ్యాంకు ఖాతాల్లోకి కనీసం ఒక్క రూపాయైనా వచ్చిందేమో చూడాలని కోరుతున్నా. మీ బిడ్డ గత 57 నెలలుగా నవరత్నాలతో అందించిన సాయాన్ని చూడండి. చంద్రబాబు ఎంత అన్యాయస్తుడంటే ఇచ్చే అరకొర సొమ్మును కూడా తన నియోజకవర్గంలో తనవారు, కానివారు అని ఎలా విభజించారో ఇవాళ ప్రతి పథకంలో పెరిగిన లబ్ధిదారులను చూస్తే అర్థం అవుతుంది.

- చంద్రబాబు హయాంలో అరకొరగా రూ.1,000 పింఛన్ కుప్పంలో కేవలం 31 వేల మందికి మాత్రమే ఇచ్చారు. ఇవాళ ఏకంగా 45,374 మంది ఇదే కుప్పంలో పెన్షన్లు తీసుకుంటున్నారు. నాడు రూ.200 కోట్లూ సరిగ్గా ఇవ్వని పరిస్థితుల నుంచి ఈరోజు రూ.507 కోట్లు మీ బిడ్డ ప్రభుత్వం ఇస్తోంది.
- ఒక్క కుప్పంలోనే 44,640 మంది రైతన్నలకు వైఎస్సార్ రైతు భరోసా పథకం ద్వారా ఏకంగా రూ.214 కోట్లు పెట్టుబడి సాయంగా అందచేశాం. ఇవాళ కుప్పంలో 83 ఆర్బీకేలు, 93 గ్రామ, వార్డు సచివాలయాలు, 76 విలేజ్ క్లినిక్స్ ఏర్పాటయ్యాయి. దాదాపు వెయ్యి మందికి ఉద్యోగాలు లభించాయి.
- చంద్రబాబు డ్వాక్రా రుణమాఫీ పేరుతో అక్కచెల్లెమ్మలను దగా చేస్తే మనందరి ప్రభుత్వం వైఎస్సార్ ఆసరా ద్వారా ఆదుకుంది. పథకం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా రూ.26 వేల కోట్లు పొదుపు సంఘాల మహిళలకు ఇవ్వగా ఒక్క కుప్పంలోనే 44,888 మంది అక్కచెల్లెమ్మలకు రూ.172 కోట్లు అందించాం. బాబు సున్నావడ్డీని ఎగ్గొడితే మన ప్రభుత్వం అక్కచెల్లెమ్మలకు మరో రూ.30 కోట్లు ఇచ్చింది. అమ్మ ఒడి ద్వారా కుప్పంలో 35,951 మంది తల్లులకు రూ.155 కోట్లు అందచేశాం.
- కుప్పంలో చంద్రబాబు పాలనలో అందించిన ఇళ్ల పట్టాలు సున్నా. మీ బిడ్డ ప్రభుత్వం కుప్పంలో ఇప్పటికే 15,721 ఇళ్ల పట్టాలు ఇచ్చింది. మరో 15 వేలకుపైగా ఇళ్ల పట్టాలు కూడా నెల తిరగకుండానే ఇవ్వబోతున్నాం. మొత్తం 30 వేలకుపైగా ఇళ్ల పట్టాలు ఇవ్వగలుగుతున్నాం. చంద్రబాబు హయాంలో కుప్పంలో పేదలకు మంజూరు చేసిన ఇళ్లు 3,547 కాగా కట్టింది కేవలం 2,968 మాత్రమే. అదే మీ బిడ్డ ప్రభుత్వం 7,898 ఇళ్లు మంజూరు చేసి ఇప్పటికే 4,871 ఇళ్లను పూర్తి చేసింది.
- వైఎస్సార్ చేయూత ద్వారా కుప్పంలో 19,921 మంది కుటుంబాల ఖాతాల్లోకి ఇప్పటికే రూ.85 కోట్లు జమ చేశాం.
- నాడు కుప్పంలో 7,002 మందికి ఆరోగ్యశ్రీతో రూ.28 కోట్లు విదిలిస్తే మన ప్రభుత్వం ఆరోగ్యశ్రీని 3,350 ప్రొసీజర్లకు విస్తరించి ఆరోగ్య ఆసరా కూడా అందిస్తూ 17,552 మందికి రూ.64 కోట్ల మేర మేలు చేసింది.
- బాబు హయాంలో అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద 8,459 మందికి రూ.27 కోట్లు ఇస్తే.. మనందరి ప్రభుత్వం వంద శాతం రీయింబర్స్‌మెంట్‌తో 12,093 మందికి విద్యాదీవెన, వసతి దీవెన ద్వారా చెల్లించిన సొమ్ము రూ.61 కోట్లు.

బీసీల సీటు బాబు కబ్జా

చంద్రగిరిలో చంద్రబాబును 1983లోనే ఏకంగా 17 వేల ఓట్లతో ప్రజలు ఓడగొట్టారు. తర్వాత ఇక్కడ (కుప్పం) ధనబలం చూపిస్తూ వలస వచ్చారు. బీసీల సీటును కబ్జా చేశారు. కుప్పం ప్రజలు చంద్రబాబుకు 35 ఏళ్లుగా చాలా ఇచ్చారు. కానీ కుప్పానికి ఆయన ఏమిచ్చారో ప్రతి ఒక్కరూ నిలదీయాలి. సొంత నియోజకవర్గానికే మంచి చేయని ఆ మనిషి 75 ఏళ్ల వయసు వచ్చాక మరో నలుగురితో పొత్తు పెట్టుకొని ఎన్నికల్లోకి దిగుతున్నాడు. రాష్ట్రంలో ఏ గ్రామానికైనా వెళ్లి ఫలానా మంచి చేశానని చెప్పలేడు. పొత్తులు, దత్తపుత్రుడితో ప్యాకేజీ గురించి తలుపులు బిగించుకొని మాట్లాడతారు. కాపులకు మీరు చేసిన మంచి ఏమిటి బాబూ? వంగవీటి రంగా హత్యకు పురిగొల్పింది మీరే కదా?


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై పూలవర్షం కురిపిస్తున్న అక్కచెల్లెమ్మలు


సభా ప్రాంగణం నిండిపోవడంతో వెలుపల నుంచే సీఎం ప్రసంగాన్ని ఆలకిస్తున్న ప్రజలు


సభా ప్రాంగణం వెలుపల రోడ్డు మీదే భారీ జన సందోహం

కుప్పంలో జన జాతర

సాక్షి, తిరుపతి: కుప్పంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అపూర్వ ఆదరణ లభించింది. దశాబ్దాల కల నెరవేర్చడం పట్ల జనం నీరాజనం పలికారు. కుప్పానికి కృష్ణా జలాలను విడుదల చేసేందుకు సీఎం వైఎస్ జగన్ సోమవారం రామకుప్పం మండలం రాజుపేట సమీపంలోని కుప్పం బ్రాంచ్ కెనాల్ వద్దకు వస్తున్నారని తెలుసుకుని పరిసర ప్రాంతాల రైతులు, స్థానికులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కాలువ పొడవునా జగన్‌కు జేజేలు పలికారు. పలమనేరు, కుప్పం నియోజక వర్గాల నుంచి పెద్ద ఎత్తున తరలి వచ్చిన జనంతో శాంతిపురం మండలం గుండుశెట్టిపల్లి వద్ద ఏర్పాటు చేసిన హెలిపాడ్ ప్రాంతం నిండిపోయింది. సీఎం వైఎస్ జగన్ హెలిపాడ్ నుంచి బస్సులో కూర్చొని దారిపొడవునా జనానికి అభివాదం చేస్తూ బహిరంగ సభ ప్రాంగణానికి వచ్చారు. జగన్‌కు దారిపొడవునా పూలు చల్లుతూ జనం ఘనంగా స్వాగతం పలికారు. నృత్యాలు చేస్తూ.. ఈలలేస్తూ, చప్పట్లు కొడుతూ.. వైఎస్ జగన్ ఫ్లెక్సీలు చేత పట్టుకుని జై జగన్ అంటూ నినాదాలు చేశారు. 35 ఏళ్లుగా చంద్రబాబు కుప్పం ప్రజల ఓట్లతో గెలుస్తూ.. కుప్పం ప్రజలకు చేస్తున్న అన్యాయం, మోసం గురించి సీఎం జగన్ వివరిస్తున్న సమయంలో జనం పెద్ద ఎత్తున ఈలలు వేస్తూ.. నిజమే.. నిజమే.. అని అరుస్తూ కనిపించారు. 2022 సెప్టెంబర్ 23న కుప్పంకు వచ్చిన సమయంలో తాను ఇచ్చిన మాట ప్రకారం కృష్ణా జలాలను తీసుకొచ్చానని చెప్పటంతో 'మళ్లీ సీఎం మీరే' అంటూ హర్షం వ్యక్తం చేశారు. మరో మూడు రిజర్వాయర్లు నిర్మించేందుకు పరిపాలన అనుమతులు ఇస్తున్నట్లు ప్రకటించటం పట్ల, చంద్రబాబు 35 ఏళ్లుగా చేయలేని కుప్పం రెవెన్యూ డివిజన్, మున్సిపాలిటీ, డీఎస్పీ డివిజన్ ఏర్పాటు చేసిన విషయాన్ని ప్రస్తావించిన సమయంలో జనం మరింత బిగ్గరగా కృతజ్ఞతలు తెలిపారు.

నమ్మలేక పోతున్నాం



మా గ్రామాల మీదుగా కృష్ణా జలాలు ప్రవహిస్తాయని ఇప్పటి వరకు ఊహించలేదు. నీటి ప్రవాహన్ని చూస్తుంటే నమ్మలేక పోతున్నాం. హంద్రీ-నీవా కాలువలో నీళ్లు చూస్తుంటే చెప్పలేని ఆనందం కలుగుతోంది. కరువు కాటకాలతో బతుకుతున్న మా జీవితాల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారు. జగనన్న రుణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేనిది. తాగడానికి నీళ్లతో పాటు వ్యవసాయంపై ఆధారపడిన రైతులకు బతుకు కల్పించారు.
– చంద్రశేఖర్, పెద్దబళ్దార్, రామకుప్పం మండలం

వైఎస్సార్‌సీపీని గెలిపిస్తాం



రాజకీయాలతో సంబంధం లేకుండా అన్ని ప్రాంతాలకు సమన్యాయం చేస్తున్న జగన్ మళ్లీ సీఎం కావడం ఖాయం. ప్రతిపక్ష నేత నియోజకవర్గమైనా రూ.250 కోట్లతో కాలువ పనులు పూర్తిచేసి కుప్పం ప్రజలకు నీళ్లు ఇచ్చిన దేవుడు జగన్. సంక్షేమ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదుగుదలకు సహాయం చేస్తున్నారు. ఇలాంటి మంచి నాయకుడిని మళ్లీ సీఎం చేసుకోవడం అందరి బాధ్యత. భరత్‌ను గెలిపించుకుంటాం.
– సుబ్రమణ్యం, రామకుప్పం మండలం

రుణం తీర్చుకుంటాం



40 ఏళ్ల మా కలను నెరవేర్చిన మ్యుమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రుణం తీర్చుకునేందుకు కుప్పం ప్రజలు సిద్ధంగా ఉన్నారు. మేము చిన్నప్పటి నుంచి ఈ నీళ్ల కోసం ఎదురు చూస్తున్నాం. ఇన్నాళ్లకు మా కోరిక నెరవేరింది. మంచి చేసిన వారిని ఆదరించడమే కుప్పం ప్రజలకు తెలుసు. తాగు, సాగునీటి సమస్య తీర్చిన సీఎం జగన్‌ను మరవలేం.
– గురుస్వామి, వెదురుగుట్టపల్లి, శాంతిపురం మండలం

క్లుప్తంగా...

7న విభజన చట్టం అమలుపై కేంద్రం సమీక్ష

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ పునర్ వ్యవస్థీకరణ చట్టం అమలుపై కేంద్ర హోంశాఖ సమీక్ష నిర్వహించనుంది. ఈ మేరకు కేంద్ర హోం శాఖ కార్యదర్శి అధ్యక్షతన మార్చి 7వ తేదీన తెలంగాణ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసింది. తెలంగాణలో విద్యాసంస్థలు, మౌలిక వసతుల కల్పన, విద్యుత్ రంగంపై ఈ సమావేశంలో సమీక్ష చేయనున్నారు. విభజన చట్టం అమలుపై ఇటీవలే ఏపీ అధికారులతో కేంద్ర హోంశాఖ సమావేశమైన విషయం విదితమే.

రేపటి నుంచి ఎడ్‌సెట్ తుది దశ కౌన్సెలింగ్

సాక్షి, అమరావతి: ఏపీ ఎడ్‌సెట్(బీఈడీ/బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్) తుది దశ ప్రవేశాల కోసం వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ఉన్నత విద్యా మండలి సోమవారం విడుదల చేసింది. ఈ నెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు రిజిస్ట్రేషన్, 29 నుంచి మార్చి 3 వరకు ధ్రువీకరణపత్రాల పరిశీలన, మార్చి 2 నుంచి 5 వరకు ఆప్షన్ల ఎంపికకు అవకాశం కల్పించింది. మార్చి 6న వెబ్ ఆప్షన్లలో మార్పుల అనంతరం 9న అభ్యర్థులకు తుది సీట్లను కేటాయించనుంది. సీట్లు పొందినవారు 11 నుంచి 16 లోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలని వెల్లడించింది.

గ్రూప్-2 'కీ' విడుదల

29 వరకు అభ్యంతరాల స్వీకరణ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్-2 ప్రిలిమ్స్ పరీక్ష 'కీ'ని సోమవారం విడుదల చేసింది. 150 ప్రశ్నలకు సమాధానాలను గుర్తించిన 'కీ'ని కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచింది. ప్రాథమిక కీపై అభ్యంతరాలను నేటి నుంచి ఈ నెల 29 వరకు తెలపాలని విజ్ఞప్తి చేసింది. అభ్యంతరాలను ఆన్‌లైన్‌లో మాత్రమే తెలపాలని కమిషన్ ప్రకటించింది.

గిరిజన ప్రాంత టీచర్ పోస్టుల్ని మార్చడం తగదు

హైకోర్టులో పిటిషన్

సాక్షి, అమరావతి: డీఎస్సీ నోటిఫికేషన్‌లో గిరిజన ప్రాంతాల్లోని 517 ఉపాధ్యాయ పోస్టులను జనరల్ కేటగిరీలోకి మార్చారని, దీనివల్ల గిరిజన యువత నష్టపోతోందని పేర్కొంటూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ వ్యాజ్యంపై సోమవారం హైకోర్టు విచారణ జరిపింది. గిరిజన గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యాయుల భర్తీకి సంబంధించిన వివరాలను తమ ముందుంచాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. అంతకుముందు పిటిషనర్ తరఫు న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపిస్తూ.. గిరిజన ప్రాంతాల్లోని ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసే అధికారం ఐటీడీఏ పీవోకి మాత్రమే ఉందన్నారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుతం భర్తీ చేస్తున్నవి జోనల్ పోస్టులని తెలిపారు. జిల్లాస్థాయి పోస్టులను మాత్రమే భర్తీచేసే అధికారం ఐటీడీఏ పీవోకి ఉంటుందన్నారు. పూర్తి వివరాలను కోర్టు ముందుంచుతామని తెలిపారు. అంగీకరించిన న్యాయమూర్తి విచారణ వాయిదా వేశారు.

'శాప్ నెట్' చైర్మన్‌గా మాచాని వెంకటేశ్



సాక్షి, అమరావతి: సొసైటీ ఫర్ ఆంధ్రప్రదేశ్ నెట్‌వర్క్ (శాప్ నెట్) చైర్మన్‌గా ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన మాచాని వెంకటేశ్ బాధ్యతలు చేపట్టారు. విజయవాడలోని సంస్థ కార్యాలయంలో సోమవారం మాచానితో సీఈవో ప్రజ్ఞాద రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించారు.



'యథారాజా తథా ప్రజ' అని అభ్యర్థులందరూ మీ పనితీరుపై కూడా సర్వే చేయించమంటున్నార్సార్!

క్లీన్ స్వీపే లక్ష్యం



మీడియాతో మాట్లాడుతున్న సజ్జల రామకృష్ణారెడ్డి చిత్రంలో వైఎస్సార్‌సీపీ నేతలు

- నేడు మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ కీలక సమావేశం
- ఏర్పాట్లను పరిశీలించిన పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 175కు 175 శాసన సభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు వేస్తున్నారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ శ్రేణులకు మంగళవారం దిశానిర్దేశం చేయనున్నారు. ఇందుకోసం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ సెంటర్‌లో 'మేము సిద్ధం.. మా బూత్ సిద్ధం' పేరుతో కీలక సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల సమన్వయకర్తలు, పార్టీ జిల్లా అధ్యక్షులు, ప్రాంతీయ సమన్వయకర్తలు, నియోజకవర్గ పరిశీలకులు, మండల పార్టీ అధ్యక్షులు, నియోజకవర్గ, మండల, జగనన్న సచివాలయ కన్వీనర్లు సహా 2,700 మందికిపైగా నేతలను ఈ సమావేశానికి ఆహ్వానించారు. ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై వారికి సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారు. సీకే కన్వెన్షన్ సెంటర్‌లో ఈ సమావేశం ఏర్పాట్లను సోమవారం వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు (ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయనతోపాటు ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, ఇతరులు కూడా ఉన్నారు.

ప్రజాక్షేత్రంలో వైఎస్సార్‌సీపీ దూకుడు

రాష్ట్రంలో గత 58 నెలలుగా రాష్ట్రంలోని ప్రతి పేదింటి భవిష్యత్తును గొప్పగా మార్చేలా సీఎం వైఎస్ జగన్ సుపరిపాలన అందిస్తుండటంతో వైఎస్సార్‌సీపీకి ప్రజాదరణ రోజురోజుకూ పెరుగుతోంది. 2019 ఎన్నికల తర్వాత జరిగిన ప్రతి ఎన్నికల్లోనూ ఇది ప్రతిబింబించింది. సుపరిపాలన వల్ల ప్రతి ఇంటా.. ప్రతి గ్రామం.. ప్రతి నియోజకవర్గంలో వచ్చిన విప్లవాత్మక మార్పులు కళ్లకు కట్టినట్లు కన్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో క్లీన్ స్వీపే లక్ష్యంగా ముందుకు వెళ్లాలని 2022 మే 11న ప్రారంభించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేశారు. అప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రజాక్షేత్రంలో దూసుకుపోతోంది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు నీరాజనాలు పట్టారు. గత నెల 27న భీమిలి వేదికగా ఎన్నికలకు 'సిద్ధం' అంటూ సీఎం వైఎస్ జగన్ ఎన్నికల శంఖం పూరించారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి భీమిలి, దెందులూరు, రాప్తాడులో నిర్వహించిన 'సిద్ధం' సభలు ఒకదానికి మించి మరొకటి గ్రాండ్ సక్సెస్ అయ్యాయి. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు ప్రజాక్షేత్రంలో దూకుడు మరింత పెంచాయి. వచ్చే నెల 3న పల్నాడు ప్రాంతంలో పిచ్చికలగుడిపాడు 'సిద్ధం' చివరి సభ నిర్వహిస్తున్నారు. ఆ తర్వాత ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టనున్నారు.

ఆత్మవిశ్వాసంతో ఎన్నికలకు సిద్ధం: సజ్జల రామకృష్ణారెడ్డి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సీఎం వైఎస్ జగన్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు, కార్యకర్తలు ప్రజాక్షేత్రంలో ఉన్నారు. గత 58 నెలలుగా సీఎం వైఎస్ జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాలు, సుపరిపాలనను ప్రతి గడపకూ తీసుకెళ్తున్నారు. ఈసారి ఎన్నికల్లో 175 స్థానాల్లో విజయమే లక్ష్యంగా మేం సమర్థవంతమైన టీమ్‌ను సిద్ధం చేసుకున్నాం. ఆత్మ విశ్వాసంతో ముందుకెళ్తున్నాం. ప్రభుత్వం చేసిన మంచిని మరింత సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడం, ప్రతిపక్షాల విమర్శలను దీటుగా తిప్పికొట్టడం, ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా చేపట్టాల్సిన చర్యలపై మంగళవారం నిర్వహించే కీలక సమావేశంలో నేతలకు సీఎం వైఎస్ జగన్ దిశానిర్దేశం చేస్తారు. మేం సమన్వయకర్తలను నియమించేటప్పుడు ఏదో జరిగిపోతున్నట్లుగా ప్రతిపక్షాలు రాద్ధాంతం చేశాయి. కానీ.. సీఎం వైఎస్ జగన్‌పై ఉన్న నమ్మకంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులన్నీ ఏకతాటిపైకి వచ్చాయి. టీడీపీ-జనసేన కూటమి అతుకులబొంత అని సీట్ల సర్దుబాటులోనే స్పష్టమైంది. పవన్‌ను అనుసరిస్తున్న శ్రేణులను ఘోరంగా అవమానిస్తూ చంద్రబాబు జనసేనకు 24 సీట్లు పడేశారు. ఆ రెండు పార్టీల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. టీడీపీ, జనసేన అసంతృప్త నేతలు గంపగుత్తగా వైఎస్సార్‌సీపీలో చేరుతామంటున్నారు. కానీ.. మేం ఎవరిని పడితే వారిని చేర్చుకోం. వారి వల్ల అనవసరమైన తలనొప్పులు. అవకాశం ఉన్న చోట మాత్రమే ఆ పార్టీల నేతలను చేర్చుకుంటాం.

నేటి నుంచి 'టెట్'

120 సెంటర్లలో సీబీటీ విధానంలో పరీక్ష

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్)-2024 షెడ్యూల్ మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే 2,67,559 మంది అభ్యర్థులకు విద్యా శాఖ హాల్ టికెట్లను జారీ చేసింది. టెట్ మొదటి సెషన్ ఉదయం 9.30 నుంచి 12, రెండో సెషన్ మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటల వరకు జరుగుతుంది. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) విధానంలో జరిగే ఈ పరీక్ష కోసం అధికారులు రాష్ట్ర వ్యాప్తంగా 120 సెంటర్లను సిద్ధం చేశారు. అభ్యర్థులకు అవసరమైన తాగునీరు, వైద్య సదుపాయాలను సైతం కల్పించినట్టు కమిషనర్ సురేష్‌కుమార్ సోమవారం తెలిపారు. పరీక్ష సరళిని పర్యవేక్షించేందుకు జిల్లాకు ఒక అధికారి చొప్పున 26 మందిని, 300 మంది అభ్యర్థులకు ఒక డిపార్ట్‌మెంటల్ అధికారిని నియమించినట్టు చెప్పారు. హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, బరంపురంలోని పరీక్ష కేంద్రాలకు కూడా డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లను నియమించినట్టు తెలిపారు. పరీక్ష కేంద్రాల పర్యవేక్షణకు ఫ్లయింగ్ స్క్వాడ్స్‌నూ సిద్ధం చేశామన్నారు. వైకల్యం గల అభ్యర్థుల కోసం సహాయకులను అందించడంతో పాటు వారికి 50 నిమిషాల అదనపు సమయం ఇచ్చినట్టు వెల్లడించారు. గర్భిణులు సమీప పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేలా వెసులుబాటు కల్పించినట్టు తెలిపారు. అయితే వీరు పరీక్ష కేంద్రంలోని అధికారులకు పరీక్ష రాసే ముందుగా సమాచారం ఇవ్వాల్సి ఉంది. హైకోర్టు ఆదేశం మేరకు బీఈడీ అభ్యర్థులు స్కూల్ అసిస్టెంట్ పోస్టులకు, డీఈడీ అభ్యర్థులు ఎస్జీటీ పోస్టుల టెట్ మాత్రమే రాయాల్సి ఉంది. టెట్ జరిగే అన్ని రోజులూ ఉదయం 7.30 నుంచి సాయంత్రం 7 గంటల వరకు కమిషనరేట్‌లో ప్రత్యేక హెల్ప్ డెస్క్ (95056 19127, 97056 55349, 81219 47387, 81250 46997) సేవలు అందించేలా చర్యలు తీసుకున్నారు.

టెట్ షెడ్యూల్ ఇదీ..

పేపర్ 1ఏ: నేటి నుంచి మార్చి 1 వరకు
పేపర్ 2ఏ: మార్చి 2, 3, 4, 6 తేదీలు
పేపర్ 1బి: మార్చి 5 (ఉదయం)
పేపర్ 2బి: 05.03.2024 (మధ్యాహ్నం)

శ్రీసిటీలో ప్రపంచ శ్రేణి మౌలిక సదుపాయాలు భేష్

సింగ్‌పూర్‌కు చెందిన సీనియర్ అధికారుల బృందం ప్రశంస



శ్రీసిటీలో సింగపూర్ సీనియర్ అధికారుల బృందం

శ్రీసిటీ (వరదయ్యపాళెం(తిరుపతి జిల్లా): సింగపూర్ వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ పరిధిలోని ఎంటర్‌ప్రైజ్ సింగపూర్ (ఈఎస్‌జీ) ఏజెన్సీకి చెందిన తొమ్మిది మంది సీనియర్ అధికారుల బృందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలపై ప్రశంసలు కురిపించింది. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) శివశంకర్ వారికి సాదర స్వాగతం పలికి, పారిశ్రామిక నగరం ప్రగతి, ప్రత్యేకతలు, ప్రపంచశ్రేణి మౌలిక సదుపాయాలు, ఇక్కడ వ్యాపారవేత్తలకు కలిగే నిర్దిష్ట ప్రయోజనాలు, ప్రోత్సాహకాలను వివరించారు. శ్రీసిటీలో పరిశ్రమల అనుకూల వాతావరణంపై సంతృప్తి చెందిన సింగపూర్ అధికారులు.. భారీ పారిశ్రామికవాడను అభివృద్ధి చేయడంలో శ్రీసిటీ యాజమాన్యం చేపట్టిన కార్యక్రమాలను అభినందించారు. ఈ పర్యటనపై శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి స్పందిస్తూ ఈ తరహా పర్యటనలు సింగపూర్, భారత్‌ల మధ్య వ్యాపార సంబంధాలను మరింత మెరుగుపరుస్తాయన్నారు.

త్వరలోనే ఉద్యోగుల సమస్యల పరిష్కారం

- సీఎం జగన్ సానుకూలంగా స్పందించారు
- ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు



మార్కాపురం: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలన్నీ త్వరలోనే పరిష్కారమవుతాయని ఏపీ ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని ఆయన చెప్పారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నిర్మించిన కాంప్లెక్స్ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ మీటింగ్‌లో వివరించడంతోపాటు సీఎం వైఎస్ జగన్ దృష్టికి కూడా తీసుకెళ్లామని చెప్పారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిందని, అందువల్లే చలో విజయవాడను వాయిదా వేశామని వివరించారు. ప్రభుత్వం హామీ ఇచ్చిన ప్రకారం ఇప్పటికే జీపీఎఫ్‌కు సంబంధించిన రూ.70కోట్లు, సీపీఎస్‌కు సంబంధించిన రూ.100కోట్లు, మెడికల్ బిల్లుల కోసం రూ.40కోట్లను చెల్లించేందుకు ఏర్పాట్లు చేసిందన్నారు. మార్చి నెలాఖరుకు అన్నీ పరిష్కారమవుతాయని, త్వరలోనే ఉద్యోగులకు పీఆర్సీ ప్రయోజనాలను అందించేందుకు వీలుగా కమిషన్ వేగంగా పని చేసేలా చర్యలు తీసుకుంటామని ప్రభుత్వం చెప్పిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శరత్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆలోచనా విధానమే వికేంద్రీకరణ



రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

1,247వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు

తాడికొండ: వికేంద్రీకరణతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమనే అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని ఆదర్శంగా తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అడుగులు వేస్తున్నదని బహుజన పరిరక్షణ సమితి నాయకులు హర్షం వ్యక్తం చేశారు. గుంటూరు జిల్లా తుళ్ళూరు మండలం తాళ్ళాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో 1,247వ రోజు కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలో సోమవారం పలువురు మాట్లాడారు. రాజ్యాంగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సూచించిన బహుజన రాజ్యాధికారంకోసం, భవిష్యత్తులో వేర్పాటు వాద ఉద్యమాలు రాకుండా ఉండేందుకు 3 ప్రాంతాల సమానాభివృద్ధి దిశగా జగన్ అడుగులు వేస్తున్నారే తప్ప.. ఇందులో స్వప్రయోజనం ఏదీ లేదన్నారు. బాబు మాత్రం కులరాజ్య స్థాపన చేసి తరతరాలు ఈ ప్రాంతంలో తమ కులవాదులే ఆధిపత్యం ప్రదర్శించాలనే దుర్మార్గ బుద్ధితో వెలిసిందే అమరావతి అని.. దీని వలన రాష్ట్ర ప్రజలకు ఏం ఉపయోగం ఉందో చెప్పాలని ప్రశ్నించారు. 5 సంవత్సరాల కాలంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన జగన్‌మోహన్‌రెడ్డి ఓట్లు అడుగుతున్నారని, బాబుకు దమ్ముంటే అదేవిధంగా అడగగలరా అని సవాల్ విసిరారు. సొంత నియోజకవర్గం కుప్పానికి గుక్కెడు నీళ్లివ్వలేని చంద్రబాబు ప్రపంచ స్థాయి రాజధాని నిర్మిస్తానని చెబితే ప్రజలు నమ్మేంత పిచ్చివాళ్లు కాదన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, బోదాల సౌమ్య, కొమరవల్లి కిషోర్ బాబు, పులి దాసు, ఈపూరి ఆదాం, బోదాల సలోమీ, కారుమూరు పుష్పరాజు, బొలిమేర శ్యామ్యూల్, నూతక్కి జోషి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో పది మంది మృతి

కాకినాడ, కర్నూలు, అన్నమయ్య జిల్లాల్లో దుర్ఘటనలు



అనంతపురం జిల్లా ఉరవకొండ శివారులో సంఘటన స్థలం వద్ద చెల్లాచెదురుగా పడిన కూలీలు

ప్రత్తిపాడు/సాక్షి, బళ్లారి/రామాపురం/ఉరవకొండ: రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 10 మంది మరణించగా, 41 మంది గాయపడ్డారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు వద్ద 16వ నంబర్ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు అదుపుతప్పి దూసుకుపోవడంతో రోడ్డు పక్కనే ఉన్న నలుగు అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. సోమవారం వేకువజామున ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఒడిశా నుంచి తమిళనాడు సరిహద్దులోని గుమ్మిడిపూడికి వైర్ల లోడుతో రెండు లారీలు వెళ్తున్నాయి. వీటిలో ఒక లారీ టైరు పంక్చర్ అవ్వడంతో రెండు లారీలను పాదాలమ్మ గుడి సమీపంలో రోడ్డు పక్కన నిలిపి బాపట్ల జిల్లా బల్లికురవ మండలం నక్కబుక్కలపాడు గ్రామానికి చెందిన లారీ డ్రైవర్లు దాసరి కిషోర్ (40), దాసరి ప్రసాద్ (42), బండి నాగయ్య (27) టైరు మార్చుతున్నారు. అదే సమయంలో విశాఖపట్నం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న ఏపీఎస్ ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు అదుపు తప్పి, వారి మీద నుంచి వేగంగా దూసుకుపోయింది. అదే సమయంలో స్థానిక శ్రీ శారదా వయోవృద్ధ నిలయంలో పని చేస్తున్న విశాఖకి చెందిన మూగవాడైన దిమిలి లోవరాజు (30)ను బస్సు ఢీకొట్టింది. కర్నూలు జిల్లాకి చెందిన రైతులు ఎండు మిర్చి పంటను అమ్ముకోవడానికి కర్ణాటకలోని బ్యాడగికి వెళుతుండగా టెంపో వాహనం టైరు పంక్చరై బోల్తాపడింది. ఈ దుర్ఘటనలో ముగ్గురు రైతులు మృతి చెందారు. మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. దావణగెరె నగర శివార్లలో పూణె-బెంగళూరు హైవేలో సోమవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. అన్నమయ్య జిల్లా రామాపురం మండలం బండపల్లెలో కర్నూలు – చిత్తూరు జాతీయరహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. రామాపురం మండలం సరస్వతిపల్లెకి చెందిన డేగల లక్ష్మీ భవాని (32) తన కుమార్తె వినిత(4)కి జ్వరం రావడంతో బావ కుమారుడు కృష్ణబాబు(22)తో కలిసి ద్విచక్రవాహనంలో రాయచోటికి వైద్యం కోసం వెళ్తున్న సమయంలో ముందున్న లారీ ఒక్కసారిగా పక్కకు తిరగడంతో బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ముగ్గురూ మరణించారు. ఇక అనంతపురం జిల్లా ఉరవకొండ శివారులోని గుంతకల్లు రోడ్డు వైపు హంద్రీ-నీవా కాలువ సమీపంలో సోమవారం తెల్లవారుజామున బొలెరో వాహనం బోల్తా పడటంతో 35 మంది కూలీలు గాయపడ్డారు. ఈ ఘటనలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఒకవేళ అది సరైనది కాకపోతే దాన్ని చేయకు;
ఒకవేళ అది సత్యం కాకపోతే దాన్ని చెప్పకు.
– మార్కస్ అరేలియస్

సాక్షి

మంగళవారం, 27 ఫిబ్రవరి 2024

సిగ్గు... సిగ్గు...

వ్యవసాయభూముల కాపాడేందుకు ఉద్యమాలు చేసి, అప్పటి ప్రభుత్వాన్ని గద్దె దింపి అధికారంలోకి వచ్చిన పార్టీ చివరకు అందులోనే విఫలమైతే? సదరు పార్టీ వ్యక్తులే సారవంతమైన భూముల్ని కబ్జా చేసి, స్థానికులను జీతం బత్తెం లేని బానిస కూలీలుగా మార్చి, స్త్రీలపై యథేచ్ఛగా లైంగిక అత్యాచారాలు సాగిస్తుంటే? పశ్చిమ బెంగాల్‌లో 34 ఏళ్ళ దీర్ఘకాల వామపక్ష సర్కార్‌పై అలుపెరుగని పోరాటాలు చేసి, 2011లో అధికారంలోకి వచ్చిన తృణమూల్ కాంగ్రెస్, ఆ పార్టీ అధినేత్రి మమతా బెనర్జీపై ఇప్పుడు సందేశ్‌ఖలీ వ్యవహారంలో వస్తున్న విమర్శలు ఇవే. కోల్‌కతాకు 70 కి.మీ.ల దూరంలో, ఉత్తర 24 పరగణాల జిల్లాలో సారవంతమైన భూములతో కూడిన ఈ కుగ్రామం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇప్పటికి 53 రోజులైనా, అక్కడి అకృత్యాలకు మూలమని ఆరోపణలను ఎదుర్కొంటున్న అధికార పార్టీ నేత షేక్ షాజహాన్‌ను అరెస్ట్ చేయకపోవడంపై కలకత్తా హైకోర్ట్ సోమవారం తీవ్ర వ్యాఖ్యలు చేయాల్సి రావడం పరాకాష్ఠ.

సందేశ్‌ఖలీలో చాలాకాలంగా అకృత్యాలు సాగుతున్నా, అది ఇప్పుడు చర్చకు వచ్చింది. రేషన్ కుంభకోణంలో నిందితుడైన స్థానిక రాజకీయ బాహుబలి షేక్ షాజహాన్‌ను అరెస్ట్ చేసేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) జనవరి 5న వెళ్ళింది. వారిపై దాదాపు 2 వేల మంది దాకా షాజహాన్ అనుచరులు తీవ్రమైన దాడికి తెగబడ్డారు. అప్పటి నుంచి ఆయన పరారీలో ఉండగా, పెద్దయెత్తున స్థానిక మహిళలు బయటకొచ్చి, ధైర్యం కూడగట్టుకొన్నారు. అనేక సంవత్సరాలుగా అక్కడ షాజహాన్, ఆయన అనుచరులు సాగిస్తున్న భూకబ్జాలనూ, లైంగిక అత్యాచారాలనూ బయటపెట్టారు. ఈ ఆరోపణలతో గ్రామంలో నిరసనలు తలెత్తాయి. గ్రామస్థుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకొని, షాజహాన్ ప్రధాన అనుచరులైన ఉత్తమ్ సర్దార్, శివప్రసాద్ హజ్రాల ఆస్తులపై దాడికి దిగేలా చేసింది. షాజహాన్‌నూ, అతని అనుచరులనూ అరెస్టు చేయాలని కోరుతూ ఆడవాళ్ళు పెద్ద సంఖ్యలో వీధులకెక్కారు. అధికార తృణమూల్ అసలు నిందితుడి విషయంలో మీనమేషాలు లెక్కిస్తుంటే, ఈ వ్యవహారాన్ని ఎన్నికల ప్రయోజనాలకు ఎలా వాడుకోవాలా అని బీజేపీ చూస్తోంది.

అధికార పార్టీ సైతం ఆచితూచి వ్యవహరిస్తున్న నిందితుడు షేక్ షాజహాన్‌ది పెద్ద కథ. 'సుందర్‌బన్స్ అసలు పులి' అంటూ స్థానిక గ్రామీణులు పిలుచుకొనే అతను 2013 నుంచి తృణమూల్‌కూ, అంతకు ముందు సీపీఐ (ఎం)కూ ఓటింగ్ మిషన్. అతను ఎవరికి మద్దతిస్తే వారిదే గెలుపు. 2023 జూలై పంచాయతీ ఎన్నికల్లో సందేశ్‌ఖలీలోని రెండు బ్లాకుల్లో 333 సీట్లుంటే, 310 సీట్లు పోటీ లేకుండా తృణమూల్ ఖాతాలో పడ్డాయి. మిగతా 23 సీట్లలోనూ చివరకు తృణమూల్ జెండాయే ఎగిరింది. అలాంటి బలవంతుణ్ణి వదులుకోవడం ఎంత మమతకైనా కష్టమే. అందులోనూ మైనార్టీ అయిన షాజహాన్‌ను పరారీలో ఉన్నాడంటూ వదిలేసి, అతని హిందూ సహచరులిద్దరిని పోలీసులు అరెస్ట్ చేయడంతో బీజేపీ – ఆరెస్సెస్‌లకు అస్త్రం అందివచ్చినట్టయింది. మమత మైనార్టీ బుజ్జగింపు రాజకీయాలు చేస్తున్నారని నిందిస్తూ ఎస్సీ, ఎస్టీలను తమ వైపు తిప్పుకోవాలని కమలదళం యత్నిస్తోంది. నాలుగేళ్ళ క్రితమే పోలీసులకు ఫిర్యాదులందినా, 42 కేసులు దాఖలైనా షాజహాన్‌ను కదిలించినవారు లేదు. అతణ్ణి అరెస్ట్ చేస్తే మైనార్టీలు దూరమవుతారనేది మమత భయం. ఏమైనా, మోదీ పర్యటనకు వచ్చే లోపల మమత ఆ పని చేయక తప్పకపోవచ్చు.

గతంలో వామపక్ష ప్రభుత్వం ఉన్నప్పుడు ప్రతిపక్ష నేతగా మమత ఎలాంటి ధర్నాలు చేసిందీ తెలుసు. 2007లో నందిగ్రామ్‌లో ప్రత్యేక ఆర్థిక జోన్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యమించి అక్కడకు చేరడానికి ఆమె స్కూటర్ వెనుక కూర్చొని ప్రయాణించడం, సింగూర్‌లో టాటా నానో కర్మాగారం ఎదుట ధర్నాలు చేయడం అందరికీ గుర్తే. తీరా మమత పాలనలో ప్రతిపక్షాలు ఆ తరహా పోరాటాలు సాగించలేకపోతున్నాయి. బీజేపీలో సైతం నేతల మధ్య సమన్వయం కొరవడింది. దాంతో, ప్రధానమంత్రే రంగంలోకి దిగుతున్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలకు మరికొద్ది రోజులే ఉన్నందున అందివచ్చిన అవకాశాన్ని వినియోగించుకొనేందుకు మార్చి తొలివారంలో ఒకటికి మూడుసార్లు బెంగాల్‌లో పర్యటించనున్నారు. రాజకీయాలు, హింసాకాండ జంటపదాలైన బెంగాల్ దేశంలోని అతి సున్నితమైన ప్రాంతాల్లో ఒకటని కేంద్ర ఎన్నికల సంఘం గుర్తించింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, చివరకు కాశ్మీర్ కన్నా ఎక్కువగా 920 కంపెనీల కేంద్ర బలగాలను బెంగాల్‌లో దింపనున్నట్టు ప్రకటించింది.

సభ్యసమాజం సిగ్గుపడేలా సాగుతున్న లైంగిక అత్యాచారాలపై పార్టీలకు అతీతంగా నేతలందరూ గళం విప్పాల్సింది. తృణమూల్ మొదట అసలు అలాంటిదేమీ లేనే లేదని కొట్టిపారేసింది. ఆనక ఇదంతా తమను అప్రతిష్ఠ పాల్జేసేందుకు కాషాయదళ స్కెచ్ అనీ, ఇప్పుడేమో నిందితుల్ని శిక్షిస్తామనీ పిల్లిమొగ్గలు వేసింది. ప్రతిపక్షాలేమో స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు ఈ వివాదాన్ని ఎలా వాడుకోగలమనే ప్రయత్నంలోనే ఉన్నాయి. ఇంత సాగుతున్నా, సందేశ్‌ఖలీ ఘటనల్ని సీఎం మమత గట్టిగా ఖండించిన పాపాన పోలేదు. కనీసం పోలీసులు అసలు నిందితుణ్ణి అరెస్ట్ చేసిందీ లేదు. ఇది శోచనీయం. ఓ మహిళ పాలిస్తున్న రాష్ట్రంలో, శాంతిభద్రతల పరిరక్షించాల్సిన హోమ్ శాఖ ఆమె చేతిలో ఉండగా ఇదీ స్త్రీల పరిస్థితి కావడం మరింత సిగ్గుచేటు. రాజకీయాలు పక్కనపెట్టి ప్రభుత్వం తక్షణం దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలి. బలవంతుడిదే రాజ్యంగా మారిన పరిస్థితుల్ని మార్చి, కబ్జాకు గురైన భూముల్ని అసలు యజమానులకు అప్పగించాలి. అప్పుడే న్యాయం గెలుస్తుంది. ప్రభుత్వంపై, ప్రజాస్వామ్యంపై జనంలో నమ్మకం నిలుస్తుంది.

పంటలన్నిటికీ ఒకే విధానం సాధ్యమా?

అభిప్రాయం



పి. వేణుగోపాల్ రెడ్డి

కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించాలని చేస్తున్న రైతుల ఉద్యమం ఇప్పటికీ ఆగడం లేదు. కేంద్ర ప్రభుత్వంతో వారి చర్చలు సఫలం కాలేదు. వారి డిమాండ్లు నెరవేరుతాయా? అన్ని పంటలకూ ఒకే విధానం అమలుచేయడం సాధ్యమేనా అన్నవి తలెత్తే ప్రశ్నలు. ప్రకటించిన 23 పంటలకు కనీస మద్దతు ధరను అమలు చేసినట్టయితే దాని ప్రభావం ఇతర అంశాలపైన, ముఖ్యంగా ఆర్థిక రంగంపైన ఉంటుందన్నది ఒక వాదన. కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడం కంటే మెరుగ్గా ఉండే విధంగా 'ప్రైస్ స్టెబిలైజేషన్ ఫండ్' (ధరల స్థిరీకరణ నిధి) ఏర్పాటు చేయాలని కొందరు సూచిస్తున్నారు. దీనివల్ల రైతాంగానికి మంచి మద్దతు అందుతుంది.

2024 రైతు ఉద్యమంలో ఉధృతి తక్కువే. కానీ ప్రశ్నలు ఎక్కువ. మూడు రైతు సంస్కరణ చట్టాలను కేంద్రం ఉపసంహరించుకున్నప్పటికీ రైతుల పేరిట జరుగుతున్న ఉద్యమం ఆగడం లేదు. కేవలం రెండు రాష్ట్రాల (పంజాబ్, హరియాణా) రైతులే ఇందులో ఎందుకు పాల్గొంటున్నారు? కేంద్రం చర్చలకు పిలిచిన ప్రతిసారీ డిమాండ్లు ఎందుకు మారుతున్నాయి? అసలు చర్చలు సఫలమయ్యే దిశగా డిమాండ్లు ఉన్నాయా? ఎన్నికల ముందు మొదలైన చలో ఢిల్లీ రైతు ఉద్యమం బీజేపీ విజయావకాశాలను దెబ్బ తీసేందుకేనన్న విమర్శ మాటేమిటి? ఈ మేరకు ఒక రైతు నేత మాటలతో బయటపడిన వీడియో (మోదీ ప్రతిష్ఠను దించడమే ధ్యేయం అంటూ) మాటేమిటి? నిజానికి రెండేళ్ల నాటి రైతు ఉద్యమమమే చాలా అనుమానాలనే మిగిల్చింది. ఆఖరికి 'టూల్–కిట్' సాలెగూడులో కూడా రైతు ఉద్యమం చిక్కుకుంది. రైతు ఉద్యమ మంటే రైతుకు సాయపడాలి. రాజకీయాలకు కాదు. జాతి వ్యతిరేక శక్తులకు అసలే కాదు. ఐదు పంటలకు మద్దతు ధరను ఐదేళ్ల పాటు అమలు చేస్తామని కేంద్ర బృందం హామీ ఇచ్చింది. మొదట ఒప్పుకున్నట్టే ఒప్పుకున్న రైతు సంఘాలు, పంటల సంఖ్యను పెంచాయి.

కనీస మద్దతు ధర (మినిమమ్ సపోర్ట్ ప్రైస్– ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కల్పించాలనే ప్రధాన డిమాండ్ తోపాటు ఇతర అంశాలపైన ప్రభుత్వం తమకు స్పష్టమైన హామీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ (కొన్ని ప్రాంతాలు)కు చెందిన రైతులు దాదాపు 200 యూనియన్లతో ఢిల్లీపైన దండయాత్రకు సిద్ధమయిన నేపథ్యంలో, కేంద్రం చర్చలకు సిద్ధమైంది. చండీఘడ్‌లో నాలుగు దఫాలుగా సాగిన చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు.

ఎంఎస్‌పీ ప్రభుత్వాల వ్యవసాయ ధరల నిర్ణయం విధానంలో భాగం. ఇది పంట ఉత్పత్తులను ప్రభుత్వం కొనుగోలు చేయటానికి నిర్దేశించే ధర. స్వామినాథన్ కమిషన్ కనీస మద్దతు ధరకు సిఫార్సు చేసింది. మొత్తం పంతొమ్మిది వందల పేజీలతో ఐదు నివేదికలు సమర్పించింది. కానీ రైతు నేతలు చెబుతున్నట్టు ఎంఎస్‌పీకి చట్టబద్ధత, లేదా దాని లెక్కింపు సూత్రాల గురించి ప్రతిపాదించలేదు. ఎంఎస్‌పీ పంట వ్యయానికి 50 శాతం అధికంగా ఉండాలని సూచించింది.

రైతు సంఘాలు కోరే 23 పంటలకు ఎంఎస్‌పీ అమలు కష్టమని నిపుణులు, విశ్లేషకులు మొదటినుంచీ చెబుతున్నారు. ఆ నిర్ణయం ఆర్థిక రంగంపైన చూపించే ప్రభావం నేపథ్యంలో అన్ని పంటలకు ఒకే విధానం సరికాదన్నది బలంగా వినిపిస్తున్న వాదన. ఎంఎస్‌పీ భద్రత చట్టాన్ని అమలు చేయాలంటే, ప్రభుత్వం ఏటా రూ. 12 లక్షల కోట్లు అదనపు వ్యయాన్ని భరించాలి. అది సాధ్యం కాదని కేంద్రం కూడా చెబుతోంది. ప్రభుత్వం గనక ఎంఎస్‌పీ ప్రకటించిన 23 పంటలను



కొనుగోలు చేసినట్టయితే అనేక అంశాలపైన దాని ప్రభావం ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో రైతుల ఎదుటికి కొన్ని ప్రత్యామ్నాయ మార్గాలు కూడా వచ్చాయి. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కంటే మెరుగ్గా ఉండే విధంగా 'ప్రైస్ స్టెబిలైజేషన్ ఫండ్'(ధరల స్థిరీకరణ నిధి) ఏర్పాటు చేయాలని కొందరు సూచిస్తున్నారు. ఎంఎస్‌పీ కంటే ధరలు తగ్గినప్పుడు ప్రభుత్వం జోక్యం చేసుకుని ఉత్పత్తిలో కొంత భాగాన్ని ప్రొక్యూర్ చేసి రైతులకు న్యాయబద్ధమైన ధరను అందిస్తుంది. దీనివల్ల రైతాంగానికి మంచి మద్దతు అందుతుంది.

2024 రైతు ఉద్యమం 2020 నాటి ఆందోళనకు కొనసాగింపుగా కాకుండా, ఒక వివాదం పొడిగింపుగానే కనిపిస్తోంది. 2020 నాటి ఆందోళన కేంద్రం తెచ్చిన మూడు రైతు చట్టాలకు వ్యతిరేకం. వాటిని కేంద్రం 2021లో రద్దు చేసింది. అప్పట్లో ప్రభుత్వం రైతుల డిమాండ్ల మేరకు ఆందోళన చేసిన రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయటానికి అంగీకరించింది. కానీ కనీస మద్దతు ధరకు చట్టబద్ధతకు సంబంధించి ఎలాంటి హామీ ఇవ్వలేదు. కానీ నేటి ఢిల్లీ చలో ఉద్దేశం వేరు. ఆందోళనకు ముందే ఈ అంశం మీద చర్చించటానికి కేంద్రం సిద్ధమైంది. అన్ని పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలనీ, రైతులకు రుణహామీ, పెన్షన్ సదుపాయాలు కల్పించాలనీ, స్వామినాథన్ కమిషన్ ఫార్ములాను అమలు చేయాలనీ రైతు సంఘాలు కోరుతున్నాయి. లఖింపూర్ హింసలో బాధితులకు న్యాయం చేయాలనీ, 2013 భూస్వాధీన చట్టాన్ని తిరిగి ప్రవేశపెట్టాలనీ, 2020–21 ఆందోళనల్లో చనిపోయిన రైతులకు పరిహారం అందించాలనీ కూడా కోరుతున్నారు.

2020లో ఈ నిరసనకు భారతీయ కిసాన్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా నాయకత్వం వహించాయి. ఇప్పుడు వివిధ యూనియన్లు నడిపిస్తున్నాయి. 2020 మాదిరిగా కేంద్రం రైతు సంఘాలను ఢిల్లీలోకి అడుగు పెట్టనీయలేదు. ఢిల్లీకి 200 కిలోమీటర్ల దూరంలోనే ఆపేసింది. ఆందోళన నాలుగో రోజున, 63 ఏళ్ల జియాన్ సింగ్ మరణించారు. రైతుల ఆందోళన సాగుతున్నతీరు, దానికి ఖర్చవుతున్న తీరు, ట్రాక్టర్ల స్థానంలో కోట్లాది రూపాయల విలువైన వాహనాలు అక్కడకు రావటం వంటివి చూస్తుంటే, ఈ ఆందోళనకు ఎవరు నాయకత్వం వహిస్తున్నారో సులువుగా అర్థం చేసుకోవచ్చునన్న విమర్శలు ఉన్నాయి. రైతుల ఆందోళన ముసుగులో కొందరు యువకులు ముసుగులు ధరించి భద్రతా సిబ్బంది పైన రాళ్లు విసురుతున్నట్టు తేలింది. హరియాణా పోలీసులు ఆందోళనకారులపైన టియర్ గ్యాస్ షెల్స్, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించి 'బలవంతపు చర్యలకు' పాల్పడటంతో అనేక మంది గాయపడ్డారని రైతు నేతలు ఆరోపించారు. రైతుల, యూట్యూబర్ల సోషల్ మీడియా ఎకౌంట్లను రద్దు చేయటం ద్వారా ప్రభుత్వం గొంతు నొక్కే ప్రయత్నం చేస్తోందని రైతు నేత సరవన్ సింగ్ పాంథర్ ఆరోపించారు.

కేంద్రం మీద నిందంతా మోపుతున్నవారు గమనించవలసిన అంశాలు కూడా ఉన్నాయి. పంజాబ్– హరియాణా సరిహద్దుల్లో రైతులకు, భద్రతా సిబ్బందికి మధ్య ప్రతిష్టంభన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం నాలుగు దఫాలుగా చర్చలు నిర్వహించింది. రైతు నేతలు కేంద్రమంత్రుల మధ్య (ఫిబ్రవరి 8, 12, 15, 18) చర్చలు జరిగాయి. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి అర్జున్ ముండా, వాణిజ్య మంత్రి పీయూష్ గోయెల్, హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ పాల్గొన్నారు. పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ సింగ్ మాన్, వ్యవసాయశాఖ మంత్రి గుర్మీత్ సింగ్ కూడా పాల్గొన్నారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాన్నీ ఇవ్వలేదు. ట్రాలీలతో కూడిన ట్రాక్టర్లు జాతీయ రహదారుల మీద కనిపించకూడదు. దానిని రైతులు ఉల్లంఘించారు. ఇంకా చాలా విషయాలలో చట్టాన్ని చేతుల్లోకి తీసు కుంటున్నారు.

కాగా 23 పంటలకు ఒకే విధమైన విధానం సాధ్యం కాదని ఎవరైనా అంగీకరించాలి. కొత్తగా మళ్లీ, పాడి రైతుల సమస్యలను ఈ ఆందోళన ఎందుకు పట్టించుకోదన్న ప్రశ్న మొదలయింది. ఇంకా చేపల చెరువుల రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదన్న విమర్శ కూడా ఉంది. ఇప్పుడు కనీస మద్దతు ధర శాశ్వతంగా ఇవ్వాలని రైతులు చెబుతున్న 23 పంటలు మొత్తం వ్యవసాయంలో 30 శాతం లోపే. మరి మిగిలిన వ్యవసాయోత్పత్తుల మాటేమిటి? ఈ ప్రశ్నకు రైతు నేతల నుంచి సమాధానం రావాలి. ఏమైనా రైతుల సమస్యల పేరుతో రాజకీయ లబ్ధిని పొందాలని కొన్ని బీజేపీయేతర పక్షాలు కోరుకుంటున్నాయి. అందుకు అవి ఎంచుకున్న మార్గం రోడ్ల మీద తేల్చుకోవడం. రైతు సమస్యల పరిష్కారం అంటే రైతులకు చెడ్డపేరు తేవడం కాదు. వారి మీద దారుణ ముద్ర పడేలా చేయడం కాదు.

వ్యాసకర్త ఏకలవ్య ఫౌండేషన్ ఛైర్మన్ । pvg@ekalavya.net

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఎన్నో విధాల బంధం



జోడాసాంకో (కోల్‌కతా)లో ఉన్న నోబెల్ పురస్కార గ్రహీత రవీంద్రనాథ్ టాగూర్ ఇంటిని దర్శించడం గుర్తుండిపోయే జ్ఞాపకం. ఫ్రాన్స్‌తో టాగూర్‌కు ఎన్నో విధాల అనుబంధం ఉంది. సహచర నోబెల్ గ్రహీత రోమా రోలా (ఫ్రెంచ్ రచయిత)తో ఆయన స్నేహం అందులో గమనించదగ్గది.

– థియెరీ మథోవ్, ఇండియాలో ఫ్రాన్స్ రాయబారి

బూటకపు ఎన్నికలు



బెలారస్‌లో జరిగిన బూటకపు పార్లమెంట్ ఎన్నికలను మేము ఖండిస్తున్నాం. 1,400కు పైగా రాజకీయ ఖైదీలు ఉన్న భయపూరిత వాతావరణంలో స్వేచ్ఛగా ఎన్నికలు జరగడం అసాధ్యం. బెలరూసియన్ ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలకు మేము మద్దతునిస్తాం.

– మాథ్యూ మిల్లర్, యూఎస్ విదేశాంగ ప్రతినిధి

ఎక్కడెక్కడో...



ఇవ్వాళే నాకు తెలిసింది. దాగెస్తాన్ రిపబ్లిక్ (రష్యా)లోని దెర్బెంద్ నగరంలో 'ఫార్సీ'లు నివసిస్తారని. వాళ్లు పర్షియా భాష తాలూకు ఒక మాండలికం మాట్లాడుతారు. కాకసస్ ప్రాంతంలో వాళ్లు 1800 ఏళ్లుగా నివసిస్తున్నారు. అన్నట్టు మధ్య తజికిస్తాన్‌లో కూడా 'దర్బంద్' అనే గ్రామం ఉంది.

– నిగోరా ఫజ్లిద్దీన్, తజికిస్తాన్ ఫిలింమేకర్

మరవలేని గొంతు



ఓం శాంతి... పంకజ్ ఉధాస్‌జీ! మీరు పాడిన అన్ని అమూల్యమైన, ప్రియమైన గజళ్లు, పాటలకు ధన్యవాదాలు. మీ గొంతు ఎప్పటికీ మరిచిపోలేనిది.

– ఉర్మి, వాయిస్ యాక్టర్

అనవసరం కదా!



అధికారికంగా కృత్రిమ మేధ హాలీవుడ్‌కు నష్టం కలిగించింది. ఓపెన్ ఏఐ కంపెనీ 'సోరా' కారణంగా తన 80 కోట్ల డాలర్ల స్టూడియో విస్తరణ పనులను టైలర్ పెర్రీ (నటుడు, ఫిలింమేకర్) నిలిపేశారు.

– రోవన్ చియూంగ్, ఏఐ విశ్లేషకుడు

పులసలు అంత అలుసై పోయాయా?

అభిప్రాయం



పి. విజయబాబు

సరిగ్గా చెప్పిన టైమ్‌కి వెళ్లి కాలింగ్ బెల్ కొట్టాడు కళ్యాణం. కొంచెం సేపటికి తలుపు తెరచుకుంది. బద్ధకంగా ఆవులిస్తూ, ఒళ్ళు విరుచుకుంటూ ఎదురుపడ్డాడు కైలాసం. 'ఓ నువ్వా, ఏంటి?' అన్నాడు. 'ఏం లేదు నాన్నగోరు పిలిచారు వచ్చాను. ఆయన కూడా నిద్రపోతున్నారా?' అన్నాడు. 'లేదు. ఆయన ఏడ నిద్రపోతాడు? ఆయన నిద్రపోడు. మమ్మల్ని నిద్ర పోనివ్వడు. కానీ నేను లెక్క చేయను. నాకు నిద్ర అంటే చాలా ఇష్టం. ఆయనకు మాత్రం నిద్ర రాదు. సరే మీరు మాట్లాడుకోండి. నాకు నిద్ర వస్తుంది అంటూ లోపలికి వెళ్ళిపోయాడు కైలాసం. ఇంతలో చంద్రయ్య బయటకు వచ్చాడు. ఆ రావయ్యా రా! భోజనం చేద్దూ!'

''వద్దులేండి బాబూ! మీ 'పప్పు' భోజనం నేను తినలేను సామీ. మీ అబ్బాయికి ఇష్టమని మీరు పప్పు భోజనానికి అలవాటు పడిపోయారు. నావల్ల కాదు లేండి!' 'ఓహో! పులస లేనిదే ఫుడ్ తినవన్న మాట!' ''ఏటండి బాబూ? పులసల్ని అంత తేలిగ్గా తీసేయకండి. 'పుస్తెలు అమ్మైనా పులసలు తినాలి' అంటారు.'' 'అమ్ముతావయ్యా నీ దగ్గర ఎప్పుడు కావాలంటే అప్పుడు రెడీగా పుస్తెలు ఉంటాయ్ జేబులో' అన్నాడు చంద్రయ్య. ఆ మాటలకు ఉలిక్కి పడ్డాడు కళ్యాణం. 'ఏటండోయ్! మీ దగ్గర నుంచి కూడా డబల్ మీనింగ్ డైలాగ్లు వొత్తన్నయ్!' వేళ్ళతో జుట్టు ఎగరేస్తూ అన్నాడు. 'ఓరి ఓరి ఓరి నేను ఆ ఉద్దేశంతో అనలేదయ్యా! చేపలు తినటానికి పుస్తెలు అమ్ముకోవడం ఏంటని అన్నాను అంతే!

సరే సరే! ఆ సంగతి వదిలేసి పాయింట్‌కి రా! ఇంతకీ నేను చెప్పింది ఏం తేల్చావ్?' 'అంత తక్కువ మందితో వర్క్ అవుట్ అవ్వదండీ'. 'ఊరుకోవయ్యా మాట మాట్లాడితే వర్కౌట్ వర్కౌట్ అంటుంటావ్! మనుషులు తగ్గారని నీ ప్యాకేజీ నేనేం తగ్గించట్లేదుగా? ఎంతమంది అయితే నీకెందుకు, నీకు ఇస్తానన్నది నీకు ఇచ్చేస్తా. మనోహరానికి ముందే చెప్పాగా నీకు చెప్పలేదా?' 'నిజమే అనుకోండి! కానీ ప్యాకేజీ మాత్రమే కాదుగా? ప్రిస్టేజీ కూడా కాస్త చూసుకోవద్దా. అంతమందికి ఆశలు పెట్టి మీరు ఇప్పుడు అంతమంది వద్దూ అంటే వాళ్ళు ఊరుకుంటారా? నేనేం సమాధానం చెప్పాలి?

'కళ్యాణం జోకులేయొద్దు. ప్రిస్టేజీ ఏంటయ్యా ప్రిస్టేజీ? మీటింగ్ పెట్టి, చేతిలో దీపం లేదని, చుట్టూ చీకటని, సముద్రం తలవంచదు లాంటి అర్థం కానివి ఏవో చెప్తావుగా? అలాంటివే చెప్పు. ఎప్పటిలాగే హైదరాబాద్ వెళ్లి కొన్ని రోజులు బ్రేక్ ఇచ్చేయ్! మళ్ళీ ఫ్రెష్‌గా రీఎంట్రీ ఇవ్వు. నీకు అలవాటేగా? మాకంటే ఇది నిత్య పోరాటం. నిత్య ఆరాటం. నీకు ఇది ఓ బెనిఫిట్ షో లాంటిది. తేడా లేదూ! వినటానికి కాస్త కటువుగా ఉంటుంది కానీ నేను నీకు ఒక నిజం చెప్పనా? సంవత్సరానికి ఒకసారి వచ్చి ఓ హడావుడి చేసి మళ్ళీ మాయమైపోయే పులసల్లాగా మీ వాళ్ళు కూడా అంతేనయ్యా! నాలుగు రోజులు హడావుడి అయిపోయిన



తర్వాత మళ్లీ వాళ్ల పనులు, వాళ్ళ వ్యవహారాల్లో మునిగిపోతారు. మేము అలా కాదు. మా వృత్తి, ప్రవృత్తి, ఆశ, శ్వాస, ధ్యాస అంతా ఇదే. నిద్రలేచిన దగ్గర్నుంచి పడుకునే వరకు మాకు ఇదే యావ' అన్నాడు చంద్రయ్య. 'సార్ ఏదో బేరం కుదుర్చుకున్నా కదా అని మీరు మరీ చులకన చేసి మాట్లాడుతున్నారు.' 'చులకన కాదయ్యా. 45 ఏళ్ల ఇండస్ట్రీ అనుభవంతో చెబుతున్నా. ఆ మాటకొస్తే నువ్వు కూడా అప్పుడప్పుడు కనిపించి మాయమయ్యే పులస లాంటోడివి. కాకపోతే నీకు నాతో డీల్ కుదిరింది కాబట్టి ఈ పార్ట్ టైమ్ వ్యవహారం మంచి లాభదాయకంగా ఉంది. వాళ్ళు నిన్ను నమ్ముకుని నువ్వేదో ఉద్ధరిస్తావ్ అనుకున్నారు. అదే వాళ్ళ అమాయకత్వం' అంటూ లో లోపల గొణుక్కున్నాడు చంద్రయ్య . 'ఏంటి సార్! లో లోపల ఏదో అనుకుంటున్నారు?' చంద్రయ్య హావభావాల్ని గమనించి అడిగాడు కళ్యాణం. 'నీ గురించే నయ్యా. పాపం నిన్ను నీ వాళ్ళు నమ్ముకున్నారు అటు ఢిల్లీ వాళ్లూ ఆశలు పెట్టుకున్నారు. కానీ నువ్వు మాత్రం నా ప్యాకేజీకే కమిట్ అయ్యావ్! మరి నెక్స్ట్ నీ ఫ్యూచర్ ఏంటి అని ఆలోచిస్తున్నాను.' 'అదేంటి మన బంధం పదేళ్ల వరకు ఉంటుందనుకున్నాంగా?'

''పాపం 'నాది యూజ్ అండ్ త్రో' పాలసీ అని తెలిసి కూడా నిజంగా అంత నమ్మకం పెట్టుకున్నాడా?'' మనసులో ప్రశ్నించుకున్నాడు చంద్రయ్య. అతడి మనోభావాల్ని చదివినట్టు కళ్యాణం ఒక అరనవ్వు నవ్వి, 'నిజంగా తన మాటల్ని నమ్మాను అనుకుంటున్నాడు. పదేళ్లు పార్ట్ టైమ్ వ్యవహారాలతో నన్ను నమ్మిన వాళ్లు నా వెనుకున్నారు అని తెలియదా తనకి? ఇదే నమ్మకాన్ని మరో పదేళ్లు క్యాష్ చేసుకుంటా. తను కాకపోతే ఇంకొకళ్ళు. ఆ టైమ్‌కు ఎవరో వస్తారు ఏంటంట? పులసల మీద ఎదవ జోకులు ఏస్తున్నాడు. పులసలంటే అంత అలుసై పోయాయా?' అనుకొని గొంతు సవరించుకుంటూ, ''సరే సార్ నా గురించి మీరు ఆలోచించకండి. ముందు మీరు మీ బలగంతో ఎంతవరకు సక్సెస్ అవుతారో ఆలోచించుకోండి! ఈ నాలుగు రోజులు హడావుడి అయిపోతే నా దారి నేను పోతా! మీరు మాత్రం ఎప్పటిలాగే, మీ పరిభాషలో చెప్పాలంటే 'ఆ విధంగా ముందుకు పోవాలి'. మీరు చెప్పినట్టే నా మనుషులను తగ్గించుకుంటా. ప్యాకేజీ ఏమీ మారదు అన్నారు కాబట్టి నాకేం ఇబ్బంది లేదు. మిగతా నా గొడవ ఏదో నేను మేనేజ్ చేసుకుంటా'' అన్నాడు.

కళ్యాణం మాటల్లో అంతరార్థం గ్రహించడానికి చంద్రయ్య ఆలోచనలో పడ్డాడు!

వ్యాసకర్త పూర్వ సంపాదకులు

మన సంగీత వాద్యాలే సిసలైనవని...


సందర్భం



ప్రొ॥ పి.ఎస్. అవధాని

మనం ఎప్పుడైనా ఆలోచించామా, ఆకాశం నీలంగానే ఎందుకుంటుందని? సముద్రం కూడా ఎందుకు నీలంగా ఉంటుందని? ఈ ప్రశ్నలకు సమాధానం కనుగొనే క్రమంలో 'రామన్ ఎఫెక్ట్'ను కనిపెట్టి చంద్రశేఖర్ వెంకటరామన్ (సీవీ రామన్) నోబెల్ బహుమతి పొందారు. అలాగే మన శాస్త్రీయ సంగీత వాద్యాల గొప్పదనాన్నీ ఆయన తదుపరి పరిశోధనలు నిరూపించాయి.

రామన్ 1888 నవంబర్ 7వ తేదీన తమిళనాడులోని తిరుచిరాపల్లి దగ్గరలో ఉన్న ఒక ఊరిలో జన్మించారు. ఎంఏ పూర్తి చేసిన తర్వాత, కలకత్తాలో ఫైనాన్స్ మంత్రిత్వ శాఖలో ఉద్యోగం సంపాదించారు. ఇంతలో ఇండియన్ ఎసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ (ఐఏసీఎస్)తో పరిచయం ఏర్పడింది. భారతీయులెవరైనా సరే అక్కడ ఉచితంగా తమ పరిశోధనలు సాగించవచ్చు. రోజూ సాయంత్రం ఆఫీసు అయిపోయిన తర్వాత రాత్రి చాలా సమయం ఇక్కడే రామన్ పరిశోధనలు సాగించేవారు. ఆయన అభిమాన సబ్జెక్టు ఆప్టిక్స్.



సి.వి. రామన్

ఇంతలో కలకత్తా విశ్వవిద్యాలయం ఫిజిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రొఫెసర్ ఉద్యోగం వచ్చిందాయనకు. ప్రొఫెసర్‌గా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో జరిగిన ఒక శాస్త్ర సదస్సుకి హాజరై లండన్ నుండి ఓడలో భారతదేశానికి వస్తూ ఆకాశం వైపూ, సముద్రపు నీళ్ళ వైపూ చూశారు. అవి నీలంగా ఎందుకున్నాయి అని ఆలోచించారు. 'ఆకాశం' అంటే శూన్యం అని అర్థం. ఆకాశానికి మరి రంగేమిటి? ఆకాశం నీలంగా ఉంది కాబట్టి ఆ నీలం రంగు సముద్రం మీద పడి సముద్ర జలాలు కూడా నీలంగా కనిపిస్తున్నాయని అప్పట్లో భావించేవారు. అది ఆయనకు సరిగ్గా అనిపించలేదు. ఆ విషయం అంతటితో వదిలేయక మన దేశానికి వచ్చిన తర్వాత దాని మీద విస్తృతంగా పరిశోధనలు చేశారు.

అదే సమయంలో ఎక్స్ రే కిరణాలు ఏదైనా పదార్థం గుండా ప్రసరిస్తే వాటి స్వభావం మారుతుంది అని సోదాహరణంగా వివరించి నోబెల్ బహుమతి పొందారు ఏహెచ్ క్రాంప్టన్ అనే శాస్త్రవేత్త. అప్పటికే రామన్ ఆకాశం నీలంగా కనిపించడానికి కారణం కాంతి, వాతావరణంలో గల ధూళి కణాలలో పరావర్తనం చెందడమేననే ప్రాథమిక అంచనాకి వచ్చివున్నారు. దీంతో క్రాంప్టన్ పరిశోధన విషయం విన్న తర్వాత, తన ప్రతిపాదన కరెక్టే అనే అభిప్రాయానికి వచ్చారు. ఆయన తనకు తాను 'ఒక పారదర్శకమైన మాధ్యమం ద్వారా కాంతి ప్రయాణించినప్పుడు అది తన స్వభావంలో ఏమైనా మార్పు పొందుతుందా?' అనే ప్రశ్న వేసుకొన్నారు. ఆ దిశగా పరిశోధనలు జరిపి ఆయన చిన్న చిన్న పరికరాలతో ఒక గొప్ప ఆవిష్కరణ చేశారు. అదే 'థియరీ ఆఫ్ రేడియేషన్.' దీనికే 'రామన్ ఎఫెక్ట్' అని నామకరణం చేశారు. ఈ పరిశోధనలకు 1930లో నోబెల్ బహుమతి లభించింది. 'రామన్ ఎఫెక్ట్' కెమికల్ కాంపౌండ్స్ మాలిక్యులర్ స్ట్రక్చర్స్‌ని కనుగొనడానికి ఎంతో ఉపయోగపడింది.

సీవీ రామన్‌కు శబ్ద తరంగాల మీద కూడా ఎంతో ఆసక్తి ఉండేది. దీనిని 'ఎకోస్టిక్స్' అంటారు. ఈ ఆసక్తి వలన ఆయన సంగీత పరికరాలలో తీగల అమరికా, వాటి ద్వారా వచ్చే శ్రావ్యమైన ధ్వని తరంగాల మీదా పరిశోధనలు చేశారు. ఆయన తన పరిశోధనల ద్వారా తబలా, మృదంగం, వీణ వంటి పరికరాలు పాశ్చాత్య సంగీత పరికరాలైన డ్రమ్స్ కంటే ఎక్కువ సంగీతపరమైన ధ్వని తరంగాలను ఉత్పత్తి చేస్తాయని తెలిసింది. మన సంప్రదాయ సంగీత పరికరాలనే సంగీత పరికరాలుగా పరిగణించాలనీ, మిగతావి ఎక్కువ శబ్దాన్నే ఉత్పత్తి చేస్తాయి గానీ శ్రావ్యతను కాదని కూడా నిరూపించారు రామన్. తరువాతి కాలంలో ఆయన రంగులు, వాటి వక్రీభవనమూ, పరావర్తనమూ లాంటి విషయాల మీద ఎక్కువగా పరిశోధనలు సాగించారు.

మన దేశంలో పరిశోధనలకు సరైన దిశానిర్దేశం చేసిన ఈ మహనీయుడు తన 82వ యేట 1970 నవంబరు 21న కన్ను మూశారు. ఆయన నోబెల్ బహుమతి పొందిన ఫిబ్రవరి 28 తేదీనే మన 'నేషనల్ సైన్స్ డే'.

వ్యాసకర్త ఆంధ్రా యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ మాజీ ప్రిన్సిపల్, అగర్తలా ఐఐఐటీ మాజీ డైరెక్టర్

(రేపు జాతీయ సైన్సు దినోత్సవం)

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, మాఘ మాసం, **తిథి:** బ.తదియ రా.11.21 వరకు, తదుపరి చవితి, **నక్షత్రం:** హస్త తె.5.21 వరకు (తెల్లవారితే బుధవారం), తదుపరి చిత్త, **వర్జ్యం:** ప.12.07 నుండి 1.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.44 నుండి 9.30 వరకు, తదుపరి రా.10.59 నుండి 11.46 వరకు, **అమృతఘడియలు:** రా.10.44 నుండి 12.30 వరకు ; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 6.24, **సూర్యాస్తమయం:** 6.01.

క్లుప్తంగా...

ఆప్నా అధ్యక్షుడిగా డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి



సాక్షి, అమరావతి: ఏపీ ప్రైవేట్ హాస్పిటల్స్, నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ (ఆప్నా) రాష్ట్ర అధ్యక్షుడిగా డాక్టర్ ఏవీ సుబ్బారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలో సోమవారం సంఘం కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు. ఈ క్రమంలో సుబ్బారెడ్డిని ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రైవేట్ నర్సింగ్ హోమ్స్ డిమాండ్ల పరిష్కారానికి కృషి చేస్తానని వెల్లడించారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన సుబ్బారెడ్డి ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా, ఐఎంఏ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా సేవలందిస్తున్నారు.

యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌కు కడప యువతి

- పార్లమెంట్‌లో ప్రసంగించే అవకాశం దక్కించుకున్న సానియా



కడప స్పోర్ట్స్: జాతీయ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్–2024కు కడప నగరానికి చెందిన సయ్యద్ సానియా ఎంపికైంది. నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి వక్తృత్వ పోటీల్లో విజేతగా నిలిచిన ఈమె అనంతపురంలో నిర్వహించిన రీజనల్ స్థాయి, గుంటూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో సైతం విజేతగా నిలిచి జాతీయ యూత్ పార్లమెంట్‌లో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. ఈ కార్యక్రమానికి రాష్ట్రం నుంచి ఎంపికైన ఏకైక యువతి సానియానే కావడం విశేషం. మార్చి 5, 6 తేదీల్లో న్యూఢిల్లీలోని పార్లమెంట్ భవన్‌లో నిర్వహించే యూత్‌పార్లమెంట్ ఫెస్టివల్–24లో సానియా పాల్గొని ఉపన్యసించనుంది. సానియా తల్లి సయ్యద్ సోఫియా గృహిణి కాగా, తండ్రి సయ్యద్ జాఫర్‌వలి సైకిల్‌మార్ట్ నిర్వహిస్తున్నాడు. ప్రస్తుతం ఈమె డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎంఏ ఇంగ్లిష్ చదువుతోంది.

నమ్మి ఓటేస్తే.. పార్థసారథి పలాయనం

- మంత్రి జోగి రమేష్



ఉయ్యూరు: నమ్మి ఓటేసిన ప్రజలను మోసగించి పార్థసారథి పలాయనం చిత్తగించాడని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా ఉయ్యూరులో సోమవారం మంత్రి జోగి రమేష్ పర్యటించారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం నివాసంలో కౌన్సిలర్లు, పార్టీ ముఖ్యులతో సమావేశం నిర్వహించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ఎమ్మెల్యేగా గెలుపొందిన పార్థసారథి నూజివీడుకు వెళ్లిపోయాడన్నారు. టిడ్కో గృహాలు లబ్ధిదారులకు అందించటంలో జాప్యానికి కారణం ఎమ్మెల్యేనే అన్నారు. జిల్లాలో గుడివాడలో ఎమ్మెల్యే కొడాలి నాని వేలాది మంది లబ్ధిదారులకు టిడ్కో గృహాలను అందించారన్నారు. బీదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్నదే సీఎం జగన్ లక్ష్యమన్నారు. నమ్మి ఓటేసిన ప్రజలను గాలికొదిలేసి జెండా మార్చి చంద్రబాబు పంచన చేరి పచ్చ జెండా కప్పుకున్నాడని ఎద్దేవా చేశారు. ఎవరున్నా, పోయినా ప్రజలు మాత్రం జగనన్నను గుండెల్లో పెట్టుకుని అండగా నిలవాలని కోరారు. జగనన్ననే మళ్లీ సీఎం అయ్యేలా కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉందని మంత్రి విజ్ఞప్తి చేశారు.

'మిస్టర్ ఆంధ్రా'గా భాస్కరరావు

- రన్నరప్‌గా కిశోర్, బెస్ట్ పోజర్‌గా మెహరాజ్
- ముగిసిన 1వ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీలు



మిస్టర్ ఆంధ్రా టైటిల్ విన్నర్, రన్నరప్, బెస్ట్ పోజర్లతో నిర్వాహకులు

కడప స్పోర్ట్స్: వైఎస్సార్ జిల్లా కడప నగరంలో నిర్వహించిన 1వ ఆంధ్రప్రదేశ్ బాడీ బిల్డింగ్ పోటీల్లో విశాఖపట్నానికి చెందిన భాస్కరరావు 'మిస్టర్ ఆంధ్రా' టైటిల్‌ను కైవసం చేసుకున్నారు. బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి వరకు జరిగిన ఈ పోటీల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి 300 మంది బాడీబిల్డర్లు పాల్గొన్నారు. 15 కేటగిరీల్లో నిర్వహించిన ఈ పోటీల్లో మిస్టర్ ఆంధ్రా టైటిల్‌ను భాస్కరరావు కైవసం చేసుకోగా, రన్నరప్‌గా విజయనగరానికి చెందిన కిశోర్ నిలిచారు. బెస్ట్ పోజర్‌గా కడపకు చెందిన మెహరాజ్ నిలిచారు. వివిధ కేటగిరీల్లోని విజేతలకు ట్రోఫీలు, నగదు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షకార్యదర్శులు నూనె నగేష్, షేక్ యూనూస్ బాషా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి బాడీబిల్డింగ్ పోటీలకు క్రీడాకారుల నుంచి విశేష స్పందన లభించిందన్నారు.

ఉన్నత విద్యపై ఉన్మాద రాతలు

ఫ్యాక్ట్ చెక్

2020 నుంచి ఇప్పటివరకు కొత్తగా 15 ప్రభుత్వ డిగ్రీ కళాశాలల ఏర్పాటు

టీడీపీ హయాంలో దొంగ అడ్మిషన్లతో ఫీజు రీయింబర్స్‌మెంట్ దోపిడీ

నిజాలకు పాతరేసి రామోజీ అబద్ధాల రంకెలు



సాక్షి, అమరావతి: ''డబ్బులుండే వాళ్లకే క్వాలిటీ ఎడ్యుకేషన్ వస్తుంది. విద్యార్థులు తమ కలను నెరవేర్చుకోవాలంటే ఏ విధంగా చదువుకోవాలో మీరే ఆలోచించుకోవాలి. విద్య అనేది ప్రభుత్వ బాధ్యత కాదు. ఎక్కడ చూసినా కార్పొరేట్ సామాజిక బాధ్యత ద్వారానే మంచి విద్యా సంస్థలు వచ్చాయి. కార్పొరేట్లు తమ భుజస్కంధాలపై విద్యా సంస్థలను పెట్టుకోవాలి''.

.. ఈ వ్యాఖ్యలు గుర్తున్నాయా రామోజీ!? స్వయంగా మీ పార్ట్‌నర్, మీ ఆత్మబంధువు చంద్రబాబు నోట జాలువారిన ఆణిముత్యాలు. విభజన ఆంధ్రప్రదేశ్‌ను ఉద్ధరిస్తానంటూ మాయమాటలు చెప్పి సీఎం సీటుపై కూర్చున్న వ్యక్తి నేతృత్వంలో ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే కుట్రకు బీజంపడిన రోజులవి. చంద్రబాబు చెప్పినట్లే తన ఐదేళ్ల పాలనలో ఉన్నత విద్య పేరుతో కార్పొరేట్లకు దోచిపెట్టారు. హాజరు పట్టికలో తప్ప తరగతి గదుల్లో పాఠాలు చెప్పని విద్యా సంస్థలకు సైతం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని దోచిపెట్టారు. కష్టపడి చదువుకునే విద్యార్థులకు అరకొర ఫీజు రీయింబర్స్‌మెంట్.. అది కూడా సకాలంలో చెల్లించకుండా నానా ఇబ్బందులు పెట్టారు. ఇదంతా జగమెరిగిన సత్యం. రామోజీ దివ్యదృష్టికి మాత్రం ఇది కనిపించకపోవడంలో ఆశ్చర్యంలేదు. కానీ, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదింటి బిడ్డలను గ్లోబల్ విద్యార్థులుగా తీర్చిదిద్దుతుంటే పెత్తందారి మనస్తత్వంతో రామోజీ ఆత్మ ఓర్వలేకపోతోంది. నిత్యం ప్రభుత్వంపై విషం చిమ్మేందుకు సర్వశక్తులూ ఒడ్డుతోంది. 'ఉన్నత విద్య పేదలకు మిథ్య' అంటూ సోమవారం తన క్షుద్ర పత్రిక ఈనాడులో అభూతకల్పనను సృష్టించే ప్రయత్నం చేసి బొక్కబోర్లాపడింది. ఈనాడు కథనంలోని అంశాలపై 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..

ఆరోపణ: పేదలకు కొరకరాని కొయ్యగా ఉన్నత విద్య..

వాస్తవం: చంద్రబాబు పాలనలో ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన చెల్లింపులు ఏడాదికి సగటున రూ.2,428 కోట్లుగా ఉంటే ప్రస్తుత ప్రభుత్వం ఏడాదికి రూ.4,044 కోట్లు చెల్లిస్తోంది. విజనరీగా చెప్పుకునే చంద్రబాబు అత్యధికంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ కింద ఒక్కో విద్యార్థికి ఏడాదికి ఇచ్చింది కేవలం రూ.35 వేలలోపు మాత్రమే. అదే సీఎం జగన్ ప్రభుత్వం గరిష్టంగా ఒక్కో విద్యార్థికి రూ.3 లక్షల వరకు చెల్లిస్తూ ఉన్నత భవిష్యత్తుకు బాటలు వేస్తోంది. ఇలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పటివరకు 27 లక్షల మంది విద్యార్థులకు జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన కింద ఏకంగా రూ.18,576 కోట్లు చెల్లిస్తోంది. టీడీపీ ఐదేళ్లలో రూ.12,141 కోట్లు మాత్రమే ఖర్చుచేసింది. చివరికి గద్దె దిగుతూ 2019లో చంద్రబాబు 16.73 లక్షల మంది విద్యార్థులకు పెట్టిన బకాయి అక్షరాల రూ.1,778 కోట్లు. ఇది కూడా చెల్లించింది సీఎం జగన్ ప్రభుత్వమే. గతంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలుకాకపోవడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక అవస్థలు పడేవారు. అప్పట్లో కాలేజీలకు సకాలంలో ఫీజులు చెల్లించకపోవడంతో యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి పెంచేవి. పరీక్షలకు హాల్ టికెట్లు, పాసైతే సర్టిఫికెట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టేవి. ఫలితంగా చాలా కుటుంబాలు అప్పులుచేసి మరీ తమ పిల్లలను చదివించాల్సిన దుస్థితి నెలకొంది. అదే ఇప్పుడు పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తుంటే విద్యార్థులపై ఏ విధంగా భారం పడుతోందో రాజగురువు రామోజీనే చెప్పాలి.

ఆరోపణ: ఉన్నత విద్యలో తగ్గిన జీఈఆర్ నిష్పత్తి..

వాస్తవం: రాష్ట్రంలో ఐదేళ్ల కాలంలో ఉన్నత విద్యలో భాగంగా యూజీ, పీజీ, పీహెచ్‌డీ, సర్టిఫికేషన్ కోర్సుల్లో ప్రవేశాలు స్థిరంగా ఉన్నాయి. చంద్రబాబు హయాంలో 2017–18లో 16.97 లక్షలు ఉంటే ఇప్పుడు 2021–22 నాటికి 19.29 లక్షలకు పెరిగాయి. అంతకుముందు.. ఏడాది కంటే ఇది స్వల్పంగా తగ్గింది. దీనికి కారణం డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులు అత్యధికంగా కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించడమే. అంతర్జాతీయ స్థాయి నైపుణ్యాభివృద్ధి శిక్షణ, ఇంటర్న్‌షిప్, కరిక్యులమ్‌లో విప్లవాత్మక మార్పులతో నైపుణ్యం కలిగిన మానవ వనరులను తయారుచేస్తున్నారు. అందుకు చంద్రబాబు హయాంలో గరిష్టంగా 35వేలు క్యాంపస్ ఎంపికలు నమోదైతే.. సీఎం జగన్ హయాంలో 1.80 లక్షలకు పెరిగాయి.

ఆరోపణ: ప్రభుత్వ కళాశాలలు లేని చోట పేద విద్యార్థులకు ఇబ్బందులు..

వాస్తవం: రాష్ట్రంలోని ప్రతి విద్యార్థికి ఉన్నతస్థాయి ప్రమాణాలతో విద్యను అందించే మహా యజ్ఞాన్ని సీఎం జగన్ తలపెట్టారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలను బలోపేతం చేస్తూనే.. ప్రైవేటు కళాశాలల్లో పేదింటి బిడ్డలు చదువుకునేందుకు వీలుగా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇస్తున్నారు. కానీ, ఈనాడు, ఎల్లో మీడియా వంటి దుష్టశక్తులు అసత్య కథనాలతో నిత్యం ఈ యజ్ఞంపై దుష్ప్రచారం చేస్తూనే ఉన్నాయి. ఎయిడెడ్ కళాశాలల అంగీకారం మేరకే వాటిని ప్రభుత్వం టేకోవర్ చేస్తోంది. ఈ ప్రతిపాదనల్లో చాలా ఎయిడెడ్ కళాశాలలు ప్రైవేటుగా నిర్వహించుకునేందుకు ఇష్టపడ్డాయి. ఇలా 600 మంది టీచింగ్, 800 మందికి పైగా నాన్ టీచింగ్ సిబ్బందిని ప్రభుత్వానికి ఇచ్చేశాయి. వీళ్లందరూ ఆయా ప్రభుత్వ కళాశాలల్లో బోధనలో నిమగ్నమయ్యారు. అంటే ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్ సామర్థ్యం పెరిగినట్లే కదా? ఇందులో ఒక్క సంప్రదాయ డిగ్రీలోనే 60వేలకు పైగా ఉన్నాయి. ఇలాంటి తరుణంలో పీజీకి వెళ్లేవారు సహజంగానే తగ్గుతారు. కానీ, ఉద్యోగం చేస్తూ వివిధ రూపాల్లో చాలామంది తమ ఉన్నత విద్యను కొనసాగిస్తున్నారు. కానీ, కనికట్టు విద్యలో ఆరితేరిన ఈనాడుకు ఇదంతా కనిపించదు.

ఆరోపణ: ప్రభుత్వ కళాశాలల్ని గాలికి వదిలేసిన ప్రభుత్వం..

వాస్తవం: రాష్ట్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కొత్త ఒరవడిలో పయనిస్తున్నాయి. గత విద్యా సంవత్సరంలో దాదాపు 18వేల మందికి క్యాంపస్ ప్లేస్‌మెంట్లు దక్కాయి. ఇది మొత్తం అడ్మిషన్లలో 65 శాతానికి పైగా ఉండటం విశేషం. 2020 నుంచి 15 కొత్త ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు వచ్చాయి. ఐదు ఎయిడెడ్ కళాశాలలు ప్రభుత్వంలో విలీనమయ్యాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని అరకులో వంద శాతం అడ్మిషన్లు నమోదయ్యాయి. పాడేరులో 99, చింతపల్లిలో 97, గుమ్మలక్ష్మీపురం 92 శాతం ప్రవేశాలు కనిపిస్తున్నాయి. వీటికి తోడు 2019 నాటికి కేవలం 18 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు మాత్రమే నాక్ సర్టిఫికేషన్ ఉంటే.. ప్రస్తుతం వాటి సంఖ్య 61కి చేరడం 'ప్రభుత్వ చదువుల అభివృద్ధికి' నిదర్శనంగా కనిపిస్తోంది. ఇక రాష్ట్రంలో మొత్తం 168 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉంటే ఏప్రిల్ నాటికి 100 కళాశాలలకు న్యాక్ గుర్తింపుతో కొత్త విద్యా సంవత్సరంలోకి విద్యార్థులను ఆహ్వానించనున్నాయి.

ఆరోపణ: ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ప్రైవేటు కళాశాలలకు వెళ్లడంతో ఆర్థిక భారం..

వాస్తవం: ప్రభుత్వం పూర్తిఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వడంతో పాటు జగనన్న వసతి దీవెనను ఎటువంటి పక్షపాతం లేకుండా అందిస్తోంది. గతంలో వసతి దీవెనలో రూ.4వేల నుంచి రూ.10వేల మధ్య శ్లాబ్ పెట్టి మరీ ఇచ్చేవారు. కానీ, సీఎం జగన్ పాలనలో శ్లాబ్ విధానాన్ని తొలగించి అర్హత ఉన్న ప్రతి విద్యార్థికి సమానంగా ఆర్థిక సాయం అందిస్తున్నారు. ఐటీఐ విద్యార్థులకు రూ.10 వేలు, పాలిటెక్నిక్ విద్యార్థులకు రూ.15 వేలు, డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు అభ్యసించే వారికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయాన్ని అందజేస్తున్నారు. ఇక్కడ వీలైనంత మందిని అర్హులుగా చేర్పించేందుకు కుటుంబ వార్షిక ఆదాయం పరిమితిని పెంచింది. గతంలో బీసీ, ఈబీసీ, కాపు, మైనార్టీలకు రూ.లక్ష ఉంటే.. ఎస్సీ, ఎస్టీలకు రూ.2 లక్షలు ఉండేది. కానీ, ఇప్పుడు అన్ని వర్గాల వారికీ కుటుంబ వార్షిక ఆదాయ పరిమితిని రూ.2.5 లక్షలకు పెంచి ఎక్కువమందికి లబ్ధిచేకూర్చారు. పీజీ విద్యలో ప్రైవేటు కళాశాలల దోపిడీకి అడ్డుకట్ట వేస్తూ ప్రభుత్వ వర్సిటీ విద్యను ప్రోత్సహించేలా అక్కడే పూర్తి రీయింబర్స్‌మెంట్ ఇస్తోంది. తద్వారా ప్రతిభగల విద్యార్థులు వర్సిటీల్లో ఉచితంగానే పీజీ విద్యను అభ్యసిస్తున్నారు.

ఆ సీట్లు మావే!

టీడీపీలో చేరకుండానే సీట్లు ప్రకటించుకున్న లావు, వసంత కృష్ణప్రసాద్

సాక్షి, అమరావతి/భవానీపురం: నర్సరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌లు టీడీపీలో చేరకుండానే ఆ పార్టీ నుంచి పోటీ చేస్తున్నట్లు ప్రకటించుకున్నారు. కృష్ణప్రసాద్ తన నియోజకవర్గంలో టీడీపీ నేతలందరినీ కలుస్తూ తనకు సీటిచ్చారని, సహకరించాలని కోరుతున్నారు. దీనిపై పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. లావు కృష్ణదేవరాయలు కూడా నర్సరావుపేట ప్రజలకు బహిరంగ లేఖ రాస్తూ తాను టీడీపీ తరఫున నర్సరావుపేట ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు తెలపడం విశేషం. ఇదిలా ఉండగా మైలవరం నుంచి వసంత కృష్ణప్రసాద్ పోటీ చేయడంపై పునరాలోచించుకోవాలని టీడీపీ నేత బొమ్మసాని సుబ్బారావు అన్నారు. తనను కలిసిన కృష్ణప్రసాద్ తండ్రి వసంత నాగేశ్వరరావుకు సుబ్బారావు పైవిధంగా సూచించారు. సోమవారం వసంత నాగేశ్వరరావు సుబ్బారావును ఆయన ఇంట్లో మర్యాదపూర్వకంగా కలిసి కృష్ణప్రసాద్‌కి మద్దతు ఇవ్వాలని కోరినట్లు తెలిసింది. బొమ్మసాని సుబ్బారావు మీడియాతో మాట్లాడుతూ నాలుగున్నరేళ్లపాటు వైఎస్సార్ సీపీ శాసనసభ్యుడిగా ఉన్న వసంత కృష్ణప్రసాద్ ఈ రోజు టీడీపీలో చేరి ఇదే నియోజకవర్గంలో పోటీ చేయడం సరికాదన్నారు. నియోజకవర్గంలోని టీడీపీ వర్గం మొత్తం ఇప్పటికే డిస్టర్బ్ అయ్యిందని, ప్రత్యామ్నాయ ఆలోచనలు చేసుకోవల్సిందిగా వసంత నాగేశ్వరరావుతో చెప్పినట్లు తెలిపారు. గడిచిన నాలుగేళ్లలో నియోజకవర్గంలో టీడీపీ, వైఎస్సార్ సీపీ మధ్య నెలకొన్న ఘర్షణ వాతావరణం నేపథ్యంలో టీడీపీ కేడర్ కేపీకి ఎంతవరకు సహకరిస్తుందో ఆలోచించుకోవాలని హితవు పలికారు. కేపీ పోటీ చేయడంపట్ల నియోజకవర్గంలో సానుకూల వాతావరణం లేదని తెలిపారు.

కేపీ సారథిని టీడీపీలో చేర్చుకున్న లోకేశ్

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి.. లోకేశ్ సమక్షంలో టీడీపీలో చేరారు. సారథితోపాటు తుమ్మల చంద్రశేఖర్, బొప్పన భవకుమార్ తదితరులు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరకుండానే సారథి నూజివీడు సీటు దక్కించుకున్నారు. సీటు ప్రకటించిన 3 రోజుల తర్వాత ఆయన పార్టీలో చేరడం విశేషం.

బీకే పార్థసారథికి చంద్రబాబు బుజ్జగింపు

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి సోమవారం ఉండవల్లిలో చంద్రబాబును కలిశారు. తనకు సీటు ఇవ్వకపోవడంపై అసంతృప్తితో ఉండడంతో సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. అనంతపురం ఎంపీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం ఇచ్చే విషయాన్ని పరిశీలిస్తున్నానని ఆయన సారథికి చెప్పినట్లు తెలిసింది. తనకు ఎంపీ సీటు వద్దన్నారు.

లైంగికదాడి కేసులో పదేళ్ల జైలు

సహకరించిన మరో నిందితుడికి మూడేళ్ల జైలు

చిలకలపూడి (మచిలీపట్నం): మహిళపై లైంగికదాడి కేసులో నిందితుడికి పదేళ్ల జైలు, అందుకు సహకరించిన మరో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, జరిమానా విధిస్తూ 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సుజాత సోమవారం తీర్పు చెప్పారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోని రాజుపేటలో నివాసం ఉంటున్న మహిళపై 2014 డిసెంబరు 31న స్థానిక ఆదర్శనగర్‌కు చెందిన కాటూరు వెంకటేశ్వరరావు పెళ్లి చేసుకుంటానని నమ్మించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో నాగేశ్వరరావుకు చిలకా నాగరాజు అనే వ్యక్తి సహకరించాడు. ఈ ఘటనపై బాధిత మహిళ ఇనగుదురుపేట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఏపీపీ చలమలశెట్టి వెంకటేశ్వరరావు 21 మంది సాక్షులను విచారించారు. నిందితులు ఇరువురిపై నేరం రుజువు కావడంతో కాటూరు వెంకటనాగేశ్వరరావుకు 10 సంవత్సరాల జైలుశిక్ష, రూ.8వేల జరిమానా, చిలకా నాగరాజుకు మూడేళ్ల జైలుశిక్ష, రూ. 5 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

తెలుగు సాహితీ వైభవం అవధానం

- శ్రీదుర్గా సౌందర్య లహరి మహాశతావధానం ప్రారంభం
- అవధానిగా ప్రముఖ ద్విసహస్రావధాని డాక్టర్ నాగఫణిశర్మ



ద్విసహస్రావధాని నాగఫణిశర్మను సత్కరిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు

వన్‌టౌన్(విజయవాడ పశ్చిమ): తెలుగు సాహితీ వైభవం అవధానమని వక్తలు అభివర్ణించారు. విజయవాడ శ్రీతుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ దేవదాయ, ధర్మాదాయ శాఖ, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో 'శ్రీ దుర్గా సౌందర్య లహరీ మహాశతావధానం' సోమవారం ప్రారంభించారు. అవధాన సరస్వతి పీఠాధీశ–బృహత్ ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అవధానిగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ మహాశతావధానాన్ని ఏపీ ప్రణాళికా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణువర్ధన్, శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ అవధానం తెలుగు సాహిత్యంలో ఉన్న గొప్ప ప్రక్రియ అన్నారు. తెలుగు సాహితీ వైభవాన్ని అవధాన ప్రక్రియ అత్యాద్భుతంగా ఆవిష్కరిస్తుందని చెప్పారు. దేశంలో అవధాన ప్రక్రియకు వన్నె తెచ్చిన డాక్టర్ నాగఫణిశర్మ నేతృత్వంలో ఈ అవధానం జరగడం ఆనందంగా ఉందన్నారు. సాంస్కృతిక రాజధానిగా పేరున్న విజయవాడలో అమ్మవారి గొప్పతనాన్ని కీర్తిస్తూ అవధాన కార్యక్రమం నిర్వహించటం చాలా గొప్ప విషయమన్నారు. కార్యక్రమాన్ని ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు పర్యవేక్షించారు. తొలి రోజు తొలి కార్యక్రమంగా 30 మంది పృచ్ఛకులు దత్తపదులను సంధించగా అవధానిగా డాక్టర్ నాగఫణిశర్మ వాటిని పూరణ చేసి ప్రేక్షకులను మెప్పించారు. తన సాహితీ పటిమతో అమ్మవారిని కీర్తిస్తూ మరోవైపు సాహిత్యంలోని విశిష్టతను చాటారు. తొలుత తెలుగు తల్లి విగ్రహానికి అతిథులందరూ పూలమాల వేసి అంజలి ఘటించారు. కాగా, డాక్టర్ నాగఫణిశర్మ అవధానిగా 50 సంవత్సరాలు పూర్తి చేసుకున్న నేపథ్యంలో ఆయన అవధాన స్వర్ణోత్సవ వేడుకగా కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు సాహితీవేత్తలు పేర్కొన్నారు.

టీటీడీ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు పెంపు

- 9 వేల మందికి ప్రయోజనం
- శ్రీపద్మావతి జనరల్ ఆస్పత్రిలో మార్చి 1 నుంచి నగదు రహిత వైద్యం
- ధర్మకర్తల మండలి సమావేశంలో టీటీడీ చైర్మన్ భూమన



తిరుమల: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లోని వివిధ విభాగాల్లో అన్‌స్కిల్డ్, సెమీ స్కిల్డ్, స్కిల్డ్, హైలీస్కిల్డ్ కేటగిరీల్లో కార్పొరేషన్, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న 9 వేల మందికి కేడర్, సీనియార్టీ ప్రాతిపదికన రూ.3 వేల నుంచి రూ.20 వేల వరకు వేతనాలు పెంచేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఇందులో తీసుకున్న ముఖ్య నిర్ణయాలు ఇలా ఉన్నాయి.

- గాలిగోపురం, 7వ మైలు శ్రీఆంజనేయ స్వామివారి విగ్రహం, మోకాళ్లమిట్ట వద్ద భక్తులకు స్వామివారి గానామృతాన్ని వీనుల విందుగా వినిపించేందుకు 'నిత్య సంకీర్తనార్చన' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు నిర్ణయం. తాళ్లపాకలో అన్నమయ్య కళామందిరాన్ని నిర్మించి అక్కడ కూడా 'నిత్య సంకీర్తనార్చన' కార్యక్రమాన్ని ఏర్పాటు చేసేందుకు తీర్మానం.
- తిరుమల పెద్దజీయర్ స్వామి అనుమతి మేరకు, ఆలయ ప్రధానార్చకుల సూచనల మేరకు శ్రీవారి ఆలయంలో ద్వారపాలకులైన జయవిజయుల విగ్రహాలు ఉండే తలుపులు రూ.1.69 కోట్లతో నూతనంగా బంగారు తాపడంతో ఏర్పాటుకు ఆమోదం.
- భక్తులకు శ్రీవారి వివాహకానుకగా వివిధ డిజైన్లలో మంగళ సూత్రాలు, లక్ష్మీకాసులు 4 గ్రా, 5 గ్రా, 10 గ్రా. బరువులో 7 డిజైన్లలో తయారు చేసేందుకు రూ.4 కోట్లతో నాలుగు ప్రముఖ బంగారు ఆభరణాల తయారీ సంస్థలకు అనుమతి.
- శ్రీలంకలో శ్రీ వేంకటేశ్వర స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించేందుకు నిర్ణయం.
- స్విమ్స్‌కు అనుబంధంగా ఉన్న శ్రీపద్మావతి జనరల్ ఆసుపత్రిలో మార్చి 1 నుంచి జనరల్ మెడిసిన్ , జనరల్ సర్జరీ, గైనకాలజీ, మానసిక వ్యాధులు, పీడియాట్రిక్స్ వంటి ప్రత్యేక విభాగాలతోపాటు జ్వరాలు, వాంతులు లాంటి సాధారణ వ్యాధులకు కూడా ఇకపై ఆరోగ్యశ్రీ కార్డు ఉన్న రోగులకు నగదురహిత వైద్యసేవలు.
- అధికారులు, పాలకమండలి, జియ్యంగార్లు, అర్చకులతోపాటు అహోబిల మఠంపై నిందారోపణలు చేసిన గౌరవ ప్రధానార్చకులు రమణదీక్షితులను ఉద్యోగం నుంచి తొలగించాలని బోర్డు తీర్మానం. ఈ సమావేశంలో ఈవో ఏవీ.ధర్మారెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల్లో ధన ప్రవాహానికి అడ్డుకట్ట

బ్యాంకుల లావాదేవీలపై ఐటీ శాఖ డేగ కన్ను

- ఒక్క రోజులో రూ.10 లక్షలకు పైగా ఉపసంహరణ, డిపాజిట్లపై నిఘా
- 30 రోజుల్లో రూ.50 లక్షలు, అంతకంటే ఎక్కువ లావాదేవీలపై ఆరా
- డిజిటల్ ఖాతా నుంచి రూ.2 వేలకు పైగా బదిలీపైనా నిఘా
- జిల్లాలవారీగా బ్యాంకులన్నీ ఐటీ శాఖకు రోజువారీ నివేదికలివ్వాలి
- అన్ని బ్యాంకులకు రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ ఆదేశం
- డబ్బు తరలింపు నిరోధానికి రాష్ట్ర ప్రభుత్వం చెక్‌పోస్టులు

సాక్షి, అమరావతి: వచ్చే సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో ధన ప్రవాహాన్ని నిలువరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు తీసుకుంది. ఇందులో భాగంగా రాష్ట్రంలో బ్యాంకుల లావాదేవీలపై ఆదాయ పన్ను శాఖ (ఐటీ) డేగ కన్నేసింది. రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీకి ఏక కాలంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బ్యాంకుల్లో నగదు లావాదేవీల సమాచారాన్ని ఆదాయ పన్ను శాఖకు అందించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ అన్ని బ్యాంకులను ఆదేశించింది. గత ఏడాది అక్టోబర్ నుంచి ఇప్పటివరకు బ్యాంకుల నుంచి నగదు ఉపసంహరణలు, డిపాజిట్ల సమాచారాన్ని అన్ని బ్యాంకులు వెంటనే ఐటీ శాఖకు అందజేయాలని సూచించింది. ఒక్క రోజులో రూ.10 లక్షలు అంత కన్నా ఎక్కువ ఉపసంహరణ, డిపాజిట్లు, నెలరోజుల్లో రూ. 50 లక్షలకు పైగా ఉపసంహరణ, డిపాజిట్లపై రోజువారీ నివేదికలను ఐటీ శాఖకు అందజేయాలని ఆదేశించింది. ఎన్నికలు ముగిసే వరకు జిల్లాల వారీగా బ్యాంకులన్నీ ఈ నివేదికలు పంపాలని స్పష్టం చేసింది. రూ. 2,000 కన్నా ఎక్కువగా డిజిటల్ బదిలీల సమాచారాన్ని కూడా ఐటీ శాఖకు పంపాలని తెలిపింది. ఒక ఖాతా నుంచి పలు ఖాతాలకు డిజిటల్ చెల్లింపులు, ఒక మొబైల్ నుంచి పలు మొబైల్ నంబర్లకు నగదు బదిలీల సమాచారాన్ని కూడా ఇవ్వాలని సూచించింది. వీటిపై క్షేత్రస్థాయిలో బ్యాంకుల సిబ్బందికి అవగాహన కల్పించాలని తెలిపింది. ఎటువంటి అనధికార కార్యకలాపాలకు పాల్పడకుండా బ్యాంకులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించింది. నగదు తరలింపును నిరోధించడానికి రాష్ట్ర ప్రభుత్వం పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నులు, అటవీ శాఖలతో కలిపి 105 అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేసి, నిరంతరం తనిఖీలు చేస్తోంది.



ఇంటర్ స్టేట్ చెక్ పోస్టులు ఇలా

రాష్ట్ర సరిహద్దు	పోలీసు	ఎక్సైజ్	వాణిజ్యపన్నులు, అటవీ
ఒడిశా	14	4	3
కర్ణాటక	16	14	1
తమిళనాడు	7	2	5
ఛత్తీస్‌గఢ్	-	-	2
తెలంగాణ	25	6	3
పాండిచ్చేరి	-	3	-
మొత్తం	62	29	14

క్లుప్తంగా...

కేజ్రీవాల్ ఏడోసారి 'సారీ'

సాక్షి, న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణం వ్యవహారంలో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ ఏడోసారి కూడా ఈడీ విచారణకు హాజరుకాలేదు. మద్యం పాలసీ కేసులో ఈ నెల 26న విచారణకు హాజరవ్వాలని ఈడీ ఏడోసారి కేజ్రీవాల్‌కు సమన్లు పంపిన విషయం తెలిసిందే. ఈడీ ఎదుటకు వెళ్లాలని కోర్టు ఆదేశిస్తే కేజ్రీవాల్ వెళతారని తెలిపింది. ఈ అంశం కోర్టులో పెండింగ్‌లో ఉందని, తదుపరి విచారణ మార్చి 16న ఉన్నందున అప్పటి దాకా వేచి ఉండాలని సోమవారం ఆప్ ఓ ప్రకటనలో పేర్కొంది. సమన్లు పంపుతూ విచారణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఒత్తిడి చేయరాదని కోరింది.

ప్రజల సూచనలతో బీజేపీ మేనిఫెస్టో: నడ్డా

న్యూఢిల్లీ: రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మేనిఫెస్టో రూపకల్పనకు గాను ప్రజల నుంచి సూచనలు కోరుతున్నట్లు పార్టీ చీఫ్ జేపీ నడ్డా చెప్పారు. ప్రజల నుంచి సలహాలు, సూచనలను సేకరించేందుకు సోమవారం 'వికసిత్ భారత్ మోదీ కీ గ్యారెంటీ' వీడియో వ్యాన్లను నడ్డా ప్రారంభించారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నదే తమ పార్టీ ఉద్దేశమని ఆయన ఈ సందర్భంగా చెప్పారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దేందుకు ప్రధాని మోదీ అమలు చేసిన పనుల వీడియోలను ఈ వ్యాన్లలో ప్రదర్శిస్తారు. పార్టీ మేనిఫెస్టో రూపకల్పనకు సూచనలు ఇవ్వాలనుకునే వారు 9090902024కు మిస్డ్ కాల్ ఇవ్వాలని నడ్డా కోరారు. నమో యాప్‌లో కూడా ప్రజలు తమ సూచనలను పంపవచ్చన్నారు.

బీజేపీలోకి కాంగ్రెస్ ఎంపీ

రాంచీ: లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రతిపక్ష కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్‌కు చెందిన ఆ పార్టీ ఎంపీ గీతా కోడా సోమవారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బాబూలాల్ మరాండీ సమక్షంలో కాషాయ కండువా కప్పుకున్నారు. మాజీ సీఎం మధు కోడా భార్య అయిన గీత రాష్ట్రంలో కాంగ్రెస్ తరఫున ఎన్నికైన ఏకైక లోక్‌సభ సభ్యురాలు. మధు కోడా జార్ఖండ్ సీఎంగా 2006 నుంచి 2008 వరకు పనిచేశారు. బొగ్గు కుంభకోణంలో దోషిగా తేలడంతో జైలు శిక్ష అనుభవించారు.

'వారంలో షాజహాన్ అరెస్ట్'

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లోని సందేశ్‌ఖాళీకి చెందిన ముఖ్యనేత షాజహాన్ షేక్‌ను రాష్ట్ర ప్రభుత్వం వారం రోజుల్లోనే అరెస్ట్ చేస్తుందని అధికార టీఎంసీ పార్టీ పేర్కొంది. షాజహాన్ షేక్ అరెస్ట్‌పై స్టే ఇవ్వబోమంటూ కలకత్తా హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో అధికార పార్టీ ఈ మేరకు పేర్కొంది. పరారీలో ఉన్న షాజహాన్‌ను పోలీసులు వారం రోజుల్లో అరెస్ట్ చేస్తారని తెలిపింది. హైకోర్టు ఉత్తర్వులను ప్రతిపక్షాలు రాజకీయం చేస్తున్నాయని ఆరోపించింది. అతడి అరెస్ట్‌కు తాము ఎటువంటి అడ్డంకులు కల్పించబోమని తెలిపింది.

గొప్పగా మాట్లాడి వస్తే ఇలాగేనా చెక్ చేసేది ?

కస్టమ్స్ అధికారులతో యానా మిర్ వాగ్వాదం



న్యూఢిల్లీ: పాక్ బాలికల విద్య, హక్కుల ఉద్యమకారిణి మలాలా యూసఫ్‌జాయ్ లాగా తానేమీ స్వదేశం వదిలి పోలేదని, సొంత కశ్మీర్‌లో హాయిగా ఉన్నానంటూ బ్రిటన్ పార్లమెంట్ భవనంలో ప్రసంగించిన కశ్మీర్ యువతి యానా మిర్ ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో కస్టమ్స్ అధికారులతో వాగ్వాదానికి దిగారు. బ్రిటన్ నుంచి విమానంలో తిరిగొచ్చాక ఆమె బ్యాగులను ఢిల్లీ కస్టమ్స్ అధికారులు తనిఖీచేయడమే ఆమె ఆగ్రహానికి లోనయ్యారు. బ్రిటన్‌లో భారత్ గురించి గొప్పగా ప్రసంగించిన నాలాంటి వ్యక్తిని ఇలాగేనా అవమానించేది?. ఖరీదైన లూయిస్ విట్టన్ బ్రాండ్ షాపింగ్ ఖాళీ సంచులు తెచ్చినందుకే బిల్లులు ఎగ్గొట్టిన దొంగలా చూస్తున్నారు. నన్ను వాళ్లు ఇండియా మీడియా యోధురాలిగా భావిస్తే మీరేమో ఇక్కడ నన్ను బ్రాండ్ స్మగ్లర్‌లా భావించి పరువు తీస్తున్నారు'' అని అధికారులతో స్వరం పెంచి మాట్లాడారు. అధికారులతో వాగ్వాదం తాలూకు వీడియోను స్వయంగా కెమెరాతో షూట్‌చేసి 'ఎక్స్'లో షేర్‌చేశారు. దీనిపై ఢిల్లీ కస్టమ్స్ అధికారులు వివరణ ఇచ్చారు. ''అంతర్జాతీయ ప్రయాణికుల బ్యాగులను స్కానింగ్ చేయడం సర్వసాధారణం. గౌరవం చట్టాలకు అతీతం కాదు. బ్యాగ్ స్కానింగ్‌కు ఆమె ఒప్పుకోలేదు' అని అన్నారు.

రష్యా యుద్ధరంగం నుంచి భారతీయులు వెనక్కు

న్యూఢిల్లీ: ఉక్రెయిన్– రష్యా యుద్ధంలో రష్యా సైన్యానికి సహాయకులుగా విధులు నిర్వర్తిస్తున్న భారతీయ యువకుల్లో కొందరిని సురక్షితంగా తిరిగి పంపించేశారు. రష్యా ఆర్మీకి 'సపోర్ట్ స్టాఫ్'గా చేరి సెక్యూరిటీ హెల్పర్లుగా విధుల్లో ఉన్న యువకులను వీలైనంత త్వరగా వెనక్కి పంపాలని భారత విదేశాంగ శాఖ డిమాండ్‌చేసిన నేపథ్యంలో ఈ తాజా పరిణామం చోటుచేసుకుంది. భారత్‌చేసిన విజ్ఞప్తిమేరకు కొందరిని రష్యా స్వదేశానికి పంపిందని భారత విదేశాంగ శాఖ సోమవారం ప్రకటించింది. అక్కడి భారతీయులందరినీ సురక్షితంగా వెనక్కి తీసుకొచ్చే పనికే భారత ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. రష్యాలో ఇతరత్రా ఉద్యోగాల్లో చేరుస్తామని మభ్యపెట్టి కొందరు ఏజెంట్లు ఈ యువకులను రష్యా యుద్ధక్షేత్రానికి తరలించిన విషయం తెల్సిందే.

గాజాలో ఆకలి కేకలు

23 లక్షల మందికీ ఆహార కొరత | కరువుతో అలమటిస్తున్నది 5 లక్షలు



- నానాటికీ పెరుగుతున్న ఆకలిచావులు
- సహాయాన్ని అడ్డుకుంటున్న ఇజ్రాయెల్
- ఘోరకలి దిశగా పరిస్థితులు: ఐరాస

గాజాలో ఆకలి కేకలు మిన్నంటుతున్నాయి. అక్కడున్న మొత్తం 23 లక్షల మందీ జనాభా తీవ్ర ఆహార కొరతతో అల్లాడుతున్నారు. 80 శాతం మంది గాజావాసులు ఇజ్రాయెల్ దాడులకు తాళలేక, దాని బెదిరింపులకు తలొగ్గి ఇప్పటికే ఇల్లూ వాకిలీ వదిలేశారు. కొద్ది నెలలుగా శరణార్థి శిబిరాల్లో తలదాచుకుంటున్నారు. ఎలాంటి సహాయక సామగ్రినీ ఇజ్రాయెల్ అనుమతించకపోవడంతో అన్నమో రామచంద్రా అంటూ అంతా అలమటిస్తున్నారు. వారిలోనూ కనీసం 5 లక్షల మంది అత్యంత తీవ్రమైన కరువు బారిన పడ్డారని ఐరాస ఆవేదన వెలిబుచ్చింది. తాళలేని ఆకలిబాధతో దుర్భర వేదన అనుభవిస్తున్నారని ఐరాస పాలస్తీనా శరణార్థుల సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) తాజా నివేదికలో వెల్లడించింది. వారికి తక్షణ సాయం అందకపోతే అతి త్వరలోనే గాజా ఆకలిచావులకు ఆలవాలంగా మారడం ఖాయమని హెచ్చరించింది...

కలుపు మొక్కలే మహాప్రసాదం

ఆకలికి తట్టుకోలేక గాజావాసులు చివరికి కలుపు మొక్కలు తింటున్నారు! ఔషధంగా వాడాల్సిన ఈ మొక్కలను ఆహారంగా తీసుకుంటే ప్రమాదమని తెలిసి కూడా మరో దారి లేక వాటితోనే కడుపు నింపుకుంటున్నారు. దీన్ని కూడా సొమ్ము చేసుకుంటున్న వారి సంఖ్య పెరిగిపోతోంది. మాలో అని పిలిచే ఈ మొక్కలను కట్టకింత అని రేటు పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. పలు ప్రాంతాల్లో ఆకలికి తాళలేక గుర్రాల కళేబరాలనూ తింటున్నారు!

నరకానికి నకళ్లు...


గత ఆదివారం గాజా శరణార్థి శిబిరంలో ఓ రెణ్నెల్ల పసివాడు ఆకలికి తాళలేక మృత్యువాత పడ్డాడు. గాజాలో కనీవినీ ఎరగని మానవీయ సంక్షోభానికి ఇది కేవలం ఆరంభం మాత్రమే కావచ్చని ఐరాసతో పాటు పలు అంతర్జాతీయ సంస్థలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మున్ముందు అక్కడ పదులు, వందలు, వేలల్లో, అంతకుమించి ఆకలి చావులు తప్పకపోవచ్చని హెచ్చరిస్తున్నాయి. ప్రతీకారేచ్ఛతో పాలస్తీనాపై నాలుగున్నర నెలలుగా విరుచుకుపడుతున్న ఇజ్రాయెల్ ఆ క్రమంలో గాజా స్ట్రిప్‌ను అష్ట దిగ్బంధనం చేయడమే ఇందుకు కారణం. గాజాకు ఆహారం, నిత్యావసరాల సరఫరాను కూడా ఇజ్రాయెల్ వీలైనంతగా అడ్డుకుంటూ వస్తోంది. చివరికి ఐరాస వంటి అంతర్జాతీయ సంస్థల సాయాన్ని కూడా అనుమతించడం లేదు. దాంతో గాజావాసులు అల్లాడిపోతున్నారు. శరణార్థి శిబిరాలు నరకానికి నకళ్లుగా మారుతున్నాయి. కొన్నాళ్లుగా ఆకలి కేకలతో ప్రతిధ్వనిస్తున్నాయి. యుద్ధం మొదలైన తొలినాళ్లలో గాజాలోకి రోజుకు 500 పై చిలుకు వాహనాల్లో సహాయ సామగ్రి వచ్చేది. క్రమంగా 50 వాహనాలు రావడమే గగనమైపోయింది. ఇప్పుడవి 10కి దాటడం లేదు! ఉత్తర గాజాలోనైతే పరిస్థితి మరింత దారుణంగా మారింది. ఆ ప్రాంతానికి ఎలాంటి మానవతా సాయమూ అందక ఇప్పటికే నెల రోజులు దాటిపోయింది. యూఎన్ఆర్‌డబ్ల్యూఏ కూడా చివరిసారిగా జనవరి 23 అక్కడికి సహాయ సామగ్రిని పంపింది. నాటినుంచి ఇజ్రాయెల్ ఆంక్షలు తీవ్రతరం కావడంతో చేతులెత్తేసినట్టు సంస్థ చీఫ్ ఫిలిప్ లాజరిని స్వయంగా అంగీకరించారు! గాజా ఆకలి కేకలను పూర్తిగా మానవ కల్పిత సంక్షోభంగా ఆయన అభివర్ణించారు. ''సహాయ సామగ్రితో కూడిన వాహనాలేవీ గాజాకు చేరకుండా చాలా రోజులుగా ఇజ్రాయెల్ పూర్తిగా అడ్డుకుంటోంది. కనీసం ఆహార పదార్థాలనైనా అనుమతించాలని కోరినా పెడచెవిన పెడుతోంది'' అంటూ సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు.

మాటలకందని విషాదం...

యూఎన్ ఆఫీస్ ఫర్ ద కోఆర్డినేషన్ ఆఫ్ హ్యూమానిటేరియన్ అఫైర్స్ (ఓసీహెచ్ఏ) గణాంకాల మేరకు గాజాలోని మొత్తం 23 లక్షల మందినీ తీవ్ర ఆహార కొరత వేధిస్తోంది. వారిలోనూ 5 లక్షల మందికి పైగా తీవ్రమైన కరువు పరిస్థితుల బారిన పడ్డారు. ఇజ్రాయెల్ వైఖరే ఇందుకు ప్రధాన కారణం...

- గాజాలోకి సహాయ సామగ్రి కోసం ఇజ్రాయెల్ కేవలం ఒకే ఒక ఎంట్రీ పాయింట్‌ను తెరిచి ఉంచింది.
- ఆ మార్గంలోనూ దారిపొడవునా లెక్కలేనన్ని చెక్ పాయింట్లు పెట్టి ఒక్కో వాహనాన్ని రోజుల తరబడి తనిఖీ చేస్తోంది.
- దీనికి తోడు అతివాద ఇజ్రాయెలీ నిరసనకారులు పాలస్తీనా వాసులకు సాయమూ అందడానికి వీల్లేదంటూ భీష్మించుకున్నారు.
- దక్షిణ గాజా ఎంట్రీ పాయింట్‌ను కొన్నాళ్లుగా వారు పూర్తిగా దిగ్బంధించారు.
- సహాయక వాహనాలకు భద్రత కల్పిస్తున్న స్థానిక పోలీసుల్లో 8 మంది ఇటీవల ఇజ్రాయెల్ దాడులకు బలయ్యారు. అప్పట్నుంచీ ఎస్కార్టుగా వచ్చే వారే కరువయ్యారు.
- దాంతో గాజాలో సహాయక వాహనం కనిపిస్తే చాలు, జనమంతా ఎగబడే పరిస్థితి నెలకొని ఉంది! వాహన సిబ్బందిని చితగ్గొట్టి చేతికందినన్ని సరుకులు లాక్కెళ్తున్నారు.
- మరోవైపు దీన్ని సాకుగా చూపి ఇజ్రాయెల్ సహాయ వాహనాలను అడ్డుకుంటోంది.
- గత అక్టోబర్ 7న ఇజ్రాయెల్‌పై హమాస్ మిలిటెంట్లు మెరుపు దాడి చేసి వందల మందిని పొట్టన పెట్టుకోవడం తెలిసిందే. యుద్ధానికి కారణంగా నిలిచిన ఈ దాడిలో ఐరాస పాలస్తీనా శరణార్థుల సంస్థ (యూఎన్ఆర్‌డబ్ల్యూఏ) సిబ్బంది పాత్రా ఉందని ఇటీవల తేలడంతో ఆ సంస్థ గాజా నుంచి దాదాపుగా వైదొలగింది. సహాయక సామగ్రి చేరవేతలో ఇన్నాళ్లూ వ్యవహరించిన ఆ సంస్థ నిష్క్రమణతో గాజావాసుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడింది. **- సాక్షి, నేషనల్ డెస్క్**

జూన్ నుంచి మూడో టర్మ్



- మా ఘనవిజయం ఖాయం: మోదీ
- యువత కలలే తన సంకల్పమని వెల్లడి
- పలు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన

న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం ఖాయమని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. జూన్ నుంచి తమ మూడో టర్మ్ పాలన మొదలవుతుందని ధీమా వెలిబుచ్చారు. ''ఆ తర్వాత సాకారమయ్యే వికసిత భారత్ దేశ యువత కలలకు ప్రతిరూపంగా ఉంటుంది. దేశ రూపురేఖలు ఎలా ఉండాలో నిర్ణయించే పూర్తి హక్కులు వారికున్నాయి. వారి కలలే నా సంకల్పం. నా సంకల్పమే వికసిత భారతానికి హామీ. ఈ నయా భారత్‌లో చిన్న లక్ష్యాలకు చోటు లేదు. పెద్ద పెద్ద కలలు కంటూ వాటి సాకారానికి నిర్విరామంగా కృషి చేస్తున్నాం. పదేళ్లుగా ఈ వేగం ప్రపంచాన్నే అబ్బురపరుస్తోంది'' అన్నారు. అమృత్ భారత్ పథకంలో భాగంగా దేశవ్యాప్తంగా రూ.41 వేల కోట్లతో తలపెట్టిన 2,000 పై చిలుకు రైల్వే ప్రాజెక్టులకు సోమవారం ఆయన వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు. వీటిలో 27 రాష్ట్రాల పరిధిలో 554 అమృత్ భారత్ రైల్వే స్టేషన్ల పునరభివృద్ధి, 1500 రోడ్ ఓవర్ బ్రిడ్జిలు, అండర్‌బ్రిడ్జి పనులున్నాయి. తెలంగాణలో రూ.230 కోట్లతో 15 అమృత్ భారత్ స్టేషన్లు, రూ.169 కోట్లతో 17 రైల్ ఫ్లై ఓవర్లు, అండర్ పాస్‌లకు మోదీ భూమి పూజ చేశారు. రూ.221 కోట్లతో పూర్తయిన 3 రైల్ ఫ్లై ఓవర్, 29 రైల్ అండర్ పాస్‌లను జాతికి అంకితం చేశారు. కాంగ్రెస్ పాలనలో రైల్వే శాఖ రాజకీయ క్రీడలకు వేదికగా కునారిల్లిందని ఈ సందర్భంగా ఆయన ఆరోపించారు. తమ పాలనలో పదేళ్లుగా ఆధునికతను అందిపుచ్చుకుని దూసుకుపోతోందన్నారు. ''కొన్నేళ్లుగా భారత్ అన్ని రంగాల్లోనూ శరవేగంగా ప్రగతి సాధిస్తోంది. పన్నుల రూపేణా ప్రజలు చెల్లిస్తున్న ప్రతి రూపాయినీ వారి సంక్షేమానికే వెచ్చిస్తున్నాం. గత కొద్ది రోజుల్లో దేశవ్యాప్తంగా పలు ఐఐటీలు, ఐఐఎంలు, ఎయిమ్స్‌లను ప్రారంభించా'' అని చెప్పారు.

టెక్స్‌టైల్ రంగ ప్రగతికి సాయం

టెక్స్‌టైల్ రంగానికి కేంద్రం అన్నివిధాలా మద్దతుగా నిలుస్తుందని మోదీ చెప్పారు. ''దేశాభివృద్ధిలో ఆ రంగానిది కీలక పాత్ర వికసిత భారత లక్ష్యసాధనలో టెక్స్‌టైల్ రంగం పాత్రను మరింతగా పెంచేందుకు కృషి చేస్తున్నాం'' అన్నారు. భారత టెక్స్–2024ను మోదీ ప్రారంభించారు. ''వికసిత భారతానికి పేదలు, యువత, రైతులు, మహిళలు నాలుగు స్తంభాలు. వారందరికీ టెక్స్‌టైల్ రంగంలో గణనీయమైన పాత్ర ఉంటుంది'' అని ఈ సందర్భంగా అన్నారు. 2014లో రూ.7 లక్షల కోట్లున్న భారత టెక్స్‌టైల్ రంగం విలువ ఇప్పుడు రూ.12 లక్షల కోట్లకు పెరిగిందని చెప్పారు. నాలుగు రోజుల భారత్ ఎక్స్‌పోలో 100కు పైగా దేశాల నుంచి 3,500కు పైగా ఎగ్జిబిటర్లు, 3,000 పై చిలుకు కొనుగోలుదారులు, 40 వేల మందికి పైగా వ్యాపారవేత్తలు తదితరులు పాల్గొంటున్నారు.

ఉపాధ్యక్ష అభ్యర్థిత్వ రేసులో వివేక్ రామస్వామి టాప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ గెలిస్తే దేశ ఉపాధ్యక్షుడిగా ఎవరు ఉంటారనే దానిపై కన్జర్వేటివ్ పొలిటికల్ యాక్షన్ కాన్ఫరెన్స్ (సీపీఏసీ) నిర్వహించిన పోలింగ్‌లో భారతీయ మూలాలున్న వ్యాపారవేత్త వివేక్ రామస్వామి హాట్ ఫేవరెట్‌గా నిలిచారు. సౌత్ డకోటా గవర్నర్, రిపబ్లికన్ నాయకురాలు క్రిస్టీ నోయెమ్, వివేక్ రామస్వామిలకు సమానంగా 15 శాతం ఓట్లు పడ్డాయని న్యూయార్క్ టైమ్స్ వెల్లడించింది. సీపీఏసీ పోలింగ్‌లో భారతీయ మూలాలున్న మరో నాయకురాలు, అమెరికా పార్లమెంట్‌లో తొలి హిందూ సభ్యురాలు తులసీ గబార్డ్‌కు కేవలం తొమ్మిది శాతం ఓట్లు పడ్డాయి. రాష్ట్రాలవారీగా రిపబ్లికన్ ప్రైమరీ ఎన్నికల్లో నిక్కీ హేలీని వెనక్కినెట్టి ట్రంప్ వరస విజయాలు సాధిస్తుండటంతో పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిగా ట్రంప్ పేరు దాదాపు ఖరారైంది. దాంతో ఉపాధ్యక్ష అభ్యర్థి ఎవరనేది ఇప్పుడు తేలాల్సి ఉంది. అందుకే శనివారం సీపీఏసీ పోల్ నిర్వహించారు.

పేదరికం కనుమరుగవుతోంది

మా సంక్షేమ పాలనే కారణం: మోదీ

న్యూఢిల్లీ: దేశంలో పేదరికం మటుమాయం అవుతోందని ప్రధాని మోదీ చెప్పారు. గత పదేళ్లలో తలసరి గృహ వినియోగ వ్యయం రెండున్నర రెట్లు పెరగడమే ఇందుకు తార్కాణమన్నారు. ఆదివారం న్యూస్9 గ్లోబల్ సదస్సులో ఆయన ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. ''తలసరి వినియోగ పెరుగుదల పట్టణాల కంటే గ్రామాల్లోనే ఎక్కువగా ఉన్నట్టు కూడా సర్వేలో తేలింది. ప్రజలకు ఖర్చు చేసే సామర్థ్యం పెరుగుతోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. గ్రామాలు, పేదలు, రైతుల సంక్షేమంపై మేమిచ్చిన ప్రాధాన్యమే ఇందుకు కారణం. గ్రామీణ భారతాన్ని దృష్టి పెట్టుకుని పలు మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేశాం. మహిళల సాధికారత సాధించాం. అపారమైన ఉపాధి అవకాశాలు కల్పించాం. ప్రజల ఆత్మవిశ్వాసాన్ని అద్భుతంగా పెంచాం. పాలనతో పాటు దృక్కోణం తదితరాలన్నింట్లోనూ అపారమైన మార్పు తీసుకొచ్చాం'' అని వివరించారు. గత ప్రభుత్వాలు ఓటు బ్యాంకు రాజకీయాల కోసం ప్రజలను కావాలనే కరువు పరిస్థితుల్లో మగ్గేలా చేశాయంటూ కాంగ్రెస్‌పై మోదీ విమర్శలు గుప్పించారు. ''ఈ కరువు, సంతుష్టీకరణ రాజకీయాలపై మాకు నమ్మకం లేదు. సంతృప్త పాలనే మా ధ్యేయం. అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూస్తున్నాం'' అని వివరించారు. గత పదేళ్లలో ప్రపంచ వేదికపై భారత్ విశ్వసనీయత ఎంతగానో పెరిగిందన్నారు.

సమున్నత శిఖరాలకు సామర్థ్యం: కొన్నేళ్లుగా తమ ప్రభుత్వ పనితీరుకు ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్ రద్దు, మహిళా రిజర్వేషన్ల బిల్లు, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి గీటురాయిగా నిలిచాయని మోదీ చెప్పారు. ''గత పాలకులకు భారతీయుల సామర్థ్యంపై కనీస నమ్మకం కూడా లేదు. వారిని తక్కువగా అంచనా వేశారు'' అంటూ కాంగ్రెస్ పాలనపై విమర్శలు గుప్పించారు. అప్పుడెప్పుడో 1960లు, 80ల్లో వారు మొదలు పెట్టిన పలు పథకాలను 2014లో తాము అధికారంలోకి వచ్చాక పూర్తి చేయాల్సి వచ్చిందన్నారు. ''మా పాలనలో దేశవ్యాప్తంగా సగటున రోజుకు రెండు కొత్త కాలేజీలు, వారానికో కొత్త యూనివర్సిటీ వచ్చాయి. అసాధ్యమంటూ ఏదీ లేదన్న విశ్వాసం ఇప్పుడు దేశ ప్రజల్లో తొణికిసలాడుతోంది'' అని మోదీ అన్నారు. చెప్పారు. మూడో టర్మ్ పాలనలో దేశ సామర్థ్యాన్ని సమున్నత శిఖరాలకు చేర్చడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

జపాన్ మూన్ స్నైపర్ మేల్కొంది!



టోక్యో: ఓ వైజ్ఞానిక విశేషం. అంతకంటే అబ్బురం! గత నెలలో చంద్రుడిపై దిగిన జపాన్ ల్యాండర్ 'మూన్ స్నైపర్' అనూహ్యంగా నిద్ర లేచింది. జాబిలిపై సుదీర్ఘంగా 14 రోజుల పాటు కొనసాగిన రాత్రివేళలో గడ్డకట్టించే మైనస్ 130 డిగ్రీల వాతావరణాన్ని తట్టుకుని మరీ బతికింది! దాంతో జపాన్ అంతరిక్ష పరిశోధన సంస్థ (జాక్సా) సంభ్రమాశ్చర్యాలకు లోనైంది. అంతటి చలిని తట్టుకునేలా సామర్థ్యం లేకపోయినా అద్భుతమే చేసిందంటూ హర్షం వెలిబుచ్చింది. ''స్మార్ట్ ల్యాండర్ ఫర్ ఇన్వెస్టిగేటింగ్ మూన్ (స్లిమ్)గా పిలిచే ఈ ల్యాండర్‌తో ఆదివారం రాత్రి సంబంధాల్ని పునరుద్ధరించాం. మేం పంపిన సందేశానికి ప్రతిస్పందించింది'' అని ఎక్స్‌లో పోస్ట్ చేసింది. మూన్ స్నైపర్ జనవరి 19న చంద్ర మధ్యరేఖకు దక్షిణంగా షియోలీ బిలం వాలులో తలకిందులుగా దిగడం తెలిసిందే. దాంతో దానిపై జాక్సా ఆశలు వదిలేసుకుంది. సౌర ఫలకాలు సూర్యుడికి వ్యతిరేక దిశలో ఉండిపోవటంతో ల్యాండర్‌ను నిద్రాణ స్థితిలోకి పంపారు. సూర్యుడి దిశ మారి ఎండ అందుబాటులోకి రావటంతో ల్యాండర్ సౌరశక్తిని సమకూర్చుకుని పని చేయడం ప్రారంభించింది. చంద్రుడిపై రాత్రి సమీపించడంతో దాన్ని మళ్లీ నిద్రావస్థలోకి పంపారు.

మేమొస్తే 'అగ్నిపథ్' రద్దు: ఖర్గే

యువతకు న్యాయం చేయాలంటూ రాష్ట్రపతికి లేఖ

న్యూఢిల్లీ: తాత్కాలిక ప్రాతిపదికన యువతను సైన్యంలో చేర్చుకునే 'అగ్నిపథ్' పథకాన్ని తాము అధికారంలోకి వస్తే రద్దుచేస్తామని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రకటించారు. ఈ పథకాన్ని ప్రకటించే నాటికే భర్తీ ప్రక్రియలో ఉత్తీర్ణులై నియామక పత్రాల కోసం ఎదురుచూసిన రెండు లక్షల మందికి తక్షణం ఉద్యోగాలివ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన లేఖ రాశారు. 'సాయుధదళాల్లోకి శాశ్వత ప్రాతిపదికన నియామకాలు ఆగిపోవడంతో లక్షలాది మంది యువత భవితవ్యం అగమ్యగోచరంగా మారింది. అగ్నివీర్‌లు నాలుగేళ్ల తర్వాత ఉద్యోగాలు కోల్పోయి నడిరోడ్డుపై నిల్చుంటారు. సామాజికంగానూ గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటారు'' పేర్కొన్నారు. సైనిక అభ్యర్థుల పోరాటానికి మద్దతుగా ఉంటామని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ అన్నారు. సైన్యంలో చేరేందుకు యువత కన్న కలలను అగ్నివీర్ పథకంతో బీజేపీ చిదిమేసిందని ప్రియాంక గాంధీ ఆరోపించారు. ''కేంద్రానికి కొంత జీతభత్యాల చెల్లింపులు ఆదా అవుతాయి తప్పితే ఈ పథకంతో ఎవరికి ఎలాంటి ఉపయోగం లేదు'' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సచిన్ పైలెట్ అభిప్రాయపడ్డారు. అగ్నివీర్ కింద సైన్యంలోకి తీసుకునే యువతలో నాలుగేళ్ల తర్వాత అత్యంత ప్రతిభ కనబరిచిన 25 శాతం మందినే 15 ఏళ్ల శాశ్వత కమిషన్‌లోకి తీసుకుంటామని కేంద్రం ప్రకటించడం తెలిసిందే.

కోస్ట్ గార్డ్‌లో మహిళల శాశ్వత కమిషన్... మమ్మల్నే అమలు చేయమంటారా?

కేంద్రంపై సుప్రీంకోర్టు ఆగ్రహం

న్యూఢిల్లీ: ఇండియన్ కోస్ట్ గార్డ్‌లో మహిళా ఉద్యోగులను శాశ్వత ప్రాతిపదికన (పర్మనెంట్ కమిషన్) నియమించాల్సిందేనని కేంద్రానికి సుప్రీంకోర్టు మరోమారు స్పష్టం చేసింది. తమ ఆదేశాలను అమలు చేయకుంటే తామే ఆ పని చేస్తామని హెచ్చరించింది. అర్హులైన షార్ట్ సర్వీస్ మహిళా ఉద్యోగులకు పర్మనెంట్ కమిషన్ ఇవ్వాలంటూ కోస్ట్ గార్డ్ ఆఫీసర్ ప్రియాంకా త్యాగి పెట్టుకున్న పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రా ధర్మాసనం విచారించింది. ఈ విషయంలో కొన్ని అవరోధాలున్నాయని కేంద్రం తరఫున అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి చేసిన వాదనలను తోసిపుచ్చింది. ''త్రివిధ దళాల్లో మహిళా అధికారులను పర్మనెంట్ కమిషన్‌లోకి అనుమతిస్తూ సుప్రీంకోర్టు గతంలోనే తీర్పు చెప్పింది. అయినా ప్రభుత్వం పితృస్వామ్య వ్యవస్థలా మాట్లాడుతోంది. ఆ పోకడ వదిలేయండి. కోస్ట్ గార్డ్‌లో మహిళల ముఖాలు చూడొద్దనుకుంటున్నారా?'' అంటూ చీవాట్లు పెట్టింది. ''ఏవేవో కారణాలతో ఈ అంశాన్ని ఏడాదంతా సాగదీస్తామంటే కుదరదు. మహిళలకు తక్షణం పర్మనెంట్ కమిషన్ ఇవ్వండి. లేదంటే మేమే ఆ పనిచేస్తాం. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకోండి. మాట్లాడితే నారీశక్తి అంటారు. ప్రభుత్వం నిబద్ధత చాటాలి. మహిళా అధికారులకూ సముచిత స్థానం దక్కేలా విధానపరమైన నిర్ణయాలతో రండి'' అని సూచించింది.

పంజాబ్ ప్రావిన్స్ సీఎంగా మరియం



లాహోర్: పాకిస్తాన్ మాజీ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్ కూతురు, పీఎంఎల్-ఎన్ ఉపాధ్యక్షురాలు అయిన మరియం నవాజ్(50) చరిత్ర సృష్టించారు. రాజకీయంగా ఎంతో కీలకమైన పంజాబ్ ప్రావిన్స్‌కు ముఖ్యమంత్రిగా ఆమె ఎన్నికయ్యారు. పాకిస్తాన్ చరిత్రలో ఒక ప్రావిన్స్‌కు సీఎంగా మహిళ పగ్గాలు చేపట్టడం ఇదే మొట్టమొదటిసారి. పంజాబ్ అసెంబ్లీలో ప్రస్తుతం 327 సీట్లుండగా ముఖ్యమంత్రి అభ్యర్థికి 187 మంది సభ్యుల అవసరం ఉంటుంది. ఇటీవలి ఎన్నికల్లో పీఎంఎల్-ఎన్ 137 సీట్లు గెలుచుకోగా, మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్ పీటీఐకి చెందిన స్వతంత్ర అభ్యర్థులు 113 సీట్లు, ఇతర స్వతంత్రులు 20 సీట్లు సాధించారు. వీరిలో స్వతంత్రులు పీఎంఎల్-ఎన్‌కు మద్దతు పలికారు. శనివారం సీఎం ఎన్నికకు జరిగిన ఓటింగ్‌లో మరియంకు 220 ఓట్లు పడ్డాయి. పీటీఐ స్వతంత్ర అభ్యర్థులు ఓటింగ్‌కు గైర్హాజరయ్యారు.

గజల్ దిగ్గజం పంకజ్ ఉధాస్ కన్నుమూత



ముంబై: 1980, 90వ దశకాల్లో హుషారు పాటలతోపాటు ఎన్నో యుగళ, విషాద గీతాలను తన గాత్రంలో అజరామర పాటలుగా మలచిన ప్రముఖ గజల్ గాయకుడు పంకజ్ ఉధాస్ గొంతు శాశ్వతంగా మూగబోయింది. చిట్టీ ఆయీ హై, ఔర్ ఆహిస్తా కీజియే బాతే అంటూ తన గాత్రంతో సంగీత ప్రియులను ఉర్రూతలూగించిన ఉధాస్ దీర్ఘకాలంగా అనారోగ్యంతో సతమతమవుతూ సోమవారం తుదిశ్వాస విడిచారని ఆయన కూతురు నయాబ్ చెప్పారు. పంకజ్ వయసు 72 సంవత్సరాలు. సోమవారం ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో కన్నుమూసిన పంకజ్ అంత్యక్రియలు మంగళవారం జరగనున్నాయి. గజల్ ఆల్బమ్స్‌తో పాటు హిందీ సినిమాల్లో నేపథ్య గాయకుడిగా భారతీయ సినీ ప్రేక్షకులకు ఆయన సుపరిచితులు. నామ్, సాజన్, మొహ్రా, దయావన్ వంటి సినిమాల్లో ఆయన పాటలు పాపులరయ్యాయి.

ఎన్నో హిట్స్

గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో సంగీత కుటుంబంలో పంకజ్ జన్మించారు. ఆయన తండ్రి కేశుభాయ్ దిల్‌రూబా సంగీతవాయిద్యం వాయించడంలో దిట్టం. పంకజ్ ఇద్దరు సోదరులూ గాయకులే. అందుకే ఈయన ఇదే రంగంలో అడుగుపెట్టారు. మొదట్లో తబలా నేర్చుకుని తర్వాత హిందుస్తానీ శాస్త్రీయ సంగీతంపై మక్కువ పెంచుకుని గాయకునిగా మారారు. 1980లో ఆహట్ ఆల్బమ్‌తో ఆయన తన కెరీర్‌ను మొదలెట్టారు. నాలుగు దశాబ్దాల ప్రస్థానంలో 50కిపైగా గజల్ ఆల్బమ్స్ విడుదలచేశారు. నా కజిరే కీ ధార్, చాందీ జైసా రంగ్ హై తేరా సోనే జైసే బాల్, ఆజ్ ఫిర్ తుమ్ పే ప్యార్ ఆయా, చాహత్ దేశ్ సే ఆనే వాలే అంటూ ఎన్నో హిట్స్ ఆయన పాడారు. నేపథ్య గాయకునిగా కొనసాగుతూనే గజల్స్‌తో ఆయన చేసిన కృషికిగాను కేంద్ర ప్రభుత్వం ఆయనకు 2006లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. ఆయన మృతిపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలు రంగాల ప్రముఖులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. 'చిన్నాపెద్దా అనే తేడా లేకుండా అందర్నీ తన మెలోడీలతో మైమరపించిన అద్భుత గాయకుడు పంకజ్. భారతీయ సంగీతంలో ఒక ఆశాదీపం ఆరిపోయింది. గతంలో ఆయనను ఎన్నోసార్లు కలిశా. ఆయన ఆలపించిన గజల్స్ ప్రతి మదితో నేరుగా సంభాషిస్తాయి. సంగీత ప్రపంచంలో ఆయన లేని లోటు ఎవరూ పూడ్చలేనిది' అంటూ మోదీ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.

ప్రత్యేక కథనం ఫ్యామిలీలో

చాందినీ చౌక్ నుంచి అక్షయ్‌కుమార్ ?



సాక్షి, న్యూఢిల్లీ: బాలీవుడ్ నటుడు అక్షయ్ కుమార్ రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చాందినీ చౌక్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగొచ్చని వార్తలొచ్చాయి. దీనిపై ఇప్పటికే పార్టీ నేతలు అక్షయ్‌ను ఒకసారి సంప్రదించారని జాతీయ మీడియాలో వార్తలు షికార్లు చేస్తున్నాయి. ఢిల్లీలో గతంలో గెలిచిన మొత్తం 7 లోక్‌సభ స్థానాలను తిరిగి ఈసారి కూడా దక్కించుకోవాలని కమలదళం పట్టుదలతో ఉంది. సినిమాల్లోకి రాకముందు గతంలో చాలా సంవత్సరాలు ఢిల్లీ చాందినీ చౌక్ ప్రాంతంలో అక్షయ్‌కుమార్ నివసించారు. అందుకే స్థానికతను దృష్టిలో ఉంచుకుని అక్షయ్‌కుమార్‌ను బరిలోకి దింపితే ఎలా ఉంటుంది అని బీజేపీ లోతైన లెక్కలు వేస్తోందని సమాచారం. గడిచిన 2014, 2019 ఎన్నికల్లో బీజేపీ అన్నిస్థానాలను స్వీప్ చేసింది. ఈ ఏడాది అదే ఊపు కొనసాగించాలని భావిస్తోంది. అయితే ప్రస్తుత ఎన్నికల్లో ఆప్, కాంగ్రెస్‌ల మధ్య పొత్తులు కుదరడంతో మూడు స్థానాల్లో కాంగ్రెస్, 4 స్థానాల్లో ఆప్ బరిలో దిగాలని నిర్ణయించుకున్నాయి. దీంతో ఈ ఏడు స్థానాల్లో త్రిముఖపోరు కాస్తా ద్విముఖ పోరుగా మారింది. దీంతో అభ్యర్థిని మరింత ఆచితూచి ఎంపికచేయాలని బీజేపీ భావిస్తోంది.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 27 । ఫిబ్రవరి । 2024



దివ్యాంగులకు ల్యాప్‌టాప్‌లు

చిలకలపూడి(మచిలీపట్నం): విభిన్న ప్రతిభావంతులు దాసి సుమన్, చిన్నాల మేఘన, గూడవల్లి రవితేజకు కృష్ణా జిల్లా జేసీ గీతాంజలిశర్మ సోమవారం ల్యాప్‌టాప్‌లు పంపిణీ చేశారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన

రైల్వేస్టేషన్: గుణదల రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు ప్రధాని మోదీ సోమవారం వర్చువల్‌గా శంకు స్థాపన చేశారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ఎంపి కేశినేని నాని, ఎమ్మెల్యే విష్ణు పాల్గొన్నారు.



పోలీస్‌స్టేషన్ ప్రారంభం

మోపిదేవి: మోపిదేవిలో ఏర్పాటుచేసిన పోలీస్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్ బాబు, ఏలూరు రేంజ్ ఐజీ అశోక్ కుమార్ సోమవారం ప్రారంభించారు.

న్యూస్‌రీల్

సాగరతీరాన్ని సందర్శించిన డీఐజీ అశోక్‌కుమార్



డీఐజీని సత్కరిస్తున్న హంసలదీవి ఆలయ ధర్మాధికారి

కోడూరు(అవనిగడ్డ): హంసలదీవి సాగరతీరాన్ని ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి.అశోక్ కుమార్ సోమవారం సందర్శించారు. పాలకాయతిప్ప బీచ్ ప్రాంతంలో పర్యటించారు. ఇక్కడ విశిష్టతను డీఐజీకి డీఎస్పీ మురళీధర్ వివరించారు. కృష్ణానది సముద్రంలో కలిసే పవిత్ర సాగరసంగమంపై డీఐజీ ఆరా తీశారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో పర్యాటకులకు కల్పిస్తున్న భద్రతను వివరించారు. హంసలదీవిలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణు గోపాలస్వామివారిని డీఐజీ దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు చేయించారు. ఆలయ ధర్మాధికారి కుప్పా సుబ్రహ్మణ్య అవధాని ఆలయ విశిష్టతను డీఐజీ వివరించారు. స్వామివార్ల చిత్రపటం, ప్రసాదాన్ని అందించి దుశ్శాలువాతో సత్కరించారు.

1,03,535 టన్నుల ధాన్యం సేకరణ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో 2023–24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఇప్పటి వరకు 1,03,535 టన్నుల ధాన్యం సేకరించామని జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి సంపత్‌కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1,38,000 టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలన్నది లక్ష్యమని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాలను ఈ నెల 28వ తేదీ నుంచి మూసివేస్తామని వెల్లడించారు. ఎవరైనా రైతులు తమ ధాన్యాన్ని విక్రయించాల్సి ఉంటే వెంటనే తమ పరిధిలోని కొనుగోలు కేంద్రంలో సంప్రదించాలని సూచించారు.

స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో 33 మంది నియామకం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వివిధ విభాగాల్లో పనిచేసేందుకు ఎంపికైన 33 మంది అభ్యర్థులకు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు సోమవారం నియామక పత్రాలు అందజేశారు. కలెక్టరేట్‌లో ఐసీడీఎస్ పీడీ ఉమాదేవితో కలిసి అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేశారు. పోషణ్ అభియాన్‌లో జిల్లా కోఆర్డినేటర్, ప్రాజెక్టు అసిస్టెంట్, కోఆర్డినేటర్ పోస్టులకు సంబంధించి ఎనిమిది మందికి, జిల్లా పరిరక్షణ విభాగంలో బాలల పరిరక్షణ అధికారి, ప్రొటెక్షన్ అధికారి, లీగల్ కం ప్రొబేషన్ అధికారి, అకౌంటెంట్, అవుట్‌రీచ్ వర్కర్‌కు సంబంధించి ఆరుగురికి, ప్రత్యేక దత్తత విభాగంలో మేనేజర్, కోఆర్డినేటర్ తదితర పోస్టులకు సంబంధించి తొమ్మిది మందికి, బాలసదన్‌లో పనిచేసేందుకు పది మందికి నియామక పత్రాలు అందజేశారు. మొత్తం 33 మందికి నియామక పత్రాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. చిత్తశుద్ధితో విధులు నిర్వర్తించి జిల్లాకు పేరు తేవాలన్నారు. సీడీపీఓలు జి.మంగమ్మ, కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ జిల్లా జట్టు ఎంపిక



కబడ్డీ ఉమ్మడి కృష్ణా జిల్లా జట్టు

విజయవాడస్పోర్ట్స్: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఉమ్మడి కృష్ణా జిల్లా సీనియర్ పురుషుల జట్టును ఎంపిక చేసినట్లు కృష్ణాజిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి నల్లా యోనారాజు తెలిపారు. విజయవాడలోని ఆంధ్రా లయోల కాలేజీలో సోమవారం నిర్వహించిన ఈ ఎంపిక పోటీలకు 50 మంది క్రీడాకారులు హాజరయ్యారని పేర్కొన్నారు. అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన క్రీడాకారులను జట్టుకు ఎంపిక చేశామని వివరించారు. నెల్లూరు జిల్లా కొవ్వూరులో మార్చి ఎనిమిది నుంచి పదో తేదీ వరకు జరిగే 70వ రాష్ట్ర స్థాయి పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందని ఈ సందర్భంగా తెలిపారు.

తలనీలాల వేలం ▶ రింగు తిరిగింది



టెండర్ ప్రక్రియలో పాల్గొన్న దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఆలయ అధికారులు

- దుర్గగుడిలో ఆరో సారి టెండర్ ప్రక్రియ వాయిదా
- రూ.7.88 కోట్లు పలికిన గత ఏడాది టెండర్
- ఇప్పుడు రూ.2.27 కోట్ల తక్కువకు దాఖలు
- ధర పెంచేందుకు ముందుకు రాని కాంట్రాక్టర్లు



తలనీలాలు సమర్పిస్తున్న భక్తులు (ఫైల్)

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లకు భక్తులు సమర్పించే తలనీలాల వేలం 'రింగు'లు తిరుగుతోంది. భక్తులు సమర్పించిన తలనీలాలను తక్కువ ధరకే దక్కించుకునేందుకు కాంట్రాక్టర్లు రింగై అంతర్జాతీయ మార్కెట్‌లో రేటు లేదని సాకుగా చూపుతూ తక్కువ ధరకు టెండర్లు వేస్తున్నారు. గడిచిన మూడు నెలల కాలంలో దేవస్థానం ఆరు పర్యాయాలు టెండర్ల ప్రక్రియ నిర్వహించింది. మూడు సార్లు టెండర్ ప్రక్రియకే కాంట్రాక్టర్లు హాజరు కాలేదు. మరో మూడు సార్లు హాజరైనా తాము అనుకున్న రేటుకే టెండర్ దక్కించుకోవాలని పావులు కదిపారు. దీంతో దేవస్థానం ఐదు సార్లు టెండర్ ప్రక్రియను నిలిపివేసింది. ఆరో దఫా సోమవారం టెండర్ ప్రక్రియ నిర్వహించగా, గత ఏడాది కంటే సుమారు రూ.2.27 కోట్ల తక్కువకు అంటే రూ.5.61 కోట్లకు టెండరు దాఖలు చేశారు. దీంతో ఆరో దఫా కూడా టెండర్ ప్రక్రియ వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి.

గత ఏడాది రూ.7.88 కోట్లు

గడిచిన ఏడాదికి రూ.7.88 కోట్లు పలికిన తలనీలాలు టెండర్ ఈ ఏడాది పది శాతం పెంపుదలతో సుమారు రూ.8.50 కోట్లు పలుకుతుందని దేవస్థానం భావించింది. ఈ మేరకు మూడు నెలల్లో ఆరు సార్లు టెండర్లను ఆహ్వానించింది. ఆన్‌లైన్, ఈ–టెండర్, బహిరంగ వేలం ప్రక్రియ ద్వారా టెండర్లు పిలిచింది. గత నెలలో నిర్వహించిన టెండర్ ప్రక్రియ సుదీర్ఘంగా సాగి రూ.5.30 కోట్లకు చేరింది. తాజాగా సోమవారం నిర్వహించిన టెండర్ ప్రక్రియలో దేవస్థానం పాటను రూ.8 కోట్లుగా నిర్ణయించింది. ఎనిమిది మంది కాంట్రాక్టర్లు ఈ వేలానికి హాజరయ్యారు. కాంట్రాక్టర్లు ఎవరూ పాటలో పాల్గొనక పోవడంతో రూ.7 కోట్లకు తగ్గించారు. అయితే రూ.4 కోట్ల నుంచి వేలం ప్రారంభించాలని కాంట్రాక్టర్లు కోరారు. చివరి సారిగా నిర్వహించిన వేలంలో రూ.5.30 కోట్ల వరకు ధర వచ్చిందని, అక్కడి నుంచి మాత్రమే పాటను తిరిగి ప్రారంభించే అధికారం తమకు ఉందని చెప్పి అక్కడి నుంచి పాటను ప్రారంభించారు. దీంతో కాంట్రాక్టర్లు పాటను క్రమంగా పెంచడంతో రూ.5.42 కోట్లకు చేరింది. దీంతో ఆలయ అధికారులు బహిరంగ వేలాన్ని నిలిపివేసి సీల్డ్ టెండర్ తెరిచారు. ఇండియన్ హెయిర్ ఇండస్ట్రీస్ రూ.5.61 కోట్లకు టెండర్ దాఖలు చేసింది. గత ఏడాది కంటే రూ.2.27 కోట్ల మేర తక్కువగా ధరకు కోట్ చేయడంతో అధికారులు ఈ విషయాన్ని ఆలయ ఈఓ రామారావు దృష్టికి తీసుకెళ్లారు. ఈఓ ఆదేశాల మేరకు వేలాన్ని ప్రస్తుతానికి నిలుపుదల చేసినట్లు ఆలయ అధికారులు ప్రకటించారు. టెండర్ ప్రక్రియను ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఏఈఓ వెంకటరెడ్డి, సూపరింటెండెంట్ డి.వి.వి.సత్యనారాయణ, జగదీష్ పర్యవేక్షించారు.

ఈ నెల ఒకటి నుంచి దేవస్థానం వద్దే..

జనవరి 31తో గత ఏడాది కాంట్రాక్టు పూర్తయింది. దీంతో ఈ నెల ఒకటో తేదీ నుంచి భక్తులు సమర్పించిన తలనీలాలను దేవస్థానమే భద్రపరుస్తోంది. దుర్గాఘాట్ ఎదురుగా ఉన్న కేశఖండన శాలలో తలనీలాల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక హుండీల్లో భద్రపరుస్తున్నారు. తలనీలాలను భద్రపరచడం, అవి దుర్వినియోగం కాకుండా ఉండేందుకు దేవస్థాన ఈఓ ఓ బృందాన్ని నియమించారు. ఈ బృందంలోని కమిటీ సభ్యులైన ఏఈఓలు చంద్రశేఖర్, ఎస్.రమేష్‌బాబు, పర్యవేక్షకులు పి.సునీత, టి.గుర్రాజు, ఎలక్ట్రీషియన్ ప్రసన్న, ఏఈ కుటుంబరావు, ధర్మకర్తల మండలి సభ్యులైన చింతా సింహాచలం, కట్టా సత్తెయ్యతో పాటు హోంగార్డు, సెక్యూరిటీ ఎస్‌ఓ, ఎస్పీఎఫ్ సిబ్బంది సభ్యులుగా ఉంటారు. గతంలో తలనీలాలను భద్రపరిచే క్రమంలో పలు ఆరోపణలు, వివాదాలు చోటు చేసుకోవడంతో దేవస్థానం ఈ దఫా అటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఈ కమిటీని ఏర్పాటు చేసింది.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు పేర్ని నాని, కైలే అనిల్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు

కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

పామర్రు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29వ తేదీన పామర్రులో పర్యటించనున్న నేపథ్యంలో పటిష్ట ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనపై ఎమ్మెల్యేలు పేర్ని వెంకట్రామయ్య(నాని), కైలే అనిల్ కుమార్‌తో కలిసి జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించి సమీక్షించారు. తొలుత బందరు మార్గంలో ఉన్న పొలాల్లో హెలిప్యాడ్ కోసం ఎంపిక చేసిన స్థలంలో జరుగుతున్న పనులను ఎమ్మెల్యేలు, కలెక్టర్ పరిశీలించారు. సమయం తక్కువగా ఉన్నందున యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని స్పష్టంచేశారు. అనంతరం ఆరేపల్లి కల్యాణ మండపంలో కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్లుగా ఇంటర్, డిగ్రీ తదితర కోర్సుల విద్యార్థులకు జగనన్న విద్యా దీవెన పథకం కింద ఫీజు పూర్తిగా తిరిగి చెల్లిస్తోందన్నారు. 2023–24 సంవత్సరానికి విద్యా దీవెన పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభిస్తారని తెలిపారు. ఈ సమావేశానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా మంచినీరు, మజ్జిగ, ఆహారం తదితర ఏర్పాట్లు పటిష్టంగా చేయాలన్నారు. పార్కింగ్ ప్రదేశాలు, సభాస్థలి వద్ద, రోడ్ షో మార్గంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీస్ బందోబస్తును పటిష్టంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సాంఘిక సంక్షేమ, సాధికారత అధికారి షాహిద్ బాబు, కృష్ణా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ బ్రహ్మచారి, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు పి.ఎస్.ఆర్.ప్రసాద్, జి.వి.సూర్యనారాయణ, పలువురు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా...

చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 29వ తేదీన పామర్రు రానున్నారు. ఆ రోజు ఉదయం 10.10 గంటలకు తాడేపల్లి తన క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి బయలు దేరుతారు. 10.30 గంటలకు పామర్రు చేరుకుంటారు. అనంతరం హెలిప్యాడ్ వద్ద ప్రజా ప్రతినిధులను కలుస్తారు. హెలిప్యాడ్ నుంచి పామర్రులోని బీఎస్ఎన్ఎల్ ఆఫీస్ వెనుక వైపు ఏర్పాటు చేసిన సభాస్థలికి చేరుకుంటారు. అనంతరం వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారు. జగనన్న విద్యా దీవెన వీడియో చిత్రీకరణ ప్రదర్శనను తిలకించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మధ్యాహ్నం 12.50 నుంచి 1.50 గంటల వరకు స్థానిక ప్రజాప్రతినిధులను కలుస్తారు. మధ్యాహ్నం 1.55 గంటలకు పామర్రు నుంచి బయలుదేరి 2.25 గంటలకు తాడేపల్లి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

పేదల సొంతింటి కల సాకారమే లక్ష్యం



లబ్ధిదారుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్. చిత్రంలో కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

- రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్
- ఉయ్యూరులో టిడ్కో లబ్ధిదారులతో సమావేశం
- జూలైలో లబ్ధిదారులతో గృహప్రవేశాలు చేయిస్తాం



టిడ్కో గృహాలను పరిశీలిస్తున్న మంత్రి జోగి రమేష్, టిడ్కో ఎండీ శ్రీధర్‌కుమార్, కలెక్టర్ రాజాబాబు

ఉయ్యూరు(పెనమలూరు): రాష్ట్రంలో పేదల సొంత ఇంటి కల సాకారం చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. ఉయ్యూరులో చేపట్టిన టిడ్కో ఇళ్ల నిర్మాణాలను నాలుగు నెలల్లో పూర్తి చేసి లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయిస్తామని పేర్కొన్నారు. ఉయ్యూరు మండలంలోని గండిగుంట, మునిసిపాలిటీ పరిధిలోని నిర్మాణంలో ఉన్న టిడ్కో గృహాల సముదాయాలను సోమవారం టిడ్కో ఎండీ శ్రీధర్‌కుమార్, కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబుతో కలిసి ఆయన సందర్శించారు. ఇళ్ల నిర్మాణ పనులను పరిశీలించి సమీక్షించారు. అనంతరం ఉయ్యూరులో లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో లక్షలాది టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు అందించామన్నారు. జగనన్న కాలనీలు ఏర్పాటు చేసి పేదల సొంతింటి కల నెరవేరుస్తున్నామని వివరించారు. ఉయ్యూరులో టిడ్కో గృహాల సమస్యను తనకు చెప్పిన వెంటనే కార్యాచరణ చేపట్టామన్నారు. 365 చదరపు గజాల గృహాలకు లబ్ధిదారులు చెల్లించిన రూ.50 వేలలో రూ.25 వేలు, 435 చదరపు గజాల గృహాలకు చెల్లించిన రూ.లక్షలో రూ.50 వేలను తమ ప్రభుత్వం తిరిగి ఇస్తోందన్నారు. ఉయ్యూరులో లబ్ధిదారులకు పది రోజుల్లో సొమ్ము అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తగా వివాహం జరిగిన జంటలకు జగనన్న లేఅవుట్లలో ఎక్కడ ఖాళీ ఉంటే అక్కడ ఇంటి స్థలం కేటాయిస్తామన్నారు. లబ్ధిదారుల ఖాతాలోకి బ్యాంకులు జమ చేస్తున్న సొమ్ము తిరిగి ఇప్పించాలని ఆదేశించారు. 70 ఏళ్ల వయస్సు వారికి టిడ్కో గృహాలు మంజూరయ్యేలా ఉత్తర్వులు సడలించామన్నారు. టిడ్కో ఎండీ శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ లబ్ధిదారుల సమస్యలన్నీ పరిష్కరిస్తామన్నారు.

కాంట్రాక్టర్ వల్లే జాప్యం

కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ.. కాంట్రాక్టరు సకాలంలో నిర్మాణాలు పూర్తిచేయకపోవటంతోనే గృహాల కేటాయింపులో జాప్యం జరిగిందన్నారు. లబ్ధిదారులు తీసుకున్న రుణాలపై మారటోరియం గడువు పెంచుతామన్నారు. లీడ్ బ్యాంకు మేనేజర్‌తో మాట్లాడి వాయిదాలు వసూలు చేయకుండా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో టిడ్కో డైరెక్టర్ పి.రాఘవరావు, ప్రాజెక్టు జిల్లా అధికారి చిన్నోడు, ఆర్డీఓ రాజు, మునిసిపల్ కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్లు సోలే సురేష్‌బాబు, అర్షతున్నీసా బేగం, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు, ప్రభుత్వాస్పత్రి చైర్మన్ జంపాన కొండలరావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు షేక్ అబుకలాం, మండల అధ్యక్షుడు దాసే రవి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

స్పందనలో 184 అర్జీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): స్పందన అర్జీలను గడువులోగా పరిష్కరించాలని అధికారులను డీఆర్వో వి.శ్రీనివాసరావు ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. డీఆర్వో శ్రీనివాసరావు ప్రజల నుంచి 184అర్జీలు స్వీకరించారు. ఆ అర్జీల ఆయా శాఖల అధికారులకు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అత్యధికంగా రెవెన్యూకు సంబంధించి 85 అర్జీలు అందాయి. పోలీస్ 22, ఎంఏయూడీ 13, ఏపీసీపీడీసీఎల్ 11, మిగిలినవి సర్వే, హెల్త్ , వ్యవసాయం, హౌసింగ్, ఎంప్లాయిమెంట్, సివిల్ సప్లయీస్, విద్య, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ట్రెజరీ, యానిమల్ హజ్‌బెండరీ, మార్కెటింగ్, కో ఆపరేటివ్, ఆరోగ్య శ్రీ, డిజేబుల్డ్, బీసీ కార్పొరేషన్, ఆర్టీసీ, డీఆర్‌డీఏ, ఫారెస్ట్, మైనార్టీ శాఖలకు సంబంధించిన అర్జీలు.

దుర్గా.. జయం జయం

- 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' ప్రారంభం
- ఆద్యంతం దుర్గమ్మను కీర్తిస్తూ సాగిన కార్యక్రమం
- తరలివచ్చిన సాహితీవేత్తలు



మహాశతావధానం నిర్వహిస్తున్న మాడుగుల నాగఫణిశర్మ



తెలుగుతల్లి విగ్రహం వద్ద మాడుగుల నాగఫణిశర్మ, ఎమెల్యే మల్లాది విష్ణు, కలెక్టర్ ఢిల్లీరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జయం.. దుర్గా.. అంటూ దుర్గమ్మను కీర్తిస్తూ ప్రఖ్యాత సహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం'ను ప్రారంభించారు. తెలుగు వారి సాహిత్య వైభవాన్ని ఆవిష్కరించే అవధానంలో డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ తెలుగు భాష మాధుర్యాన్ని చాటి చెప్పారు. ప్రతి పదంలోనూ తెలుగు ఔన్నత్యాన్ని వివరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఆంధ్ర ప్రదేశ్ దేవదాయ, ధర్మదాయ శాఖ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ తుమ్మలపల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో ఐదు రోజుల పాటు కొనసాగే 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' సోమవారం ప్రారంభమైంది. తొలుత 30 మంది పృచ్ఛకులతో దత్తపదిని ప్రారంభించి ఆ తరువాత సమస్యా పూరణం, వర్ణాలు, ఆశువులు, స్వరపది, మీ స్వరానికి నా పాట తదితర అవధాన ఘట్టాలను నిర్వహించారు. శ్రీదుర్గామల్లేశ్వరుల వైభవాన్ని చాటుతూ సాగిన అవధానం ఆద్యంతం ప్రేక్షకులను తన్మయులను చేసింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన సాహితీవేత్తలు పృచ్ఛకులుగా సంధించిన అంశాలకు అవధానిగా నాగఫణిశర్మ ధారణతో దీటుగా బదులిచ్చి ఆకట్టుకున్నారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ పాలపర్తి శ్యామలానందప్రసాద్, సినీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు, డాక్టర్ కె.సాజన్యలక్ష్మి, మా శర్మ, పి.వి.జ్యోతి, సింగం లక్ష్మీనారాయణ, డాక్టర్ శామనపూడి వెంకటేశ్వరరావు వంటి సాహితీవేత్తలు అలరించారు. స్వరపదిలో భాగంగా సంగీత కళాకారుడు పోపూరి గౌరీనాథ్ ఆధ్వర్యంలో సంగీత కళాకారులు అడిగిన స్వరాలకు సైతం నాగఫణిశర్మ అవధాన ప్రక్రియలో బదులిచ్చి మెప్పించారు. కార్యక్రమంలో దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఆలయ కార్యనిర్వహణాధికారి కె.ఎస్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలు కేంద్రబిందువులు కావాలి

సాహిత్యం, సంస్కృతి, భాషా వికాసాలకు దేవాలయాలు కేంద్ర బిందువులుగా ఉండాలని అతిథిగా హాజరైన రాష్ట్ర హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాద్ ఆకాంక్షించారు. 'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' అమ్మవారి కీర్తిని మరింతగా వివరిస్తూ పండిత, పామరులను సైతం అలరిస్తుందన్నారు. ఇదే స్ఫూర్తితో మునుముందు మరిన్ని కార్యక్రమాలు జరగాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వాన్ని అభినందిస్తున్నా

'శ్రీ దుర్గా సౌందర్యలహరి మహాశతావధానం' వంటి ఐదు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రభుత్వాన్ని అభినందిస్తున్నానని ప్రముఖ సినీ కవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. ఇటువంటి కార్యక్రమాలు జాతి వైభవాన్ని చాటే సాధనాలని కొనియాడారు. అవధానం తెలుగు వారికి మాత్రమే ఉన్న గొప్ప ప్రక్రియ అని, అటువంటి ప్రక్రియను జగద్విఖ్యాతం చేసిన మాడుగుల నాగఫణిశర్మతో తాను అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నానని చెప్పారు. నాగఫణిశర్మ ప్రతి పదం సామాజిక స్పృహను కలిగించే సాధనమన్నారు. ఇటువంటి కార్యక్రమాలను ప్రభుత్వం మరిన్ని చేపట్టాలని ఆకాంక్షించారు.

కవి నిరంతర లోకహితుడు

కవి నిరంతర లోకహితుడని ద్విసహస్రావధాని డాక్టర్ మాడుగుల నాగఫణిశర్మ అన్నారు. కవి నుంచి వచ్చే సాహిత్యం కల్పవృక్షం వంటిదన్నారు. సమాజాన్ని జాగృతం చేసే సాహిత్యం అన్ని రకాలుగా లోకహితానికి బాసటగా నిలుస్తుందన్నారు. దుర్గమ్మ ఆలయం, ఏపీ ప్రభుత్వం ఈ చక్కని కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ముందుకు రావటం అభినందనీయమని పేర్కొన్నారు.

'పల్స్ పోలియో'ను విజయవంతం చేయండి

కృష్ణా జేసీ గీతాంజలి శర్మ



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గీతాంజలిశర్మ

చిలకలపూడి(మచిలీపట్నం): మార్చి మూడో తేదీన జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కృష్ణా జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఆదేశించారు. ఈ కార్యక్రమంపై సంబంధిత అధికారులు, సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. జేసీ గీతాంజలి శర్మ మాట్లాడుతూ.. ఐదు సంవత్సరాల్లోపు పిల్లలకు మామూలుగా వేసే పోలియో చుక్కలతో పాటు అదనంగా ఈ పోలియో చుక్కల మందు వేయటం ద్వారా పోలియో వైరస్‌ను వ్యాపించకుండా అడ్డుకోవచ్చని సూచించారు. అప్పుడే పుట్టిన పిల్లలు మొదలు ఐదేళ్లలోపు పిల్లలు అందరికీ పోలియో చుక్కల మందు తప్పనిసరిగా వేయించాలన్నారు. వైద్య, ఆరోగ్య శాఖ, ఇతర శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.గీతాబాయి మాట్లాడుతూ.. జిల్లాలో ఐదు సంవత్సరాల్లోపు వయసు పిల్లలు 1,39,180 మంది ఉన్నారని తెలిపారు. వారందరికీ చుక్కల మందు వేస్తామన్నారు. పల్స్ పోలియో బూత్‌ల వద్ద పోలియో చుక్కలు వేయించుకోని వారికి మరుసటి రోజు నుంచి మూడు రోజుల పాటు గృహసందర్శన ద్వారా పోలియో చుక్కల మందు వేస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసు, డీఆర్డీఏ పీడీ పి.ఎస్.ఆర్.ప్రసాద్, ఐసీడీఎస్ పీడీ ఎస్.సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రేపు విజయవాడ సిటీ లెవల్ ఆర్చరీ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్:ఖేలో ఇండియా ఎన్టీపీసీ విజయవాడ సిటీ లెవల్ ఆర్చరీ టోర్నమెంట్ ఈ నెల 28వ తేదీన విజయవాడలోని ఓల్గా ఆర్చరీ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ఆర్చరీ అసోసియేషన్ కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ తెలిపారు. అండర్-9, 14, సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో రికర్వ్, కాంపౌండ్ ఇండియన్ రౌండ్ కేటగిరీలలో పోటీలు జరుగుతాయన్నారు. ఆర్చరీ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, ఎన్టీపీసీ, ఏపీ ఆర్చరీ అసోసియేషన్, ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి ఉన్న క్రీడాకారులు ఆ రోజు ఉదయం ఏడు గంటలకు మహానాడు రోడ్డులోని వీఎంసీ ఓల్గా ఆర్చరీ అకాడమీలో రెండు పాస్ పోర్టు సైజు ఫొటోలు, జనన ధ్రువీకరణ పత్రాలతో సంప్రదించాలని సూచించారు.

పదవి పోతేనే బీసీలు గుర్తుకు వస్తారా?

లబ్బీపేట(విజయవాడతూర్పు): తాము అధికారంలో ఉండగా తమ జాతిని విస్మరించే బీసీ ప్రజా ప్రతినిధులు, వారికి పదవి పోయినప్పుడో, అన్యాయం జరిగినప్పుడో మాత్రమే బీసీ అంటూ కులం గుర్తుకు రావడం బాధాకరమని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు అన్నారు. విజయవాడలోని తమ సంఘ ఉద్యోగ విభాగం కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పదవి పొందే వరకూ బీసీల అభ్యున్నతే లక్ష్యం అని చెప్పే నేతలు, పదవి పొందిన తర్వాత బీసీలను విస్మరిస్తున్నారన్నారు. ఎన్నికల్లో కోట్లు ఖర్చు చేసే నాయకులు సంఘాలకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు.

సెమీఫైనల్స్‌లో వీఆర్ సిద్ధార్థ జట్టు గెలుపు

- కంచికచర్లలో ఆసక్తిగా సాగుతున్న జేఎన్టీయూకే సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్
- నేడు సీఆర్ రెడ్డి, వీఆర్ సిద్ధార్థ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మిక్ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వంశీకిరణ్

కంచికచర్ల: కంచికచర్ల మిక్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీలో జేఎన్టీయూ కాకినాడ సెంట్రల్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ సెమీ ఫైనల్ పోటీలు జరుగుతున్నాయని టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నిమ్మగడ్డ శౌరయ్య సోమవారం తెలిపారు. సెమీ ఫైనల్స్‌లో వీఆర్ సిద్ధార్థ(కానూరు), విష్ణు ఇంజినీరింగ్ కాలేజీ (భీమవరం) జట్టు తలపడ్డాయి. ముందుగా కళాశాల మెకానికల్ హెచ్‌ఓడీ డాక్టర్ శివారెడ్డి టాస్ వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. టాస్ గెలిచిన విష్ణు కాలేజీ జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 109 పరుగులు మాత్రమే చేయగలిగింది. వీఆర్ సిద్దార్థ బౌలర్ సృజన్ 4 ఓవర్లు వేసి 18 పరుగులు ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టి బ్యాట్స్‌మెన్‌లను కట్టడి చేశారు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన వీఆర్ సిద్దార్థ జట్టు 17 ఓవర్లకే 110 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది. బ్యాట్స్‌మెన్ శశిధర్ 30 పరుగులు చేసి జట్టు విజయానికి తోడ్పడ్డాడు. దీంతో జట్టు ఫైనల్స్‌కు చేరింది. రెండవ సెమీ ఫైనల్‌మ్యాచ్ ఎన్ఆర్ఐ ఇంజినీరింగ్ కళాశాల(ఆగిరిపల్లి)జట్టు సీఆర్ రెడ్డి ఇంజినీరింగ్ కళాశాల(ఏలూరు)జట్ల మధ్య జరిగింది. టాస్ గెలిచిన సీఆర్ రెడ్డి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 118 పరుగులు సాధించింది. జట్టు సభ్యుడు సంజయ్ 40 పరుగులు తీశాడు. ఆ తర్వాత బ్యాటింగ్ ప్రారంభించిన ఎన్ఆర్ఐ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 105 పరుగులు మాత్రమే చేసింది. దీంతో సీఆర్ రెడ్డి జట్టు 13 పరుగుల తేడాతో విజయం సాధించింది. మంగళవారం ఫైనల్ మ్యాచ్ వీఆర్ సిద్దార్థ, సీఆర్ రెడ్డి జట్ల మధ్య జరుగుతుందని శౌరయ్య తెలిపారు.

ప్రభుత్వం దృష్టికి కేబుల్ ఆపరేటర్ల సమస్యలు

ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, గౌతంరెడ్డి


వెలంపల్లి, గౌతంరెడ్డిలకు వినతి పత్రం అందజేస్తున్న కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కేబుల్ అపరేటర్ల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం నుంచి సానుకూల నిర్ణయం వస్తుందని ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ పూనూరు గౌతంరెడ్డి , పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. అలంకార్ సెంటర్ లోని ధర్నా చౌక్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మల్టీ సర్వీసెస్ కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆపరేటర్ల మహాసభ జరిగింది. ఈ మహాసభలో పోల్ టాక్స్ కారణంగా కేబుల్ ఆపరేటర్లు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. కేబుల్ ఆపరేటర్లు నిర్వహించిన మహాసభలో ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఏపీఎస్ఎఫ్ఎల్ చైర్మన్ గౌతంరెడ్డి పాల్గొన్నారు. ఆపరేటర్లు తమ సమస్యలను వారికి విన్నవించారు. ఈ సందర్భంగా వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇప్పటికే ఆపరేటర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, సమస్య పరిష్కారం కోసం ఓ కమిటీని వేశామన్నారు, సీఎం వైఎస్ జగన్ మాట ఇస్తే కచ్చితంగా నెరవేరుస్తారన్నారు. అనంతరం గౌతం రెడ్డి మాట్లాడుతూ కేబుల్ అపరేటర్లు పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతమని, పోల్ టాక్స్ రద్దు చేయాలని కేబుల్ రంగాన్ని ఓక ఇండస్ట్రీ గా గుర్తించాలని, ఎస్వీబీసీ చానల్‌ను ప్రసారం చేస్తున్న వారికి ఉచితంగా శ్రీవారి దర్శనం కల్పించాలని కేబుల్ ఆపరేటర్ల సంక్షేమ సంఘం కోరుతోందని చెప్పారు. కేబుల్ రంగం మీద పూర్తి అవగాహన ఉన్న ముఖ్యమంత్రి మంచి నిర్ణయం తీసుకుంటారని చెప్పారు. కార్యక్రమంలో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కృష్ణారెడ్డి , వైస్ ప్రెసిడెంట్‌లు సన్యాసి నాయుడు , ఉదయ భాస్కర్‌కుమార్, నరసింహ, కేబుల్ ఆపరేటర్లు , ఎంఎస్ఓలు పాల్గొన్నారు.

29న సీఎం సభ విజయవంతం చేయండి


సభాస్థలి వద్ద అధికారులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి పేర్ని నాని

పామర్రు: విద్యార్థులకు మరోసారి జగనన్న విద్యా దీవెనను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందించేందుకు ఈనెల 29వ తేదీన నిర్వహించే బహిరంగ సభను ప్రజలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని పామర్రు, మచిలీపట్నం శాసన సభ్యులు కైలే అనిల్‌కుమార్, పేర్ని వెంకట్రామయ్య(నాని) పేర్కొన్నారు. స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కనే ఉన్న స్థలంలో నిర్వహించే బహిరంగ సభ పనులను వారు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఉన్న 13 జిల్లాలలోని అర్హులైన విద్యార్థుల తల్లుల అకౌంట్‌లకు జగనన్న విద్యా దీవెన నగదుని సీఎం బటన్ నొక్కి జమ చేస్తారని చెప్పారు. పామర్రు నియోజకవర్గంలోని విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజలు అందరూ ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈనెల 29వ తేదీన ఉదయం 9 గంటల నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని చెప్పారు.

కౌంటింగ్ కేంద్రాల ప్రతిపాదనలు పంపాం

రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు


రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సాధారణ ఎన్నికలకు డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, స్ట్రాంగ్ రూమ్, పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలకు ప్రతిపాదనలను రూపొందించి ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఎన్నికల ప్రక్రియ, తుది ఓటర్ల జాబితాపై సోమవారం జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు రాజకీయ పార్టీల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రానున్న సాధారణ ఎన్నికలను అత్యంత పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాలకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించి ఎన్నికల సంఘానికి సమర్పించినట్లు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు.

- తిరువూరు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి తిరువూరు జిల్లా పరిషత్ గరల్స్ హైస్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఇంటర్మీడియెట్ స్ట్రాంగ్ రూమ్, ఇబ్రహీంపట్నం జూపూడిలోని నోవా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్ట్రాంగ్ రూం, కౌంటింగ్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు.
- విజయవాడ పశ్చిమ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి గాంధీ మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఇబ్రహీంపట్నం జూపూడి లోని నోవా కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం.
- విజయవాడ సెంట్రల్ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఇబ్రహీంపట్నం జూపూడి లోని నోవా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం.
- విజయవాడ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి పటమట ఎస్ఎస్ఎం పబ్లిక్ స్కూల్‌లో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఇబ్రహీంపట్నం జూపూడి లోని నోవా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం.
- మైలవరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి మైలవరం లక్కిరెడ్డి లక్ష్మీరెడ్డి ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్, ఇబ్రహీంపట్నం జూపూడి లోని నిమ్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ కళాశాలలో రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం.
- నందిగామ అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి నందిగామ కేవీఆర్ కళాశాలలో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఇంటర్మీడియెట్ కాలేజీలో స్ట్రాంగ్ రూమ్, ఇబ్రహీంపట్నం జూపూడి లోని నోవా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం.
- జగ్గయ్యపేట అసెంబ్లీ నియోజకవర్గానికి పట్టణంలోని జీవీజే బాలుర హైస్కూల్ లో డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్, ఇంటర్మీడియెట్ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, ఇబ్రహీంపట్నం జూపూడి లోని నోవా కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం.

సమావేశంలో కలెక్టరేట్ ఏఓ సీహెచ్ నాగలక్ష్మి, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గా ప్రసాద్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు వినికిడి యంత్రాలు ఉచితంగా పంపిణీ

హాజరు కానున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినికిడి యంత్రాల ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని దీనదయాళ్ శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగల రామాంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి త్రిపుర గవర్నర్ ఎస్.ఇంద్రసేనారెడ్డి, రిటైర్డ్ డీజీపీ ఎం. మాలకొండయ్య, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ డైరెక్టర్ తోట సర్వారాయుడు, రామినేని ఫౌండేషన్ కన్వీనర్ పాతూరి నాగభూషణం, హరేకృష్ణ గోకుల క్షేత్రం ఉపాధ్యక్షుడు విలాస విగ్రహ దాస స్వామి, బీజేపీ గుంటూరు జిల్లా ఇన్‌చార్జి వి.శ్రీనివాసరాజు, ఆర్ఎస్ఎస్ విజయవాడ విభాగ్ ప్రచారక్ డి.నవీన్ హాజరై వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తారని తెలియజేశారు. వినికిడి లోపం లేని రాష్ట్రాన్ని, దేశాన్ని చూడాలనే లక్ష్యంతో తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో శిబిరాలు నిర్వహించి యంత్రాల అవసరం ఉన్న వారిని గుర్తించి వారికి ఉచితంగా వినికిడి యంత్రాలను పంపిణీ చేస్తున్నామని రామాంజనేయులు వివరించారు.

వీఆర్ సిద్ధార్థలో 28,29 తేదీల్లో ఎఫోసెక్-2024


ఎఫోసెక్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ రత్నప్రసాద్, అధ్యాపకులు

పెనమలూరు: వికసిత్ భారత్ -2047 లక్ష్యంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్‌కాలేజీలో ఈ నెల 28, 29 తేదీల్లో జాతీయ స్థాయిలో ఎఫోసిక్ -2024 సాంకేతిక, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తున్నామని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్ తెలిపారు. కాలేజీలో సోమవారం ఎఫోసిక్-2024 పోస్టర్‌ను ఆవిష్కరించి విలేకరులకు వివరాలు తెలిపారు. ఈ పోటీల్లో ఇప్పటివరకు సాంకేతిక పోటీలకు 3 వేల మంది, లిటరేచర్, కల్చరల్ పోటీలకు 800 మంది పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారని తెలిపారు. వికసిత్ భారత్ లక్ష్యంగా ఈ పోటీల్లో ఐడియాతాన్, ప్రాజెక్టు ఎక్స్‌పో ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయని అన్నారు. ఇప్పటివరకు ఇన్నోవేషన్ మోడల్స్ 40, టెక్నికల్ పేపర్స్ 70 వచ్చాయన్నారు. విజేతలకు రూ.5 లక్షలు ప్రైజ్ మనీ ఇస్తామన్నారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ డి.రాజేశ్వరరావు మాట్లాడుతూ రోబోరేస్, పోస్టర్ ప్రెజెంటేషన్, పత్ర సమర్పణ, కోడింగ్ పలు సాంకేతిక పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మైక్రోసాఫ్ట్ సీనియర్ డైరెక్టర్ బొల్లేపల్లి మాధవి, కాగ్నిజెంట్ హెచ్ఆర్ మేనేజర్ జితేందర్‌సింగ్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారన్నారు. సమావేశంలో కాలేజీలో వివిధ విభాగాల అధిపతులు డీన్ బావినేని పాండురంగారావు, ఎంవీఎస్ రాజు, చావా శ్రీనివాస్, నరసింహస్వామి, ప్రవీణ్, అధ్యాపకులు, ఎఫోసెక్ ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

అడ్వాన్స్ మొత్తాన్ని వడ్డీతో చెల్లించండి

చిలకలపూడి(మచిలీపట్నం): వినియోగదారుడు అడ్వాన్స్‌గా చెల్లించిన మొత్తాన్ని వడ్డీతో సహా చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల సోమవారం తీర్పు చెప్పారు. మచిలీపట్నంకు చెందిన బీఎస్ కిరణ్‌పాల్ విజయవాడలో రాధామాధవ్ టయోటా డీలర్‌కు రూ.11 లక్షలు అడ్వాన్స్‌గా చెల్లించి ఇన్నోవా కారును బుక్ చేశారు. నెలలు గడుస్తున్నప్పటికీ కారును డెలివరీ ఇవ్వకపోవటంతో ఆయన వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. వినియోగదారుల కమిషన్ సభ్యులు విచారించిన మీదట కిరణ్‌పాల్ అడ్వాన్స్‌గా చెల్లించిన రూ.11 లక్షలు 2022 మార్చి 9వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.25వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10వేలు తీర్పు వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

బీమా మొత్తాన్ని చెల్లించండి

ఖాతాదారునికి వడ్డీతో సహా బీమా మొత్తాన్ని చెల్లించాలని వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు చింతలపూడి కిషోర్‌కుమార్, సభ్యులు నందిపాటి పద్మారెడ్డి, శ్రీలక్ష్మీరాయల సోమవారం తీర్పు చెప్పారు. గుడివాడకు చెందిన అట్లూరి మోతీలాల్ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, జగ్గయ్యపేట శాఖలో 2013 నుంచి సేవింగ్స్ ఖాతా కలిగి ఉన్నాడు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ద్వారా ఇన్సూరెన్స్ నిమిత్తం సంవత్సరానికి రూ.12 చొప్పున ఆయన ఖాతా నుంచి 2021, 2022లో కట్ చేశారు. మోతీలాల్ ద్విచక్రవాహనం నడుపుతూ ప్రమాదానికి గురయ్యారు. కుడికాలు తొలగించాల్సి రావటంతో ఇన్సూరెన్స్ కంపెనీని ఆశ్రయించారు. కారణాలు చెప్పకుండా కాలయాపన చేస్తుండటంతో మోతీలాల్ వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. ఈ విషయంపై కమిషన్ సభ్యులు విచారించి ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద లక్ష రూపాయలు 2023 జనవరి 9వ తేదీ నుంచి 9 శాతం వడ్డీతో చెల్లించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకు రూ.25 వేలు, ఖర్చుల నిమిత్తం రూ.10వేలు తీర్పు వెలువడిన తేదీ నుంచి 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశించారు.

పోలీస్ స్పందనలో 91 ఫిర్యాదులు


స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీసీపీ శ్రీనివాసరావు

విజయవాడస్పోర్ట్స్: పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన స్పందనలో ప్రజల నుంచి 91 ఫిర్యాదులు స్వీకరించినట్లు రూరల్ డీసీపీ కె.శ్రీనివాసరావు తెలిపారు. కుటుంబ కలహాలపై 16, నగదు లావాదేవీలపై 23, ఆస్తి వివాదాలపై 17, మోసాలపై 9, ఇతర వివాదాలపై 26 ఫిర్యాదులు అందినట్లు చెప్పారు. బాధితులతో నేరుగా మాట్లాడినట్లు వివరించారు. ఫిర్యాదులను నిర్ణీత కాల వ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత స్టేషన్ అధికారులకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

నమ్మక ద్రోహులకు ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదు

డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



కంకిపాడు: కన్నతల్లి లాంటి పార్టీకి వెన్నుపోటు పొడిచి, ప్రజల్ని వంచించిన నమ్మక ద్రోహులకు ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదని డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ అన్నారు. ఆమె సోమవారం కంకిపాడులో విలేకరులతో మాట్లాడారు. జగనన్నపై నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి ఎమ్మెల్యేని చేస్తే నమ్మకద్రోహం చేసి పార్థసారథి టీడీపీలో చేరటం హేయమన్నారు. నాలుగున్నరేళ్లు పదవి అనుభవించి, ఆయన అనుచరులకు పదవులు కట్టబెట్టి అవినీతి, అక్రమాలకు పాల్పడటం నిజం కాదా అని ప్రశ్నించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల్లోనూ ఎమ్మెల్యే, ఆయన అనుచరులు అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగుతుందంటూ పార్థసారథి విమర్శ చేయటం దిగజారుడు రాజకీయానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమాన్ని చూసి ఓర్వలేక, జగనన్నపై బురద చల్లుతున్నారని మండిపడ్డారు. నమ్మక ద్రోహం చేసిన వ్యక్తులకు ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదని, ప్రజలు గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు.

27 నుంచి ఏపీ టీఈటీ పరీక్షలు

చిలకలపూడి(మచిలీపట్నం): జిల్లాలో ఈ నెల 27 నుంచి మార్చి 6వ తేదీ వరకు టీఈటీ-2024 పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి తాహెరాసుల్తానా సోమవారం తెలిపారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5గంటల వరకు నిర్వహిస్తారన్నారు. జిల్లాలో 24వేల మంది అభ్యర్థులు హాజరవుతున్నారని చెప్పారు. ఈ పరీక్షలు డీఎంఎస్ అండ్ ఎస్‌వీహెచ్ ఇంజినీరింగ్ కళాశాల (మచిలీపట్నం), వాసవీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాల(నందమూరు), శేషాద్రిరావు ఇంజినీరింగ్ కళాశాల (గుడ్లవల్లేరు), అయాన్ డిజిటల్ (కానూరు), శైలేష్ ఇన్‌స్టిట్యూట్ అండ్ టెక్నాలజీ (కానూరు)లో జరుగుతాయని తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి గంట ముందుగా హాజరుకావాలన్నారు. పరీక్ష జరిగే తేదీల్లో డీఈవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని, ఫోన్ నంబర్ 97008 82034ను సంప్రదించాలన్నారు.

బైక్ దొంగ అరెస్టు



ఉయ్యూరు: బైక్ దొంగను ఉయ్యూరు పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. తిరునాళ్లలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించటంతో బైక్‌ల దొంగతనం వెలుగుచూసింది. ఉయ్యూరు సీఐ హబీబ్ బాషా తెలిపిన వివరాల ప్రకారం... ఉయ్యూరు పట్టణంలో కొంతకాలంగా బైక్‌లు చోరీకి గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కంకిపాడుకు చెందిన తెన్నేరు రాఘవరావు తిరునాళ్లలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా పోలీసు నిఘా బృందం అతడిని అదుపులోకి తీసుకుని విచారించింది. రాఘవరావు పాత నేరస్తుడు కావటంతో అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టడంతో ఆరు బైక్‌లు చోరీ చేసినట్లు తేలింది. బైక్‌లను స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు. సమావేశంలో ఎస్ఐ గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ తోక పార్టీగా జనసేన

వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ పరిశీలకుడు రామ్‌సుధీర్



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జనసేన పార్టీ తెలుగుదేశం పార్టీకి తోక పార్టీగా తయారైందని, కాపు కులస్తులను తెలుగుదేశం పార్టీ జెండా మోసే కూలీలుగా జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ మార్చాడని వైఎస్సార్‌సీపీ పెనమలూరు నియోజకవర్గ పరిశీలకుడు, వైఎస్సార్‌సీపీ కాపు జేఏసీ నాయకుడు రామ్ సుధీర్ ఆరోపించారు. విజయవాడలోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనసేనలో ఉన్న నాయకులు, కార్యకర్తలను పవన్ కల్యాణ్ తీసుకువెళ్లి చంద్రబాబునాయుడు కాళ్ల దగ్గర పెట్టాడని ధ్వజమెత్తారు. టీడీపీ, జనసేన ముసుగు రాజకీయాలు నమ్మి కాపులు మోసపోవద్దని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉందామని పిలుపిచ్చారు.

పవన్ ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పు?

- రాష్ట్రంలో కౌలు రైతులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున ఇస్తానని ప్రకటన చేశావు, ఎంత మందికి ఇచ్చావు, కౌలు రైతులకు సహాయం పేరుతో ఎంత ఫండ్ వసూలు చేశావు.
- వారాహి యాత్ర ఏమైంది, చంద్రబాబు ఎక్కడ నిర్వహించమంటే అక్కడ నిర్వహించావు, వారాహి యాత్ర నిర్వహణకు ఎవరి దగ్గర ఎంత వసూలు చేశావు.
- జనసేన పార్టీ సభ్యత్వం, ప్రమాదబీమా పేరుతో ప్రతి కార్యకర్త నుంచి రూ.500 చొప్పున ఎంత మంది దగ్గర వసూలు చేశావు. ఆ నిధులను ఏంచేశావు.
- చంద్రబాబు దగ్గర పవన్ కల్యాణ్ రూ.750 కోట్ల ప్యాకేజ్ తీసుకున్నావా లేదా.

తాను జనసేన పార్టీలో కష్టపడి పనిచేశానని, అందువలనే తనకు పవన్‌ను ప్రశ్నించే హక్కు తనకు ఉందని రామ్‌సుధీర్ అన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి కోట్లాది రూపాయలను జనసేన నాయకులు వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

క్లుప్తంగా

186 మంది దివ్యాంగులు ఉద్యోగాలకు ఎంపిక

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): మాచవరంలోని తమ సంస్థ ఆధ్వర్యాన సోమవారం నిర్వహించిన జాబ్‌మేళాలో 186 మంది విభిన్న ప్రతిభావంతులకు వివిధ ప్రైవేటు కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారని గ్రో పీడబ్ల్యూడీ సంస్థ మేనేజర్ జైగణేష్ చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి మొత్తం 310 మంది విభిన్న ప్రతిభావంతులు హాజరయ్యారని, వారికి ప్రైవేటు కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేశారని తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తుంటామని, ఉద్యోగాలు అవసరమైన విభిన్న ప్రతిభావంతులు 73311 49646లో సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ప్రజాకాపునాడు 15వ డివిజన్‌కు కమిటీ



లబ్బీపేట/ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం 15వ డివిజన్ కమిటీని నియమించినట్లు ఆ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు తెలిపారు. డివిజన్ అధ్యక్షుడిగా మల్లా నారాయణరావు, ఉపాధ్యక్షులుగా అచ్యుత సీతారామయ్య, మల్లవరపు సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా సుధాబత్తుల రాజేష్‌ను నియమించినట్లు పేర్కొన్నారు. కాపుల అభివృద్ధి, సంక్షేమానికి కృషి చేయనున్నట్లు వారు తెలిపారు. పేద కాపులకు పెళ్లి కానుక పథకాన్ని అమలు చేయాలని ఆయన కోరారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలివే

లబ్బీపేట(విజయవాడతూర్పు): మొగల్రాజపురం సెక్షన్ మహాత్మాగాంధీ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మత్తుల నిమిత్తం పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవిన్యూ కాలనీ 11 కేవీ ఫీడర్ పరిధిలోని రెవిన్యూ కాలనీ, ఏఎస్ రామారావు రోడ్డు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ రోడ్డు, కోనేరు లక్ష్మయ్య వీధి, కాంధారి రోడ్డు, పార్కురోడ్డు, రఘురామ్ వీధి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

- ఆటోనగర్(విజయవాడతూర్పు): స్క్యూ బ్రిడ్జిసెక్షన్, 11 కేవీ 10 ఎంజీడీ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజినీర్ బీవీ సుధాకర్ తెలిపారు. ఫకీర్‌గూడెం, ప్రగతినగర్, టిక్కిల్ రోడ్డు, శ్రీరామ్‌నగర్, మోహిద్దీన్‌ఎస్టేట్, బీఎస్‌ఎన్‌ఎల్ కార్యాలయం పరిధితో పాటు పోస్టాఫీస్ రోడ్డు ప్రాంతాల్లో కరెంట్‌ను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వశక్తిపై ఆధారపడితేనే మంచిపేరు



ఆటోనగర్(విజయవాడతూర్పు): మహిళలు స్వశక్తి మీద ఆధారపడి జీవించినప్పుడే సమాజంలో మంచిపేరు ఉంటుందని కోవే ఏపీ చాప్టర్ రాష్ట్ర అధ్యక్షులు రాధిక అన్నారు. మూడు రోజుల నుంచి సుమారు 150 మంది మహిళలకు కేకుల తయారీపై శిక్షణ సోమవారం ముగిసింది. ఈసందర్భంగా పిజ్జా, చిరుధాన్యాలతో బిస్కెట్ తదితర వాటిని మహిళలు తయారు చేసే విధానాన్ని నిపుణుల ద్వారా నేర్చుకున్నారు. రాధిక మాట్లాడుతూ శిక్షణలో నేర్చుకున్న తర్వాత మీ ఇంటి వద్ద నిత్యం కేక్‌లను తయారు చేస్తే ఆర్థిక ఎదుగుదలకు ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. కొందరు మహిళలు గతంలో శిక్షణ పొందినవారు సొంతంగా తయారు చేసి ఆర్డర్‌లను వేరే షాపులకు, ఫంక్షన్‌లకు కేక్‌లను తయారు చేసి లబ్ధి పొందుతున్నారన్నారు. మరి కొందరైతే బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకొని ఇంటి వద్దనే సరుకులను తయారు చేస్తూ ఆర్థికంగా కుటుంబాలు నిలదొక్కుకున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో కోవే కార్యదర్శి విజయలక్ష్మి, మోహిణి, విజయవాడ చుట్టు పక్క ప్రాంతాల మహిళలు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

కంకిపాడు: ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరమని వణుకూరు ఇండియన్ బ్యాంక్ అసిస్టెంట్ మేనేజర్ కె.నాగలక్ష్మి అన్నారు. కంకిపాడు పట్టణంలో సొసైటీ ఫర్ సోషల్ ట్రాన్స్‌ఫర్మేషన్ ఆధ్వర్యంలో ఆర్‌బీఐ వారి ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను పురస్కరించుకుని ఆర్థిక అక్షరాస్యతా ర్యాలీ సోమవారం నిర్వహించారు. స్థానికంగా ఉన్న ఎస్ఎస్ మహిత డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన సదస్సులో నాగలక్ష్మి మాట్లాడారు. ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. బ్యాంకుల్లో ఖాతాలను తెరిచి పొదుపు అలవాటు చేసుకోవాలన్నారు. ఆదాయ, వ్యయాలను సమీక్షించుకుని ఆర్థిక ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

కొండంత అభివృద్ధి



- 6వ డివిజన్...రూ.6 కోట్లతో పనులు
- టీడీపీ హయాంలో సమస్యలను పట్టించుకోని వైనం
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సమస్యలన్నీ పరిష్కారం



పునర్నిర్మాణం చేసిన బ్రహ్మానందరెడ్డి నగర్ మెయిన్ రోడ్డు



వీరన్న రోడు



కొండపైన మెట్లు, ర్యాంపు, పైప్‌లైన్

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన తర్వాత నగరంలోని కొండ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి. 'తూర్పు' పరిధిలోని 6వ డివిజన్ చాలా వరకు కొండ ప్రాంతం. ఇక్కడ టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధి సున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొండపై ధ్వంసమైన మెట్లు, ర్యాంపుల పునర్నిర్మాణంతో పాటుగా తాగునీటి సరఫరాకు నీటి పైపుల సైజులను పెంచి ఏర్పాటు చేశారు. సుమారు ఆరు కోట్ల రూపాయలతో ఆరో డివిజన్‌లోనే వివిధ అభివృద్ధి పనులు జరిగాయి.

రూ.కోటితో తాగునీటి పైపులైను మార్పిడి

డివిజన్ పరిధిలోని మారుతీనగర్, బాలభాస్కర్ నగర్ కొండ ప్రాంతాల్లో కోటి రూపాయలతో కొత్త పైపులైను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతాల్లో 25 సంవత్సరాల క్రితం అమర్చిన పైపులైన్ల నుంచే నీటిని సరఫరా చేస్తున్నారు. పైపులు చిన్నవి కావడం, ఎప్పుడో ఏర్పాటు చేయడంతో కుళాయిల నుంచి సన్నటి నీటి ధార రావడంతో ఆయా ప్రాంతాల వాసులు ఇబ్బందులు పడేవారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావడంతో సమస్య పరిష్కారమైంది.

- మారుతీనగర్ కొండ చివర ప్రాంతంలో 20 సంవత్సరాల నుంచి సింగిల్ ఫేజ్ కరెంట్ సరఫరా అయ్యేది. ఇక్కడ సుమారు 5 వేల మంది నివసిస్తున్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రూ.35 లక్షలతో కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటు చేయడంతో ప్రస్తుతం త్రీ ఫేజ్ కరెంట్ సరఫరా అవుతోంది.
- బ్రహ్మానందరెడ్డి నగర్‌లో రూ.20 లక్షలతో తారు రోడ్డును సిమెంట్ రోడ్డుగా పునర్నిర్మాణం చేశారు.
- భాలభాస్కర్‌నగర్, గుమ్మడి వారి వీధి, అమ్మవారి గుడి రోడ్డు, కరెంట్ ఆఫీస్ ఎదురుగా రోడ్డు, మేయర్ టి.వెంకటేశ్వరరావు రోడ్లలో పాత భూగర్భ డ్రైనేజీ పైపులను తొలగించి పైపుల సైజు పెంచి రూ.50 లక్షలతో కొత్త పైపులను ఏర్పాటు చేశారు. దీనితో ఆయా ప్రాంతాల్లో డ్రైనేజీ సమస్య పరిష్కారమైంది.
- మారుతీనగర్, చలసాని వారి వీధి, గంగానమ్మ వీధి, తోట నారాయణరావు వీధి, గుమ్మడి వారి వీధి, భాలభాస్కర్‌నగర్‌లో రూ.80 లక్షలతో రోడ్లు నిర్మించారు.
- మారుతీనగర్ కొండ ప్రాంతంలో రూ.15 లక్షలతో ధ్వంసమైన మెట్లకు మరమ్మతులు చేశారు. భగత్‌సింగ్ రోడ్డు నుంచి మెట్రో వరకు ఉన్న రహదారిని రూ.10 లక్షల వ్యయంతో బాగు చేశారు.
- మెట్రో ఎదురుగా ఉన్న కొండపై ప్రాంతంలో అప్పలనాయుడు వీధిలో విద్యుత్ లైన్లు లేవు. కొత్తగా అక్కడ విద్యుత్ లైన్లను ఏర్పాటు చేశారు.
- మారుతీనగర్ కోకో కోలా వీధిలో 20 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తైంది
- రూ.20 లక్షలతో వీరన్న వీధిలో మెట్లు, ర్యాంపులు, మురుగునీటి కాలువల నిర్మాణం పూర్తయ్యాయి.
- బ్రహ్మానందరెడ్డి నగర్ ఒకటో లైన్ నుంచి కోకో కోలా స్ట్రీట్ వరకు రూ. 37 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మించారు.
- బ్రహ్మానందరెడ్డి నగర్ రెండో అంతర్గత రహదారిలో రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు.
- ఆలీ బేగ్ స్ట్రీట్‌లో రూ.15 లక్షలతో యూజీడీ పైపులైను పనులు, మారుతీనగర్‌లో రూ.50 లక్షలతో తాగునీటి సరఫరా పైపులు అమర్చారు.
- మొగల్రాజపురం రావి చెట్టు సెంటర్ గంగానమ్మ వీధి, ఈడే సత్యవతి రోడ్డులను రూ.20 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. గుమ్మడి వారి వీధి, పెద్ద వేప చెట్టు రోడ్లను రూ.20 లక్షలతో సిమెంట్ రోడ్డు.
- రూ.10 లక్షలతో భగత్ సింగ్ రోడ్డు, అమ్మవారి గుడి రోడ్డులో యూజీడీ పైపులు అమర్చారు
- మొగల్రాజపురం కొండ ప్రాంతంలో రూ.50 లక్షలతో వాటర్ పైప్ లైన్ వేశారు. డివిజన్‌లోని కొన్ని ప్రాంతాల్లో రహదారులు, మెట్ల నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం



టీడీపీ హయాంలో డివిజన్‌లో ఒక్క అభివృద్ధి పని జరగలేదు. టీడీపీ కార్పొరేటర్, ఎమ్మెల్యేకు చెప్పినా సమస్యలను పట్టించుకునేవారు కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొండ ప్రాంతం కావడంతో ఇక్కడ మెట్లు, రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ అంశాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి పరిష్కరింపచేస్తున్నాం. త్వరలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నాం.

–అమర్‌నాథ్, కార్పొరేటర్,6వ డివిజన్

సమస్యల పరిష్కారానికి చర్యలు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సమస్య చెప్పిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. స్థానికంగా ఉన్న మెట్లు, ర్యాంపులు, మురుగునీటి కాలువలతో పాటుగా తాగునీటి సమస్యను పరిష్కారం అయ్యాయి. టీడీపీ హయాంలో సమస్యలను ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకునేవారు కాదు.

–ఎస్.కోటేశ్వరరావు, మొగల్రాజపురం

సాయం చేయడంలో వైఎస్సార్ సీపీ ముందంజ



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పేదలకు అవసరమైన సహాయాన్ని చేయడానికి తమ పార్టీ ఎల్లప్పుడు ముందుంటుందని వైఎస్సార్‌సీపీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ చెప్పారు. స్థానిక ఆరో డివిజన్‌లో రావిచెట్టు సెంటర్ దగ్గర నాలుగు నిరుపేద కుటుంబాలకు జీవనోపాధి నిమిత్తం దేవినేని నెహ్రూ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా మొత్తం లక్షా పదివేల రూపాయల విలువైన ఇస్త్రీబండి, టిఫిన్ బండి, రెండు తోపుడు బండ్లను దేవినేని అవినాష్ సోమవారం అందచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు వియ్యపు అమర్‌నాథ్, ఎం.మాధురి, పార్టీ నాయకులు వేగె వెంకటేశ్వరరావు, సంపత్, నాగేంద్ర, వెంకటేశ్వరరావు, కోటేశ్వరరావు, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

- అర్హులకు సంక్షేమ పథకాలను ఇంటికి తీసుకువచ్చి అందజేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని దేవినేని అవినాష్ సతీమణి సుధీర చెప్పారు. గడప గడపకు మీ అవినాష్ అన్న హామీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఏడో డివిజన్ పరిధిలోని రావిచెట్టు సెంటర్, దాసరి లింగయ్య వీధుల్లో సుధీర ఇంటింటికి వెళ్లి ప్రచారం చేశారు. స్థానిక కార్పొరేటర్ ఎం.మాధురి, నేతలు వేగె వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సెమీ కండక్టర్ రంగానికి ప్రాధాన్యం

పెనమలూరు: ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొవటానికి సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని బెంగళూరుకు చెందిన చిప్ ఎడ్జు టెక్నాలజీ సీఈఓ సుంకర వెంకట్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో సోమవారం చిప్ డిజైన్ సవాళ్లు, సెమీ కండక్టర్ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు అనే అంశంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ.. ఎస్ఓసీ డిజైన్లలో భద్రత, డిజైన్ ధ్రువీకరణ తదితర కారణాలతో అనేక సమస్యలు వస్తున్నాయన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు



స్పందనలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్

మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్ చెప్పారు. 'స్పందన' కార్యక్రమం సోమవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా ప్రతి సోమవారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోగానీ, సమీప సచివాలయాల్లోగానీ నిర్వహించే స్పందన కార్యక్రమంలో తెలియజేయవచ్చన్నారు. అన్ని రకాల పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని, నెలాఖరులోపు వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకోవాలని కోరారు.

23 అర్జీలను స్వీకరించిన కమిషనర్

సోమవారం స్పందన కార్యక్రమంలో మొత్తం 23 అర్జీలను స్వీకరించామని, వాటిల్లో ఇంజినీరింగ్ శాఖకు సంబంధించి నాలుగు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి ఆరు ఉండగా రెవెన్యూ శాఖకు తొమ్మిది, యూసీడీ విభాగానికి రెండు, ఎస్టేట్ విభాగానికి రెండు ఉన్నాయని కమిషనర్ వివరించారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, అడిషనల్ కమిషనర్ (జనరల్) ఎ.మహేష్, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, చీఫ్ సిటీ ప్లానర్ జీవీజీఎస్‌వీ ప్రసాద్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పీ రత్నావళి, అకౌంట్స్ ఆఫీసర్ నరసింహమూర్తి, ఆర్ఎఫ్ఓ వెంకటేశ్వరరావు, యూసీడీ పీఓ రోహిణి, జాయింట్ డైరెక్టర్ (అమృత్) లత, ఎస్టేట్ ఆఫీసర్ టీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

- నమ్మక ద్రోహానికి మారుపేరు చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఇన్‌చార్జి దేవినేని అవినాష్



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దేవినేని అవినాష్

కృష్ణలంక(విజయవాడతూర్పు): అభివృద్ధి కార్యక్రమాలతో పాటు అర్హతే ప్రామాణికంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుందని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ అన్నారు. కృష్ణలంక 22వ డివిజన్‌లోని ఆనంద్‌భవన్ రోడ్డు, కోత మిషన్‌రోడ్డు, మార్వాడీ గుడి రోడ్డు, పాత పోస్టాఫీస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల తొమ్మిది నెలల కాలంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించి మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టబోయే కార్యక్రమాలు ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవినాష్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కోట్లాది రూపాయలు సంక్షేమ ఫలాలు అందించడంతో పాటు డివిజన్‌లో దాదాపు రూ.7 కోట్లతో రోడ్లు, డ్రైనేజీ, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. కోటిన్నర వ్యయంతో దోబీఘట్‌ను అభివృద్ధి చేసి ప్రహరీ పూర్తి చేశామన్నారు. ప్రభుత్వం ఎన్నో మంచి కార్యక్రమాలు చేసుకుంటూ ముందుకెళ్తుంటే మరోవైపు ప్రతిపక్షాలు సీట్ల పంపకాలు, అసంతృప్తులతో సతమతమవుతున్న పరిస్థితి ఉందన్నారు. స్వార్థ ప్రయోజనాల కోసం నమ్మిన వారిని నట్టేట ముంచే నీచ వ్యక్తిత్వం చంద్రబాబునాయుడిదని, అతని అజెండా రాష్ట్ర అభివృద్ధి కాదని, అధికార యావ మాత్రమేనని విమర్శించారు. సీట్ల పంపకం అయిన తర్వాత జనసేన నాయకుల దీనస్థితి చూస్తుంటే జాలి వేస్తోందని, చంద్రబాబుని నమ్ముకుంటే పొత్తు ధర్మం విస్మరించి కేవలం 24 సీట్లు ఇచ్చి మోసం చేశారని వాపోతున్నారని గుర్తు చేశారు. నమ్మకద్రోహనికి మారుపేరు చంద్రబాబు అని చెప్పారు. ప్రతిపక్షాలు కట్టకట్టుకొని వచ్చినా జగన్ మోహన్‌రెడ్డిని ఎదుర్కోవడం ఎవరి తరం కాదన్నారు. కార్యక్రమంలో 22వ డివిజన్ కార్పొరేటర్ తాటిపర్తి కొండారెడ్డి, నేతలు జోగారాజు, నాగిరెడ్డి, పులి రమణారెడ్డి, గొర్ల గోవింద్, ఆసిఫ్, ఫజులుద్దీన్, జావీద్, ఖాశిం తదితరులు పాల్గొన్నారు.

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): భార్య కనిపించడం లేదంటూ భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఘటనపై పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత రాజరాజేశ్వరిపేట మహంకాళి గుడి ప్రాంతానికి చెందిన జంకర్ జవాన్, లలితలు భార్యభర్తలు. వీరికి 13 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి సంతానం లేరు. ఇటీవల జవాన్ చీటి పాడగా,వచ్చిన రూ.1.40 లక్షలు భార్యకు ఇచ్చి జాగ్రత్త చేయమని చెప్పాడు. కొద్ది రోజుల క్రితం డబ్బులు ఇవ్వాలని కోరగా, అందులో కేవలం రూ. 50 వేలు మాత్రమే ఇచ్చింది. దీంతో భార్యభర్తలకు గొడవ జరిగింది. శనివారం రాత్రి భార్యభర్తలిద్దరు భోజనాలు చేసిన తర్వాత నిద్రపోయారు. అర్ధరాత్రి 2 గంటలకు నిద్రలేచిన జవాన్‌కు భార్య ఫోన్ చూస్తూ కనిపించింది. కొంత సమయం తర్వాత ఇంట్లో భార్య కనిపించకపోవడంతో చుట్టు పక్కల వెదికినా ఫలితం లేదు. భార్య కనిపించడం లేదంటూ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

మెట్ల మార్గాల నిర్మాణానికి శ్రీకారం



మెట్ల మార్గాల పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్పొరేటర్ నిర్మలాకుమారి

లబ్బీపేట(విజయవాడతూర్పు): కార్మికనగర్ కొండ ప్రాంతంలో మెట్లు శిథిలావస్థకు చేరి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో, వాటి పునర్నిర్మాణ పనులకు సోమవారం స్థానిక రెండో డివిజన్ కార్పొరేటర్ అంబడిపూడి నిర్మలకుమారి శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా రూ.13 లక్షలతో చేపట్టనున్న పనులను స్థానికులతో కలిసి భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ నిర్మలకుమారి మాట్లాడుతూ కార్మికనగర్ కొండ ప్రాంతంలో అనేక సమస్యలు ఉండేవన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు రూ.8 కోట్లు వెచ్చించి డివిజన్‌లో మెట్ల మార్గాలు, డ్రెయిన్‌లు నిర్మాణం చేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం అభివృద్ధిని విస్మరించడంతో కొండ ప్రాంత వాసులు అనేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. రాష్ట్రంలో పేదల ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ సమస్యలు తీరాయని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానికులు శేఖర్‌బాబు, కనపర్తి బాబు, అలంకార్ బాబు, కోటేశ్వరరావు, గిరి, సత్యనారాయణ, మహాలక్ష్మి, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



కుట్టుమిషన్లు అందజేస్తున్న భాగ్యలక్ష్మి, కేశినేని, వెలంపల్లి, రుహుల్లా

భవానీపురం(విజయవాడపశ్చిమ): మహిళా సాధికారతే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని మేయర్ రాయన భాగ్యలక్ష్మి పేర్కొన్నారు. మెప్మా సహకారంతో సోమవారం పూజిత మహిళా సొసైటీ ఆఫ్ డెవలప్‌మెంట్ సంస్థ సెంట్రల్ నియోజకవర్గం 59వ డివిజన్‌కు చెందిన సుమారు వంద మంది మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అజిత్‌సింగ్‌నగర్ గుజ్జుల సరళాదేవి కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మేయర్ భాగ్యలక్ష్మి, ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని), ఎమ్మెల్సీ రుహుల్లా, సెంట్రల్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రతి ప్రభుత్వ సంక్షేమ పథకం మహిళల పేరుతో అందించడమే అందుకు నిదర్శనమన్నారు. ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ సీఎం జగనన్న మహిళా పక్షపాతిగా నిలిచారని కొనియాడారు. ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు స్వయం ఉపాధి కల్పించే దిశగా కుట్టు మిషన్లను ఉచితంగా అందించటం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, మెప్మా మేనేజింగ్ డైరెక్టర్ విజయలక్ష్మి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలో విద్యార్థుల ప్రతిభ

ఇబ్రహీంపట్నం(మైలవరం): విద్యార్థి దశ నుంచి పోటీలలో పాల్గొనడం ద్వారా విషయ పరిజ్ఞానం పెరుగుతుందని ప్రధానోపాధ్యాయురాలు ఎం. సంధ్యారాణి తెలిపారు. రైల్వే శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్–వికసిత్ రైల్వే–2047 అనే అంశంపై సోమవారం నిర్వహించిన వ్యాస రచన పోటీలో ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు ఆర్.జాహ్నవి ప్రథమ, కె.కీర్తన ద్వితీయ, డి.సిద్ధార్థ తృతీయ స్థానాలు సాధించగా వీరిని హెచ్ఎం అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతి కార్యక్రమాల్లో కూడా పాల్గొనాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో నిర్వహించిన అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్‌లో భాగంగా 554 రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో ఒకటిగా రాయనపాడు రైల్వే స్టేషన్ ఎంపిక కావడం సంతోషకరమైన విషయమన్నారు.

చల్లదనానికి కాదు.. శుభ్రపరచడానికి..



కృష్ణలంకలో మునిసిపల్ కార్పొరేషన్ అభివృద్ధి చేసిన అంబేడ్కర్ పార్క్‌లోని భారీ ఏనుగు విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నిజమైన గజరాజును చూసినట్లే ఈ విగ్రహాన్ని తీర్చిదిద్దారు. విగ్రహానికి దుమ్ము పట్టడంతో సోమవారం పార్క్ సిబ్బంది నీటితో శుభ్రం చేశారు. నిజమైన ఏనుగుపైనే నీటిని చల్లుతున్నారని, ఎండలు పెరగడంతో చల్లబరుస్తున్నారని.. ఒక్కసారిగా చూసిన వారు భ్రమపడ్డారు. ఈ చిత్రాన్ని సాక్షి క్లిక్‌మనిపించింది.

–సాక్షి ఫొటోగ్రాఫర్ విజయవాడ

6 నుంచి పాత శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (పాతశివాలయం)లో మార్చి 6 నుంచి 13వ తేదీ వరకూ మహాశివరాత్రి కల్యాణ మహోత్సవాలను నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి లోకేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆలయంలో ఉత్సవాల కరపత్రాన్ని ఆవిష్కరించినట్లు పేర్కొన్నారు. ఉత్సవాల్లో భాగంగా మార్చి ఎనిమిదో తేదీన మహాశివరాత్రి వేడుకలు, తొమ్మిదో తేదీ రథోత్సవం తదితర కార్యక్రమాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మ మధు ఇతర పాలకవర్గ సభ్యులు పాల్గొన్నట్లు వివరించారు. తొలి ఆహ్వానాన్ని పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రుహుల్లాకు అందించినట్లు వివరించారు.

పశువుల్లో కృత్రిమ గర్భధారణతో మేలు

ఇబ్రహీంపట్నం(మైలవరం): పశువుల్లో కృత్రిమ గర్భధారణ రైతులకు లాభదాయకమని పశుగణాభివృద్ధి జిల్లా ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. ఇబ్రహింపట్నం మండలం కొండపల్లి పశువుల ఆసుపత్రిలో లేగ దూడల ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఉప సంచాలకులు డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ లేగ దూడల పెంపకంలో రైతులు తగిన జాగ్రతలు తీసుకోవాలని రైతులకు సూచించారు. లింగ నిర్ధారణ, కృత్రిమ గర్భోత్పత్తి విధానంలో 90 శాతం ఆడ దూడలు జన్మిస్తాయన్నారు. నాలుగు సంవత్సరాల్లో గ్రామాల్లో పాల ఉత్పత్తి రెట్టింపు అయ్యే అవకాశం ఉందన్నారు. దీనితో పశుపోషణ లాభదాయకంగా మారుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజకుమారి, వాసు పాల్గొని లేగ దూడల యజమానులకు బహుమతులు అందజేశారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

సర్కారు 'చేయూత'తో సాఫీగా జీవనం



మాకున్న ఎకరం పొలంలో వరిసాగు చేసేవాళ్లం. ఐదేళ్ల క్రితం సంభవించిన వరుస తుపాన్లు.. చీడ, పీడల వల్ల పంట దిగుబడి రాకపోవడంతో అప్పులపాలయ్యాం. గత ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అందలేదు. నేను కస్తూర్బా స్వయం శక్తి సంఘంలో ఉండటంతో మా సీఎఫ్ సలహా మేరకు బ్యాంకు ద్వారా రూ.50 వేలు తీసుకొని ఆటో కొనుక్కుని దానినే జీవనాధారంగా చేసుకున్నాం. దానివల్ల కూడా కష్టాలు తీరలేదు. ఈలోగా ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక వైఎస్సార్ చేయూత ద్వారా ఏటా రూ.18,750 చొప్పున మూడు పర్యాయాలు వచ్చింది. వైఎస్సార్ ఆసరా కింద రూ.5 వేలు చొప్పున నాలుగు పర్యాయాలు అందింది. ఆ మొత్తంతో సాగుకు పనికి రాని ఎకరా భూమిపై పెట్టుబడి పెట్టాం. నిత్య పంటగా కాయగూరలు పండించడం ప్రారంభించాం. ఇప్పుడు కాయగూరల సాగు ఆశాజనకంగా ఉండటంతో నెలవారీ మంచి ఆదాయం వస్తోంది. మా ఆయనకు వాహన మిత్ర ద్వారా ఏటా రూ.పది వేలు వంతున అందుతోంది. మా అమ్మాయికి అమ్మ ఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు వస్తోంది. ఇప్పుడు మా కుటుంబమంతా సంతోషంగా ఉంది. కుటుంబానికి అండగా ఉన్న సీఎం జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– కొల్ల లక్ష్మి, కొళిగాం (మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

ఉచితంగా ఉన్నత విద్య



మా నాన్న కరీముల్లా స్వర్ణకారుడు. అమ్మ సాధారణ గృహిణి. వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పట్టణం భగత్‌సింగ్ కాలనీలో ఉంటున్న మా నాన్నకు వచ్చే అరకొర ఆదాయం కుటుంబ పోషణకే సరిపోయేది కాదు. ఇక ముగ్గురు పిల్లల చదువులు సాగించడం ఎలా అని నిత్యం మదన పడుతుండేవారు. ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక మా సమస్య పరిష్కారమైంది. నేను రాజంపేటలోని అన్నమాచార్య ఇంజినీరింగ్ కాలేజీలో నాలుగో సంవత్సరం ఈసీఈ చదువుతున్నాను. చెల్లి సనా కూడా అదే కాలేజీలో డిప్లమో అనంతరం బీటెక్ రెండో సంవత్సరంలో చేరింది. నా తమ్ముడు మహమ్మద్ తాహిర్ ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న విద్యా దీవెన (ఫీజు రీయింబర్స్‌మెంట్) పథకం ద్వారా నాకు నాలుగేళ్లకు రూ.1.87 లక్షలు మా అమ్మ బ్యాంక్ ఖాతాలో జమ అయింది. నా చెల్లికి కూడా మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ కింద డబ్బు వచ్చింది. నా తమ్ముడికి అమ్మఒడి సొమ్ము ఏటా రూ.15 వేలు వంతున వస్తోంది. ఇప్పుడు మా అమ్మ, నాన్నకు మా చదువుల గురించి బెంగ లేదు. మా భవిష్యత్తును తీర్చిదిద్దుతున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మా కుటుంబం ఎప్పటికీ రుణపడి ఉంటుంది.


– సీఎస్ అబ్దుల్ రెహమాన్, ప్రొద్దుటూరు (వీరారెడ్డి, విలేకరి, ప్రొద్దుటూరు)

సంక్షేమ పథకాలతో చింతలేని జీవితం



బతుకు తెరువు కోసం ఆటో నడుపుతున్నా. దాని ద్వారా వచ్చే ఆదాయమే మా కుటుంబానికి ఆధారం. అన్ని రోజులూ ఒకేలా ఉండవు. అప్పుడప్పుడు వాహనానికి మరమ్మతులు తప్పనిసరి. ఏటా ఇన్సూరెన్స్ చెల్లించాలి. ఇంకా కేసుల సంగతి సరేసరి. ఇలాంటి సందర్భాల్లో అప్పులు చేయడం తప్పనిసరి అయ్యేది. రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించాక అప్పులు చేయాల్సిన బాధ తప్పింది. పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం కె.శివడ గ్రామానికి చెందిన నాకు వాహన మిత్ర పథకం ద్వారా ఏటా రూ.10 వేలు అందుతోంది. ఈ ప్రభుత్వ సాయంతో ఏటా ఇన్సూరెన్స్, ఆటో రిపేర్లు చేయించుకుంటున్నా. ప్రభుత్వ సేవలు ప్రజలకు చేరువ చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థలో నా భార్య సురేఖకు వలంటీర్‌గా ఉన్న ఊళ్లోనే ఉపాధి లభించింది. నా భార్యకు, మా అమ్మ సావిత్రికి 'వైఎస్సార్ ఆసరా పథకం' ద్వారా ఏటా చెరో రూ.1200 చొప్పున లభించింది. ఇద్దరు పిల్లలూ చదువుకుంటున్నారు. ఏటా అమ్మ ఒడి పథకం ద్వారా రూ.15 వేలు అందుతోంది. మా అమ్మ సావిత్రికి వితంతు పింఛన్ అందుతోంది. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలతో మా జీవనం సాఫీగా సాగుతోంది.

– నిమ్మల వెంకటరావు, కె.శివడ (జి.పెంటయ్య, విలేకరి, గుమ్మలక్ష్మీపురం)



కాకినాడ రూరల్ సీటు పిల్లి అనంతలక్ష్మికి ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ఆత్మహత్యాయత్నం చేస్తున్న టీడీపీ కార్యకర్త లోవరాజు



నగరిలో చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతో పాటు ఇసుక, గ్రావెల్, కంకర, ఎర్రచందనం చూపుతూ టీడీపీ నేతల నిరసన



మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లికి సీటివ్వాలని టీడీపీ నిడదవోలు కార్యాలయంలో ఆందోళన చేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

టీడీపీలో ఆగ్రహ జ్వాల

చంద్రబాబు నమ్మించి మోసగించాడని సీనియర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జిలు, కార్యకర్తల మండిపాటు

- ఉండవల్లిలో బాబు ఇంటి ముందు తంబళ్లపల్లి టీడీపీ నేతల నిరసన
- శంకర్‌యాదవ్‌కు టికెట్ ఇవ్వాలంటూ పెట్రోల్ పోసుకునేందుకు యత్నం
- కోడుమూరులో టీడీపీ నేత ఆకెపోగు ఆత్మహత్యాయత్నం
- ఎర్రచందనం స్మగ్లర్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తారా?: నగరి నేతల ఆగ్రహం
- కాకినాడ రూరల్‌లో తాడోపేడో అంటున్న తమ్ముళ్లు.. కార్యకర్త ఆత్మహత్యాయత్నం
- నిడదవోలులో దుర్గేష్‌ను ఒప్పుకోం.. శేషారావుకు టికెట్ ఇవ్వాల్సిందే
- పార్టీ కోసం ఆస్తులన్నీ అమ్ముకున్నా: మాదినేని
- నరసరావుపేటలో యరపతినేని కోసం బీసీ నేత చదలవాడ బలి
- కోట్లు ఖర్చుపెడితే రాజానగరంలో బొడ్డుకు రిక్తహస్తం
- జనసేనకు టికెట్ ఇస్తే సహకరించబోమన్న బుద్ధప్రసాద్ అనుచరులు

సాక్షి నెట్‌వర్క్: టీడీపీలో టికెట్ల కేటాయింపులపై ఆ పార్టీలో నిరసనలు ఎగసిపడ్డాయి. అనేక చోట్ల చంద్రబాబు మోసంపై నేతలు, కార్యకర్తలు మండిపడ్డారు. చంద్రబాబు తమను నమ్మించి నట్టేట ముంచారని సీనియర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలు నిరసన తెలుపుతూ రోడ్డెక్కారు. కొన్ని చోట్ల కార్యకర్తలు, నేతలు ఆత్మహత్యాయత్నాలు చేశారు. ఇన్నాళ్లు పార్టీ కోసం పాటుపడితే ప్రజలతో సంబంధాలు లేని కొత్తవారికి టికెట్ ఇచ్చారని.. తమకు టికెట్ ఇవ్వకపోతే టీడీపీ-జనసేన అభ్యర్థుల్ని ఓడిస్తామని హెచ్చరించారు. ఉండవల్లిలో చంద్రబాబు నివాసం ముందు ధర్నా చేస్తున్న అసమ్మతి నేతలు, కార్యకర్తల్ని బాబు బుజ్జగించేందుకు ప్రయత్నించినా ససేమిరా అంటూ వెనుదిరిగారు.

ఉండవల్లిలో తంబళ్లపల్లె తమ్ముళ్ల నిరసన

తంబళ్లపల్లె టికెట్‌ను పార్టీలో కనీసం గుర్తింపు లేని వ్యక్తికి ఎలా ఇస్తారని, టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే శంకర్ యాదవ్‌కు ఇవ్వాల్సిందేనంటూ నియోజకవర్గ టీడీపీ శ్రేణులు సోమవారం ఉండవల్లిలోని చంద్రబాబు ఇంటిముందు బైఠాయించి ఆందోళన చేశారు. పెట్రోలు డబ్బాలు చూపుతూ ఆత్మహత్య చేసుకుంటామంటూ నిరసనలతో హోరెత్తించారు. శంకర్‌కు టికెట్ ఇవ్వకపోతే టీడీపీని ఓడిస్తామని నినదించారు. చంద్రబాబును కలిసేందుకు అవకాశం ఇవ్వకపోవడంతో గేట్లు దాటుకుని ముందుకు వెళ్లారు. శంకర్ యాదవ్‌ను అభ్యర్థిగా ప్రకటించకపోతే ఆత్మహత్యకైనా సిద్ధమంటూ ముగ్గురు కార్యకర్తలు తమ వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను ఒంటిపై పోసుకునేందుకు ప్రయత్నించారు. అది గమనించిన తాడేపల్లి సీఐ అడ్డుకున్నారు. త్రీమెన్ కమిటీ సభ్యులు కొల్లు రవీంద్ర, నెట్టెం రఘురాం, కొనకళ్ల నారాయణలు వారిని వారించే ప్రయత్నం చేశారు. ఇంతలో అక్కడికి వచ్చిన చంద్రబాబు తంబళ్లపల్లి నేతలపై అసహనం వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన వ్యక్తి ఎవరికి తెలియదని, అలాంటప్పుడు ఆ వ్యక్తి సర్వేలో ముందంజలో ఉండటం ఎలా సాధ్యమని ప్రశ్నించగా.. ఏయ్ ఆగు..ఆగు అంటూ చంద్రబాబు వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాము పార్టీకి రాజీనామా చేశామని చంద్రబాబుకు చెప్పడంతో వారిని బుజ్జగించేందుకు ప్రయత్నించారు. ఎవరికి సీటివ్వాలో తనకు తెలుసని, తనను డిక్టేట్ చేయవద్దని బాబు హెచ్చరించారు.

కాకినాడ రూరల్‌లో కార్యకర్త ఆత్మహత్యాయత్నం

కాకినాడ రూరల్ స్థానాన్ని జనసేనకు కేటాయించడంపై టీడీపీ మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి వర్గీయులు సోమవారం నిరసనలతో హోరెత్తించారు. వలసపాకలలోని పిల్లి అనంతలక్ష్మి, సత్యనారాయణ దంపతుల ఇంటి వద్ద రోడ్డుపై బైఠాయించారు. టీడీపీ ఫ్లెక్సీలు చించేశారు. కార్యకర్త వెలగ లోవరాజు పెట్రోలు పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించగా అడ్డుకున్నారు. టీడీపీకి రాజీనామా చేయాలని పిల్లి అనంతలక్ష్మి దంపతుల్ని కార్యకర్తలు డిమాండ్ చేశారు. కార్యకర్తలతో మార్చి 2, 3 తేదీల్లో సమావేశం ఏర్పాటు చేసి ఈ విషయంపై చర్చిస్తామని అనంతలక్ష్మి తెలిపారు.

జెండా విలువ తెలియని వ్యక్తికి టికెట్ ఇస్తారా?: మాదినేని

కళ్యాణదుర్గం అసెంబ్లీ టికెట్ విషయంలో చంద్రబాబు తనకు అన్యాయం చేశారని, కనీసం జెండా విలువ కూడా తెలియని వ్యక్తికి టికెట్ ప్రకటించడం బాధాకరమని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాదినేని ఉమా మహేశ్వరనాయుడు అన్నారు. కళ్యాణదుర్గంలోని సోమవారం కార్యకర్తల సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. కళ్యాణదుర్గంలో బాబు ష్యూరిటీ..భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జ్‌గా ఉమా ఉన్నారని.. సరైన సమయంలో ఆయనను అభ్యర్థిగా ప్రకటిస్తానని చెప్పారని గుర్తుచేశారు. ఏ రోజూ జెండా పట్టని వ్యక్తిని అభ్యర్థిగా ప్రకటించడం సహించలేనిదన్నారు. టీడీపీ జెండాను భుజాన వేసుకుని పనిచేయడం నేను చేసిన తప్పా? పార్టీ కోసం ఆస్తులన్నీ అమ్ముకుని పనిచేయడం తప్పా? అంటూ చంద్రబాబును ప్రశ్నించారు.

దొంగ, స్మగ్లర్‌ను అభ్యర్థిగా ప్రకటిస్తారా?

నగరి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థిగా గాలి భానుప్రకాష్‌ను ప్రకటించడంపై స్థానిక టీడీపీ నాయకులు మండిపడుతున్నారు. ఒకటో వార్డులో టీడీపీ సీనియర్ నాయకుడు రామానుజం చలపతి, మాజీ కౌన్సిలర్ లత స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి సామాలమ్మ ఆలయ ఆవరణలో చంద్రబాబు, లోకేశ్ ఫొటోలతో పాటు ఇసుక, గ్రావెల్, బియ్యం, గంజాయిని తలపించేలా ఆకులు, ఎర్రచందనం కట్టలు పట్టుకొని వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేశారు. గంజాయి స్మగ్లర్లు, గ్రావెల్ దొంగలు, బియ్యం స్మగ్లర్లు, లిక్కర్ స్మగ్లరు, కంకర దొంగలు, చందనం స్మగ్లర్లు అభ్యర్థులుగా వద్దంటూ నినాదాలు చేశారు. రామానుజం చలపతి మాట్లాడుతూ.. నగరిలో దొంగలు, స్మగ్లర్లకు పదవులు ఇచ్చారని, నగరి సంపదను దోచుకుని తినే వ్యక్తిని అభ్యర్థిగా ఎన్నుకుంటే మేము ఓట్లు వేయాలా? అంటూ ప్రశ్నించారు.

బాబు చేతుల్లో మరో బీసీ నేత బలి

పల్నాడు జిల్లా నరసరావుపేట టీడీపీ అసెంబ్లీ ఇన్‌చార్జి చదలవాడ అరవింద్‌బాబుకు చంద్రబాబు షాక్ ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. అరవింద్‌బాబు 2019 ఎన్నికల ముందు నుంచి ఇన్‌చార్జిగా కొనసాగుతున్నారు. టికెట్ ఇస్తారని ఆశలు పెట్టుకున్న చదలవాడను తప్పించేందుకు చంద్రబాబు ఐవీఆర్ఎస్ పేరుతో ఎత్తులు వేస్తున్నారు. గతంలో నరసరావుపేట ఎమ్మెల్యే అభ్యర్థి ఎంపికపై ఐవీఆర్ఎస్ సర్వేలో చదలవాడ అరవింద్‌బాబు, కడియాల వెంకటేశ్వరరావు, ప్రత్తిపాటి పుల్లారావు, అట్ల చిన్నవెంకటరెడ్డి పేర్లతో అభిప్రాయ సేకరణ చేశారు. తాజాగా సోమవారం సర్వేలో ఐవీఆర్ఎస్ కాల్‌లో కేవలం గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాస్ పేరుతో మాత్రమే సర్వే నిర్వహించారు. యరపతినేని ఎంపిక దాదాపు పూర్తయ్యిందని, కార్యాలయం ఏర్పాటు ముమ్మరంగా జరుగుతోందని టీడీపీ నేతలు అంటున్నారు.

నిడదవోలులో కందుల దుర్గేష్‌కు సెగ

జనసేన నేత కందుల దుర్గేష్ నిడదవోలు నుంచి ఎన్నికల బరిలోకి దిగుతున్నారన్న ప్రచారం టీడీపీ నేతలకు మింగుడు పడటం లేదు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ నేతలు నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మున వెంకటేశ్వరరావు అధ్యక్షతన సోమవారం సమావేశమయ్యారు. మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావుకు టికెట్ ఇవ్వకపోతే మూకుమ్మడి రాజీనామాలకు సైతం వెనుకాడబోమని అల్టిమేటం జారీ చేశారు. పార్టీ బలోపేతానికి అహర్నిశలూ కృషి చేసిన శేషారావు వంటి నేతకు సీటు ఇవ్వకపోతే సహించేది లేదని, చంద్రబాబు తీరు మార్చుకోవాలని హితవు పలికారు. చంద్రబాబు వద్ద పంచాయితీ పెట్టేందుకు రంగం సిద్ధం చేశారు. నిడదవోలు టీడీపీ టికెట్ ఆశించిన కుందుల సత్యనారాయణ టికెట్ దక్కదనే మనస్తాపంలో అనారోగ్యానికి గురయ్యారు.

టీడీపీ నేత ఆకెపోగు ఆత్మహత్యాయత్నం

చంద్రబాబు తనకు కోడుమూరు టికెట్ ఇవ్వకుండా మోసం చేశాడనే బాధతో నియోజకవర్గ ఇన్‌చార్జి ఆకెపోగు ప్రభాకర్ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించారు. కోడుమూరు టికెట్‌ను బొగ్గుల దస్తగిరికి కేటాయించడంతో ప్రభాకర్ తీవ్ర మనస్తాపానికి గురై అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఈ నెల 25న గద్వాలలోని తన సమీప బంధువుల ఇంటికి వెళ్లి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గద్వాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. చంద్రబాబు తమకు అన్యాయం చేశాడంటూ ఆయన భార్య మీడియా ముందు వాపోయారు.

గోరంట్ల గెలుపు కష్టమే!

రాజమహేంద్రవరం రూరల్‌లో జనసేన శ్రేణులు కందుల దుర్గేష్‌కు టికెట్ ఇవ్వకపోవడంపై తీవ్ర ఆగ్రహంగా ఉన్నారు. ఇప్పటికే రోడ్డెక్కి తమ నిరసనను వెలిబుచ్చారు. దీంతో రూరల్‌లో టీడీపీ అభ్యర్థిగా భావిస్తున్న గోరంట్ల బుచ్చయ్య చౌదరి గెలుపు కష్టమేనంటున్నారు. రాజానగరంలో జనసేనకు టికెట్ కేటాయింపుపై టీడీపీ నేతలు రగిలిపోతున్నారు. పార్టీ సోషల్ మీడియాకు రూ.కోట్లు ఖర్చు పెట్టిన టీడీపీ నేత బొడ్డు వెంకట రమణ చౌదరిని కాదని జనసేనకు కేటాయించడంపై ఆయన వర్గం మండిపడుతోంది.

తూర్పులో బీసీల భగభగ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో టీడీపీలో బలమైన శెట్టిబలిజ సామాజిక వర్గానికి తొలి జాబితాలో ఒక్కటంటే ఒక్క స్థానం కూడా దక్కలేదని రగిలిపోతున్నారు. టీడీపీ నుంచి శెట్టి బలిజ సామాజికవర్గం కాకినాడ రూరల్, రామచంద్రపురం, కొత్తపేట, రాజమహేంద్రవరం రూరల్ అసెంబ్లీ స్థానాలను ఆశిస్తోంది. రామచంద్రాపురంలో టీడీపీని అంటిపెట్టుకుని ఉన్న శెట్టి బలిజ నాయకుడు రెడ్డి సుబ్రహ్మణ్యానికి ఇప్పుడు సీటు ఇవ్వకుండా తరువాత ప్రాధాన్యం ఇస్తామని చెప్పడంపై ఆ వర్గం మండిపడుతోంది. కొత్తపేటలో కాపు సామాజికవర్గంతో సమానం బలం ఉన్న తమకు సీటు ఇవ్వకపోవడంపై ఆ నియోజకవర్గానికి చెందిన బీసీ నేతలు మండిపడుతున్నారు. టీడీపీకి ఎన్నికల్లో మద్దతుపై వారు పునరాలోచనలో పడ్డారు. రాజమహేంద్రవరం రూరల్‌ను కూడా చంద్రబాబు సామాజిక వర్గానికి కట్టబెట్టి తమను విస్మరిస్తున్నారని బీసీల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

30 ఏళ్లుగా శ్రమిస్తే మీరిచ్చే గౌరవం ఇదేనా

టీడీపీ కోసం 30 ఏళ్లుగా పనిచేస్తున్న మాజీ మంత్రి పరసా వెంకటరత్నంకు పార్టీ అధిష్టానం ఇచ్చే గౌరవం ఇదేనా అని ఆయన కుమార్తె పరసా షాలినీ రత్నం ఆవేదన వ్యక్తం చేశారు. నాయుడుపేట పట్టణంలోని అగ్రహారపేటలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. సూళ్లూరుపేట(ఎస్సీ) నియోజకవర్గం టికెట్ రత్నంకు ఇవ్వకపోవడంపై పరసా రత్నంతో పాటు నాయకులు, కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. జనాలతో సంబంధం లేని మహిళకు పార్టీ టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమన్నారు.

సీటివ్వకపోతే చచ్చిపోతా..!

తణుకు జనసేన ఇన్‌చార్జి విడివాడ హెచ్చరిక

- ఫలించని నాదెండ్ల మనోహర్ చర్చలు
- పెంటపాడు మండలంలో మనోహర్‌కు నిరసన సెగ
- గెస్ట్‌హౌస్ వద్ద తోపులాట, ఉద్రిక్తత
- జనసేన పార్టీలో బట్టబయలైన వర్గ విభేదాలు
- ఏలూరు జనసేనలోనూ ప్రకంపనలు
- సీటుపై పునరాలోచించాలని అప్పలనాయుడు డిమాండ్
- కార్యాచరణ రూపొందించేందుకు ఏడుగురు సభ్యులతో కమిటీ
- నిర్ణయం మార్చుకోకపోతే మేమేంటో చూపిస్తామంటూ కేడర్ హెచ్చరిక
- పవన్, చంద్రబాబు ఉన్న ఫ్లెక్సీలో బాబు ఫొటో చించివేత
- రాష్ట్రవ్యాప్తంగా జనసేన కార్యకర్తల నిరసనలు



ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విడివాడ రామచంద్రరావు



బొలిశెట్టి శ్రీనుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న జనసేన కార్యకర్తలు



జనసేన ఇన్‌చార్జి అప్పలనాయుడు కార్యాలయ ఫ్లెక్సీలో చంద్రబాబు ఫొటోను చించివేస్తున్న కార్యకర్తలు

తాడేపల్లిగూడెం/తణుకు/సాక్షి ప్రతినిధి, నెల్లూరు/ఏలూరు(టూటౌన్)/గోకవరం: పదేళ్లపాటు టికెట్ ఇస్తానని నమ్మబలికి ఇప్పుడు తణుకు టికెట్‌ను పొత్తులో టీడీపీకి కేటాయించడం న్యాయం కాదని, తనకు టికెట్ ఇవ్వకపోతే చచ్చిపోతానని పశ్చిమ గోదావరి జిల్లా తణుకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు హెచ్చరించారు. టికెట్ కేటాయింపుపై జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌తో ఆయన సోమవారం రాత్రి భేటీ అయ్యారు. ఈ సందర్భంగా మనోహర్‌తోపాటు ఇతర నాయకులు చేపట్టిన బుజ్జగింపులు ఫలించలేదు. తనకు సీటు కేటాయించకపోవడంపై సోమవారం రాత్రి మనోహర్‌ను ప్రశ్నించేందుకు ఆయన బస చేసిన గెస్ట్‌హౌస్‌కు నాయకులు, కార్యకర్తలతో కలిసి వెళ్లిన విడివాడను మనోహర్ కలిసేందుకు కూడా ఇష్టపడలేదు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన విడివాడ తణుకు వెళ్లిపోయారు. తొలుత జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్‌కు పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలంలో సొంత పార్టీ కార్యకర్తల నుంచే నిరసన సెగ తగిలింది. తణుకు టికెట్‌ను పవన్ గతంలో హామీ ఇచ్చిన విధంగా విడివాడ రామచంద్రరావుకు కాకుండా టీడీపీకి చెందిన ఆరిమిల్లి రాధాకృష్ణకు కేటాయించడంతో రగిలిపోతున్న జనసేన కార్యకర్తలు, నాయకులు జనసేన పీఏసీ చైర్మన్ మనోహర్‌కు వ్యతిరేకంగా నిరసనలు చేస్తూ పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహించారు. పెంటపాడు మండలం అలంపురం సమీపంలోని జయా గార్డెన్‌లో ఈ నెల 28న నిర్వహించ తలపెట్టిన జనసేన, టీడీపీ ఉమ్మడి సభ ఏర్పాట్లు పరిశీలించేందుకు నాదెండ్ల మనోహర్ విచ్చేశారు. ఈ క్రమంలో తణుకు నియోజకవర్గానికి చెందిన జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు నియోజకవర్గ కన్వీనర్ విడివాడ రామచంద్రరావు ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో తరలివచ్చి ఆయన బస చేసిన గెస్ట్‌హౌస్‌ని ముట్టడించారు. మనోహర్ బయటికి రావాలని, విడివాడకు న్యాయం చేయాలంటూ నినాదాలిచ్చారు. పరిస్థితులు ఉద్రిక్తంగా మారడంతో లోపల ఉన్న మనోహర్ దగ్గరకు వెళ్లకుండా పోలీసులు వారిని అడ్డుకున్నారు. దీంతో మరింత రగిలిపోయిన శ్రేణులు తోపులాటకు దిగాయి. ఆ పార్టీ జిల్లా స్థాయి నాయకులు సముదాయించే ప్రయత్నం చేసినా శ్రేణుల ఆగ్రహం చల్లారలేదు. ఈ క్రమంలో సహనం నశించిన కార్యకర్తలు గెస్ట్‌హౌస్ తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లడానికి యత్నించారు. ఆగ్రహంగా ఉన్న కార్యకర్తలను శాంతింపజేసేందుకు పార్టీ నేతలు బొలిశెట్టి శ్రీను, కొటికలపూడి గోవిందరావు తదితరులు ప్రయత్నించినా ఎవ్వరూ లెక్కచేయలేదు. ఈ సందర్భంగా విడివాడ మాట్లాడుతూ తనకు టికెట్ ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయంటూ హెచ్చరించారు. ఈ పంచాయితీని తణుకులోనే తేల్చుకుంటామని తన అనుచరులతో కలసి వెనుదిరిగారు. అనంతరం మనోహర్ సూచనలతో జిల్లా నాయకులు తణుకు చేరుకొని రాత్రి తొమ్మిది గంటల సమయంలో విడివాడ గెస్ట్ హౌస్‌కు తీసుకొచ్చారు. పదేళ్లపాటు జనసేన టికెట్ ఇస్తామని నమ్మబలికి చివరికి టికెట్ల పంపకాల్లో మొండిచేయి చూపడంతో ఆగ్రహించిన జనసేన కార్యకర్తలు రోడ్డెక్కారు. ఎక్కడికక్కడ ఫ్లెక్సీలను చించేస్తూ జనసేన అధినేత పవన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

రెండు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ

పదేళ్ల పాటు పార్టీ కోసం కష్టపడితే ఇప్పుడు నన్ను కాదని మరో వ్యక్తికి తణుకు టికెట్ కేటాయించడం ఎంతవరకు సమంజసమని తణుకు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి విడివాడ రామచంద్రరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. టికెట్ కేటాయించకపోవడంతో మనస్తాపం చెందిన విడివాడ మండపాక గ్రామ జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం రాత్రి అనుచరులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019లో తనను కాదని మరో వ్యక్తికి టిక్కెట్ ఇచ్చినా సహించానని, పదేళ్లుగా రూ. కోట్లు ఖర్చు పెట్టానని ఆగ్రహం వ్యక్తం చేశారు. తన భవిష్యత్ కార్యాచరణను రెండు రోజుల్లో ప్రకటిస్తానని వెల్లడించారు. పార్టీ కోసం కష్టపడిన నాయకుడిని పక్కన పెట్టడం న్యాయమేనా అని ప్రశ్నించారు. జనసేన అధినేత పవన్ ఇక్కడ పోటీ చేస్తే సహకరిస్తామని, అంతే తప్ప తెలుగుదేశం జెండా మోసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. జనసేన పార్టీకి సంబంధం లేని వారిని టీడీపీ అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ తనతో పాటు తిప్పుకోవడం సరైన పద్ధతి కాదని మండిపడ్డారు. మరోవైపు నెల్లూరులో జనసేన కార్యకర్తలు రోడ్డెక్కారు. నెల్లూరు సిటీ లేదా నెల్లూరు రూరల్ సీటు ఇస్తారని ఆశ పెట్టుకున్న మనుక్రాంత్ రెడ్డికి పవన్ కళ్యాణ్ పెద్ద షాకిచ్చారు. పవన్‌కళ్యాణ్ తీరుపై జనసేన కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పార్టీని నమ్ముకుని టికెట్ వస్తుందని ఆశిస్తే అన్యాయం చేశారని మండిపడుతున్నారు. సోమవారం నెల్లూరులోని మినీబైపాస్‌లోని జనసేన కార్యాలయానికి చేరుకున్న కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. చంద్రబాబు మాయలోపడి పవన్ మోసపోయాడని వారు మండిపడ్డారు. టీడీపీకి ఓటేసే ప్రసక్తే లేదని తెగేసి చెప్పారు. ఈ నిరసన సమయంలో మనుక్రాంత్‌రెడ్డి పార్టీ కార్యాలయంలోనే ఉన్నారు.


రెడ్డి అప్పలనాయుడు కన్నీటిపర్యంతం

పొత్తులో భాగంగా ఏలూరు అసెంబ్లీ స్థానాన్ని టీడీపీకి కేటాయించడంపై జనసేన వర్గాల్లో తీవ్ర అసంతృప్తిని రగిల్చింది. దీనిపై జనసేన, టీడీపీ నేతలు పవన్ కళ్యాణ్, చంద్రబాబు నాయుడు పునరాలోచన చేసి సీటును జనసేనకు కేటాయించాలని జనసేన పార్టీ కేడర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటివరకు మౌనంగా ఉన్న ఏలూరు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు సోమవారం సాయంత్రం పార్టీ ముఖ్య కేడర్‌తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 'మాకు న్యాయం చేయాలి', 'రెడ్డి అప్పలనాయుడుకు సీటు ఇవ్వాలి' అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అవసరమైతే జనసేన ఇన్‌చార్జి రెడ్డి అప్పలనాయుడు రెబల్‌గా పోటీలో నిలవాలంటూ నినదించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో అప్పలనాయుడు మాట్లాడుతూ జనసేన, టీడీపీ పొత్తులో భాగంగా ఏలూరు టికెట్‌ను టీడీపీకి కేటాయించడం పట్ల ఏలూరు నియోజకవర్గ జనసైనికులు అసంతృప్తికి లోనయ్యారన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోనే జనసేన పార్టీకి అత్యధికంగా బలం ఉన్న నియోజకవర్గం ఏలూరు అని సర్వేలో మొదటి స్థానం వచ్చిన ఏలూరు సీటుపై పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ పునరాలోచన చేయాలని కోరారు. రెండు రోజుల్లో దీనిపై పార్టీ అధినాయకత్వం స్పందించని పక్షంలో ఏం చేయాలనే దానిపై కార్యాచరణ ప్రకటించనున్నట్లు స్పష్టం చేశారు. కార్యకర్తల మనోభావాలను తెలుసుకుని భవిష్యత్తు కార్యాచరణ చేపట్టేందుకు వీలుగా ఏడుగురు సభ్యులతో కమిటీని వేశారు. గత ఐదున్నర సంవత్సరాలుగా పార్టీ కోసం శ్రమించిన రెడ్డి అప్పలనాయుడుకు పొత్తుల పేరుతో మొండిచేయి చూపడాన్ని పార్టీ కార్యకర్తలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ సమయంలో ఒక్కసారిగా కార్యకర్తల సమావేశం నుంచి లోపలికి వెళుతూ కన్నీరు పెట్టుకున్నారు. దీన్ని చూసిన జనసైనికులు పెద్దగా నినాదాలు చేశారు. కార్యాలయంలో పవన్ కళ్యాణ్, చంద్రబాబు కలిసి ఉన్న ఫ్లెక్సీల్లోని చంద్రబాబు ఫొటోలను చించేశారు. కాకినాడ జిల్లాలో జగ్గంపేట ఎమ్మెల్యే టికెట్ టీడీపీకి కేటాయించి, తనకు అన్యాయం చేయడంపై జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పాటంశెట్టి సూర్యచంద్ర గోకవరం మండలంలోని అచ్యుతాపురం కనకదుర్గమ్మ ఆలయం వద్ద చేస్తున్న ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతోంది. దీక్షా శిబిరాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు సందర్శించి సూర్యచంద్ర, శ్రీదేవి దంపతులను పరామర్శించారు.

ముదిరింది ఎండే కాదు.. ఈనాడు పచ్చ పైత్యం కూడా

రాష్ట్రంలో భారీగా పెరిగిన విద్యుత్ వినియోగం

- అయినా సరిపడా సరఫరా చేస్తున్న డిస్కంలు
- ఎక్కడా కోతలు లేకుండా ముందస్తు చర్యలు
- ప్రణాళిక ప్రకారం బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు
- లేని ఇబ్బందులు సృష్టించి ఈనాడు తప్పుడు రాతలు



సాక్షి, అమరావతి: ఎండలు మండుతున్నాయో లేదో ఏసీ గదుల్లో కూర్చునే రామోజీకేం తెలుస్తుంది. ఒకసారి కళ్లు తెరిచి రోడ్డు మీదకు వస్తే రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది. వాతావరణ మార్పుల కారణంగా ఫిబ్రవరి నెలలోనే ఎండలు ముదురుతుండటంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం రోజురోజుకీ పెరుగుతోంది. అయినప్పటికీ ప్రజలు ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా కోతలు లేని నాణ్యమైన విద్యుత్‌ను రాష్ట్ర ప్రభుత్వం, విద్యుత్ సంస్థలు అందిస్తున్నాయి. కానీ ఎండ కన్నెరుగని డ్రామోజీ 'ఎండలు ముదరకముందే ఎడా పెడా కోతలు' శీర్షికన ఈనాడులో అడ్డగోలుగా ఓ అబద్ధాన్ని అచ్చేశారు. ఈ అసత్య కథనంపై రాష్ట్ర విద్యుత్ సంస్థలు తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశాయి. రాష్ట్రంలో ఏదైనా సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల సమయంలో వచ్చే స్వల్ప విద్యుత్ అంతరాయాలను వ్యవసాయ విద్యుత్ కోతలుగా చూపిస్తూ తరచూ కథనాలు ప్రచురించడం ఈనాడు దిగజారుడుతనానికి నిదర్శనమని, ఇలాంటి నీతిమాలిన పాత్రికేయం ఆ పత్రిక పతనానికి నాంది అని దుయ్యబట్టాయి. వాస్తవాలేమిటో వివరించాయి.

ఈనాడు ఆరోపణ: విద్యుత్ కోతలతో పంటలు ఎండుతున్నాయని ప్రకాశం జిల్లాలో ఓ గ్రామం రైతులు, విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారని పార్వతీపురం మన్యం జిల్లాలోని ఓ గ్రామం రైతులు ఆందోళన చేశారు.

వాస్తవం: పార్వతీపురం మన్యం జిల్లా యర్రసామంతవలస 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో ఏర్పడ్డ విద్యుత్ అంతరాయం, ప్రకాశం జిల్లా ఉమా మహేశ్వరపురం 33/11 కేవి సబ్ స్టేషన్, అద్దంకి దగ్గర గుండ్లకమ్మ వంతెన సమీపంలో 33 కేవీ కుంకుపాడు లైన్ మరమ్మతుల వల్ల తలెత్తిన అంతరాయాలను వ్యవసాయ విద్యుత్ కోతలుగా ఈనాడు ప్రచురించింది. అది అవాస్తవం. నిజానికి ఈ రెండు చోట్లా ప్రత్యామ్నాయంగా ఏపీ ట్రాన్స్‌కో హై వోల్టేజ్ సబ్ స్టేషన్ లైన్ల ద్వారా విద్యుత్ అందించడం కూడా జరిగింది. వ్యవసాయ వినియోగదారులకు పగటి పూట విద్యుత్ సరఫరాకు అధికారులు గతంలోనే చర్యలు తీసుకున్నారు. అక్కడక్కడా సమస్యలు తలెత్తినా వెంటనే నివారించేందుకు సబ్‌స్టేషన్, లైన్ల సామర్థ్యం పెంపుదల పనులు జరుగుతున్నాయి. ఇంక ఆందోళన చేయాల్సిన అవసరమేముంది? అదంతా కేవలం రామోజీ మార్కు సృష్టి మాత్రమే.

ఈనాడు ఆరోపణ: రైతులకు పగటిపూట అంతరాయం లేకుండా 9 గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పిన సర్కారు.. వేసవి ఆరంభంలోనే చేతులెత్తేసింది. ముందస్తు ప్రణాళికల్లో విఫలమైంది.

వాస్తవం: రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా ప్రస్తుతం విద్యుత్ వినియోగం పెరుగుతోంది. అయినప్పటికీ రాష్ట్ర ప్రజలు ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా నాణ్యమైన నిరంతరాయ విద్యుత్‌ను విద్యుత్ సంస్థలు అందిస్తున్నాయి. ఇందుకోసం బహిరంగ మార్కెట్ నుంచి విద్యుత్‌ను కొనుగోలు చేస్తున్నాయి. ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని అందుకు అవసరమైన ముందస్తు ప్రణాళికను రూపొందిస్తున్నాయి. రైతులకు పగటిపూట తొమ్మిది గంటల విద్యుత్తును ఎటువంటి ఆటంకాలు లేకుండా సరఫరా చేస్తున్నాయి. కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం ఈ ఏడాది రబీ సీజను నుండి సోలార్ విద్యుత్‌ను వ్యవసాయానికి ప్రత్యేకంగా సరఫరా చేయనున్నాయి. గడిచిన పది రోజుల్లో ప్రజలకు.. ముఖ్యంగా రైతులకు ఏమాత్రం కొరత లేకుండా విద్యుత్ అందిస్తున్నాయి.

ఈ నెల 16 నుంచి 25వ తేదీ వరకు గత పది రోజుల్లో విద్యుత్ వినియోగం, సరఫరా, కొనుగోలు, కొరత వివరాలు (మిలియన్ యూనిట్లలో)

తేదీ	విద్యుత్ వినియోగం	విద్యుత్ లభ్యత	జాతీయ గ్రిడ్ నుంచి వాడిన అదనపు విద్యుత్	మార్కెట్ (ఎక్ఛేంజీ) కొనుగోళ్లు	కొరత
16	228.04	230.44	-2.40	0.68	0.00
17	226.13	227.40	-1.27	0.49	0.00
18	217.87	220.79	-2.92	2.73	0.00
19	225.81	226.88	-1.07	4.30	0.00
20	230.88	229.31	1.57	9.50	0.00
21	232.08	230.55	1.53	17.38	0.00
22	236.11	235.96	0.15	17.02	0.00
23	238.77	237.92	0.85	17.97	0.00
24	238.04	235.28	2.76	23.38	0.00
25	231.97	234.11	-2.14	17.77	0.00

8 మంది ఫిరాయింపు ఎమ్మెల్యేలపై అనర్హత వేటు

సాక్షి, అమరావతి: పార్టీ ఫిరాయించిన 8 మంది శాసన సభ్యులపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేశారు. వీరిలో వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి నలుగురు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి శాసనసభకు ఎన్నికై పార్టీ ఫిరాయించిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్ నియోజకవర్గం), ఆనం రామనారాయణ రెడ్డి (వెంకటగిరి), మేకపాటి చంద్రశేఖరరెడ్డి (ఉదయగిరి), ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ)పై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. టీడీపీ నుంచి శాసన సభకు ఎన్నికై పార్టీకి దూరంగా ఉంటున్న వాసుపల్లి గణేష్‌కుమార్ (విశాఖ దక్షిణ), కరణం బలరాం (చీరాల), మద్దాల గిరి (గుంటూరు వెస్ట్), వల్లభనేని వంశీ (గన్నవరం)పై అనర్హత వేటు వేయాలని టీడీపీ విప్ డోలా బాల వీరాంజనేయ స్వామి స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ రెండు పార్టీల ఫిర్యాదులపై స్పీకర్ తమ్మినేని సీతారాం పలుమార్లు ఎమ్మెల్యేలను విచారించారు. ఎమ్మెల్యేల నుంచి వివరణలు తీసుకున్నారు. పార్టీల విప్‌లు చేసిన ఫిర్యాదులు, ఎమ్మెల్యేలు ఇచ్చిన వివరణలను క్షుణ్ణంగా పరిశీలించిన స్పీకర్.. ఆ 8 మంది సభ్యులు పార్టీ ఫిరాయించినట్టు తేల్చారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం ఆ ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేశారు. స్పీకర్ ఆదేశాల మేరకు ఏపీ లెజిస్లేచర్ సెక్రటరీ జనరల్ పీపీకే రామాచార్యులు సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

చంద్రబాబు అండ్ కోది తప్పుడు ప్రచారం

మంత్రి ధర్మాన ప్రసాదరావు



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: తాను చెప్పిన విషయాన్ని వక్రీకరించి చంద్రబాబు అండ్ కో తనపై తప్పుడు ప్రచారం చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు చెప్పారు. గతంలో కడపకు చెందిన సుబ్బారెడ్డి అనే వ్యక్తి వచ్చి కళింగ వైశ్యుల భూముల వ్యవహారంలో సెటిల్‌మెంట్ చేస్తుంటే 'నువ్వొచ్చి చేయడమేమిటని, ఇక్కడి నుంచి పొమ్మని చెప్పాను' అని, అదే విషయాన్ని కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశంలో చెప్పానని తెలిపారు. కళింగ వైశ్యులకు తాను అండగా ఉన్నానన్న విషయాన్ని గుర్తు చేశానన్నారు. దీనిని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వక్రీకరించి రాజకీయ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నారని అన్నారు. ప్రతిదీ రాజకీయం చేయడం తప్ప అంతకుమించి టీడీపీ నేతలు సాధించిందేమీ లేదన్నారు. అసలు సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఎవరో తనకు తెలియదని, అప్పట్లో గట్టిగా చెప్పి పంపించేశానని అన్నారు. జిల్లాకు తాను ఎంత మేలు చేశానో ప్రజలందరికీ తెలుసునని చెప్పారు. జిల్లాలో ఎక్కడ చూసినా తన మార్కు అభివృద్ధి ఉంటుందన్నారు. ఈ జిల్లాకు మేలు జరిగింది ఒక్క వైఎస్సార్ ఫ్యామిలీతోనే అని ధర్మాన స్పష్టం చేశారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, అంబేడ్కర్ యూనివర్సిటీ, రిమ్స్ మెడికల్ కళాశాల తదితర కీలక ప్రాజెక్టులు వైఎస్ రాజశేఖరరెడ్డి చలవేనన్నారు. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్ హయాంలో జిల్లాలో కిడ్నీ రీసెర్చ్ ఆస్పత్రి, ఉద్దానం మంచినీటి ప్రాజెక్టు, మూలపేట పోర్టు, వంశధార లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్, మహేంద్రతనయ ప్రాజెక్టు పనులు ఊపందుకోవడం, బుడగట్లపాలెం ఫిషింగ్ హార్బర్ తదితర అభివృద్ధి పనులెన్నో జరిగాయన్నారు. చంద్రబాబు 14 ఏళ్లు సీఎంగా పనిచేసి జిల్లాకు ఒక్కటంటే ఒక్కటి కూడా మంచి చేయలేదని విమర్శించారు. చేతనైతే జిల్లాలో చంద్రబాబు ఏం అభివృద్ధి చేశారో చెప్పాలని ఆయన సవాల్ విసిరారు.

టీడీపీతో పొత్తుకు తొందరేం లేదు..

బీజేపీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు



సాక్షి, విశాఖపట్నం: తెలుగుదేశం పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి భారతీయ జనతా పార్టీ(బీజేపీ) తొందర పడడం లేదని ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు చెప్పారు. టీడీపీతో పొత్తు విషయంలో తమ అధిష్టానం అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకుంటుందని, ఆ తర్వాతే ఏదైనా ప్రకటన వెలువడుతుందని తెలిపారు. ఆయన సోమవారం సాయంత్రం విశాఖపట్నంలోని బీజేపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నందున దేశవ్యాప్తంగా పార్లమెంటరీ క్లస్టర్లలో పార్టీ సీనియర్లతో సమావేశాలు నిర్వహించాలని కేంద్ర పార్టీ నిర్ణయం తీసుకుందన్నారు. ఇందులో భాగంగా మంగళవారం కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాష్ట్రానికి వస్తున్నారని చెప్పారు. విశాఖ, విజయవాడ, ఏలూరుల్లో పర్యటిస్తారని వివరించారు. రాష్ట్రంలో రాజ్‌నాథ్‌సింగ్ పర్యటన ద్వారా బీజేపీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టినట్టేనన్నారు. విశాఖపట్నంలో మంగళవారం నుంచి వారం రోజులపాటు పీఎం రాష్ట్రీయ వయోశ్రీ పథకం ద్వారా 60 ఏళ్లు పైబడిన వృద్ధులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన పరికరాలను ఉచితంగా పంపిణీ చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు.

జనసేనలో చేరిన కొత్తపల్లి సుబ్బారాయుడు

సాక్షి, అమరావతి/నరసాపురం: పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి కొత్తపల్లి సుబ్బారాయుడు సోమవారం జనసేన పార్టీలో చేరారు. హైదరాబాద్‌లో జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఆశలతో ఉచ్చు.. ఎన్నో ఇళ్లలో చిచ్చు

▶ మొదటి పేజీ తరువాయి

కొనుక్కోవడం దేవుడెరుగు.. ఉన్న ఇళ్లు, భూములు, బంగారం అమ్ముకుంటున్నా అప్పుల ఊబి నుంచి బయట పడటం లేదు. అందమైన కలలు చూపిస్తూ రామోజీరావు సామాన్యుల మెడకు చిట్టీల ఉచ్చు బిగిస్తున్నారు. ఒక చిట్టీ అప్పు తీర్చడం పేరిట మరో చిట్టీలో చేర్పిస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తున్నారు. ఆస్తులు తెగనమ్ముకున్నా అప్పులు తీరవు.. సరికదా కాల్‌మనీ రాకెట్‌ను తలపిస్తూ మార్గదర్శి సిబ్బంది వేధింపులతో చందాదారుల కుటుంబాలు మానసిక క్షోభ అనుభవిస్తుండటం రామోజీ ఆర్థిక అరాచకాలకు నిదర్శనం. విజయవాడకు చెందిన ఓ ప్రభుత్వ వెటర్నరీ డాక్టర్ కుటుంబానికి ఇలాంటి క్షోభే మిగిలింది. ఈ వెటర్నరీ వైద్యుడి కుటుంబ సభ్యులు కోళ్ల ఫారం నిర్వహిస్తున్నారు. ఆయన భార్య మార్గదర్శి చిట్ ఫండ్స్‌లో ఒక గ్రూపులో చందాదారుగా చేరారు. ఆ తర్వాత ఆమెకు తెలియకుండానే మరికొన్ని చిట్టీ గ్రూపుల్లో సభ్యురాలిగా చేర్చారు. ఆ చిట్టీ గ్రూపుల చందాలు చెల్లించడం కోసమంటూ మరికొన్ని చిట్టీ గ్రూపుల్లో చేర్పిస్తూ ఏకంగా 90 చిట్టీ గ్రూపుల్లో సభ్యురాలిగా చూపించారు. నిబంధనల ప్రకారం ఇచ్చిన ష్యూరిటీలను కూడా గుర్తించకుండా ఏకంగా 17 చిట్టీ గ్రూపుల్లో డిఫాల్టర్‌గా చూపించారు. అనంతరం ఆ కుటుంబం ఆస్తులను గుంజుకున్నారు. ఆ వెటర్నరీ వైద్యుడు జీపీఎఫ్ డబ్బులు రూ.35 లక్షలతోపాటు పిల్లల పెళ్లి కోసం దాచుకున్న బంగారం కూడా అమ్మి చెల్లించినా ఇంకా అప్పులు తీరనే లేదు. కాల్‌మనీ రాకెట్ గూండాల మాదిరిగా మార్గదర్శి చిట్‌ఫండ్స్ సిబ్బంది వచ్చి అల్లరి చేసి మరీ వారి ఇంటిని వేలం వేయించారు. అంతటితో రామోజీ ఆగడాలు ఆగలేదు. విదేశాల్లో చదువుతున్న ఆ వెటర్నరీ డాక్టర్ కుమార్తె సంతకాన్ని కూడా ఫోర్జరీ చేసి చందాదారుగా చేర్చారు. ఆమె చిట్టీ పాట పాడినట్టు చూపించారు. రూ.9 లక్షల నష్టానికి చిట్టీ పాట పాడినట్టు చూపించి బకాయిలు మినహాయించుకుని కేవలం రూ.210 మాత్రమే ఇస్తామని రికార్డుల్లో సర్దుబాటు చేశారు. ఆ చిట్టీ గ్రూపునకు సంబంధించి వాయిదాల బకాయిలు చెల్లించాలని మళ్లీ వేధింపులు మొదలు పెట్టారు. అసలు ఈ దేశంలోనే లేని మా కుమార్తె ఎలా చందాదారుగా చేరింది.. ఎలా వేలం పాటలో పాల్గొంది.. అసలు తను వచ్చి ఎప్పుడు సంతకం చేసింది.. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానమే లేదు. ఆమె పేరుతో మార్గదర్శి చిట్ ఫండ్స్ ఉద్యోగులే మోసం చేశారు.

తలలు అమ్ముకున్నా తీరని అప్పులు

జాతీయ బ్యాంకులుగానీ ప్రైవేటు బ్యాంకులుగానీ తమ ఖాతాదారుల ఆర్థిక పరిస్థితిని సహేతుకంగా అంచనా వేసి తదనుగుణంగా రుణాలు ఇస్తాయి. రుణాలు చెల్లించే స్తోమతను బట్టి ఒక పరిమితి విధిస్తాయి. దేశంలో ఏ ఆర్థిక సంస్థ అయినా ఈ నిబంధనను పాటించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ మాత్రం అవేవీ పట్టించుకోదు. చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారికి కూడా వారి ఆదాయం, ఆర్థిక స్తోమతను మించి ఎన్నో చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పిస్తోంది. దాంతో వాయిదాలు చెల్లించలేక వారు అప్పుల ఊబిలో కూరుకుపోయి తమకున్న కొద్దిపాటి ఆస్తులను తమకు ధారాదత్తం చేసే పరిస్థితిని సృష్టిస్తున్నారు. అందుకు విజయవాడకు చెందిన ఓ టాక్సీ డ్రైవర్ దీనగాథే తార్కాణం. ఇతను మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో రూ.2 లక్షల చిట్టీ గ్రూపులో సభ్యునిగా చేరారు. తర్వాత మరిన్ని చిట్టీ గ్రూపుల్లో చేరితే ఆర్థికంగా కలసి వస్తుందని చెప్పడంతో మరో రెండు గ్రూపుల్లో సభ్యుడిగా చేరాడు. తర్వాత ఆయనకు తెలియకుండానే ఏకంగా 20 గ్రూపుల్లో సభ్యునిగా చేర్పించేశారు. నెలకు రూ.50 వేలు వాయిదాల కిందే చెల్లించాల్సిన పరిస్థితి సృష్టించారు. చిట్టీ పాట పాడిన తర్వాత ప్రైజ్‌మనీ తీసుకునేందుకు ఆయన ఇచ్చిన ష్యూరిటీలను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్దేశ పూర్వకంగానే కొర్రీలు వేసి తిరస్కరించింది. వాయిదాల బకాయిలు చెల్లించేందుకు తమకున్న ఇల్లు అమ్ముకోవాల్సిన పరిస్థితి సృష్టించారు. అసలు ఓ టాక్సీ డ్రైవర్ నెలకు రూ.50 వేలు చిట్టీ వాయిదాలు ఎలా చెల్లించగలరని మార్గదర్శి చిట్‌ఫండ్స్ విచక్షణతో యోచించి ఉంటే ఆయనకు అంతటి దుస్థితి ఏర్పడేది కాదు. కానీ రామోజీ లక్ష్యం ఆయనకు ఉన్న ఒక్క ఇంటిని గుంజుకోవడమే.

బరితెగించి రామోజీ ఆర్థిక ఆగడాలు

మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారుల్లో అత్యధికులది ఇలాంటి దుస్థితే. రాజకీయంగా ఎలాంటి అండాదండా లేనివారు, ప్రభుత్వ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఇతర మధ్య తరగతి వర్గాలను లక్ష్యంగా చేసుకుని రామోజీరావు పక్కాగా తన కుట్రను అమలు చేస్తూ వారి ఆస్తులను కొల్లగొడుతున్నారు. అటువంటి చందాదారుల్లో చిట్టీల చందాలు చెల్లింపుల్లో ఇబ్బంది పడుతున్న వారిని గుర్తించి, వారిని మరికొన్ని చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పిస్తున్నారు. కొత్త చిట్టీ గ్రూపులో ప్రైజ్ మనీతో పాత చిట్టీ గ్రూపు వాయిదాలు చెల్లించవచ్చని ఆశ చూపిస్తున్నారు. మళ్లీ కొత్త చిట్టీ దగ్గరకు వచ్చేసరికి ష్యూరిటీల పేరుతోనో మరో రకంగానో కొర్రీలు వేసి మరిన్ని చిట్టీ గ్రూపుల్లో చేర్పిస్తున్నారు. చాలా మంది చందాదారులకు తెలియకుండానే వారి పేరిట మార్గదర్శి చిట్‌ఫండ్స్ మేనేజర్లు చిట్టీ పాటలు పాడేస్తున్నారు. ఆ ప్రైజ్‌మనీని మరో చిట్టీ గ్రూపులో సర్దుబాటు చేసినట్టు రికార్డుల్లో చూపిస్తున్నారు.

అలా చందాదారులు తమకు తెలియకుండానే లెక్కకు మించి చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేరి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇక అప్పులు తీర్చడం వారి తరం కాదని నిర్ధారించుకున్న తర్వాత వారి ఇళ్లపై మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉద్యోగులు దాడులు చేస్తున్నారు. వారిని వేధిస్తూ.. సామాజిక గౌరవానికి భంగం కలిగిస్తూ మానసిక క్షోభకు గురి చేస్తున్నారు. దాంతో తమ ఆస్తులను మార్గదర్శి చిట్‌ఫండ్స్ పరం చేసి కట్టుబట్టలతో బయటకు వెళ్లిపోవాల్సిన అనివార్యత సృష్టిస్తున్నారు. కొందరి నుంచి ఆస్తి పత్రాలు, ఎల్ఐసీ బాండ్లు తీసుకుని మరీ డబ్బులు ఇవ్వకుండా వేధిస్తున్నారు. మరికొందరిని.. చిట్టీలు పాడినా పాట మొత్తం (ప్రైజ్‌మనీ) ఇచ్చేందుకు నెలల తరబడి తిప్పుతున్నారు. ఇంకొందరి సంతకాలను ఫోర్జరీ చేసి మరొకరికి ష్యూరిటీలో చూపిస్తూ చిట్టీ మొత్తం ఇవ్వకుండా వేధిస్తున్నారు. చిట్టీ వాయిదా ఒక్క రోజు ఆలస్యమైనా రూ.500 జరిమానా వసూలు చేస్తున్న మార్గదర్శి చిట్‌ఫండ్స్.. తాము చెల్లించాల్సిన చిట్టీ పాట మొత్తాన్ని మాత్రం నెలల తరబడి జాప్యం చేస్తున్నా సరే ఒక్క రూపాయి వడ్డీ చెల్లించడం లేదు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు.. వేలాది మంది మార్గదర్శి చిట్‌ఫండ్స్ చందాదారులు గగ్గోలు పెడుతున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌లో 50 శాతం వరకు ఇటువంటి బాధితులే ఉండటం రామోజీ మోసాల తీవ్రతకు నిదర్శనంగా నిలుస్తోంది.

యథేచ్ఛగా చట్టం ఉల్లంఘన

- ఎవరైనా ఓ చందాదారుడు చిట్టీ పాట పాడిన తర్వాత తగిన ష్యూరిటీలు చూపించకపోతే... ఆ చిట్టీ పాటను రద్దు చేయాలి. ఆ చిట్టీ గ్రూపునకు మళ్లీ పాట(వేలం) నిర్వహించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఆ నిబంధనను పాటించడం లేదు. ఆ చిట్టీ పాటను రద్దు చేయడం లేదు. కొత్తగా పాటను నిర్వహించడమూ లేదు. ఆ చిట్టీ పాట సక్రమంగా నిర్వహించినట్టు చూపిస్తూ ఆ ప్రైజ్‌మనీని వేరే ఖాతాల్లోకి మళ్లించేస్తోంది. ఆ చిట్టీ గ్రూపును యథావిధిగా కొనసాగిస్తోంది. దాంతో ఆ డిఫాల్టర్ చందాదారుడు తర్వాత నెలల వాయిదాలు కూడా చెల్లించాల్సినట్టు చూపిస్తూ అప్పుల ఊబిలోకి కూరుకుపోయేలా చేస్తోంది.
- వాయిదాలు చెల్లించలేని చందాదారుడిని డిఫాల్టర్‌గా చూపించాలి. అంతవరకు ఆ చందాదారు చెల్లించిన మొత్తాన్ని ప్రత్యేక ఖాతాలో వేసి కమీషన్ పోగా వెనక్కి ఇచ్చేయాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ అలా చేయడం లేదు. ఆ డిఫాల్టర్ చందాదారు మొత్తాన్ని మరో చిట్టీ బకాయి కింద జమ చేసినట్టు చూపిస్తూ.. ఇంకా బకాయిలు చెల్లించాలని రికార్డుల్లో ఆ చందాదారుడిని రుణగ్రస్తునిగా చూపిస్తోంది.
- ఎవరైనా ప్రైజ్‌మనీ తీసుకోని చందాదారు వాయిదాలు చెల్లించలేకపోతే డిఫాల్టర్‌గా ప్రకటించాలి. ఆ చందాదారునికి 14 రోజుల నోటీసు ఇచ్చి డిఫాల్టర్‌గా ప్రకటించినప్పటి వరకు చెల్లించిన వాయిదాలను ప్రత్యేక బ్యాంకు ఖాతాలో జమ చేయాలి. ఆ తర్వాత ఏడు రోజుల్లో ఆ మొత్తాన్ని నిర్దేశిత వడ్డీ రేటుతో కలిపి చెల్లించాలి. కానీ మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఈ నిబంధనను పాటించడం లేదు. అటువంటి చందాదారులను ఉద్దేశ పూర్వకంగా డిఫాల్టర్లుగా ప్రకటించకుండా కొనసాగిస్తూ వారు మరింతగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోంది.
- చిట్‌ఫండ్ చట్టం ప్రకారం ప్రతి చిట్టీ గ్రూపు దేనికదే ప్రత్యేకం. ప్రతి చిట్టీ గ్రూపు ఒక ప్రత్యేక కంపెనీ వంటిది. ఒక చిట్టీ గ్రూపు చందాదారుగా చెల్లించిన మొత్తాన్ని మరో చిట్టీ గ్రూపులో సర్దుబాటు చేసినట్టు చూపించకూడదు. ఈ నిబంధనను మార్గదర్శి చిట్‌ఫండ్స్ ఉల్లంఘిస్తూ చందాదారులను ఎన్నో చిట్టీ గ్రూపుల్లో సభ్యునిగా చూపిస్తూ... అన్ని చిట్టీ గ్రూపుల మొత్తాన్ని ఒకదానికి ఒకటి అనుసంధానిస్తూ చందాదారులను ఉద్దేశ పూర్వకంగా అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తోంది.

బాధితులకు అండగా చట్టం, ప్రభుత్వం

చిట్‌ఫండ్ కంపెనీల మోసాలు, ఆగడాల నుంచి బాధితులకు రక్షణ కల్పించి న్యాయం చేసేందుకు కేంద్ర చిట్‌ఫండ్స్ చట్టం సరైన వ్యవస్థను ఏర్పాటు చేసింది. చిట్టీ గ్రూపుల డిఫాల్టర్ సభ్యుల విషయంలో అనుసరించాల్సిన నిబంధనలను కేంద్ర చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 22లో విస్పష్టంగా పేర్కొంది. అయితే దశాబ్దాలుగా ప్రభుత్వాలు పట్టించుకోని ఆ చట్టాన్ని వైఎస్సార్‌సీపీ పటిష్టంగా అమలు చేస్తోంది. చిట్ రిజిస్ట్రార్‌లతోపాటు ప్రభుత్వం వరకు వివిధ స్థాయిల్లో అప్పీలు చేసుకునే అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే మార్గదర్శి అక్రమాలు, వేధింపులకు చెక్ పెట్టవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. మార్గదర్శి చిట్‌ఫండ్స్‌తోపాటు ఇతర చిట్‌ఫండ్ కంపెనీల బాధితులు తమ సమస్యను తెలియజేసి న్యాయం పొందేందుకు ప్రత్యేక వ్యవస్థ ఉంది. కేంద్ర చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్ 64 నుంచి 68 వరకు జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌కు విస్తృత అధికారాలున్నాయి. ఆయనకు జ్యుడీషియరీ అధికారాలను చట్టం కల్పించింది. చందాదారులు తమకు చిట్‌ఫండ్ కంపెనీ మోసం చేసిందీ.. వేధిస్తోంది.. అని భావిస్తే తగిన ఆధారాలతో జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయవచ్చు. తాము సరైన ష్యూరిటీలు సమర్పించినా ఆమోదించడం లేదని, తమను డిఫాల్టర్‌గా ప్రకటించి అప్పటి వరకు చెల్లించిన వాయిదాలను వెనక్కి ఇవ్వాలని.. తమ సమ్మతి లేకుండానే ఎన్నో చిట్టీ గ్రూపుల్లో సభ్యులుగా చేర్పించారని... తమ సంతకాలను ఫోర్జరీ చేశారని.. ఇలా ఎటువంటి సమస్యలపైన అయినా ఫిర్యాదు చేయవచ్చు. దానిపై జిల్లా అసిస్టెంట్ రిజిస్ట్రార్ విచారించి తగిన చర్యలు తీసుకుంటారు. ఆమేరకు ఆదేశాలు జారీ చేస్తారు. జిల్లా అసిస్టెంట్ చిట్ రిజిస్ట్రార్ ఇచ్చిన ఆదేశాలతో సంతృప్తి చెందకపోతే బాధితులు రాష్ట్ర స్థాయిలో కూడా ఫిర్యాదు చేసేందుకు అవకాశం కల్పించారు. చిట్‌ఫండ్ చట్టంలోని సెక్షన్లు 69, 70 ప్రకారం రాష్ట్ర చిట్స్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేయవచ్చు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఆదేశాలు ఇచ్చిన రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అప్పీల్ చేసి తగిన న్యాయం పొందవచ్చు.

'స్కిల్' కేసులో చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాల్సిందే

సుప్రీంకోర్టులో ఏపీ సీఐడీ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో చంద్రబాబు బెయిల్‌ను రద్దు చేయాల్సిందేనని ఏపీ సీఐడీ సుప్రీంకోర్టుకు విజ్ఞప్తి చేసింది. బెయిల్ షరతుల ఉల్లంఘన స్పష్టంగా కనిపిస్తోందని ఆరోపించింది. చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు అధికారులను బెదిరిస్తూ బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారని ధర్మాసనం దృష్టికి తెచ్చింది. వచ్చే ఎన్నికల అనంతరం అధికారంలోకి వస్తామని.. ఆ తర్వాత చంద్రబాబు కేసులో దర్యాప్తు చేస్తున్న అధికారులపై ప్రతీకారం తీర్చుకుంటామని బెదిరిస్తున్నారని నివేదించింది. ఏపీ హైకోర్టు చంద్రబాబుకు ఇచ్చిన బెయిల్‌ను రద్దు చేయాలంటూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన పిటిషన్‌ను సోమవారం న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం.త్రివేది, జస్టిస్ పంకజ్ మిత్తల్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఈ సందర్భంగా టీడీపీ అధికారంలోకి వచ్చాక స్కిల్ కేసును దర్యాప్తు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకుంటామని బహిరంగంగా ప్రకటనలు చేస్తున్నారని ఏపీ సీఐడీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ఇలా చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. ఈ సమయంలో న్యాయమూర్తి జస్టిస్ బేలా ఎం.త్రివేది జోక్యం చేసుకొని రికార్డుల్లో లేని అంశాలను పరిగణనలోకి తీసుకోబోమని తెలిపారు. దీంతో చంద్రబాబు కుటుంబసభ్యుల ప్రకటనలకు సంబంధించి అదనపు డాక్యుమెంట్లు అందజేయడానికి ఏపీ సీఐడీ అనుబంధ పిటిషన్ దాఖలు చేశామని రోహత్గి కోర్టు దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఏపీ సీఐడీ ఏం కోరుకుంటోందని జస్టిస్ బేలా ఎం త్రివేది ప్రశ్నించగా.. చంద్రబాబు బెయిల్ రద్దు చేయాలని రోహత్గి విన్నవించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ పోటీ చేస్తోందని, ఈ సమయంలో బెదిరింపు ప్రకటనలను తేలిగ్గా తీసుకోరాదని తెలిపారు. చంద్రబాబు బెయిల్ రద్దు కోరుతూ ఏపీ సీఐడీ దాఖలు చేసిన అప్పీల్ కోర్టు ముందుందన్నారు. నిందితుడి కుటుంబ సభ్యుడి తీరు దిగ్భ్రాంతికరంగా ఉందని.. అధికారుల పేర్లన్నీ ఒక పుస్తకంలో రాస్తున్నట్లు చెబుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. వీరి పార్టీ వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తున్నందున బెదిరింపు ప్రకటనలు చేసేవారికి బెయిల్ ప్రయోజనం, స్వేచ్ఛ లభించకూడదన్నదే తమ ఉద్దేశమన్నారు. దీన్ని చాలా తీవ్రంగా పరిగణించాలని కోర్టుకు విన్నవించారు. చంద్రబాబు తరఫు సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే వాదనలు వినిపిస్తూ సీఐడీ అనుబంధ పిటిషన్‌పై స్పందించడానికి తమకు సమయం కావాలని కోరారు. దీంతో రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. అవసరమనుకుంటే పిటిషనర్ కూడా స్పందించవచ్చని పేర్కొంది. తదుపరి విచారణను మార్చి 19కి వాయిదా వేసింది.

దూరదృష్టి ఉన్న నేత సీఎం వైఎస్ జగన్

- యువతకు ఉన్నతవిద్య, ఉపాధి, ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా పాలన
- ఐదేళ్లలో 6.38 లక్షల ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు
- యువతకు 20 లక్షలకు పైగా ప్రైవేటు కొలువులు
- ఇంటికో ఉద్యోగమంటూ యువతను చంద్రబాబు నట్టేట ముంచారు
- తిరుపతిలో 'యువశక్తి–ఉద్యోగ విప్లవం' చర్చాగోష్టిలో వక్తలు



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి. వేదికపై ఎంపీ గురుమూర్తి, అభినయ్‌రెడ్డి, మేధావులు

తిరుపతి సిటీ: దూరదృష్టితో రాష్ట్రాభివృద్ధి, యువతకు ఉద్యోగ కల్పనే లక్ష్యంగా పాలన సాగిస్తున్న నేత సీఎం వైఎస్ జగన్ అని డిప్యూటీ సీఎం నారాయణ స్వామి కొనియాడారు. సోమవారం తిరుపతి ఇందిరా మైదానంలో సాక్షి టీవీ ఆధ్వర్యంలో 'యువశక్తి–ఉద్యోగ విప్లవం' అనే అంశంపై చర్చాగోష్టిని నిర్వహించారు. ఇందులో మేధావుల ఫోరం సమన్వయకర్త పురుషోత్తంరెడ్డి, అధికార భాషా సంఘం అధ్యక్షురాలు మస్తానమ్మ, బీజేపీ నాయకులు సామంచి శ్రీనివాస్, తిరుపతి నగర ప్రజలు, విద్యావంతులు పాల్గొన్నారు. డిప్యూటీ సీఎం నారాయణ స్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో 70 ఏళ్లలో జరగని అభివృద్ధిని ఐదేళ్లలోనే సీఎం జగన్ చేసి చూపించారన్నారు. దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో ప్రతి ఇంటిలో యువత ఇంజనీరింగ్, ఎంబీబీఎస్ కోర్సులు చదివారని తెలిపారు. శ్రీసిటీని ఏర్పాటు చేసి 50వేల మందికి ఉపాధి కల్పించిన వ్యక్తి వైఎస్సారేనన్నారు. అదే దారిలో సీఎం జగన్ కూడా నడుస్తున్నారని చెప్పారు. విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చి, ఉద్యోగ విప్లవానికి నాంది పలికారన్నారు. యువతకు 6.38 లక్షల ఉద్యోగాలు కల్పించారని కొనియాడారు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెన, విదేశీ దీవెన పథకాలతో యువత ఉన్నత చదువులు చదువుతున్నారన్నారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి అంటూ యువతను ముంచిన వ్యక్తి చంద్రబాబు అని మండిపడ్డారు.

తిరుపతి రూపురేఖలు మారాయి

విజన్ ఉన్న నాయకుడి పాలనలో పనిచేయడం గర్వంగా ఉంది. సీఎం వైఎస్ జగన్ పాలనలో తిరుపతి నగరంలో అభివృద్ధి బాగా జరిగింది. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కోసం రూ.10 కోట్లు కేటాయించారు. శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీ అభివృద్ధికి రూ.100 కోట్లు ఇచ్చారు. యూనివర్సిటీల్లో మౌలిక వసతులు, అధ్యాపకుల నియామకం, బస్‌స్టేషన్, రైల్వేస్టేషన్ ఆధునికీకరణ చేపట్టారు.

– గురుమూర్తి, తిరుపతి వైఎస్సార్‌సీపీ ఎంపీ

ఐటీ హబ్‌గా తిరుపతి..

యువతకు ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా సీఎం జగన్ ఆశీస్సులతో త్వరలో శెట్టిపల్లి సమీపంలో ఐటీ హబ్‌ను ఏర్పాటు చేస్తాం. ఈ ప్రభుత్వం పారిశ్రామికరంగాన్ని అభివృద్ధి చేసి.. ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పిస్తోంది. గ్రామ, వార్డు సచివాలయాల్లో 1.34 లక్షలు, ఆర్టీసీలో 51,387, వైద్య రంగంలో 53 వేల శాశ్వత ఉద్యోగాలను భర్తీ చేసింది. కాంట్రాక్ట్ పద్ధతిలో 43,923, ఔట్‌సోర్సింగ్ విధానంలో 3.73 లక్షల ఉద్యోగాల భర్తీ జరిగింది.

– భూమన అభినయ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ తిరుపతి సమన్వయకర్త

అన్ని రంగాల్లో అభివృద్ధి..

సీఎం జగన్ రాష్ట్రంలో అన్ని రంగాలను అభివృద్ధి చేసి పాలనలో తనదైన ముద్ర వేశారు. యువతకు ఉపాధి, ఉద్యోగాల కల్పించడమే లక్ష్యంగా పారిశ్రామిక రంగంలో రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులను ఆహ్వానించారు. 2014 నుంచి 2019 వరకు సీఎంగా ఉన్న చంద్రబాబు 34 వేల ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేశారు. ఈ ఐదేళ్లలోనే సీఎం జగన్ 6.38 లక్షల ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు, 20 లక్షల ప్రైవేటు ఉద్యోగాలు ఇచ్చారు.

– కొమ్మినేని శ్రీనివాసరావు, ప్రముఖ జర్నలిస్ట్



మైదానంలోకి దిగిన హార్దిక్ పాండ్యా

భారత్ ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా గాయం నుంచి కోలుకొని సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ మైదానంలోకి అడుగు పెట్టాడు. డీవై పాటిల్ టి20 కప్ క్రికెట్ టోర్నీలో రిలయన్స్ జట్టు తరఫున అతను బరిలోకి దిగాడు. జీపీసీఎల్‌తో సోమవారం జరిగిన మ్యాచ్‌లో 3 ఓవర్లలో 22 పరుగులిచ్చి 1 వికెట్ తీసిన పాండ్యా...10వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 3 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. గత ఏడాది వన్డే వరల్డ్ కప్‌లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో పాండ్యా కాలి మడమకు గాయం కాగా...అప్పటి నుంచి అతను రీహాబిలిటేషన్‌లోనే ఉన్నాడు.

ట్రయల్స్‌కు బజరంగ్, వినేశ్, సాక్షిలకు ఆహ్వానం

ఆసియా చాంపియన్‌షిప్, ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీలో పాల్గొనే భారత జట్లను ఎంపిక చేసేందుకు నిర్వహించే ట్రయల్స్‌లో పాల్గొనాల్సిందిగా స్టార్ రెజ్లర్లు బజరంగ్, వినేశ్, సాక్షి మలిక్‌లను భారత రెజ్లింగ్ సమాఖ్య ఆహ్వానించింది. మార్చి 10, 11 తేదీల్లో ఈ ట్రయల్స్ జరుగనున్నాయి. డబ్ల్యూఎఫ్ఐ మాజీ చీఫ్ బ్రిజ్‌భూషణ్‌పై న్యాయపోరాటం చేసిన బజరంగ్, వినేశ్, సాక్షిలపై వివక్ష చూపరాదని షరతు విధిస్తూ యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్... డబ్ల్యూఎఫ్ఐపై సస్పెన్షన్‌ను ఎత్తేసింది.



చెలరేగిన షఫాలీ, లానింగ్

ఢిల్లీ క్యాపిటల్స్ ఘనవిజయం



షఫాలీ

బెంగళూరు: టోర్నీ తొలి మ్యాచ్‌లో అనూహ్యంగా చివరి బంతికి ఓటమి పాలైన ఢిల్లీ క్యాపిటల్స్ రెండో పోరులో సత్తా చాటింది. సోమవారం ఏకపక్షంగా సాగిన మహిళల ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ 9 వికెట్ల తేడాతో యూపీ వారియర్స్‌పై గెలిచింది. యూపీకి ఇది వరుసగా రెండో పరాజయం. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన యూపీ 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 119 పరుగులే చేయగలిగింది. శ్వేత సెహ్రావత్ (42 బంతుల్లో 45; 5 ఫోర్లు, 1 సిక్స్) మినహా అంతా విఫలమయ్యారు. ఢిల్లీ స్పిన్నర్ రాధా యాదవ్ (4/20) ప్రత్యర్థిని కుప్పకూల్చగా, 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' మరిజాన్ కాప్‌కు 3 వికెట్లు దక్కాయి. అనంతరం ఢిల్లీ 14.3 ఓవర్లలో ఒక వికెట్ కోల్పోయి 123 పరుగులు చేసింది. షఫాలీ వర్మ (43 బంతుల్లో 64 నాటౌట్; 6 ఫోర్లు, 4 సిక్స్‌లు), కెప్టెన్ మెగ్ లానింగ్ (43 బంతుల్లో 51; 6 ఫోర్లు) దూకుడైన ఆటతో అర్ధ సెంచరీలు సాధించారు. స్కోర్లు సమమైన తర్వాత లానింగ్ అవుట్ కాగా, జెమీమా రోడ్రిగ్స్ (4 నాటౌట్) లాంఛనం పూర్తి చేసింది. మరో 33 బంతులు మిగిలి ఉండగానే గెలుపు ఢిల్లీ సొంతమైంది. నేడు జరిగే పోరులో రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది.

సెమీస్‌లో పట్నా, హరియాణా



సాక్షి, హైదరాబాద్: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పట్నా పైరేట్స్, హరియాణా స్టీలర్స్ జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన ఎలిమినేటర్–1లో పట్నా పైరేట్స్ 37–35తో దబంగ్ ఢిల్లీ జట్టును ఓడించగా... ఎలిమినేటర్–2లో హరియాణా స్టీలర్స్ 42–25తో గుజరాత్ జెయింట్స్‌పై గెలిచింది. పట్నా తరఫున సచిన్ (9 పాయింట్లు), సుధాకర్ (5), మంజీత్ (5), సందీప్ (5) రాణించారు. ఢిల్లీ తరఫున అషు మలిక్ ఏకంగా 19 పాయింట్లు స్కోరు చేయడం విశేషం. మరో మ్యాచ్‌లో హరియాణా తరఫున వినయ్ (12), శివమ్ (8), మోహిత్ (7) ఆకట్టుకున్నారు. బుధవారం జరిగే సెమీఫైనల్స్‌లో పుణేరి పల్టన్‌తో పట్నా పైరేట్స్; జైపూర్ పింక్ పాంథర్స్‌తో హరియాణా స్టీలర్స్ తలపడతాయి.

కుర్రాళ్లు కొట్టేశారు

- నాలుగో టెస్టులో భారత్ విజయం
- 5 వికెట్ల తేడాతో ఓడిన ఇంగ్లండ్
- సిరీస్ 3–1తో భారత్ వశం
- రాణించిన రోహిత్, గిల్, జురెల్
- మార్చి 7 నుంచి చివరి టెస్టు



గిల్ జురెల్

కింగ్ కోహ్లి ఈ సిరీస్ నుంచి తప్పుకున్నాడు. తొలి టెస్టులో మంచి ఇన్నింగ్స్ ఆడిన కేఎల్ రాహుల్ గాయంతో తర్వాత మూడు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. వైఫల్యంతో శ్రేయస్ అయ్యర్‌ను తీసేశారు. ఇక ప్రధాన బ్యాటింగ్ దళానికి కెప్టెన్ రోహిత్ శర్మ ఒక్కడే పెద్ద దిక్కు. రజత్ పటిదార్, ధ్రువ్ జురెల్, సర్ఫరాజ్, ఆకాశ్ దీప్... వీళ్లంతా పూర్తిగా కొత్తవాళ్లు! ఈ సిరీస్‌తోనే అరంగేట్రం చేశారు. 11 మందిలో నలుగురు కొత్తవాళ్లతో... మిగతా అనుభవం లేనివారితో... సంప్రదాయ మ్యాచ్‌లాడి ఇంగ్లండ్‌లాంటి 'బజ్‌బాల్' దూకుడు జట్టును ఓడించడం ఆషామాషీ కానేకాదు. కానీ కుర్రాళ్లతో నిండిన టీమిండియా ఆడి గెలిచింది. సిరీస్‌ను సొంతం చేసుకుంది. రోహిత్, కోహ్లి తర్వాత టీమిండియా భవిష్యత్తుకు కొండంత విశ్వాసాన్ని ఈ సిరీస్ ఇచ్చింది.

రాంచీ: ఐదు టెస్టుల సిరీస్‌ను ఆఖరి మ్యాచ్ మిగిలుండగానే భారత్ 3–1తో కైవసం చేసుకుంది. గత మ్యాచ్‌ల్లాగే నాలుగు రోజుల్లోనే ముగిసిన ఈ నాలుగో టెస్టులో భారత్ ఐదు వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌పై విజయం సాధించింది. 192 పరుగుల లక్ష్యాన్ని భారత్ రెండో ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఓపెనర్, కెప్టెన్ రోహిత్ శర్మ (81 బంతుల్లో 55; 5 ఫోర్లు, 1 సిక్స్), శుబ్‌మన్ గిల్ (124 బంతుల్లో 52 నాటౌట్; 2 సిక్స్‌లు) అర్ధసెంచరీలతో రాణించారు. తొలి ఇన్నింగ్స్ టాప్‌స్కోరర్ ధ్రువ్ జురెల్ (77 బంతుల్లో 39 నాటౌట్; 2 ఫోర్లు) టెస్టు విజయానికి అవసరమైన పరుగుల్ని అజేయంగా చేసి పెట్టాడు. ఇంగ్లండ్ స్పిన్నర్లలో షోయబ్ బషీర్ 3 వికెట్లు పడగొట్టగా, రూట్, హార్ట్‌లీలకు చెరో వికెట్ దక్కింది. రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ కీలకమైన పరుగులు చేసిన కొత్త వికెట్ కీపర్, బ్యాటర్ ధ్రువ్ జురెల్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది.

రోహిత్, గిల్ ఫిఫ్టీ–ఫిఫ్టీ

ఈ టెస్టుతో పాటు సిరీస్ విజయానికి 152 పరుగులు కావాల్సి ఉండగా... ఓవర్‌నైట్ స్కోరు 40/0తో రెండో ఇన్నింగ్స్‌ను కొనసాగించిన టీమిండియాను ఓపెనర్లు రోహిత్, జైస్వాల్ ఒడిదొడుకుల్లేకుండా నడిపించారు. కుదురుగా ఆడుతున్న యశస్వి జైస్వాల్ (44 బంతుల్లో 37; 5 ఫోర్లు)ను జట్టు స్కోరు 84 పరుగుల వద్ద రూట్ బోల్తా కొట్టించాడు. అర్ధసెంచరీ పూర్తిచేసుకున్నాక మరో ఓపెనర్ రోహిత్‌ను హార్ట్‌లీ పెవిలియన్ చేర్చాడు. 99/2 వద్ద ఓపెనర్లే అవుటయ్యారు. ఇక్కడిదాకా టీమిండియా మంచి స్థితిలోనే ఉంది. అయితే బషీర్ స్పిన్నేయడంతో రజత్ పటిదార్ (0), జడేజా (4), సర్ఫరాజ్ (0)లు బ్యాట్లెత్తారు. అప్పుడు భారత్ స్కోరు 120/5. సగం వికెట్లను కోల్పోయింది. ఇక మిగిలిన సగంలో జురెల్ తప్ప అంతా స్పెషలిస్టు బౌలర్లే! లక్ష్యమింకా 72 పరుగుల దూరంలో ఉంది. ఇలాంటి గడ్డు స్థితిలో శుబ్‌మన్, జురెల్ మొండి పోరాటం చేశారు. ఇంగ్లండ్ సారథి స్టోక్స్ వరుసబెట్టి స్పిన్ త్రయం బషీర్, హార్ట్‌లీ, రూట్‌లతోనే బౌలింగ్ వేయించాడు. అయినా ప్రత్యర్థి జట్టుకు పట్టుబిగించే అవకాశమివ్వకుండా... మరో వికెట్ పడకుండా గిల్–జురెల్ జోడీ ఇన్నింగ్స్‌ను నడిపించింది. ఈ క్రమంలో శుబ్‌మన్ ఫిఫ్టీ పూర్తి చేసుకోగా... టీ విరామానికి ముందే భారత్ విజయతీరాలకు చేరుకుంది. ఇద్దరు అబేధ్యమైన ఆరో వికెట్‌కు 72 పరుగులు జోడించడంతో టెస్టుతోపాటు సిరీస్ కూడా మన జట్టు వశమైంది.

- వరుసగా మూడు టెస్టుల్లో గెలిచి 3–1తో ఐదు టెస్టుల సిరీస్‌ను కైవసం చేసుకున్న భారత్ 64.58 శాతంతో ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో కొనసాగుతోంది. న్యూజిలాండ్ (75) అగ్రస్థానంలో, ఆస్ట్రేలియా (55) మూడోస్థానంలో ఉన్నాయి.
- ఈ టెస్టూ నాలుగో రోజుల్లో ముగియడం... ధర్మశాలలో ఆఖరి టెస్టు (మార్చి 7 నుంచి)కు 9 రోజుల విరామం ఉండటంతో ఇంగ్లండ్ జట్టు సభ్యులు రెండు వేర్వేరు చోట్ల విశ్రాంతి తీసుకోనున్నారు. కొన్నాళ్లు చండీగఢ్, ఆ తర్వాత బెంగళూరుల్లో స్టోక్స్ బృందం సేద తీరుతుంది. మూడో టెస్టుకు ముందూ ఇలాంటి గ్యాపే ఉండటంతో ఇంగ్లండ్ జట్టు అబుదాబిలో విశ్రాంతి తీసుకొని వచ్చింది.

స్కోరు వివరాలు

ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 353; భారత్ తొలి ఇన్నింగ్స్: 307; ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: 145; భారత్ రెండో ఇన్నింగ్స్: రోహిత్ (సి) ఫోక్స్ (బి) హార్ట్‌లీ 55; యశస్వి (సి) అండర్సన్ (బి) రూట్ 37; శుబ్‌మన్ గిల్ (నాటౌట్) 52; రజత్ పటిదార్ (సి) పోప్ (బి) బషీర్ 0; జడేజా (సి) బెయిర్‌స్టో (బి) బషీర్ 4; సర్ఫరాజ్ (సి) పోప్ (బి) బషీర్ 0; ధ్రువ్ జురెల్ (నాటౌట్) 39; ఎక్స్‌ట్రాలు 5; మొత్తం (61 ఓవర్లలో 5 వికెట్లకు) 192. వికెట్ల పతనం: 1–84, 2–99, 3–100, 4–120, 5–120. బౌలింగ్: జో రూట్ 7–0–26–1, హార్ట్‌లీ 25–2–70–1, బషీర్ 26–4–79–3, అండర్సన్ 3–1–12–0.

17 స్వదేశంలో భారత్‌కిది వరుసగా 17వ టెస్టు సిరీస్ విజయం. చివరిసారి టీమిండియా సొంతగడ్డపై 2012లో ఇంగ్లండ్ చేతిలోనే ఓడిపోయింది.



మధ్యప్రదేశ్ ఆటగాళ్ల సంబరం

నాలుగు పరుగుల వేదన!

- క్వార్టర్ ఫైనల్లో ఓడిన ఆంధ్ర
- రంజీ సెమీస్‌లో మధ్యప్రదేశ్

ఇండోర్: ప్రతిష్టాత్మక దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీలో తొలిసారి సెమీఫైనల్లోకి అడుగు పెట్టాలనుకున్న ఆంధ్ర జట్టు ఆశలు గల్లంతయ్యాయి. సోమవారం ముగిసిన ఈ మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ 4 పరుగుల తేడాతో ఆంధ్రపై విజయం సాధించింది. 170 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 95/4తో నాలుగో రోజు ఆట కొనసాగించిన ఆంధ్ర తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. హనుమ విహారి (136 బంతుల్లో 55; 5 ఫోర్లు) అర్ధ సెంచరీతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అనుభవ్ (6/52) ఆరు వికెట్లతో ఆంధ్రను దెబ్బ తీశాడు. 129/8తో ఇబ్బందుల్లో పడిన ఆంధ్ర జట్టును అశ్విన్ హెబర్ (22), గిరినాథ్ రెడ్డి (15) తొమ్మిదో వికెట్‌కు 32 పరుగులు జత చేసి గెలుపు దిశగా తీసుకెళ్లారు. అయితే గిరినాథ్‌నూ అనుభవ్ వెనక్కి పంపించాడు. గెలుపు కోసం చివరి వికెట్‌కు మరో 9 పరుగులు చేయాల్సి ఉండగా ఆంధ్ర నాలుగు పరుగులు జోడించింది. అయితే ఖెజ్రోలియా బౌలింగ్‌లో హెబర్ ఎల్బీడబ్ల్యూ కావడంతో ఆంధ్ర శిబిరం తీవ్ర నిరాశలో మునిగింది. మరో క్వార్టర్ ఫైనల్లో తమిళనాడు ఇన్నింగ్స్, 33 పరుగుల తేడాతో సౌరాష్ట్రను ఓడించి సెమీస్‌లోకి అడుగు పెట్టింది.

ఆంధ్ర జట్టుకు మళ్లీ ఆడను: విహారి



ఇండోర్: ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) క్రికెటేతర కారణాలతో తనను అవమానపర్చిందని, ఇకపై ఆ జట్టుకు ఆడబోనని భారత టెస్టు క్రికెటర్ గాదె హనుమ విహారి ప్రకటించాడు. తాజా రంజీ ట్రోఫీ సీజన్‌లో ఆంధ్ర టీమ్ క్వార్టర్ ఫైనల్లో మధ్యప్రదేశ్ చేతిలో ఓడిన అనంతరం అతను ఈ విషయాన్ని వెల్లడించాడు. సీజన్ తొలి మ్యాచ్ తర్వాత తనను కెప్టెన్సీ నుంచి తొలగించేందుకు కారణమైన ఘటన వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు విహారి పేర్కొన్నాడు. 'బెంగాల్‌తో తొలి మ్యాచ్ సమయంలో కెప్టెన్‌గా ఉన్న నేను జట్టు సహచరుడు ఒకరిపై (కేఎన్ పృథ్వీరాజ్) ఆగ్రహం వ్యక్తం చేశాను. రాజకీయ నాయకుడి కుమారుడైన అతను తన తండ్రితో ఈ విషయం చెప్పాడు. దాంతో ఏసీఏ అధికారులు నన్ను కెప్టెన్సీ నుంచి తప్పించారు. నేనేమీ వ్యక్తిగత దూషణకు పాల్పడకపోయినా నాకంటే ఆ ప్లేయర్‌కే ప్రాధాన్యతనిచ్చి ఏసీఏ చర్య తీసుకుంది. భారత్‌కు 16 టెస్టులు ఆడిన నేను గత ఏడాది జట్టు కోసం ఒంటి చేత్తో బ్యాటింగ్ చేశా. 7 సీజన్లలో 5సార్లు నాకౌట్ చేరడంలో కీలక పాత్ర పోషించా. ఆటపై, జట్టుపై ఇష్టంతో సీజన్ ముగిసేవరకు ఆగి ఇప్పుడు ఈ విషయాన్ని చెబుతున్నా. ఇకపై ఆంధ్ర జట్టుకు ఆడను' అని విహారి స్పష్టం చేశాడు. సదరు క్రికెటర్ ప్రవర్తనపై జట్టు సభ్యులంతా తనకు మద్దతుగా నిలిచిన లేఖను కూడా విహారి సోషల్ మీడియాలో పెట్టాడు.

ఏసీఏ వివరణ...

సాక్షి, విశాఖపట్నం: విహారి ఆరోపణల్లో వాస్తవం లేదని ఏసీఏ తెలిపింది. 'విహారి తనను తిట్టాడంటూ ఒక క్రికెటర్ ఏసీఏకు అధికారికంగా ఫిర్యాదు చేసిన మాట వాస్తవం. మా దృష్టిలో ఆటగాళ్లంతా సమానమే. అయితే కెప్టెన్సీ తీసేయడానికి ఇది కారణం కాదు. భారత టెస్టు జట్టులో స్థానం ఆశిస్తున్న విహారి పూర్తి సీజన్‌కు అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో రికీ భుయ్‌ను నియమించాం. గతంలోనూ విహారి మాటతీరుపై ఫిర్యాదులు వచ్చాయి. ముస్తాక్ అలీ టోర్నీ సమయంలో జట్టులో విభేదాలు ఉన్నట్లూ తెలిసింది. ఆంధ్రకు వచ్చినప్పటి నుంచి కూడా విహారి పదే పదే జట్టు మారేందుకు ప్రయత్నిస్తూ ఎన్‌ఓసీలు అడిగాడు. అయితే ఆపై క్షమాపణలు కోరడంతో జట్టు కోసం అతడిని కొనసాగించాం. తాజా ఘటనపై విచారణ జరిపించి తదుపరి చర్యలు తీసుకుంటాం' అని ఏసీఏ స్పష్టం చేసింది.

సినిమా రీల్స్

అందుకే ఆ టైటిల్!



● ప్రభాస్

ప్రభాస్ హీరోగా నటిస్తున్న తాజా పాన్ ఇండియన్ చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో దీపికా పదుకోన్ హీరోయిన్. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దిశా పటానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ కథాంశంతో ఈ మూవీ రూపొందుతోంది. ఇదిలా ఉంటే.. ఈ సినిమా టైటిల్‌ని తొలుత 'ప్రాజెక్ట్ కె' అని నిర్ణయించారు. ఆ తర్వాత 'కల్కి 2898 ఏడీ'గా మార్చారు. కొత్త టైటిల్‌పై ఇటు సినిమా ఇండస్ట్రీలోనూ, అటు ప్రేక్షకులు, ప్రభాస్ అభిమానుల్లోనూ ఆసక్తి నెలకొంది. తాజాగా ఓ కార్యక్రమంలో పాల్గొన్న నాగ్ అశ్విన్ 'కల్కి 2898 ఏడీ' టైటిల్ ఎందుకు పెట్టామనే విషయాన్ని వెల్లడించారు. ''నేను మహాభారతం గురించి వింటూ, స్టార్ వార్స్‌ని చూస్తూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' ఆలోచన వచ్చింది. ఈ చిత్రకథ మహాభారతం కాలం నుంచి మొదలై 2898తో పూర్తవుతుంది. గతంతో ప్రారంభమై భవిష్యత్తుతో ముగుస్తుంది కాబట్టి 'కల్కి 2898 ఏడీ' టైటిల్ పెట్టాం. ఈ మూవీలో ఆరు వేల సంవత్సరాల మధ్య జరిగే కథను చూపించనున్నాం. భవిష్యత్తు ప్రపంచం ఎలా ఉంటుందో చూపే ప్రయత్నం కూడా చేశాం. ఈ క్రమంలోనే ఓ ఊహా ప్రపంచాన్ని సృష్టించాం. సినిమాలోని ప్రధాన పాత్రలన్నీ ఇండియన్ మైథాలజీ చుట్టే ఉంటాయి. గతంలో హాలీవుడ్‌లో విడుదలైన సైన్స్ ఫిక్షన్ థ్రిల్లర్ 'బ్లేడ్ రన్నర్' మూవీ పోలికలు 'కల్కి 2898 ఏడీ'లో ఎక్కడా కనిపించవు. ఓ రకంగా ఇది నాకు సవాల్'' అన్నారు. సి. అశ్వినీదత్ నిర్మిస్తున్న 'కల్కి 2898 ఏడీ' మే 9న విడుదల కానుంది.

కింగ్ కోసం ట్రైనింగ్



● సుహానా ఖాన్

బాలీవుడ్ కింగ్ ఖాన్ షారుక్ ఖాన్, ఆయన తనయ సుహానా ఖాన్ కలిసి ఓ యాక్షన్ మూవీ చేయనున్నారనే టాక్ వినిపిస్తోన్న సంగతి తెలిసిందే. ఈ సినిమాకు 'కింగ్' అనే టైటిల్ పరిశీలిస్తున్నారట మేకర్స్. సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహించనున్న ఈ సినిమా చిత్రీకరణను ఈ ఏడాది మేలో ఆరంభించాలని యూనిట్ ప్లాన్ చేస్తోందని సమాచారం. ఈ సినిమాలో సుహానా ఖాన్‌కు కూడా యాక్షన్ సీన్స్ ఉంటాయట. దీంతో ముందుగా కొంత ట్రైనింగ్ తీసుకుని ఆ తర్వాత సెట్స్‌లో జాయిన్ అవ్వాలని భావించారట సుహానా. అంతర్జాతీయ స్టంట్ కొరియోగ్రాఫర్స్ పర్యవేక్షణలో ఆమె ట్రైనింగ్ తీసుకుంటున్నారని బాలీవుడ్ భోగట్టా. షారుక్ ఖాన్, సిద్ధార్థ్ ఆనంద్ ('వార్, పఠాన్, బ్యాంగ్ బ్యాంగ్' సినిమాల దర్శకుడు) కలిసి 'కింగ్' సినిమాను నిర్మించనున్నారు. ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ప్రారంభంలో విడుదల చేయాలనుకుంటున్నారు. అలాగే 'కింగ్' సినిమా ఓ కొలిక్కి వచ్చాక షారుక్ ఖాన్ 'పఠాన్' సినిమా సీక్వెల్ 'పఠాన్ 2'ను సెట్స్ పైకి తీసుకువెళ్తారట. 'పఠాన్' సినిమాను తెరకెక్కించిన సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలోనే సీక్వెల్ రూపొందనుంది.

క్లైమాక్స్‌ని ఎవరూ ఊహించలేరు



● రాశీ సింగ్

''భూతద్ధం భాస్కర్ నారాయణ' చిత్రంలో లక్ష్మి అనే రిపోర్టర్ పాత్ర చేశాను. చాలా సహజంగా ఉండే బలమైన పాత్ర నాది. ఈ మూవీలో సస్పెన్స్, రొమాన్స్, పాటలు.. ఇలా అన్నీ ఉన్నాయి. తర్వాత ఏం జరుగుతుందనే సస్పెన్స్ ఆద్యంతం ఉంటుంది. క్లైమాక్స్‌ని ఎవరూ ఊహించలేరు. 'భూతద్ధం భాస్కర్ నారాయణ' వంటి మంచి సినిమా చేసినందుకు గర్వంగా ఉంది'' అని హీరోయిన్ రాశీ సింగ్ అన్నారు. శివ కందుకూరి, రాశీ సింగ్ జంటగా పురుషోత్తం రాజ్ దర్శకత్వం వహించిన చిత్రం 'భూతద్ధం భాస్కర్ నారాయణ'. స్నేహాల్, శశిధర్, కార్తీక్ నిర్మించిన ఈ చిత్రం మార్చి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా రాశీ సింగ్ మాట్లాడుతూ– ''మాది రాయ్‌పూర్. ఢిల్లీ యూనివర్సిటీలో చదువుకున్నాను. ఏడాది పాటు ఎయిర్ హోస్టెస్‌గా చేశాను. చిన్నప్పటి నుంచి సినిమాలపై ఆసక్తి ఉండేది. హీరోయిన్ కావాలని చాలా కష్టపడి సినిమాల్లోకి వచ్చాను. మేం మొదట్లో ముంబైలో ఉండేవాళ్లం.. ఇప్పుడు హైదరాబాద్‌కి వచ్చేశాం. తెలుగు పరిశ్రమ, హైదరాబాద్ చాలా నచ్చాయి. ఇక 'భూతద్ధం భాస్కర్ నారాయణ' విషయానికొస్తే.. ఆడిషన్‌లో నన్ను ఎంపిక చేశారు పురుషోత్తం రాజ్. కథ నచ్చితే గ్లామర్ రోల్స్ చేయడానికి సిద్ధమే. 'ఆర్య 2' మూవీ చూసి అల్లు అర్జున్‌గారికి ఫ్యాన్ అయిపోయాను. సుహాస్‌కి జోడీగా నేను నటించిన 'ప్రసన్న వదనం' సినిమా త్వరలో విడుదల కానుంది'' అన్నారు.

శ్రుతికి స్వాగతం



● శ్రుతీ మరాఠే

మరాఠీ, తమిళ భాషల్లో సినిమాలు చేస్తున్న గుజరాతీ అమ్మాయి శ్రుతీ మరాఠే తెలుగు చిత్ర పరిశ్రమకు వస్తున్నారు. ఎన్టీఆర్ హీరోగా నటిస్తున్న 'దేవర' సినిమాతో శ్రుతి తెలుగుకు పరిచయం కానున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న 'దేవర' షూటింగ్‌లో శ్రుతి జాయిన్ అయ్యారు. ఈ విషయాన్ని సోషల్ మాధ్యమాల వేదికగా వెల్లడించారు శ్రుతి. ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతున్న షెడ్యూల్ పూర్తి కాగానే పాటల చిత్రీకరణ కోసం చిత్ర యూనిట్ కేరళ వెళ్లాలనే ఆలోచనలో ఉందని సమాచారం. కొరటాల శివ దర్శకత్వంలో కల్యాణ్ రామ్, మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న 'దేవర' చిత్రం రెండు భాగాలుగా విడుదల కానుంది. తొలి భాగం ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల కానుంది.

ధైర్యం.. ప్రేమ



● రాశీ ఖన్నా

''యోధ'లో భాగం కావటం చాలా ఆనందంగా ఉంది. ఈ చిత్రం ఒక అద్భుతమైన అనుభూతిని ఇచ్చింది. ఒక మంచి కథతో రూపొందింది. సినిమా కథనంలో ధైర్యం, ప్రేమను చాలా గొప్పగా మిళితం చేశారు. ప్రేక్షకులతో కలిసి ఈ చిత్రాన్ని బిగ్ స్క్రీన్‌పై చూడటానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను'' అన్నారు రాశీ ఖన్నా. సిద్ధార్థ్ మల్హోత్రా, రాశీ ఖన్నా జంటగా నటించిన హిందీ చిత్రం 'యోధ'. మార్చి 15న ఈ చిత్రం విడుదల కానున్న సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాశీ ఖన్నా ఈ విధంగా స్పందించారు. ''యోధ' అనేది ఒక అసాధారణమైన ప్రయాణం. సినిమా కథనం అత్యంత ఆసక్తిగా ఉండటమే కాదు ధైర్యం మరియు దేశభక్తి స్ఫూర్తిదాయకంగానూ ఉంటుంది'' అన్నారు సిద్ధార్థ్ మల్హోత్రా. ఈ చిత్రానికి దర్శక ద్వయం సాగర్ అంబ్రే–పుష్కర్ ఓజా దర్శకత్వం వహించారు.

ఫుల్ కామెడీ



● పోసాని కృష్ణమురళి

అజయ్, వంశీ ఏకశిరి, ఆదిత్య శశాంక్ నేతి, రోమిక శర్మ తదితరులు నటించిన చిత్రం 'వి లవ్ బ్యాడ్ బాయ్స్'. పోసాని కృష్ణమురళి, అలీ, సప్తగిరి, పృథ్వీ, శివారెడ్డి కీలక పాత్రల్లో పప్పుల వరలక్ష్మి సమర్పణలో పప్పుల కనక దుర్గారావు నిర్మించారు. రాజు రాజేంద్ర ప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం టీజర్‌ని 'విశ్వంభర' దర్శకుడు వశిష్ఠ రిలీజ్ చేశారు. ''ప్రస్తుత ట్రెండ్‌కి తగ్గ కథా కథనాలతో ఆద్యంతం నవ్వించే కామెడీ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉంటుంది. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు దుర్గారావు.

నటుడు కెన్నెత్ మిచెల్ మృతి



ప్రముఖ హాలీవుడ్ నటుడు కెన్నెత్ మిచెల్ (49) కన్నుమూశారు. 'కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్' వంటి చిత్రాల సిరీస్‌లలో నటుడిగా తనకంటూ ఎంతో గుర్తింపు తెచ్చుకున్న ఆయన 'అమియోట్రోఫిక్ లాటరల్ స్క్లెరోసిస్' (ఏఎల్ఎస్) వ్యాధి కారణంగా ఈ నెల 24న తుది శ్వాస విడిచారు. ఈ విషయాన్ని ఆయన కుటుంబ సభ్యులు తాజాగా వెల్లడించారు. 'కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్: డిస్కవరీ, మిరాకిల్, ఛార్మ్స్ ఫర్ ది ఈజీ లైఫ్, బ్లడ్ హనీ, ఘోస్ట్ విస్పరస్' వంటి పలు చిత్రాల్లో నటించారు కెన్నెత్. 'కెప్టెన్ మార్వెల్, స్టార్ ట్రెక్: డిస్కవరీ' వంటి సినిమాలతో ఆయన బాగా పాపులర్ అయ్యారు. ప్రత్యేకించి 'కెప్టెన్ మార్వెల్' మూవీలో ఆయన చేసిన జోసెఫ్ డాన్వర్ పాత్ర ప్రేక్షకులకు బాగా గుర్తుంటుంది. సినిమాలతో పాటు పలు వెబ్ సిరీస్‌లు, సహాయ పాత్రల్లోనూ నటించి ప్రేక్షకులను అలరించారాయన. కాగా కెన్నెత్ మిచెల్ మృతిపై పలువురు హాలీవుడ్ ప్రముఖులు సంతాపం తెలిపారు.

రాజకీయం నేపథ్యంలో...



● నిహాన్, వేణుగోపాలాచారి

నిహాన్, వైష్ణవి కాంబ్లే జంటగా రవి బాసర దర్శకత్వం వహించిన చిత్రం 'మా ఊరి రాజారెడ్డి'. రజిత రవీందర్ ఎర్ర, సునీత వెంకటరమణ నిర్మించిన ఈ మూవీ మార్చి 1న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదల వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి మాట్లాడుతూ– ''మా ఊరి రాజారెడ్డి' సినిమా స్వర్గీయ రాజారెడ్డిగారిని గుర్తు చేసేలా ఉంటుంది. రాజకీయం నేపథ్యంలో రూపొందిన ఈ చిత్రంలోని నటీనటులు, సాంకేతిక నిపుణులందరూ నిర్మల్ ప్రాంతం వాళ్లు కావడం సంతోషం. ఈ సినిమా విజయం సాధించాలి'' అన్నారు. కాగా.. మంచితనం మూర్తీభవించిన రాజా రెడ్డి (నిహాన్ పాత్ర) నేపథ్యంలో ఈ సినిమా ఉంటుందని యూనిట్ పేర్కొంది. ''మా ఊరి రాజారెడ్డి'ని ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు వెంకటరమణ. ''నాకు అవకాశం ఇచ్చిన దర్శక–నిర్మాతలకు ధన్యవాదాలు'' అన్నారు నిహాన్. ''మా డైరెక్టర్ ఈ సినిమా ఫస్ట్ షెడ్యూల్ చేసి మధ్యలో వదిలేస్తే.. సినిమాని నేను పూర్తి చేశాను'' అన్నారు కో డైరెక్టర్ రవీంద్ర సిద్ధార్థ.

అందమైన ప్రేమకథ



● అపర్ణ, వినాయక్

వినాయక్ దేశాయ్, అపర్ణా దేవీ జంటగా నటించిన చిత్రం 'రాధా మాధవం'. దాసరి ఇస్సాకు దర్శకత్వంలో గోనాల్ వెంకటేశ్ నిర్మించిన ఈ సినిమా మార్చి 1న రిలీజ్ కానుంది. సోమవారం ప్రెస్‌మీట్‌లో దాసరి ఇస్సాకు మాట్లాడుతూ– ''అందమైన ప్రేమకథా చిత్రం ఇది. వాస్తవ ఘటనలతో ఈ మూవీని అద్భుతంగా రాశారు వసంత్ వెంకట్ బాల'' అన్నారు. ''మా సినిమాను ఆడియన్స్ పెద్ద సక్సెస్ చేయాలి'' అన్నారు గోనాల్ వెంకటేశ్. ''ఈ చిత్రంలో యాక్షన్ సీక్వెన్స్ సహజంగా ఉంటాయి. మా చిత్రాన్ని పంపిణీ చేస్తున్న పార్థుకి థ్యాంక్స్'' అన్నారు వినాయక్ దేశాయ్.

సాక్షి బిజినెస్
మంగళవారం
27-2-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
353	91
72,790	22,122

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండు శుక్రవారం ముగింపు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,013	△ 16
డోజోన్స్	39,138	△ 7
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,684	▽ 22
డాక్స్	17,423	△ 4
షాంఘై	2,977	▽ 29
నికాయ్	39,234	△ 135

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (24 క్యారెట్)	61,510
బంగారం (22 క్యారెట్)	58,580
వెండి (కేజీ)	76,000

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధరవరలు	81.06	84.74
£	బ్రిటన్ పౌండ్	ధరవరలు	102.77	107.75
€	యూరో	ధరవరలు	87.74	92.23
¥	జపాన్ ఎన్ (100)	ధరవరలు	42.00	68.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ధరవరలు	51.95	56.77
S$	సింగపూర్ డాలర్	ధరవరలు	59.36	64.05
SAR	సౌదీ రియాల్	ధరవరలు	21.20	22.77
UAE D	యూఏఈ దిర్హామ్	ధరవరలు	21.67	23.46
¥	చైనా యువాన్	ధరవరలు	10.40	12.49

స్టార్టప్‌లతో ప్రతి నెలా సమావేశం నిర్వహించండి..

ఆర్‌బీఐకి ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచన



స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ సంస్థలతో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమావేశం

న్యూఢిల్లీ: అంకుర సంస్థలు, ఫిన్‌టెక్ సంస్థల ఆందోళనలను, సమస్యలను పరిష్కరించేందుకు వాటితో నెలవారీ సమావేశాలు నిర్వహించాలని రిజర్వ్ బ్యాంక్‌కు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సూచించారు. స్టార్టప్‌లు, ఫిన్‌టెక్ సంస్థలతో జరిగిన సమావేశంలో మంత్రి ఈ మేరకు సూచనలు చేసినట్లు ప్రభుత్వాధికారి ఒకరు తెలిపారు. రేజర్‌పే, క్రెడ్, పీక్‌ఫిఫ్టీన్ తదితర 50 సంస్థల టాప్ ఎగ్జిక్యూటివ్‌లు ఈ భేటీలో పాల్గొన్నారు. ప్రభుత్వం తరఫున ఆర్థిక సేవల విభాగం కార్యదర్శి వివేక్ జోషి, డీపీఐఐటీ కార్యదర్శి రాజేశ్ కుమార్ సింగ్ తదితరులు, ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా, ఎన్‌పీసీఐ అధికారులు హాజరయ్యారు. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్)పై ఆర్‌బీఐ ఆంక్షల కొరడా ఝుళిపించిన తరుణంలో ఫిన్‌టెక్, స్టార్టప్‌లతో భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే, పీపీబీఎల్ ఉదంతంపరమైన ఆందోళనలేమీ అంకుర సంస్థల వ్యవస్థాపకుల్లో కనిపించలేదని అధికారి తెలిపారు. ఈ భేటీలో స్టార్టప్‌లు సైబర్ సెక్యూరిటీ సంబంధ అంశాలను ప్రస్తావించినట్లు వివరించారు.

మహాకుంభ్‌లో వెయ్యి అంకుర సంస్థలు..

మార్చి 18 నుంచి న్యూఢిల్లీలోని భారత మండపంలో జరిగే స్టార్టప్ మహాకుంభ్ కార్యక్రమంలో 1,000 పైచిలుకు అంకుర సంస్థలు, పెద్ద సంఖ్యలో ఇన్వెస్టర్లు, ఇన్‌క్యుబేటర్లు పాల్గొననున్నాయి. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని పరిశ్రమలు, అంతర్గత వాణిజ్యం ప్రోత్సాహక విభాగం డీపీఐఐటీ నిర్వహించనుంది. పరిశ్రమకు సంబంధించిన అంశాలపై చర్చలు, మెంటార్ సెషన్లు, మాస్టర్‌క్లాస్‌లు, కీలకోపన్యాసాలు, యూనికార్న్ రౌండ్‌టేబుల్ సమావేశాలు మొదలైనవి ఉంటాయి.

అదానీ డిఫెన్స్ కాంప్లెక్స్ షురూ



కాన్పూర్: రక్షణ రంగానికి అవసరమయ్యే మందుగుండు, మిస్సైళ్ల తయారీకి వీలుగా అదానీ గ్రూప్ భారీ కాంప్లెక్స్‌ను ప్రారంభించింది. ఇది దక్షిణాసియాలోనే అతిపెద్ద కాంప్లెక్స్‌కాగా.. దీనిలో రెండు మెగా తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. తద్వారా డిఫెన్స్ తయారీలో ఏకీకృత కార్యకలాపాలకు తెరతీసింది. 500 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఏర్పాటుచేసిన తయారీ సౌకర్యాల కోసం అదానీ డిఫెన్స్ వై ఏరోస్పేస్ రూ. 3,000 కోట్లు ఇన్వెస్ట్ చేసింది. దీంతో పూర్తిస్థాయి మందుగుండు సామగ్రి తయారీకి వీలు కల్పించింది.

హైదరాబాద్-బ్యాంకాక్ మధ్య ఇండిగో డైరెక్ట్ ఫ్లైట్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఇండిగో తాజాగా హైదరాబాద్-బ్యాంకాక్ మధ్య నేరుగా సర్వీసులను సోమవారం ప్రారంభించింది. హైదరాబాద్‌లో ఉదయం 3.55కు విమానం బయల్దేరి 9.05కు బ్యాంకాక్ చేరుకుంటుంది. ఇరు నగరాల మధ్య డైరెక్ట్ ఫ్లైట్ నడుపుతున్న భారతీయ తొలి విమానయాన సంస్థ తామేనని ఇండిగో ప్రకటించింది. భారత్-బ్యాంకాక్ మధ్య ఇండిగో ప్రతి వారం 37 సర్వీసులు నడుపుతోంది.

అక్షరాల్లో ఫోన్ సంభాషణలు

ట్రూకాలర్ సరికొత్త ఫీచర్



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: కాలర్ వివరాలను తెలిపే యాప్ ట్రూకాలర్ తాజాగా సంచలన ఫీచర్‌ను జోడించింది. ప్రీమియం కస్టమర్ల కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత కాల్ రికార్డింగ్ ఫీచర్‌ను జత చేసింది. ఇది కాల్ రికార్డింగ్‌తోపాటు మాట్లాడిన మాటలను అక్షర రూపం చేస్తుంది. ప్రస్తుతానికి ఇంగ్లిష్, హిందీ భాషలకు ఈ ఫీచర్ పరిమితం. ఇన్‌కమింగ్, ఔట్‌గోయింగ్ వివరాలతో కూడిన సమ్మరీ కూడా ప్రత్యక్షం అవుతుంది.

పీపీబీఎల్ నుంచి విజయ్ ఔట్

పేటీఎమ్ బ్యాంక్ బోర్డు పునర్వ్యవస్థీకరణ



న్యూఢిల్లీ: పేటీఎమ్ పేమెంట్స్ బ్యాంక్ (పీపీబీఎల్) బోర్డు నుంచి పార్ట్‌టైమ్ నాన్‌ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న విజయ్ శేఖర్ శర్మ తప్పుకున్నారు. ఈ నేపథ్యంలో బోర్డును పునర్వ్యవస్థీకరించినట్లు పేటీఎమ్ పేర్కొంది. సెంట్రల్ బ్యాంక్ మాజీ చైర్మన్ శ్రీధర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ దేవేంద్రనాథ్ సారంగి, బీఓబీ మాజీ ఈడీ గార్గ్, మాజీ ఐఏఎస్ ఆఫీసర్ రజనీతో కొత్త బోర్డును ఏర్పాటు చేసినట్లు వెల్లడించింది.

ఎస్‌బీఐ కొత్త ఫండ్‌కు కోట్లలో నిధులు


రూ.6,700 కోట్లు సమీకరణ



ముంబై: ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ఓ నూతన పథకం ద్వారా భారీగా నిధులు సమీకరించింది. ఎస్‌బీఐ ఎనర్జీ అపార్చునిటీస్ ఫండ్ పట్ల ఇన్వెస్టర్లు ఎంతో ఉత్సాహం చూపించారు. రూ.5,000 కోట్ల సమీకరణను ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ అంచనా వేయగా, దీన్ని అధిగమించి రూ.6,700 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. అన్ని రకాల పంపిణీ ఛానళ్ల ద్వారా విస్తృతమైన స్పందన వచ్చిందని, దరఖాస్తులు 5 లక్షలు దాటాయని ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ ప్రకటించింది. పెద్ద సంఖ్యలో కొత్త ఇన్వెస్టర్లు ఈ నూతన ఫండ్ ఆఫర్ (ఎన్‌ఎఫ్‌వో)లో పాల్గొనడం చూస్తుంటే అది ఎస్‌బీఐ మ్యూచువల్ ఫండ్ పట్ల ఇన్వెస్టర్లలో ఉన్న విశ్వాసాన్ని తెలియజేస్తోందని పేర్కొంది. ఎనర్జీ థీమ్ (ఇంధన రంగం) పట్ల ఇన్వెస్టర్ల నమ్మకానికి నిదర్శనమని తెలిపింది. ఇంధనం, దాని అనుబంధ రంగాల్లో పనిచేసే కంపెనీల్లో ఈ పథకం ఇన్వెస్ట్ చేస్తుంది. ఈక్విటీ, డెరివేటివ్స్, డెట్ సెక్యూరిటీల లోనూ పెట్టుబడులు పెడుతుంది. రాజ్ గాంధీ, ప్రదీప్ కేశవాన్ ఫండ్ మేనేజర్లుగా పనిచేయనున్నారు.

లాభాల స్వీకరణ...

- ఐటీ, మెటల్, ఫార్మా షేర్లలో అమ్మకాలు
- బలహీన అంతర్జాతీయ సంకేతాల ప్రభావం
- సెన్సెక్స్ నష్టం 353 పాయింట్లు
- 22,150 స్థాయి దిగువకు నిఫ్టీ



ముంబై: ఐటీ, మెటల్, ఫార్మా షేర్లలో విక్రయాలు తలెత్తడంతో స్టాక్ సూచీలు సోమవారం నష్టాలు చవిచూశాయి. సెన్సెక్స్ 353 పాయింట్లు నష్టపోయి 72,790 వద్ద నిలిచింది. నిఫ్టీ 91 పాయింట్లు క్షీణించి 22,122 వద్ద నిలిచింది. సూచీలకిది రెండో రోజూ నష్టాల ముగింపు. అంతర్జాతీయ ఈక్విటీ మార్కెట్లోని మిశ్రమ సంకేతాల ప్రభావంతో ప్రథమార్థంలో అమ్మకాల ఒత్తిడి నెలకొంది. ఒక దశలో సెన్సెక్స్ 472 పాయింట్లు పతనమై 72,667 వద్ద, నిఫ్టీ 138 పాయింట్లు క్షీణించి 22,075 వద్ద ఇంట్రాడే కనిష్టాన్ని తాకింది. అయితే ద్వితీయార్థంలో విద్యుత్, క్యాపిటల్ గూడ్స్, యుటిలిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో సూచీల నష్టాలు కొంత తగ్గాయి. బీఎస్‌ఈ మిడ్ క్యాప్, స్మాల్ క్యాప్ సూచీలు 0.38%, 0.06% నష్టపోయాయి. ఆసియాలో జపాన్, తైవాన్ మినహా అన్ని దేశాల స్టాక్ సూచీలు నష్టాల్లో ముగిశాయి. పేటీఎం షేరుకు మరోసారి కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్‌ఈలో 5% ఎగసి రూ.428.10 వద్ద అప్పర్ సర్క్యూట్‌ను తాకింది. యూపీఐ హ్యాండిల్ '@పేటీఎం'ను ఉపయోగిస్తున్న పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ కస్టమర్లను వేరే బ్యాంకులకు మార్చే అవకాశాలను పరిశీలించాలని ఎన్‌పీసీఐకి ఆర్‌బీఐ సూచించడంతో ఈ షేరుకు కొనుగోళ్ల మద్దతు లభించింది.

ముక్క ప్రొటీన్స్ @ రూ. 26-28

ఈ నెల 29– మార్చి4 మధ్య ఐపీవో

ఫిష్ మీల్, ఆయిల్, ఫిష్ సొల్యూబ్ పేస్ట్ తదితర ప్రొడక్టుల కంపెనీ ముక్క ప్రొటీన్స్ పబ్లిక్ ఇష్యూ ఈ నెల 29న ప్రారంభంకానుంది. మార్చి 4న ముగియనున్న ఇష్యూకి రూ. 26-28 ధరల శ్రేణిని ప్రకటించింది. దీనిలో భాగంగా 8 కోట్ల ఈక్విటీ షేర్లను కొత్తగా జారీ చేయనుంది. తద్వారా రూ. 224 కోట్లు సమీకరించాలని భావిస్తోంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-2-2024	
విశాఖ	500-00
చిత్తూరు	568-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475-00
విజయవాడ	475-00
రిటైల్ ధర (డజను)	72.00
26-2-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	500-00
వరంగల్	502-00
రిటైల్ ధర	5.60

హోటల్ పరిశ్రమలో కొనసాగనున్న జోరు

- 2024-25లో 7-9% వృద్ధి
- రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా



కోల్‌కతా: దేశ హోటల్ పరిశ్రమ వచ్చే ఆర్థిక సంవత్సరంలోనూ మంచి వృద్ధిని చూడనుంది. 2024-25లో హోటల్ పరిశ్రమ ఆదాయం మొత్తం మీద 7-9 శాతం మధ్య పెరుగుతుందని రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. దేశీయ విహార పర్యటనలు కొనసాగుతుండడం, సమావేశాలు, ప్రోత్సాహకాలు, సదస్సులు, ప్రదర్శనలనుకు (ఎంఐసీఈ) డిమాండ్ ఉండడం వచ్చే ఆర్థిక సంవత్సరంలో వృద్ధికి మద్దతుగా నిలుస్తాయని ఇక్రా తెలిపింది. సాధారణ ఎన్నికల ప్రభావం స్వల్పకాలమేనని పేర్కొంది. హోటల్ పరిశ్రమ డిమాండ్‌లో ఆధ్యాత్మిక పర్యాటకం, టైర్-2 సిటీలు కీలక చోదకంగా నిలుస్తాయని వివరించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో హోటళ్లలో గదుల భర్తీ రేటు (ఆక్యుపెన్సీ) దశాబ్ద గరిష్టమైన 70-72 శాతానికి చేరుకుందని, 2022-23లో ఇది 68-70 శాతమే ఉన్నట్టు పేర్కొంది. దేశవ్యాప్తంగా హోటల్ గదుల రేట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో సగటున రూ.7,200-7,400 మధ్య ఉండొచ్చని.. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.7,800-8,000కు పెరగొచ్చని అంచనా వేసింది. దేశ ఆతిథ్య రంగంపై సానుకూల అవుట్‌లుక్‌ను ప్రకటించింది.

శృంగవరపుకోటలో ఎంఎస్‌ఎంఈ పార్కు..

ఉత్తరాంధ్రకు ఊతం

రూ.531 కోట్లతో జేఎస్‌డబ్ల్యూ ఇండస్ట్రియల్ పార్కు అభివృద్ధి

- ప్రపంచస్థాయి సౌకర్యాలతో పరిశ్రమలకు ఆహ్వానం
- జిందాల్ అల్యూమినియం ఫ్యాక్టరీ భూముల సద్వినియోగానికి గ్రీన్‌సిగ్నల్
- సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో దీర్ఘకాల సమస్యకు మోక్షం
- సుమారు రూ.15వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని అంచనా
- 45వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు



విజయనగరం జిల్లా శృంగవరపుకోట వద్ద ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటు చేయనున్న ప్రదేశం

సాక్షి ప్రతినిధి, విజయనగరం: పారిశ్రామికంగా వెనుకబడిన విజయనగరం జిల్లాకే కాదు ఉత్తరాంధ్ర ప్రగతికే ఊతమిచ్చేలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. సుదీర్ఘకాలంగా వృథాగా ఉన్న జిందాల్ (జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్) సంస్థ భూముల సద్వినియోగం చేయాలని సంకల్పించింది. 1,166 ఎకరాల విస్తీర్ణంలో ఎంఎస్‌ఎంఈ పార్కు ఏర్పాటుకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. తద్వారా సుమారు రూ.1,500 కోట్ల మేర పెట్టుబడులు ఈ జిల్లాకు రానున్నాయి. తద్వారా 45 వేల మంది యువతకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. అంతేకాదు.. పరోక్షంగా వివిధ అనుబంధ వ్యాపార, సేవా రంగాల ద్వారా మరింత మందికి ఉపాధి చేకూరుతుంది. ఈ పార్కు జిల్లా పారిశ్రామిక, ఆర్థికాభివృద్ధిలో కీలకమవుతుందనడంలో సందేహం లేదు.

తొలుత అల్యూమినియం శుద్ధి కర్మాగారం

మహానేత వైఎస్ ప్రభుత్వ హయాంలో జలయజ్ఞంతో ఒకవైపు సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధికి ఇతోధికంగా కృషిచేస్తూనే మరోవైపు పారిశ్రామికంగానూ విజయనగరం జిల్లాకు ఊతమివ్వాలని తలపోశారు. అదే సమయంలో విశాఖ-విజయనగరం జిల్లాల సరిహద్దు (ప్రస్తుత అల్లూరి సీతారామరాజు జిల్లా)లో విరివిగా ఉన్న బాక్సైట్ నిక్షేపాల సద్వినియోగంతో అల్యూమినియం శుద్ధి కర్మాగారం ఏర్పాటుచేయడానికి జిందాల్ గ్రూప్ యాజమాన్యం ముందుకొచ్చింది. రాష్ట్ర ప్రభుత్వంతో 2005లో పరస్పర ఒప్పందం కుదుర్చుకుంది. ఏటా 14 లక్షల టన్నుల అల్యూమినియం ఉత్పత్తి లక్ష్యంతో జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ సంస్థను 2005 జూలై 8న ఏర్పాటుచేసింది.

అప్పట్లోనే భూసేకరణ పూర్తి

అల్యూమినియం శుద్ధి కర్మాగారం ఏర్పాటుకోసం జిందాల్ సంస్థ శృంగవరపుకోట మండలంలో కొనుగోలు చేసిన 180 ఎకరాలకు తోడు రాష్ట్ర ప్రభుత్వం 985 ఎకరాలను కేటాయించింది. ఇందులో కొంత ప్రభుత్వ భూమి కాగా ఎక్కువ భాగం అసైన్డ్ భూములు. వాటిపై ఆధారపడిన రైతులకు చట్టప్రకారం పరిహారాన్ని జేఎస్‌డబ్ల్యూ అల్యూమినియం లిమిటెడ్ (జేఎస్‌డబ్ల్యూఏఎల్) యాజమాన్యం చెల్లించింది. 2007-08 నాటికల్లా భూసేకరణ పూర్తయింది. 2009లో వైఎస్ రాజశేఖరరెడ్డి అకాల మరణంతో ఈ ప్రాజెక్టు పురోగతి ఆగిపోయింది. తర్వాత వచ్చిన ఏ ప్రభుత్వాలూ ఆ ప్రాజెక్టుపై దృష్టిపెట్టలేదు.

గిరిజనుల సంక్షేమం కోసం..

విశాఖ ఏజెన్సీలో బాక్సైట్ తవ్వకాలు వద్దంటూ గిరిజనులు చేస్తున్న ఆందోళనలను పరిగణనలోకి తీసుకున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం 2019లో కీలక నిర్ణయం తీసుకుంది. బాక్సైట్ తవ్వకాలను నిషేధిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. దీంతో జేఎస్‌డబ్ల్యూ అల్యూమియం శుద్ధి కర్మాగారం ఏర్పాటు సాధ్యంకాని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో.. నాడు సేకరించిన విలువైన భూమిని సద్వినియోగం చేయాలనే ఉద్దేశంతో జిందాల్ యాజమాన్యం ఇటీవల ఎంఎస్‌ఎంఈ పార్కు లేదా లాజిస్టిక్స్ పార్కు ప్రతిపాదనను తెరపైకి తెచ్చింది.

ఏయే పరిశ్రమలకు అవకాశమంటే..

టెక్స్‌టైల్స్, అపెరల్స్, ఆగ్రో, ఫుడ్ ప్రాసెసింగ్, ఇథనాల్ మాన్యుఫ్యాక్చరింగ్, షిప్పింగ్ కంటైనర్ మాన్యుఫ్యాక్చరింగ్, కాయిర్ ఇండస్ట్రీ, లిథియం-అయాన్ బ్యాటరీ రీసైక్లింగ్, మాన్యుఫ్యాక్చరింగ్, ఎలక్ట్రిక్ వెహికల్స్, గ్రీన్ ఎనర్జీ, హైడ్రోజన్, టాయ్ ఇండస్ట్రీ, ఇంటిగ్రేటెడ్ ఐటీ పార్కు.

వ్యూహాత్మక ప్రాంతంలో పార్క్

- ఎంఎస్‌ఎంఈ పార్క్‌కు ప్రతిపాదించిన ప్రదేశం వ్యూహాత్మక ప్రాంతంలో ఉంది.
- రాజమహేంద్రవరం-విజయనగరం జాతీయ రహదారికి ఆనుకుని ఉంది.
- విశాఖపట్నం-అరకు రోడ్డుతో శరవేగంగా నిర్మాణమవుతున్న విశాఖపట్నం-రాయ్‌పూర్ గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సమీపంలోనే ఉంది.
- విశాఖపట్నం పోర్టుకు, భోగాపురంలో నిర్మాణమవుతున్న అంతర్జాతీయ విమానాశ్రయానికి అందుబాటులో ఉంది.
- చెన్నై-హౌరా రైల్వేలైన్, విశాఖ-కిరండూల్ (కేకే) రైల్వేలైన్‌లకు సమీపంలో ఉంది.
- తాటిపూడి రిజర్వాయర్‌కు కూడా ఇది సమీపంలో ఉంది.

.. ఇలా అన్నివిధాలా కనెక్టివిటీ ఉన్న ఈ ప్రాంతంలో రూ.531 కోట్లతో ప్రపంచస్థాయి మౌలిక వసతులతో ఎంఎస్‌ఎంఈ పార్కు అభివృద్ధి చేయడానికి జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ ప్రతిపాదించింది. తద్వారా రూ.15వేల కోట్ల మేర పెట్టుబడులు వస్తాయని అంచనా వేస్తోంది. ఇక్కడ ఏర్పాటయ్యే పరిశ్రమల్లో 45 వేల మంది యువతకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

ఎక్కువ మంది పిల్లల్ని కంటే లాభం

రా.. కదలిరా.. సభలో చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు

- ఈ ప్రభుత్వం సలహాదారులకు రూ.680 కోట్లు ఖర్చు చేసిందని విమర్శ
- జిల్లాలో ఎమ్మెల్యేలు, మంత్రులు, స్పీకర్ అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపణ


చంద్రబాబు ప్రసంగిస్తున్న సమయంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

శ్రీకాకుళం: రాష్ట్ర ప్రజలు ఓపిక ఉండి ఎక్కువ మంది పిల్లల్ని కంటే ఎక్కువగా లాభ పడతారని తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సీఎం చంద్రబాబు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన రా.. కదిలిరా.. సభలో ఆయన మాట్లాడుతూ.. ‹టీడీపీ అధికారంలోకి వస్తే ఒక ఆడపిల్ల ఉంటే నెలకు రూ.1500, ఇద్దరు ఉంటే రూ.3000, ముగ్గురు ఉంటే రూ.4500 .. అలాగే ఒక్కో పిల్లవానికి చదువుకోసం ఏడాదికి రూ.15 వేలు చొప్పున ఎందరు పిల్లలు ఉంటే అంత మొత్తం జమ చేస్తాం. ఎక్కువ మంది పిల్లలను కంటే టీడీపీ అధికారంలోకి వచ్చాక అంతగా లాభ పడతారు› అని చెప్పడంతో సభలోని వారంతా ముక్కున వేలేసుకున్నారు. ప్రస్తుత ప్రభుత్వం అప్పులు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయటం సరికాదన్నారు. ఈ ప్రభుత్వం తప్పుడు సలహాలు ఇస్తున్న సలహాదారులకు ఇప్పటివరకు రూ.680 కోట్లు ఖర్చు చేసిందని విమర్శించారు. అన్న క్యాంటీన్లు మూత వేసిన ఈ సీఎం పేదల మనిషి ఎలా అవుతారని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో ఎమ్మెల్యేలు, మంత్రులు, స్పీకర్ అవినీతికి పాల్పడుతున్నారని, అభివృద్ధి చేయలేదని తెలిపారు. జనసేన టీడీపీ మధ్య వివాదాలు సృష్టించేందుకు అధికార పార్టీ ప్రయత్నిస్తోందని అన్నారు. తాము అనేక రకాలుగా సర్వేలు చేయించి ఐవీఆర్‌ఎస్ ద్వారా ప్రజాభిప్రాయ సేకరణ జరిపి 99 మంది అభ్యర్థులను ప్రకటించామన్నారు. ఈ రోజు నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చి సైకిల్ ఎక్కాలని, కనబడిన ప్రతి చోటా తెలుగుదేశం పార్టీకి ఓటు వేయటంపై చర్చించాలని పిలుపునిచ్చారు.

చంద్రబాబు ప్రసంగిస్తుండగానే ఖాళీ అయిన సభ

గంటపాటు సాగిన చంద్రబాబు ప్రసంగంలో చెప్పిందే చెబుతూ సాగదీయడంతో ప్రజలకు విసుగుపుట్టి ఆయన ప్రసంగం మధ్యలోనే లేచి వెళ్లిపోయారు. ఆయన ప్రసంగం ప్రారంభమైన కొద్దిసేపటికే ప్రజలు లేచి వెళ్లిపోవడం ప్రారంభించారు. చివరికి వచ్చేసరికి సభా ప్రాంగణం ఖాళీ అయింది.

ఎన్టీఆర్‌కు బదులు ఎర్రన్న స్మరణ

తెలుగుదేశం పార్టీ ఎక్కడ సభ నిర్వహించినా ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించడం పరిపాటి. కానీ, శ్రీకాకుళంలో సోమవారం జరిగిన రా.. కదిలిరా.. సభలో కొత్త ఆనవాయితీ తీసుకువచ్చారు. దివంగత ఎంపీ ఎర్రన్నాయుడు విగ్రహాన్ని వేదికపై ఉంచి ఆయన స్మరణతో సభను జరుపుకుందామంటూ ఎర్రన్న విగ్రహానికి పూలమాలను వేసి నివాళులర్పించారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే ప్రతి పేద కుటుంబానికి రూ.5 వేలు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే

అనంతపురం (ఎడ్యుకేషన్)/అనంతపురం (టవర్ క్లాక్): ఏపీలో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే ప్రతి నిరుపేద కుటుంబానికి నెలకు రూ.5 వేల ఇస్తామని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పారు. న్యాయ సాధన సభ పేరిట కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తొలి ఎన్నికల సభను సోమవారం అనంతపురంలో నిర్వహించింది. మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ.. బీజేపీ పదేళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్నా.. ఏపీకి ఒక్క పైసా కూడా నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడుతూ.. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో రాజధాని నిర్మించకుండా కేవలం గ్రాఫిక్స్‌కే పరిమితమయ్యారని విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా ఐదేళ్ల పాలనలో రాజధాని నిర్మించలేదన్నారు.

షర్మిల మాటలు నమ్మొద్దు

వైఎస్సార్‌టీపీ ఖమ్మం మాజీ అధ్యక్షుడు సుధీర్‌బాబు

ఖమ్మం మయూరి సెంటర్: ఇప్పటికే తాము షర్మిల మాటలు నమ్మి మోసపోయామని.. ఏపీ ప్రజలు కూడా నమ్మి రోడ్డున పడొద్దని వైఎస్సార్‌టీపీ ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షుడు సుధీర్‌బాబు కోరారు. షర్మిల కారణంగా తనకు జరిగిన మోసంపై విజయవాడలో మీడియా సమావేశం పెట్టేందుకు వెళ్లాలని నిర్ణయించగా, సోమవారం పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. వైఎస్సార్‌టీపీలో మూడేళ్లపాటు పనిచేసిన తాను షర్మిల రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన పాదయాత్రకు మద్దతు తెలిపినట్లు చెప్పారు. ఆమె సతీష్ అనే వ్యక్తిని తన సొంత అన్నయ్య కంటే ఎక్కువ అని పరిచయం చేయగా, ఆయన పలువురి నుంచి రూ.కోట్లలో దండుకున్నాడని ఆరోపించారు. తాను సైతం ఆన్‌లైన్ ద్వారా డబ్బులు పంపించానన్నారు.

పొత్తులపై బీజేపీ స్పష్టత ఇచ్చేనా?

- నేడు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ రాష్ట్రానికి రాక
- ఐదు లోక్‌సభ స్థానాల నేతలతో ఏలూరులో సమావేశం
- విజయవాడలో పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ నేతలతోనూ భేటీ
- పొత్తులపై పార్టీ వైఖరిని తెలిపే అవకాశం ఉందంటున్న బీజేపీ నేతలు

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన పార్టీల కూటమిలోకి బీజేపీ వస్తుందా, రాదా అనే అంశంపై మంగళవారం స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఏలూరులో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని ఐదు లోక్‌సభ స్థానాల బూత్ లెవల్ నేతలు, కార్యకర్తలతో ఆయన సమావేశం కానున్నారు. అలాగే విజయవాడలో బీజేపీ కోర్ కమిటీ నేతలతోనూ భేటీ నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా టీడీపీ, జనసేనలతో పొత్తుపై రాజ్‌నాథ్ సింగ్ స్పష్టత ఇచ్చే అవకాశం ఉందని బీజేపీ నేతలు చెబుతున్నారు. వాస్తవానికి.. బీజేపీ 175 అసెంబ్లీ నియోజకవర్గాలతో పాటు 25 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆసక్తి ఉన్న అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఈ నెల 1న ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 25 లోక్‌సభ స్థానాల్లో పార్టీ ఎన్నికల కార్యాలయాలను ప్రారంభించింది. ఈ క్రమంలో ఫిబ్రవరి 6న చంద్రబాబు ఢిల్లీ వెళ్లి కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో భేటీ అయ్యారు. దీంతో టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తుపై ఊహాగానాలు మొదలయ్యాయి.

చడీచప్పుడు చేయని జాతీయ నాయకత్వం

పొత్తులపై బీజేపీ జాతీయ నాయకత్వం ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. గత 20 రోజులుగా టీడీపీ, జనసేన నేతలు మాత్రం బీజేపీ కూడా తమతో కలిసివస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేస్తున్నారు. బీజేపీ రాష్ట్ర నాయకత్వం సైతం పొత్తులపై తమ పార్టీ జాతీయ నాయకత్వం నిర్ణయం తీసుకుంటుందని చెబుతూ వచ్చింది. 2019 ఎన్నికలకు ముందు టీడీపీ ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన తర్వాత రాష్ట్రంలో బీజేపీ -టీడీపీల మధ్య రాజకీయ సంబంధాలు ఉప్పునిప్పుగా కొనసాగాయి. అప్పట్లో రాష్ట్ర పర్యటనకు వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కాన్వాయ్‌పై తిరుపతిలో టీడీపీ శ్రేణులు రాళ్లదాడికి పాల్పడ్డాయి. మోదీపై చంద్రబాబు వ్యక్తిగతంగా తీవ్రవిమర్శలు చేశారు. అయితే, 2019లో ఎన్నికల్లో రాష్ట్రంలో టీడీపీ ఓడిపోయి, కేంద్రంలో బీజేపీ గెలిచిన తర్వాత మళ్లీ చంద్రబాబు బీజేపీకి దగ్గరయ్యేందుకే ప్రయత్నాలు కొనసాగిస్తూ వచ్చారు. మరోవైపు.. పవన్ కళ్యాణ్ బీజేపీ – టీడీపీని ఒకటి చేసేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అయితే బీజేపీ జాతీయ నాయకత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ముందుకు సాగింది. ఇప్పుడు రాష్ట్ర పర్యటనకు వస్తున్న రాజ్‌నాథ్‌సింగ్ పొత్తుపై స్పష్టత ఇవ్వకుంటే టీడీపీ, జనసేనలతో బీజేపీ కలిసి సాగే అవకాశం తక్కువగానే ఉండొచ్చని అంటున్నారు.

క్లుప్తంగా...

కొనసాగుతున్న మిలాన్ విన్యాసాలు



విశాఖ సిటీ: మిలాన్–2024లో భాగంగా సముద్ర దశ విన్యాసాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా సోమవారం బంగాళాఖాతంలో సముద్రం నుంచి ఉపరితలంపై ఉన్న శత్రు స్థావరాలు, గగనతలంలో వైమానిక లక్ష్యాలను సమర్థవంతంగా ఛేదించే విన్యాసాలు చేపట్టారు. అలాగే జలాంతర్గాముల వ్యూహాలను తిప్పికొట్టడం, క్రాస్–డెక్ ల్యాండింగ్ వంటి కార్యకలాపాలు నిర్వహించారు. మంగళవారంతో సీ–ఫేజ్ విన్యాసాలు ముగియనున్నాయి.

ట్రైకార్ చైర్మన్‌గా గుండా సురేంద్ర నియామకం



సాక్షి,అమరావతి: ఏపీ షెడ్యూల్డ్ తెగల కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ట్రైకార్)సంస్థ చైర్మన్‌గా గుండా సురేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సురేంద్ర వైఎస్సార్‌సీపీ ఎస్టీ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రస్తుతం కొనసాగుతున్నారు. వైఎస్సార్‌సీపీ ఎలక్షన్ స్టేట్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యుడిగా, గిరిజన ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. గిరిజనుల సమస్యల పరిష్కారానికి విశేష కృషి చేశారు.

సాంప్రదాయ హస్తకళలకు ప్రోత్సాహం

- చేనేత జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత
- 'భారత్ టెక్స్ 2024' ఎగ్జిబిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఏపీ పెవిలియన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని హస్తకళల వైవిధ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ, సాంప్రదాయ కళాకారులను ప్రోత్సహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు చేనేత, జౌళి శాఖ ముఖ్య కార్యదర్శి సునీత తెలిపారు. సోమవారం ఢిల్లీలో దేశంలోనే అతిపెద్ద అంతర్జాతీయ వస్త్ర ప్రదర్శన 'భారత్ టెక్స్ 2024'లో ఆంధ్రప్రదేశ్ పెవిలియన్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ గొప్ప వారసత్వం, శక్తివంతమైన వస్త్ర పరిశ్రమకు నిలయంగా ఉందన్నారు. ప్రతి జిల్లా నుంచి ప్రత్యేకమైన చేనేత, హస్తకళలను పెవిలియన్‌లో ప్రదర్శించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఏపీ వస్త్ర ఉత్పత్తిలోనే కాకుండా వ్యాపారం, పెట్టుబడికి ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మారిందన్నారు. చేనేత, జౌళి శాఖ కమిషనర్ ఎంఎం నాయక్, ఆప్కో ఎండీ పవనమూర్తి, లేపాక్షి ఈడీ విశ్వమోహన్ తదితరులు పాల్గొన్నారు. ఈ ఎగ్జిబిషన్‌ను కేంద్ర ప్రభుత్వం, భారత టెక్స్‌టైల్ రంగం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయి.

బాబు లీల.. కేడర్ గోల

టీడీపీలో ఎవరిని ఎక్కడి నుంచి పోటీ చేయిస్తున్నారో తెలియక గందరగోళం



సాక్షి, అమరావతి: అభ్యర్థుల ఎంపికలో చంద్రబాబు చేస్తున్న హడావుడితో తెలుగుదేశం పార్టీ కేడర్‌లో అయోమయం నెలకొంది. తమ నియోజకవర్గానికి అభ్యర్థిగా రోజుకో నేత పేరు.. అదీ సంబంధం లేని ప్రాంతాలకు చెందిన వారి పేర్లు వస్తుండటంతో కేడర్ నిర్ఘాంతపోతున్నారు. టీడీపీ, జనసేన ఉమ్మడిగా 99 మంది అభ్యర్థుల జాబితా ప్రకటించడంతో ఇప్పటికే పలుచోట్ల ఆందోళనలు జరుగుతున్నాయి. మిగిలిన సీట్లలో అభ్యర్థులను ఖరారు చేసేందుకు చంద్రబాబు చేస్తున్న కసరత్తు కేడర్‌ను మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ఎవరిని ఎక్కడి నుంచి బరిలోకి దింపుతారో, ఎందుకు అలా చేస్తున్నారో అర్థంకాక పార్టీ నేతలు, కార్యకర్తలు తలలు పట్టుకుంటున్నారు. ఐవీఆర్ఎస్ సర్వే అంటూ కేడర్‌కు వారి నియోజకవర్గానికి సంబంధం లేని కొత్త వ్యక్తుల పేర్లు చెప్పి వారు ఆ స్థానంలో పోటీ చేస్తే గెలుస్తారో లేదో చెప్పండని నిలదీస్తుండటంతో ఏమి చేయాలో కార్యకర్తలకు పాలుపోవడం లేదు.

మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు గతంలో ఉమ్మడి కృష్ణా జిల్లాలో మైలవరం నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఈ సీటును వసంత కృష్ణప్రసాద్‌కి ఖరారు చేయడంతో ఉమా పరిస్థితి ప్రశ్నార్థకంగా మారింది. పెనమలూరుకు సిద్ధంగా ఉండాలని ఉమాకు చంద్రబాబు సూచించారు. పెనమలూరులో అభ్యర్థి ఉమా అయితే సమ్మతమేనా అని ఫోన్లు వస్తుండడంతో కేడర్ తెల్లబోతోంది. ఉన్నట్టుండి ఉమాను ఇక్కడకు దిగుమతి చేయడం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. మరోవైపు అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్ తనకు కాకుండా మరొకరికి సీటు ఇస్తే తాను చేతగానివాడిలా చూస్తూ ఊరుకోనంటూ బహిరంగంగానే హెచ్చరిస్తున్నారు. దేవినేని ఉమా కూడా పెనమలూరులో కొందరు టీడీపీ నాయకులకు ఫోన్లు చేసి అక్కడి పరిస్థితి ఎలా ఉంటుందని ఆరా తీస్తుండటంతో ఇదేమి పరిస్థితంటూ స్థానిక నేతలు జుట్టు పీక్కుంటున్నారు.

ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావును నిన్నటి వరకు చంద్రబాబు గాల్లో పెట్టారు. మొదటి జాబితాలో ఆయన పేరు గల్లంతైంది. ఇప్పుడు ఆయన్ని గురజాల నుంచి నర్సరావుపేటకు మార్చాలనే ఆలోచన చేస్తున్నారు. నర్సరావుపేట టీడీపీ అభ్యర్థిగా యరపతినేని అయితే ఎలా ఉంటుందోనని ఐవీఆర్ఎస్ సర్వే చేస్తున్నారు. దీంతో అక్కడి ఇన్‌ఛార్జి చదలవాడ అరవింద్‌బాబు వర్గం లబోదిబోమంటోంది. మరోవైపు గురజాలలో వలస వచ్చిన నేత జంగా కృష్ణమూర్తి అభ్యర్థిత్వంపై సర్వే చేస్తున్నారు. గురజాలలో తనను కాదని ఉన్నట్టుండి జంగాను తేవడంతో యరపతినేని కారాలు మిరియాలు నూరుతున్నారు.

విశాఖ జిల్లాకు చెందిన మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావును అయితే ఏకంగా జిల్లా దాటించే ప్రయత్నం చేస్తుండడంతో ఉత్తరాంధ్ర టీడీపీ ఆశ్చర్యం వ్యక్తం చేస్తోంది. ఆయన్ని విజయనగరం జిల్లా చీపురుపల్లి నుంచి పోటీ చేయాలని ఒత్తిడి తేవడం, ఆయన నిరాకరిస్తుండటం గందరగోళానికి దారితీసింది.

విజయవాడ పశ్చిమ సీటు కోసం మాజీ ఎమ్మెల్సీ బుద్ధా వెంకన్న, మాజీ ఎమ్మెల్యే జలీల్‌ఖాన్ రకరకాల గిమ్మిక్కులు చేస్తున్నారు. మరోవైపు ఆ సీటు తమదేనని జనసేన హడావుడి చేస్తోంది. ఈ మూడు శిబిరాలు నివ్వెరపోయేలా కొత్తగా ఎంకే బేగ్‌ను చంద్రబాబు తెరపైకి తెచ్చారు. ఆయన అభ్యర్థిత్వంపై ఐవీఆర్ఎస్ సర్వే చేస్తుండటంతో స్థానిక నేతలు ముక్కున వేలేసుకుంటున్నారు.

సహకార కార్యాలయాల ఆధునికీకరణ

రూ.283.53 కోట్ల అంచనా వ్యయంతో చేపడుతున్న ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సహకార రిజిస్ట్రార్ కార్యాలయాలతోపాటు వ్యవసాయ, గ్రామీణాభివృద్ధి బ్యాంకుల ఆధునికీకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్ట్‌కు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా కంప్యూటరీకరణతోపాటు డిజిటల్ పోర్టల్‌ను అభివృద్ధి చేయనుంది. ఇప్పటికే వ్యవసాయ ప్రాథమిక పరపతి సంఘాల(పీఏసీఎస్) కంప్యూటరీకరణ శరవేగంగా జరుగుతోంది. రెండో విడతలో సహకార సంఘాల రిజిస్ట్రార్ కార్యాలయాలు, గ్రామీణాభివృద్ధి బ్యాంకులను ఆధునికీకరిస్తారు. ఈ ప్రాజెక్టును రూ.283.53 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టారు. మూడేళ్ల కాలవ్యవధిలో పూర్తి చేయనున్న ఈ ప్రాజెక్టు కింద అత్యాధునిక కంప్యూటర్ల కోసం రూ.201.60 కోట్లు వెచ్చిస్తారు. సాఫ్ట్‌వేర్ మెయింటినెన్స్, అప్‌గ్రేడేషన్ కోసం రూ.30లక్షలు, ఎంఎఫ్‌పీ కోసం రూ.27.60 లక్షలు, క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కోసం రూ.15.90 లక్షలు, యూపీఎస్‌ల కోసం మరో రూ.8.40 లక్షలు ఖర్చు చేయనున్నారు. కాంపోనెంట్ నిధుల బదిలీ కోసం ఇప్పటికే రెండు ఖాతాలను తెరిచారు. 100 శాతం కేంద్ర వాటా ఉన్న సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కాంపోనెంట్ కోసం ఒకటి, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో వ్యాపార లావాదేవీల కోసం మరొక ఖాతాలను రెడీ చేశారు.

వేగంగా పీఏసీఎస్ కంప్యూటరైజేషన్

రాష్ట్రంలోని 2,037 పీఏసీఎస్‌ల కంప్యూటరైజేషన్ కోసం ఆప్కాబ్‌ను నోడల్ ఏజెన్సీగా నియమించింది. రూ.79.72 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కింద హార్డ్‌వేర్, డిజిటలైజేషన్, సిస్టమ్స్ పోర్ట్ కాంపోనెంట్లకు రూ.62.96కోట్లు ఖర్చు చేయనుంది. ఇప్పటికే ప్రాజెక్టు అమలు కోసం ప్రభుత్వం రూ.40 కోట్లు విడుదల చేసింది. హార్డ్‌వేర్ సేకరణ జరుగుతోంది. సిస్టమ్ ఇంటిగ్రేషన్ కార్యకలాపాలను చేపట్టేందుకు నాబార్డుకు ప్రతిపాదనలు పంపారు. ప్రాజెక్టు అమలు కోసం రాష్ట్ర స్థాయిలో ఎస్‌పీఎంయూ, జిల్లా స్థాయిలో డీపీఎంయూ, పీఏసీఎస్ స్థాయిలో మైగ్రేషన్ బృందాలను ఏర్పాటు చేశారు.

ఆస్టిన్ తెలుగు కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పరమేశ్వరరెడ్డి

సాక్షి, అమరావతి: అమెరికాలోని ఆస్టిన్ నగరంలో ఆస్టిన్ తెలుగు కల్చరల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం– 2024 ఏర్పాటైంది. వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులుగా ఉన్న ప్రవాసాంధ్రులు సోమవారం అక్కడి ఓ హోటల్‌లో సమావేశమయ్యారు. అధ్యక్షుడిగా పరమేశ్వరరెడ్డి నంగి, ఉపాధ్యక్షుడిగా శ్రీని బైరపనేని, కార్యదర్శిగా భరత్ పిస్సాయ్, ట్రెజరర్‌గా చిన్నపరెడ్డి కుందూరును ఎన్నుకున్నారు. ప్రతిభ నల్ల (కల్చరల్), లక్ష్మీకాంత్ (ఫైనాన్స్ స్పాన్సర్‌షిప్), వెంకటేష్ దూబాల (ఫుడ్ లాజిస్టిక్స్), శ్రీలత అంబటి (మెంబర్‌షిప్ టెక్నాలజీ), సర్వేశ్వరరెడ్డి పాశం (స్పోర్ట్స్) సంయుక్త కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. బోర్డు ఆఫ్ డైరెక్టర్లుగా అర్జున్ అనంతుల, గిరి మేకల, బ్రహ్మేంద్రరెడ్డి లాక్కును ఎన్నుకున్నారు. గత కార్యవర్గంలో సేవలందించిన రామ్ హనుమంతు మల్లిరెడ్డి, మురళీధర్ రెడ్డి వేలూరు, శ్రీనివాస్ బత్తుల ఇతర టీసీఏ సభ్యులను ఈ సందర్భంగా అభినందించారు.

నేటి నుంచి ఐబీ బృందం పర్యటన

- విజయవాడకు చేరుకున్న ఏడుగురు సభ్యులు
- మార్చి 7 వరకు జిల్లాల్లో పర్యటించనున్న బృందం
- ప్రభుత్వ స్కూళ్లు.. వాటిలోని సదుపాయాలపై అధ్యయనం
- ఆ నివేదిక ఆధారంగా సిబ్బందికి 'ఐబీ' శిక్షణ
- 2025–26 విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంటర్నేషనల్ బాకలారియట్(ఐబీ) సిలబస్ అమలు కోసం విద్యా శాఖ వేగం పెంచింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు.. వాటిలోని సదుపాయాలపై అధ్యయనం చేసేందుకు ఐబీ నుంచి ఏడుగురు సభ్యుల బృందం సోమవారం విజయవాడకు చేరుకుంది. ఈ బృందంలో కరిక్యులం డిజైన్ సీనియర్ మేనేజర్ ఆల్డో(మెక్సికో), ఈక్విటీ అండ్ ఇన్‌క్లూసివ్ ఎడ్యుకేషన్ సీనియర్ మేనేజర్ కళా పరశురామ్, పర్సనల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ ఎరిక్ బాబర్(ఇంగ్లండ్), కరిక్యులం స్పెషలిస్ట్ అలెన్ (ఇంగ్లండ్), అసెస్‌మెంట్ ఆపరేషన్స్ ట్రాన్స్‌ఫర్మేషన్ అసోసియేట్ మేనేజర్ మైఖేల్ డోనోవన్ (ఇంగ్లండ్), పోస్ట్ ఆథరైజేషన్ పాలసీ అండ్ డిజైన్ సీనియర్ మేనేజర్ వెండీ గ్రీన్(అమెరికా), సీనియర్ లెర్నింగ్ ఆర్కిటెక్ట్ ప్రొఫెషనల్ డెవలప్‌మెంట్ డెలివరీ జెన్ ప్లెజ్‌కోచ్ (అమెరికా) ఉన్నారు. వీరంతా మూడు బృందాలుగా ఏర్పడి మంగళవారం నుంచి మార్చి 7 వరకు జిల్లాల్లో పర్యటించనున్నారు. జిల్లా, మండల, మున్సిపల్ స్కూళ్లతో పాటు అన్ని ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలలను పరిశీలిస్తారు. అక్కడి పరిస్థితులు, వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించిన సదుపాయాలు, ఉపాధ్యాయుల సామర్థ్యాలను అంచనా వేస్తారు. అనంతరం నివేదిక రూపొందించి రాష్ట్ర ప్రభుత్వానికి, ఐబీ విభాగానికి అందజేస్తారు. సోమవారం విజయవాడకు చేరుకున్న ఐబీ బృందంతో రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి సమావేశమయ్యారు. టీచర్ ట్రైనింగ్, అసెస్మెంట్లు, విద్యా సంబంధిత అంశాలను ఆయన ఐబీ బృందానికి వివరించారు. అధ్యయనం అనంతరం అంతర్జాతీయ ప్రతినిధులిచ్చే నివేదిక ఆధారంగా విద్యా శాఖ సిబ్బందికి ఐబీ అమలుపై శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉపాధ్యాయులు, మండల, జిల్లా విద్యాధికారులు, ఎస్సీఈఆర్టీ, డైట్ సిబ్బంది, ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్ బోర్డు సిబ్బందికి దశలవారీగా 'ఐబీ'పై అవగాహన, నైపుణ్యం, సామర్థ్యం పెంపుపై శిక్షణ ఇస్తారు. వీరందరికీ సర్టిఫికెట్లు జారీ చేసి ప్రతిష్టాత్మక ఐబీ గ్లోబల్ టీచర్ నెట్‌వర్క్‌లో భాగం చేస్తారు. అనంతరం 2025–26 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి ఐబీ సిలబస్‌లో బోధన ప్రారంభమవుతుంది. ఏటా ఒక తరగతి చొప్పున పెంచుతూ 2035 నాటికి విద్యార్థులు పదో తరగతి, 2037లో ప్లస్2లో ఐబీ సిలబస్‌లో పరీక్షలు రాసేలా ప్రణాళిక రూపొందించారు. ఈ విద్యార్థులకు ఐబీ, ఏపీ ఎస్సీఈఆర్టీ కలిసి జాయింట్ సర్టిఫికేషన్ ఇస్తాయి. ఈ సర్టిఫికెట్‌కు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంటుంది.

సుందర రైల్వేస్టేషన్లు

- రాష్ట్రంలో పలు రైల్వేస్టేషన్ల అభివృద్ధికి వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ
- విజయవాడలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న గవర్నర్, పలువురు ప్రజాప్రతినిధులు



గుణదల రైల్వేస్టేషన్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో గవర్నర్ తదితరులు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ)/గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): అమృత్ భారత్ పథకంలో భాగంగా విజయవాడ డివిజన్‌లోని గుణదల, వాల్తేరు డివిజన్‌లోని 12 రైల్వేస్టేషన్ల అభివృద్ధికి ప్రధాని మోదీ సోమవారం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. విజయవాడలోని గుణదలలో జరిగిన కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే మల్లాది విష్ణు తదితరులు పాల్గొని ప్రధాని ప్రసంగాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ కేశినేని నాని మాట్లాడుతూ.. ప్రధాని మోదీ రైల్వే స్టేషన్లను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారని చెప్పారు. తన నియోజకవర్గ పరిధిలో రామవరప్పాడు, గుణదల స్టేషన్‌లకు రూ.40 కోట్ల నిధులతో ఆధునీకరణ పనులు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. రైల్వేల అభివృద్ధికి ప్రధాని మోదీ అధిక ప్రాధాన్యత కల్పించడం హర్షణీయమన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా రైల్వేలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అందులో ఆంధ్రప్రదేశ్ టాప్‌లో నిలవడం సంతోషించదగ్గ విషయమన్నారు. అలాగే సింహాచలం రైల్వే స్టేషన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్ మాట్లాడుతూ.. అమృత్ భారత్ పథకంలో భాగంగా రూ.443.47 కోట్లతో వాల్తేరు డివిజన్‌లో ఏపీ పరిధిలో ఉన్న సింహాచలం, అరకు, పార్వతీపురం, బొబ్బిలి, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం రోడ్డు, నౌపాడ స్టేషన్లతో పాటు ఒడిశా పరిధిలో పర్లాకిమిడి, జైపూర్, రాయగడ, కోరాపుట్ స్టేషన్లను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రూ.218.13 కోట్లతో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో 4 రోడ్ ఓవర్ బ్రిడ్జ్‌లు నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. కాగా, రైల్వే పురోగతిపై నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహం, ఎమ్మెల్యే గణబాబు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, పద్మశ్రీ అవార్డు గ్రహీత కూటికుప్పల సూర్యారావు, బీజేపీ నాయకుడు విష్ణుకుమార్ రాజు, సీనియర్ డీసీఎం వావిలపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన పొత్తుకు కాపులు వ్యతిరేకం

- పవన్‌కు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నా.. ఎంత డబ్బు కావాలి?
- మీడియాతో ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్



సీతమ్మధార (విశాఖ ఉత్తర): తెలుగుదేశం, జనసేన పార్టీల పొత్తును కాపులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కేఏ పాల్ అన్నారు. ఆశీలమెట్ట లోని ఓ ఫంక్షన్ హాలులో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పవన్‌కళ్యాణ్‌కు ఓపెన్ ఆఫర్ ఇస్తున్నా.. ఎంత డబ్బు కావాలో చెప్పాలని కోరారు. ప్రజాశాంతి పార్టీలో చేరితే అతనిని ముఖ్యమంత్రిని చేస్తానన్నారు. వైఎస్సార్ సీపీ సిద్ధం అంటుంది..టీడీపీ, జనసేన దోచుకోవడానికి సంసిద్ధం అంటున్నాయన్నారు. ప్రధాని మోదీ తిరుపతి సాక్షిగా ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పి మాట తప్పారని, ప్రత్యేక ప్యాకేజీ, స్మార్ట్ సిటీలు నిర్మాణం చేపడతానని చెప్పి మోసం చేశారని అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడానికి సిద్ధమయ్యారని అన్నారు. మోదీ పాలనలో ఇతర మతాల ప్రజలకు భద్రత లేదని, పాస్టర్లకు ఆత్మరక్షణ కోసం రైఫిల్ కొనిస్తానని చెప్పారు. మోదీ తొత్తులుగా ఉన్న టీడీపీ, జనసేన పార్టీలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వంగవీటి రంగాను హత్య చేయించిన చంద్రబాబు చెర నుంచి పవన్ బయటకు రావాలని హితవు పలికారు.

పోలింగ్ కేంద్రాల వద్ద బ్రీత్ ఎనలైజర్లు పెట్టాలంటూ పిల్

బుధవారం విచారణ జరుపుతామన్న ధర్మాసనం

సాక్షి, అమరావతి: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్లు ఏర్పాటు చేసేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించాలని కోరుతూ జనవాహిని పార్టీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేసింది. బ్రీత్ ఎనలైజర్ల ఏర్పాటు ద్వారా మద్యం ప్రభావానికి లోను కాకుండా ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆస్కారం ఉంటుందని, అందువల్ల ఈ దిశగా ఆదేశాలు ఇవ్వాలంటూ ఆ పార్టీ కార్యదర్శి ఎం.శివరామ్ సుందర్ కోరారు. అత్యవసర విచారణ నిమిత్తం పిటిషనర్ తరపు న్యాయవాది డీఎస్ఎన్‌వీ ప్రసాద్‌బాబు సోమవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ నేతృత్వంలోని ధర్మాసనం ముందు ప్రస్తావించారు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్16 ప్రకారం చిత్తభ్రమణం (అన్‌సౌండ్ మైండ్) ఉన్న వారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అనర్హులని ఆయన తెలిపారు. పరిమితికి మించి మద్యం సేవించిన వారు చిత్తభ్రమణం కిందకే వస్తారని తెలిపారు. అందువల్ల ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద బ్రీత్ ఎనలైజర్ ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. మద్యం సేవించిన వారు ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్16 పరిధిలోకి ఎలా వస్తారని ప్రశ్నించింది. 18 ఏళ్ల దాటిన వారికి ఓటు హక్కు కల్పిస్తున్నారని గుర్తు చేసింది. నిర్దిష్ట వయసు లేనివారికి మద్యం విక్రయించడంపై నిషేధం ఉందని తెలిపింది. ప్రసాద్‌బాబు సమాధానమిస్తూ.. పరిమితికి మించి వాహనం నడపడం మోటారు వాహనాల చట్టం కింద నేరమని, అలాగే ఓటు ద్వారా రాష్ట్ర భవిష్యత్‌ను నిర్ణయించే అర్హత మద్యం సేవించి ఓటువేసే వారికి ఉండకూడదన్నారు. ప్రసాద్‌బాబు వాదనలు విన్న ధర్మాసనం ఈ వ్యాజ్యంపై బుధవారం విచారణ జరుపుతామని స్పష్టం చేసింది.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.